# ఆత్మీయ అంతర్యుద్ధం

**ఆత్మీయయుద్ధం మధ్యలో శిష్యులను తయారు చేయడం**

**టెడ్ డబ్ల్యు. గ్రోవ్స్**

ఇందులోని లేఖనభాగములన్నీ “పరిశుద్ధ గ్రంథము” పాత అనువాదము నుండి స్వీకరించబడ్డాయి. కొన్నిసార్లు ఇంగ్లీషులో ఉపయోగించిన వేరు వేరు తర్జుమాలు తెలుగులో స్వేచ్ఛానువాదము చేయబడ్డాయి.

*అనువదించిన వారు- పాస్టర్. పార్ల ప్రసన్నకుమార్, ఫోన్ 9346717636.*

**Translator - Pr. Prasanna Kumar Parla, Visakhapatnam.**
**Mobile: 9346717636**

ఆత్మీయ అత్యర్యుద్ధం (ఆత్మీయ యుద్ధ శిక్షణ)

సర్వ హక్కులు రచయితవి. టెడ్ డబ్ల్యు. గ్రోవ్స్

Published by Grace Publications
8400 W. Beloit Road
West Allis, WI 53227
414-771-3020

www.ourgcc.com -website

office@ourgcc.co -church email

ISBN 0 -615 -12642 -1

**All rights reserved.** No portion of this book may be reproduced, stored in a retrieval system, or transmitted in any form or by any means- electronic, mechanical, digital, photocopy, recording, or any other -except for brief quotations in printed reviews, without the written permission of the publisher.

**Printed in India**

## విషయసూచిక

ముందుమాట
అంకితం / కృతజ్ఞతలు
ఈ పుస్తకాన్ని ఎలా వాడుకోవాలి?
పరిచయము

మొదటి అధ్యాయము "ఆత్మీయ యుద్ధ శిక్షణ మరియు
వ్యక్తిగత శిష్యత్వముయొక్క పని"
రెండవ అధ్యాయము "యుద్ధ వ్యూహములు"
(నీవు యుద్ధంలో ఉన్నావు!)
మూడవ అధ్యాయం "దేవుని విశ్రాంతిలో ప్రవేశించడం"
నాలుగవ అధ్యాయం "ఆత్మను పోషించడం"
ఐదవ అధ్యాయం "శత్రువుకు పనిచెప్పడం"
ఆరవ అధ్యాయం "హృదయపూర్వకంగా వెంబడించడం"
ఏడవ అధ్యాయం "తిరిగిసమకూర్చడం"
ఎనిమిదవ అధ్యాయం "సహనము"
బిబ్లియోగ్రఫీ (ఆధారగ్రంధాలు)

అపెండిక్స్ (ఉపగ్రంథాలు)
40 రోజుల చార్టు
కంఠస్థవాక్య కార్డు విధానం
వ్యక్తిగత ప్రార్థనా సహకార పట్టిక
బైబిల్ పఠన చరిత్ర
జవాబుదారీతనం ఉన్న భాగస్థుల పట్టిక
"దృక్పథం"

రచయితనుగూర్చి

# ముందుమాట

శిష్యత్వపు తర్ఫీదుకార్యక్రమాలలో, సలహాఇచ్చే పరిచర్యకు ఈ 'ఆత్మీయ యుద్ధ శిక్షణ' అనే పుస్తకం సహకరిస్తుందని సిఫారసు చేయడం నాకు ఘనతగా భావిస్తున్నాను. గత సంవత్సరాలలో టెడ్‌ను అనేకసార్లు కలిసి, ఆయనకు స్థానిక సంఘముయెడల ఉన్న సమర్పణ, దేవుని వాక్యమునందున్న సంతృప్తి, సంఘనాయకత్వము యెడల ఉన్న సమర్పణా భావమును గమనించుట నాకు దొరికిన భాగ్యముగా భావిస్తున్నాను. క్రైస్తవులు ఆధ్యాత్మిక పరిపక్వతలోనికి ఎదుగుట విషయములో సహాయపడడానికి దేవుడు టెడ్‌కిచ్చిన సామర్థ్యమునుబట్టి, ఆయనకున్న సహనమునుగూర్చి నేనెంతో ప్రభావితుడనయ్యాను.

ఆత్మీయ యుద్ధ శిక్షణ అనే ఈ పుస్తకంలో టెడ్ సైనిక వ్యూహం, సంసిద్ధత, తర్ఫీదునిచ్చుట అనేవి ఉపమానములుగా, జీవితంలోను ఆత్మీయ యుద్ధములలోను విజయం పొందడానికి లేఖనానుసారమైన సూత్రాలను వివరించడానికి ఉపయోగించారు. యుద్ధము సులువైనది కాదు, శిక్షణపొందిన హృదయము, మనస్సు కలిగివుండటం ప్రాముఖ్యమని సున్నితంగా హెచ్చరిస్తూనే, దేవుని సన్నిధి ఆయన శక్తి ఈ యుద్ధములో మనలను క్షేమముగా ముందుకు నడిపిస్తుందనే సత్యముతో మనలను ప్రోత్సహిస్తారు.

ఆత్మీయ ఎదుగుదలకు సులువైన విధానంకోసం మీరు చూస్తున్నట్లయితే, మీకు నిరుత్సాహం తప్పదు. కాని, దేవునితో మీ యాత్రలో మీరు నిజంగా పురోభివృద్ధి సాధించాలంటే, వెంటనే హృదయపూర్వకంగా ఈ సందేశాన్ని వాడుకోమని మిమ్మల్ని నేను ఆహ్వానిస్తాను.

- డా॥ ఎడ్ బల్క్‌లీ

టెడ్ గ్రోవ్స్ 'ఆత్మీయ యుద్ధ శిక్షణ' అని పేరుపెట్టిన పుస్తకాన్ని వ్రాసారు. శీర్షికలో చెప్పినట్లుగానే, క్రైస్తవ జీవితం లోకముతో, శరీరముతో, సాతానుతో పోరాటం లేక యుద్ధం అనే లేఖనాంశంపై కట్టబడింది. యుద్ధాన్ని వివరించడమే కాక, ఆ యుద్ధంలో గెలుపొందడానికి సహాయపడే ఆలోచనలు, అవసరమైన విధానాలను ఈ పుస్తకం వివరిస్తుంది. ఈ రెండు పనులూ చేయడంతోపాటు,

ప్రతి అధ్యాయం చివరిలో వ్యక్తిగత అభివృద్ధికి ఇతరులను శిష్యులనుగా చేసే పనిలో ఉపయోగపడు ప్రశ్నలు, వాటినిగూర్చి చర్చ ఇచ్చి, పాస్టర్ గ్రోవ్స్ ఈ పుస్తకాన్ని ఉపయోగకరంగా ఉండేటట్లు చేసారు. లేఖన సత్యాలతోను, ఉపయోగకరమైన ఉదాహరణలు, అన్వయింపుతోను ఈ పుస్తకం చక్కగా తీర్చిదిద్దబడింది.

- డా॥ వేన్ మాక్

'ఆత్మీయ యుద్ధ శిక్షణ' ఉన్నది ఉన్నట్లు చెప్పే ఆచరణాత్మకమైన పుస్తకం. నీ మానసిక జీవితం అదుపుతప్పిపోయివుంటే, ఆత్మీయంగా నీవు దిక్కుతోచని స్థితిలో ఉంటే ఈ పుస్తకం నీకోసమే. నీ వైవాహిక జీవితంలో కలతలుఉన్నా, లేక కృంగుబాటు, చింత లేక భయం అనే అనేక వ్యక్తిగత సమస్యలు నిన్ను చుట్టుముట్టివున్నా, ఈ పుస్తకంలోని ధ్యానం నీ ఆత్మీయ పునాదిని పెంపొందించుకోవడానికి, ఈ సమస్యలను, ఇంకా ఇలాంటి అనేక సమస్యలను సమర్థవంతముగా ఎదుర్కోవడానికి తగిన క్రమశిక్షణ నేర్పిస్తుంది. ఇది కేవలం సిద్ధాంతపరమైనదిగా చదువుకోవడానికి మాత్రమే అన్నట్లుగా కాక తాను చెప్పినదానిని ఆచరించడానికి అనుకూలంగా ఒక్కొక్క మెట్టు ఎక్కడానికి మార్గదర్శనం చేసారు రచయిత. ఇది నూతన క్రైస్తవులకు, సమస్యలతో పెనుగులాడుతున్న విశ్వాసులకు ప్రాథమిక తర్ఫీదు.

- డా॥ క్రేగ్ రోయి

## అంకితం/కృతజ్ఞతలు

ఈ ఆత్మీయ యుద్ధ శిక్షణ పుస్తకాన్ని, 50 సంవత్సరాలుగా నాకు ప్రియతమమైన జీవితభాగస్వామిగా ఉండి, తన సహాయ సహకారములద్వారా సువార్తపనిలో భాగస్థురాలైన నా భార్యకు అంకితం ఇస్తున్నాను.

ఈ నూతన ముద్రణను ఈ పుస్తకం మొదటి ముద్రణనుండి ఈ శిష్యత్వపు తర్ఫీదులో నాతో కలసి పనిచేయుటకు దేవుడు లేపిన అనేకులైన నా సహపనివారికి అంకితం ఇవ్వాలని ఆశపడుచున్నాను. ఈ వ్యక్తులు శిష్యత్వపు పనిలో ఈ విధానాన్ని విస్తరింపజేయునట్లుగా ఈ పుస్తకాన్ని అనేక దేశాలలో, భాషలలో ఉపయోగించడానికి సాధ్యమయ్యేలా చేసారు.

మా స్వంత సంఘంలో, జైళ్లలో ఉన్న స్త్రీలమధ్య ఈ శిష్యత్వపు పరిచర్య జరగడానికి వ్యవస్థీకృతం చేసిన జోడి స్వాహియుకు కృతజ్ఞతలు. ఆమె పరిచర్య అనేకమంది దిక్కులేని, అవసరతలో ఉన్న స్త్రీలను దేవుని వాక్య శక్తి ద్వారా రూపాంతర పరచునట్లు దేవుడు వాడుకున్నాడు. మా సంఘంలో అనేకమంది బాధ్యతా భాగస్వాములుగా మా సలహాలిచ్చే పరిచర్యలో, క్రొత్త విశ్వాసులను శిష్యులుగా చేసే పనిలో ఆత్మీయ యుద్ధ శిక్షణనిచ్చే శిక్షకులుగా ఉన్నారు.

ముఖ్యముగా నెల్స్, ఎలెన్ హ్యూజ్‌లకు కృతజ్ఞతలు. ఇద్దరూ గొప్ప తలాంతులు ఉన్న వ్యక్తులు, మాకు మంచి మిత్రులుగా, సువార్తీకరణ శిష్యత్వపు పరిచర్యలో నమ్మకమైన సహపనివారుగా ఉన్నారు. మా సంఘం వద్ద తక్కువ కాలపు మిషన్ పరిచర్య ఆరంభించడానకి ప్రాథమికంగా వారే కారణం. వారి ప్రోత్సాహంతోనే ఈ తక్కువకాలపు శిష్యత్వపు పరిచర్య వేర్వేరు దేశాలలో కూడా ఆరంభించబడింది.

ఈ స్వల్పకాల మిషన్ యాత్రలు, పరిచయస్థులకు బంధువులకు ప్రాకి, అవి ఈ సువార్త పరిచర్యను పెరిగేటట్లు చేసాయి. పోలండ్‌లో పాస్టర్ జీనెట్ ఆయన భార్య జోలా, ప్రియలైన మిత్రులుగాను, సహపనివారుగాను మారారు. పాస్టర్ జీనెట్, రొమేనియాలో సామ్యూల్ మిట్రోఫాన్‌లు చాలా శిక్షణా శిబిరాలు ఏర్పాటు చేసి, రాకపోకలకు, తర్జుమాలకు ప్రయాసపడ్డారు.

పాస్టర్ సామ్యూల్, తూర్పు యూరోప్‌లో ఇ.ఇ. కి వైస్ ప్రెసిడెంట్‌గా అనేక అవకాశ ద్వారాలను (అనేక దేశాలలో, భాషలలో) ఏర్పాటుచేసి, ఈ

మార్గాలగుండా సమావేశాలు ఏర్పాటు చేయడానికి మా తరుపున శిష్యత్వపు పరిచర్యలో గొప్ప తెగువతో తాను స్వయంగా ముందు నడిచారు.

ఫిలిప్పీన్స్‌లో ఉన్న నమ్మకమైన పనివారికి- గ్రేస్ హ్యూస్ (పోర్‌ట్రెస్ కాలేజ్ అధ్యక్షులు, కబన్‌కలన్, నెగ్రోస్ ఒక్కిడెంటల్ దీవి), పాస్టర్ టిమ్ టపాంగ్ ఆయన భార్య నిడా (అదే పట్టణంలో సాన్ కార్లోస్ నివాసులు)లకు నా కృతజ్ఞతలు. ఈ వ్యక్తులందరూ మంచి స్నేహితులుగా, సహపనివారుగా ఉన్నారు. వారికి నేను ఎంతో ఋణపడివున్నాను. వారి సహాయానికై నా కృతజ్ఞతలు అభినందనలు. ఈ శిష్యత్వపు ప్రయత్నంలో వీరందరితో పరిచర్య చేయడం, దేవుడు ఇంకా అనేకులను ఈ విధంగా లేపడాన్ని వారితో పని చేయడం నాకు దొరికిన గొప్ప భాగ్యముగా ఎంచుతూ ఉన్నాను.

అన్నిటికంటే ఎక్కువగా ...... **దేవునికి స్తోత్రము!**

## ఆత్మీయ యుద్ధ శిక్షణ అంటే ఏమిటి?

ఈ ఆత్మీయ యుద్ధ శిక్షణ ధ్యానం కాపరి పరిచర్యా నేపధ్యంలో గత సంవత్సరాలలో తయారుచేయబడింది. లేఖనానుసారమైన ఆలోచన ఇచ్చుటకు కీలకమైనదిగా దీనిని వాడాలని, అంతేకాక, క్రైస్తవులందరూ వాడుకొనదగిన శిష్యత్వపు పరికరంగా దీనిని సిద్ధపరచాము. ఒక విశ్వాసి ప్రభువుతో అనుదిన జీవితంలో నడచుచూ బలపరచబడునట్లుగా ఇది రూపొందించబడింది. లేఖనానుసారమైన సలహాలిస్తూ వచ్చిన 40ఏండ్ల అనుభవంలో నేను కనుగొన్నది ఏమిటంటే, ఏదైనా అవసరం నిమిత్తమై క్రైస్తవులు వాక్యానుసారమైన సలహాకోసం వచ్చినపుడు, ప్రభువుతో వారి అనుదిన అనుభవం ఎలా ఉండాలో వారు నేర్చుకున్నట్లు నాకనిపించలేదు. నిజానికి చాలామంది క్రైస్తవులు ఏమాత్రం ప్రభావంలేని, ఎంతో బలహీనమైన అనుదిన ధ్యానసమయాన్ని గడపుతున్నారని కనుగొనటం నన్ను ఆశ్చర్యానికి గురిచేసింది.

క్రైస్తవుల వ్యక్తిగత ధ్యాన జీవితం బలహీనంగా ఉన్నా, క్రమముగా లేకుండా ఉన్నా లేక అసలు లేకపోయినా, వారు పాపంలో పడిపోయి కృంగుబాటు, భయం, చింత ఇంకా వత్తిడిలో పడిపోతారు. ఆత్మీయ యుద్ధ శిక్షణ దేవునితో మన అనుదిన నడక విషయంలో ఆచరణాత్మకమైన సహాయాన్ని

అందించడానికి అవకాశం ఇస్తున్నది. ఈ శిక్షణా శిబిరంలో నేర్పించే విషయాలను గంభీరమైనవిగా భావించి, క్రమముగా అనుసరించి చేసినపుడు, దేవునితో సమృద్ధియైన, అర్థవంతమైన అనుభవాన్ని పెంపొందించి విడువకుండా అచరించడానికి సహాయపడుతుంది.

## ఈ ఆత్మీయ యుద్ధ శిక్షణ పుస్తకాన్ని ఎలా వాడుకోవాలి?

### ఒక క్రైస్తవునికి వ్యక్తిగతంగా వాడుకోవడానికి

ఈ ఆత్మీయ యుద్ధ శిక్షణ అనే పుస్తకం ప్రాథమికంగా ఇద్దరు లేక అంతకంటే ఎక్కువమంది క్రైస్తవులు ఒకనికొకరు లెక్కఅప్పగించుకొనే విధంగా ఉండటానికి తయారుచేయబడినప్పటికీ, అవసరమైతే ఒక్క వ్యక్తి దీనిని ఒంటరిగా కూడా వాడుకోవచ్చు. అలాంటప్పడు, నాలుగవ అధ్యాయంలో ఇవ్వబడిన లెక్కఅప్పగించే విషయాలను అంటే -40రోజుల చార్టు, కంఠతవాక్య విధానం, వ్యక్తిగత ప్రార్థనా పట్టికకు సూచనలు, బైబిల్ పఠన చరిత్ర -అనేవి, కేవలం చదవడం మాత్రమే కాకుండా, వ్యక్తిగత ధ్యానజీవితంలోనికి ఇముడ్చుకొని ఈ ఆత్మీయ యుద్ధ శిక్షణ పుస్తకాన్ని వాడుకొనేటట్లుగా అలవరచుకోవాలి.

### ఇద్దరు లేక ఎక్కువమంది క్రైస్తవులమధ్య శిష్యత్వపు తర్ఫీదు పరికరంగా వాడుకోవడానికి

అనుదిన ధ్యానజీవితంలో శిష్యత్వపు తర్ఫీదుకోసం ఇద్దరు లేక ఎక్కువమంది క్రైస్తవులు కలసి ఈ ఆత్మీయ యుద్ధ శిక్షణ పుస్తకాన్ని ఉపయోగించుకోవచ్చు. వయసులో పెద్దవారు, క్రైస్తవ ఆత్మీయజీవితంలో పరిపక్వతకు వచ్చిన క్రైస్తవుడు గురువుగా ఉండి, ఈ పుస్తకంలో ఇచ్చిన అభ్యాసములన్నీ మిగిలిన క్రైస్తవులు అతనికి లెక్కఅప్పగించేటట్లుగా బాధ్యతగా చేయవచ్చు. లేక ఇద్దరు క్రైస్తవులు ఒకరికొకరు బాధ్యత వహించేటట్లుగా ఈ పుస్తకాన్ని పూర్తిచేయవచ్చు..

ఒక్కొక్కరు ఎవరికి వారుగా ఒక్కొక్క అధ్యాయాన్ని చదవి, చివరిలో ఉన్న చర్చించేవిషయాలకు సంబంధించిన ప్రశ్నలకు జవాబులు పూర్తిచేయాలి. వీరిరువురూ క్రమంగా (వారానికి ఒకసారి గాని లేకపోతే కనీసం రెండువారాలకు ఒక్కసారి అయినా) కలుసుకుంటూ ఉండాలి. కలుసుకున్న

ప్రతిసారి, బాధ్యత వహించే విధానం కీలకం! తాము చదివిన ఆత్మీయ యుద్ధ శిక్షణ పుస్తకంలోని అధ్యాయంయొక్క ప్రతిని అధ్యాయం చివరిలో పూర్తిచేసిన ప్రశ్నపత్రాలను, రెండవ అధ్యాయం చివరిలో ఉన్న లెక్కఅప్పగించే విషయాలకు సంబంధించి పైన చెప్పిన ప్రతులన్నీ తీసుకువచ్చి చూడాలి. ప్రతివారు తెచ్చిన ప్రతులను పరిశీలించి ఏదైనా లోపములు, పురోగతి పరీక్షించాలి. బాధ్యత వహించే భాగస్వాములు ఈ కలుసుకున్నప్పుడల్లా ప్రార్థించి, ప్రోత్సహించుకొని, ప్రతి అధ్యాయములోని విషయాలను పూర్తిగా చర్చించాలి. ప్రతి అధ్యాయం చివరిలో ఉన్న చర్చా సహకారిలో ఇవ్వబడినవి ఇలాంటి కూటములలో ఉ పయోగించడానికే రూపొందించబడ్డాయి.

అధ్యాయాలన్నీ ఒకసారి పూర్తిచేసిన తరువాత ఈ కూటాలు కొనసాగించవచ్చు, ప్రాధమిక బాధ్యతా పరికరాలను ఉపయోగించుకోవచ్చు. పాల్గొంటున్న భాగస్వాములలో ఎవరికైనా ఏదైనా ఆత్మీయ సమస్య లేక ఆయా అధ్యాయాలలో ఉన్న విషయాలకు సంబంధించిన సమస్యలేవైనా ఉ త్పన్నమయితే, ఆయా అధ్యాయాలలో ఉన్న విషయాలను తరచుగా మరలా మననం చేయవచ్చును.

## కాపరి సలహాకోసం వచ్చేవారికోసం లేక వ్యక్తిగత క్రైస్తవ సలహా సంప్రదింపులలో

ఆత్మీయ యుద్ధ శిక్షణలోని విషయాలు వ్యసనాలు, భయం, చింత, కృంగుబాటు, శోధన మొదలగు అంశములకు సంబంధించి సలహానిచ్చే పరిచర్యలో చర్చించడానికి ఆరంభించేందుకు అనువుగా రూపొందించబడ్డాయి. వివాహంలో వచ్చే సమస్యలు, చింత, నిరాశ మొదలగు విషయాలకు సలహాలిచ్చే సందర్భాలలో ఈ పుస్తకంలోని అంశాలు చాలా సహకారంగా ఉండటం నేను కనుగొన్నాను. జీవితాన్ని వేధించే దుర్వ్యసనాలనుండి విడిపించడానికి ఇచ్చే సలహా చర్చలలో ఇవి చాలా సహాయకరంగా ఉండడం నేను గమనించాను.

## ఇలా వాడుకుంటే ఉపయోగకరంగా ఉంటుందని నేను కనుగొన్న విధానం:

1) సలహాకోసం వచ్చేవారికి ఒకరిని బాధ్యతా భాగస్వామిగా ఇచ్చి, 'ఆత్మీయ యుద్ధ శిక్షణ' పుస్తకంగుండా నడిపించడానికి నియమించండి. మీరిచ్చే భాగస్వామి వాక్యానుసారమైన సలహాలిచ్చే పరిచర్యలో ఆసక్తిగలవాడై, మీతోపాటు పరిచర్యలో ఉన్నవాడుగా ఉండేటట్లు చూచుకోండి. ఈ అనుభవం వారికి నిజమైన పనిచేస్తున్న అనుభవాన్ని ఇస్తుంది. లేకపోతే, ఈ భాగస్వామి, అనుభవజ్ఞుడై, పరిపక్వతచెందిన క్రైస్తవుడై, సలహాకోసం వచ్చే వ్యక్తిని ఎరిగియుండి, అతనికి నమ్మకస్థుడై ఉన్నా పరవాలేదు. మరికొన్ని సందర్భాలలో, భార్యాభర్తల జంటకూడా ఈ భాగస్వాములుగా బాగా పని చేస్తారు.

2) సలహాకోసం వచ్చే వ్యక్తి, మీరిచ్చే బాధ్యత వహించే భాగస్వామి క్రమంగా (వారానికి ఒక్కసారి లేక రెండువారాలకు ఒక్కసారి) కలుసుకుంటూ ఈ పుస్తకాన్ని పూర్తిచేసి, ప్రతి అధ్యాయము చివరిలోని చర్చా అంశాలను నింపేటట్లు చూడండి. క్రమంగా జరుగుతున్న సలహా సమావేశాలకు ఇవి అనుబంధంగా ఉపయోగపడతాయి. మిగిలిన సలహాలిచ్చే ప్రక్రియతో ఇవి క్రమంగా కొనసాగుతాయి.

3) వారిద్దరూ (సలహాకోసం వచ్చేవ్యక్తి, అతని బాధ్యతా భాగస్వామి) ఆత్మీయ యుద్ధ శిక్షణ పుస్తకంలోని ఒక అధ్యాయం పూర్తిచేసిన తరువాత బాధ్యతా భాగస్వామి సదరు సలహాకోసం వచ్చిన వ్యక్తి ఆ అధ్యాయాన్ని పూర్తిగా అర్థం చేసుకుని, అందులోని విషయాలను ఆకళింపు చేసుకున్నాడని ఒప్పించబడితే, సలహాకోసం వచ్చే వ్యక్తి 'మోనిటరింగ్' సమయంకోసం ఏర్పాటు చేసుకోవచ్చు. ఈ మోనిటరింగ్ సమయంలో సలహా ఇచ్చే వ్యక్తి, సలహాకోసం వచ్చినవ్యక్తి, అతని బాధ్యతా భాగస్వామి ముగ్గురూ ఉంటారు. ఇందులో సలహా ఇచ్చే వ్యక్తి చర్చను నడిపిస్తాడు. ఇతని పని ఏమిటంటే, సలహాకోసం వచ్చిన వ్యక్తి ఉన్న పరిస్థితులలో ఆత్మీయ యుద్ధ శిక్షణలో ఉన్న వాక్యానుసారమైన సూత్రాలు ఎలా అతనికి వర్తిస్తాయో సహాయపడటమే. (గమనించండి: ఇలాంటి మోనిటరింగ్ సమయాలు

తరచుగా జరిగేటట్లుగా వత్తిడిచేయడం ముఖ్యం (నెల లేక నెలన్నర గడువులో ఒక్కసారి). బాధ్యతా భాగస్వామిగా ఉన్న వ్యక్తి కొన్నిసార్లు కావలసిన సమయంలో ఉండకుండా లేక మోనిటరింగ్ సమయాలు లేకుండా కలవడానికి, లేక అవి లేకుండా చేయడానికి అవకాశం తీసుకోవడం నా అనుభవంలో గమనించాను. సలహా ఇచ్చేవారు ఈ సమావేశాలను పర్యవేక్షించాలి.

4) సలహాకోసం వచ్చే వక్తి 'ఆత్మీయ యుద్ధ శిక్షణ'లోని అన్ని అధ్యాయాలను పూర్తిచేసేవరకు ఈ ప్రక్రియ చేస్తూనే ఉండాలి. సలహా ఇచ్చేవ్యక్తి ఈ సమావేశాలను ముగించాలి.

# పరిచయం

నేను ఒకసారి దక్షిణ కరోలినాలోని పారిస్ ద్వీపాన్ని దర్శించాను. అది నావికా దళ శిక్షణా శిబిరం. మేము ఆ ఆవరణలో కారులో వెళుతున్నపుడు, అక్కడ తర్ఫీదు పొందడానికి వచ్చినవారు (వీరిని మెరైన్‌లు అంటారు) రోడ్డువెంబడి ఎంతోదూరం పరుగెత్తడం చూశాం. మరొకచోట, ఈ మెరైన్‌లు హెల్మెట్‌లు పెట్టుకొని, ముఖానికి రక్షణకవచాలు తొడుగుకొని, పొడవైన కర్రలతో యుద్ధం చేస్తున్నారు. పోటీ తీవ్రంగా జరుగుతున్నది. చుట్టూ చేరి చూస్తున్న ప్రేక్షకులు ఆ పోటీదారులను ఉత్సాహపరుస్తూ, ఆ పోటీని మరింత తీవ్రంగా మారుస్తున్నారు. మరికొందరు ఫైరింగ్ రేంజ్‌లో తుపాకీలతో లక్ష్యాలను కాల్చడం చూశాం. కొన్నిసార్లు యుద్ధపరిస్థితులను ఎదుర్కునే తర్ఫీదులో భాగంగా, పైన తుపాకులతో కాల్చుతుండగా, ఈ మెరైన్‌లు బురదలో కాళ్ళు చేతులమీద పాక్కుంటూ వెళ్తారని మాకు చెప్పారు. మేము ఆ ప్రదేశాన్ని విడిచి వెళ్తుండగా, రోడ్డుపక్కనే ఉన్న చెట్లమధ్యన ఒక జింక లేక ఏదో జంతువు తిరుగుతున్నట్లుగా కనిపించే దృశ్యాన్ని చూచాము. జాగ్రత్తగా పరిశీలించిచూస్తే, ముఖాలకు రంగువేసుకున్న అనేకమంది మెరైన్‌లు చెట్లలో కలిసిపోయే దుస్తులు వేసుకుని, యుద్ధవిన్యాసాలు అభ్యాసం చేస్తున్నారని గమనించాను.

మిలిటరీలో చేరినవారు యుద్ధాలలో తమ ప్రాణాలు పోగొట్టుకొనే ప్రమాదం ఉన్నందున, వారిని సైన్యంలో చేర్చుకోవడానికి ముందు వారికి 'యుద్ధ శిక్షణా శిబిరం' లో ప్రాథమిక తర్ఫీదు ఇవ్వబడుతుంది. ఈ తర్ఫీదుయొక్క ముఖ్య ఉద్దేశ్యం ఏమిటంటే, సైన్యంలో చేరేవారికి యుద్ధసమయంలో శత్రువునుండి తమను కాపాడుకుంటూ, ప్రభావవంతమైన సైనికులుగా పనిచేయడానికి అవసరమైన మెలకువలు అనుభవాలు నేర్పించడం. అలాంటి శిక్షణా శిబిరాలలో నేర్పించే ప్రాణరక్షణ నైపుణ్యాలను నేర్చుకోకపోతే, సైన్యంలో చేరే వీరి జీవితాలు చాలా ప్రమాదంలో చిక్కుకుంటాయి. వారు శత్రుసైనికుల చేతికి సులువుగా దొరికిపోయి, తమ దేశంకోసం పోరాడే యుద్ధాలలో చెప్పకోదగ్గ ప్రభావం చూపలేరు.

క్రైస్తవ జీవితాన్ని సైన్యంతో పోల్చే ఆలోచనను కొంతమంది క్రైస్తవులు ఇష్టపడకపోవచ్చు. కాని బైబిల్ అదే చెబుతుంది. మనకు ఇష్టమున్నా లేకపోయినా

మనమందరము యుద్ధంలో ఉన్నామని బైబిల్ బోధిస్తుంది. లేఖనాల ప్రకారం, సృష్టికార్యాల వెనుక దేవునికి, అపవాదికి మధ్య విశ్వయుద్ధం జరుగుతూ ఉన్నది. ఆ యుద్ధం ఈ లోకము సృష్టించబడడానికి ముందే మొదలయ్యి ఉండవచ్చు కాని, ఆదాము ఏదేను వనంలో అపవాదిచే శోధింపబడినప్పడు లోబడి, పాపంలోపడి పతనమైనపుడు అది ఈ సృష్టిలోనికికూడా ప్రవేశించింది (రోమా 5:12). ఆ సమయంలో, లేఖనము బోధించే ప్రకారము, మానవజాతి అంతా దేవునికి విరోధముగా అపవాదిపక్షము వహించింది. నాటినుండి సర్ప సంతానమునకు (అనగా రక్షణపొందని వ్యక్తులకు- 1యోహాను 5:19), స్త్రీ సంతానమునకు (అనగా క్రీస్తు, ఆయన విమోచించినవారు -ఆదికాండము 3:15; హెబ్రీ. 2:10) వైరము కలిగింది. మనమందరము, పుట్టినది మొదలుకొని ఈ రెండు సైన్యాలలో ఒకదానిలో ఉన్నాము: దేవుని రాజ్యము లేక అపవాది రాజ్యము (కొలస్సి.1:13). ఈ రెండు రాజ్యాలు ఒకదానితో ఒకటి భీకర యుద్ధంలో ఉన్నాయి.

ఈ లోకంలో అనేకమంది క్రైస్తవులు ఓటమిలో (భయముతో, ఆందోళనతో, చింతలతో, వేదనతో, పగ, పాప ఇచ్ఛలు మొదలగువాటి ఆధీనంలో ఉండటం) జీవించడానికి, వారిచుట్టూ, వారి కుటుంబాలలో, ఉద్యోగాలలో గందరగోళము, నాశనము, అధ్వాన్నపు పరిస్థితులకు కారణం - వారికి ఈ ఆత్మీయ యుద్ధాన్నిగూర్చి ఏమాత్రం ఆలోచన లేకపోవడమే. అందువల్లే నేటి సంఘం సిద్ధపడని సైన్యంలా ఉంది! అలాంటి క్రైస్తవులు యుద్ధరంగంలో తమవంతు పనిచేయడంలో విఫలమైపోతున్నారు. అనేకమందికి, వాళ్ళు యుద్ధంలో ఉన్నారన్న విషయం కూడా తెలియదు! అందుకే ఈ పుస్తకం రచించబడింది. వ్యక్తిగత సమస్యలలో అపజయంపొందుతూ ఉన్న క్రైస్తవులు, మరలా ఆరంభానికి వెళ్ళి ఆత్మీయ యుద్ధ శిక్షణ నేర్చుకోవాలి. వారి ఆత్మలను కాపాడుకోవడానికి అవసరమైన ప్రాథమిక వనరులు తెలుసుకొని, ఆయన గొప్ప రాజ్యములో ప్రభావవంతమైన ఆత్మీయ సైనికులవలె తమ రాజైన ప్రభువైన యేసు క్రీస్తును సేవించడానికి తమను తీర్చిదిద్దుకోవడానికి వారు తగినరీతిలో సిద్ధపడి ఉండాలి.

ఆత్మీయ యుద్ధ శిక్షణ శిబిరంలో తగిన తర్ఫీదు అవసరమైన వేర్వేరు విభాగాలు ఏమిటంటే : బైబిల్ పరిజ్ఞానము, ప్రార్థన, ఆరాధన, సహవాసము,

సేవ, సాక్ష్యము. ఏదేమైనా, విశ్వాసి దేవునితో అనుదిన నడవడి విషయంలో బలపరచడానికి, విశ్వాసి అనుదిన ప్రార్థన ధ్యాన సమయాలు మరింత అర్థవంతముగాను, వారి పరిస్థితులకు తగినవిగాను ఉండుటకు కావలసిన నిర్దిష్టమైన సమాచారము తెలియజేసి, విధానాలు చూపించుట ఈ పుస్తకంయొక్క ఉద్దేశ్యం. ఈ అంశముయొక్క ప్రాధాన్యతను తగినంతగా నొక్కిచెప్పడం కష్టం.

ఈ పుస్తకంలోని మొదటి అధ్యాయం, 'పెద్ద చిత్రం' లేక 'పూర్తి దృక్పధం' -ఈ లోకంలో క్రైస్తవుని జీవితనేపథ్యంలో, నిత్యత్వపు విలువల ప్రాధాన్యత అనే అంశాన్ని చర్చించడానికి అంకితం చేయబడింది. ప్రతి క్రైస్తవుడు 'గొప్ప ఆదేశం' నెరవేర్చడానికి పిలువబడ్డాడు అనేవిషయాన్ని ఈ విషయం చర్చిస్తుంది. ఇది శిష్యత్వము వైపుకు మన దృష్టిని మరల్చుతుంది. శిష్యత్వపు ప్రాముఖ్యతను ప్రతి క్రైస్తవుడు తన స్వంత జీవితంలో ఎరగాలి, తరువాత ఇతరులను క్రీస్తు శిష్యులుగా చేయమనే క్రీస్తు ఆజ్ఞకు (మత్తయి 28:19-20) విధేయత చూపుటకు సవాలుచేయబడాలి.

రెండవ అధ్యాయము కొన్ని ప్రాథమిక బైబిల్ వ్యూహములను పరిచయం చేస్తుంది. తరువాతి అధ్యాయాలలో చర్చించబడే అన్నింటిలో ఈ వ్యూహాలు అంతర్లీనంగా ఉంటాయి. నిజానికి, ఈ 'ఆత్మీయ యుద్ధ శిక్షణ'లో మిగిలిన అధ్యాయాలు ఒకని జీవితంలో ఈ వ్యూహములు ఎలా అన్వయించుకోవాలో అనే విషయాన్ని తెలియజేస్తాయి. ఈ వ్యూహములపై దృష్టి ఉంచి, వాటిపై పూర్తి పట్టు సాధించడం ఎందుకు అవసరమో ఈ అధ్యాయం మీకు వివరిస్తుంది.

దేవుని వాక్యములో ఉన్న అద్భుతమైన వాగ్దానాలనుగూర్చి అనేకానేక ఉదాహరణలతో వివరిస్తూ, దేవుని వాగ్దానాల ప్రాముఖ్యతనుగూర్చి మూడవ అధ్యాయం వివరిస్తుంది. రెండవ అధ్యాయంలో చెప్పిన వ్యూహాలను ఎలా అమలుపరచాలి అనే చర్చ, ఈ మూడవ అధ్యాయంలో మొదలౌతుంది. (నిర్దిష్టమైన వ్యూహాలు అమలుపరచడాన్నిగూర్చి ప్రతి అధ్యాయంలో కొంచెం కొంచెగా విశదీకరించబడింది.) ఈ వాగ్దానముల ద్వారా "దురాశను అనుసరించుటవలన లోకమందున్న భ్రష్టత్వమును" తప్పించుకొనవచ్చునని 2 పేతురు 1:4 చెబుతుంది. దేవుని వాగ్దానములతో విశ్వానమును కలపుకోవడంగూర్చి ముఖ్యమైన సూచనలు ఇచ్చాము. మన జీవితాలలో ఉన్న

చెడుగును జయించడానికి మనలో ఉన్న రహస్యమైన శక్తి ఇది. ఈ అధ్యాయంలో ఉన్న విషయాలు "సంరక్షణ" అనే రెండవ వ్యూహాన్ని, మనకు మనం "ప్రసంగించుకోవడం" అనే మూడో వ్యూహాన్ని ఎలా అమలు పరచాలి అనే విషయంలో శిష్యునికి సహాయం చేస్తాయి.

నాలుగవ అధ్యాయం, దేవుని వాక్యంతో మన ఆత్మను పోషించుకోవడం గూర్చి, అర్థవంతమైన ధ్యానసమయాన్ని ఆరంభించడం ఎలాగో వివరిస్తుంది. ముందున్న అధ్యాయాలకంటే, నాలుగవ అధ్యాయం మరింత ఆచరణాత్మకమైనది. దేవునితో మన అనుదిన నడకను స్థిరపరచుకోవడాన్ని గూర్చిన కొన్ని నిర్దిష్టమైన విషయాలు ఎలా పనిచేస్తాయో ఇది పరిచయం చేస్తుంది. బాధ్యత వహించే భాగస్వామినిగూర్చి, వేర్వేరు లెక్కఅప్పగించే వివిధ సాధనాలను గూర్చి కూడా ఈ అధ్యాయం పరిచయం చేస్తుంది. శిష్యత్వపు పనిలో ఈ సాధనాలు ఆచరణాత్మకంగా సహాయపడతాయి.

ఐదవ అధ్యాయం మన శత్రువునుగూర్చిన ముఖ్యమైన విషయాలతో క్లుప్తంగా వివరణ ఇస్తుంది. మన శత్రువు క్రైస్తవులతో తాను చేసేయుద్ధంలో వ్యూహాలు పన్నుతాడు గనుక మనముకూడా (రెండవ అధ్యాయంలో చర్చించినటువంటి) తెలివైన వ్యూహాలు పన్నవలసిన అవసరం ఉంటుంది. 2 కొరింథి 2:11లో అపోస్తలుడైన పౌలు ''సాతాను తంత్రములను (వ్యూహములు) మనము ఎరుగనివారము కాము" అని చెపుతాడు. మన శత్రువు వేసే ఎత్తులు, వాడి బలములు బలహీనతలు, వాడి వ్యూహములు మన అర్థం చేసుకోవాలి.

ఆరవ అధ్యాయం చాలా ముఖ్యమైన ప్రాధాన్యతలు, ఒకే విషయంపై ధ్యాన కలిగివుండటం, దేవునికి హృదయపూర్వక సమర్పణ అనే అంశములనుగూర్చి వివరిస్తుంది. ఇందులో, "నీ ప్రవర్తన అంతటియందు ఆయన అధికారమునకు ఒప్పుకొనుట" (సామెతలు 3:5-6)నుగూర్చి అనసరణీయమైన కొన్ని మార్గములు మీరు నేర్చుకుంటారు. ఈ అధ్యాయం నాలుగవ వ్యూహమైన "ప్రాధాన్యత", మొదటి వ్యూహమైన "పరిశుద్ధత" లమీద కేంద్రీకరిస్తుంది.

ఏడవ అధ్యాయం పాపమును గూర్చి, అపరాధభావననుగూర్చి వివరిస్తుంది. ఈ సమస్యను ఎలా ఎదుర్కోవాలో ప్రతి క్రైస్తవుడు నేర్చుకోవాలి.

నేర్చుకోకపోతే అపవాది మనలను శక్తిహీనులను చేసి నిస్సహాయులను చేసేస్తాడు. ఈ అధ్యాయంలోని సమాచారం "పరిశుద్ధత" అనే మొదటి వ్యూహాన్ని అమలు పరచడంగూర్చి సహాయపడతుంది.

చివరిగా, ఈ పుస్తకంలోని ఏ సందేశమైనా మనలో ఎల్లప్పడూ నిలిచి వుండే ప్రభావాన్ని చూపాలంటే సహనము కలిగివుండుట నేర్చుకోవాలి అనే విలువైన పాఠాన్ని ఎనిమిదవ అధ్యాయం నొక్కి వక్కాణిస్తుంది.

ఈ విషయాలలో నిజంగా ప్రయత్నం చేసి, నైపుణ్యం సంపాదించడానికి ప్రయత్నం చేసే ఎవరైనా, ఈ అధ్యాయాలద్వారా సహాయ సహకారాలు పొందుతారు, ఉత్తేజం పొంది, దేవునితో తమ అనుదిన నడకను అర్థవంతముగాను ఫలభరితంగాను చేసుకుంటారు. ఈ పుస్తకం చదవడం మీలో మార్పు తీసుకురాదు; కాని ఈ పుస్తకంలో చెప్పిన విషయాలను క్రమమైన పద్ధతిలో, ఆపకుండా చేస్తూవుంటే మీ జీవితంలో నిజమైన మార్పు, అభివృద్ధి ఆరంభమవుతుంది.

### మొదటి అధ్యాయం

# "ఆత్మీయ యుద్ధ శిక్షణా శిబిరం మరియు వ్యక్తిగత శిష్యత్వపు పని"

**[శిష్యత్వము : వాక్యానుసారమైన ఆదేశం]**

వెస్ట్‌మినిస్టర్ ఒప్పకోలు, అత్యంత ప్రభావవంతమైన పత్రముగా ప్రొటెస్టెంటు సంఘాలలోను, సర్వత్రా గుర్తించబడింది. క్రైస్తవ్యంలో సామాన్యమైన అత్యధిక సిద్ధాంతాలు చాలా క్రమబద్ధంగా నిర్మించబడి ఇందులో పొందుపరచబడ్డాయి. ఇందులో ఇవ్వబడ్డ ప్రశ్నలు జవాబులు విధ్యార్థులు కంఠస్థం చేసి మరలా మరలా చెబుతారు. ఈ ఒప్పకోలులోని మొదటి ప్రశ్న బాగా సుపరిచితమైంది ఎందుకంటే అది చాలా తరచుగా వినబడేది: "మానవుని ముఖ్యమైన లక్ష్యం ఏమిటి?" జవాబు : "మానవుని ముఖ్యమైన లక్ష్యం దేవునిని మహిమపరచుట, ఆయనయందు నిత్యము అనందించుట" అని ఇవ్వబడుతుంది.

ఎంతో సమర్పణ కలిగిన, యోగ్యతలు గలిగిన క్రైస్తవనాయకులుగా చరిత్ర గుర్తించిన వ్యక్తులు సిద్ధపరచిన పత్రములో, ప్రతి మానవుని జీవితంలో ప్రాథమికమైన ముఖ్యమైన లక్ష్యం ఏమై ఉండాలో పొందుపరచారు! "నేను ఎక్కడనుండి వచ్చాను?" "నేను ఇక్కడ ఎందుకు ఉన్నాను?" "నా గమ్యం/లక్ష్యం ఏమిటి?" అనే ప్రశ్నలకు తత్వవేత్తలు జవాబు ఇవ్వడానికి ప్రయత్నించారు. క్రైస్తవ ప్రపంచ కోణంలో సర్వజీవులు, సృష్టిలోని సమస్త పదార్థము యొక్క ఉనికి భూమ్యాకాశములయందు సర్వమును సృష్టించి, తయారుచేసిన స్వయంభవుడైన దేవునియందు ఉన్నది. ఈ గ్రహింపు జీవమునకు, సమస్త సృష్టికి ఒక అర్థం, భవిష్యత్తు, నిత్యమైన లక్ష్యం ఉన్నవనే భావనకు నడిపిస్తాయి. దేవుడే ఒక నిత్యమైన ఉద్దేశ్యం కలిగి ఉన్నాడని (ఎఫెసీ. 3:11), ఆ ఉద్దేశ్యం ఆయన కుమారుడైన యేసుక్రీస్తును కేంద్రబిందువుగా చేసుకుని ఉన్నదని (ఎఫెసీ.1:9-10) బైబిల్ బోధిస్తుంది. కాబట్టి మన జీవితాలలలో నిత్యమైన గుర్తింపు కలిగివుండాలని ఆశపడితే, సృష్టికర్తను ఎరిగి ఆయన ఉద్దేశ్యానికి అనుగుణంగా మన జీవితాలు రావాలి అని కోరుకున్నట్లయితే, ఆయన మననుండి ప్రాథమికంగా ఏమి కోరుతున్నాడు, ఆయన మనలను ఎలా నడిపించాలని ఆశిస్తున్నాడు అని మనం వెదకాల్సి ఉంది.... ఆచరణాత్మక దృష్టికోణంనుండి చూస్తే బైబిల్ ప్రాథమికంగా నిర్దేశించేవి ఏమిటంటే:

# సువార్త
# గొప్ప ఆదేశం
# మరియు శిష్యత్వం

వాక్యానుసారమైన క్రైస్తవ్యానికి ఆరంభస్థానం ఏమిటంటే, నిస్సందేహంగా **యేసు క్రీస్తు సువార్త.** అది బైబిల్ గ్రంథమంతటికీ కేంద్రబిందువు. ఆరంభంనుండీ, బైబిల్‌లోని సమస్తమూ, సువార్త సందేశాన్ని ఎత్తిచూపుతుంది. "సువార్త" అంటే "మంచివార్త". ఈ "మంచి వార్త" ప్రపంచమంతటా ప్రకటించబడి విస్తరించాలనేది దేవుని కోరిక (ఆజ్ఞ). అందుకే, భూమిపై తన పరిచర్య ముగింపులో, ప్రభువైన యేసు తన సంఘానికి ఈ టవబ్ వాజ్ఞబ్కఖు ఇచ్చారు...

**"కాబట్టి మీరు వెళ్ళి సమస్త జనులను శిష్యులనుగా చేయుడి; తండ్రియొక్కయు కుమారునియొక్కయు పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మమిచ్చుచు నేను మీకు ఏయే సంగతులు ఆజ్ఞాపించితినో వాటినన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి. ఇదిగో నేను యుగ సమాప్తివరకు సదాకాలము మీకూడ ఉన్నాను" మత్తయి 28:19-20**

సువార్త పునాది (1) యేసు ఎవరు; మరియు (2) ఆయన ఏమి చేశారు అనే రెండు విషయాలను వివరిస్తుంది.

**ఆయన ఎవరు?**

యేసు: దేవుని కుమారుడు (యోహాను 3:16); ఆయన సర్వ సృష్టికర్త, అన్నిటినీ చేసినవాడు (యోహాను 1:1-2); ఆయన మానవశరీరాకారంలో ఉన్న దేవుడు (యోహాను 1:14); ఆయన తండ్రితో ఏకమైయున్నవాడు (యోహాను 10:30; 14:9); లోకమునకు తీర్పు తీర్చుటకు దేవునిచే నియమింపబడినవాడు (అపోస్తలుల కార్యములు 17:31).

**ఆయన ఏమి చేశారు:**

మెస్సియ్యాను గూర్చిన ప్రవచనాలను నెరవేర్చాడు (అంటే ఆయన బైబిల్లోని వాగ్దానాలను - గొప్ప విమోచకుడు, రక్షకుడు వస్తాడని చెప్పబడిన సాదృశ్యాలు, ముంగుర్తులు - ఆయనలో నెరవేరాయి (హెబ్రీయులకు 10:1) ఆయన లోక పాపములను మోసుకొనిపోవుటకు వచ్చిన "దేవుని గొఱ్ఱెపిల్ల" (యోహాను 1:29; 1 పేతురు 2:24))

## "సువార్త" మరియు
## క్రైస్తవులపై దాని ప్రభావములు సంక్షిప్తంగా.....

**ఒకప్పుడు మనమందరమూ**

| | |
|---|---|
| ఎఫెసీయులకు 2:12 | - "క్రీస్తుకు దూరస్థులము" (1 తిమోతి 2:5; యోహాను 14:16తో పోల్చి చూడండి) |
| ఎఫెసీ 2:1 | - "అపరాధములచేతను పాపములచేతను చచ్చినవారము" |
| రోమా 5:10 | - "దేవునికి శత్రువులము" |
| రోమా 8:7 | - "దేవునికి విరోధులము" |
| ఎఫెసీ 2:12 | - "ఇశ్రాయేలుతో సహపౌరులము కాక...పరదేశులము... నిరీక్షణలేనివారము.....లోకమందు దేవుడు లేనివారము" |
| ఎఫెసీ 2:13 | - "దూరస్థులము" |
| ఎఫెసీ 2:3 | - "దైవోగ్రతకు పాత్రులము" |
| యోహాను 3:36 | - "దేవుని ఉగ్రత" మనమీద "నిలిచియున్నది" |

**కాని ఇప్పుడు, క్రీస్తు చేసిన ప్రాయశ్చిత్త కార్యమును బట్టి.....**

| | |
|---|---|
| ఎఫెసీ 2:13 | -"అయినను, మునుపు దూరస్థులైన మీరు ఇప్పుడు క్రీస్తుయేసునందు క్రీస్తు రక్తమువలన సమీపస్థులైయున్నారు." |
| కొలస్సి 1:13 | - "ఆయన మనలను అంధకారసంబంధమైన అధికారములో నుండి విడుదలచేసి, తాను ప్రేమించిన తన కుమారునియొక్క రాజ్యనివాసులనుగా చేసెను." |
| ఎఫెసీ. 2:19 | - "కాబట్టి మీరికమీదట పరజనులును పరదేశులునైయుండక, పరిశుద్ధులతో ఏక పట్టణస్థులును దేవుని యింటివారునై యున్నారు." |
| 1 యోహాను 3:1 | - "మనము దేవుని పిల్లలమని పిలువబడునట్లు తండ్రి మనకెట్టి ప్రేమననుగ్రహించెనో చూడుడి; మనముదేవుని పిల్లలమే." |
| రోమా 8:15 | - "ఏలయనగా మరల భయపడుటకు మీరు దాస్యపు ఆత్మను పొందలేదుగాని దత్తపుత్రాత్మను పొందితిరి. ఆ ఆత్మ కలిగిన వారమైన మనము - అబ్బా తండ్రీ అని మొఱ్ఱపెట్టు చున్నాము" |

**గొప్ప ఆదేశము:**

**"కాబట్టి మీరు వెళ్ళి సమస్త జనులను శిష్యులనుగా చేయుడి; తండ్రియొక్కయు కుమారునియొక్కయు పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మమిచ్చుచు నేను మీకు ఏయే సంగతులు ఆజ్ఞాపించితినో వాటినన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి. ఇదిగో నేను యుగ సమాప్తివరకు సదాకాలము మీకూడ ఉన్నాను" మత్తయి 28:19-20**

గమనిక : గొప్ప ఆదేశం ప్రకారం క్రైస్తవులు సువార్తను ఎలా ప్రకటించాలంటే, సువార్త ప్రకటన ద్వారా మార్పు చెందిన ప్రజలు తరువాత శిష్యులుగా మారాలి.

**శిష్యుడంటే ఏమిటి?**

**యోహాను 8:31-32 – నిజమైన శిష్యులు** ఆయన ఉపదేశములోని సత్యము వారిని పాపముయొక్క బలమునుండి దాని శిక్షావిధి నుండి స్వతంత్రులను చేసే, **క్రీస్తు ఉపదేశములలో "నిలిచి"యుండేవారు.**

**యోహాను 15:5-8 – నిజమైన శిష్యులు అనగా విశ్వాసంలో ఓర్పుతో కొనసాగుతూ. తమ జీవితాలలో పరిశుద్ధాత్మ ఫలములను ఫలిస్తూ, క్రీస్తురూపములోని మార్చబడేవారు.** (గలతి. 5:22-23; రోమా 8:29 వచనాలతో పోల్చి చూడండి).

**యోహాను 13:34-35 – నిజమైన శిష్యులు అనగా "ఒకరినొకరు ప్రేమించువారు!"** (అంటే తమవంటి విశ్వాసము, నిరీక్షణ గలవారిచెంతకు ఆకర్షించబడేవారు. ఇతర క్రైస్తవులతో సమయాన్ని గడపడానికి సంతోషించేవారు. వారినుండి బలమును ఆదరణను పొందుకునేవారు. అలా కలుసుకోవడం ఒక కుటుంబాన్ని కలసినట్టు ఉంటుంది.)

**యోహాను 15:5 గూర్చి ఒక మాట [క్రీస్తులో "నిలిచియుండుట"] "నాయందు నిలిచియుండుడి"** అని మన ప్రభువు చెపుతున్నపుడు, ఆయన మన చిత్తమునుగూర్చి, మన ఎంపికలనుగూర్చి మనం తీసుకునే నిర్ణయాలనుగూర్చి మాట్లాడుతున్నారు. మనం ఆయనకు తెలిసేలా, ఆయనతో అనుబంధంలో ఉండేలాంటి పనులు చేయడానికి నిర్ణయించుకోవాలి. ఆయనలో నిలిచివుండటం అంటే అర్థం ఇది. పరిశుద్ధాత్మ ద్వారా మనం క్రీస్తులో ఉంచబడ్డాము. మనం తీసుకునే నిర్ణయాలతో ఇప్పడు మనం ఆ అనుబంధాన్ని కొనసాగించడానికి అనుగుణంగా మన ప్రాధాన్యతలు ఉండాలి -ఆయన వాక్యమునకు మనలను అప్పగించుకొని ఆయనగురించి నేర్చుకోవడానికి, ప్రార్థనద్వారా ఆయనతో సంభాషిస్తూ అనుబంధంలో ఉండాలి.

ఇతర విశ్వాసులతో -ఒకరి భారములు ఒకరు భరించుచూ, మన తప్పిదములను ఒప్పుకొంటూ, సహవాసములో ఒకరితో ఒకరు పంచుకుంటూ 'ఏక శరీరముగా' ఉండే అనుభవంతో నిర్ణయాలు తీసుకోవాలి." - రే స్టెడ్‌మేన్

## శిష్యత్వమునుగూర్చి పలు క్రైస్తవ నాయకుల నుండి కొన్ని ముఖ్యమైన మెళకువలు

**డేవిడ్ ప్లాట్ తలంపులు.......**

(బ్రూక్‌ఫీల్డ్ సంఘ కాపరి, బర్మింగ్‌హామ్, అలబామ, అమెరికా. (ఈ క్రింద ఇవ్వబడినవి డేవిడ్ ప్లాట్‌గారు ఆగస్టు 2012లో ప్రసారం చేసిన ప్రసంగంనుండి వ్యక్తిగతంగా సేకరించిన విషయాలు).

మత్తయి సువార్తలోని ఆరు లేఖనభాగాలనుండి ప్లాట్‌గారు 4 విషయాలను సంగ్రహిస్తారు (మత్తయి 4:18-19; 8:18-22; 9:9-11; 10:34-38; 16:24-27; 19:16-30).

**తన శిష్యులుగా ఉండుటకు యేసు ఇచ్చిన ఆహ్వానం ......**

**1] దయతోకూడిన ఆహ్వానం.....**

"ఆయన తనను వెంబడించమని పిలిచిన ప్రజలు, తమలో ఏ యోగ్యత లేనివారు (సుంకరులు, జాలరులు, నిరుపేదలు, దీనస్థితిలో ఉన్నవారు, భయంకరమైన పాపులు....).

ఆయన శిష్యులు ఆయనవద్దకు రాలేదు; ...ఆయన వారియొద్దకు వచ్చాడు! ("మీరు నన్ను ఏర్పరచుకొనలేదు... నేను మిమ్మును ఏర్పరచుకొని నియమించితిని" యోహాను 15:16)

**2] ఒక ఉద్దేశ్యంతో కూడిన ఆహ్వానం......**

".....నా వెంబడిరండి నేను మిమ్మును మనుష్యులను పట్టు జాలరులుగా చేయుదును....."

"ఒక ఉద్దేశ్యపూర్వకమైన పనితో కూడిన దయ!"

యేసు నిన్ను పిలిచారంటే, ఒక ఉద్దేశ్యంతోనే పిలుస్తారు!
(అంతేకాక, ఆ పిలుపు వెనుక ఒక స్పష్టమైన ఆత్రుత ఉన్నది!)

క్రీస్తు నిన్ను "పిలిచారంటే" ఆయన నీకు ఒక ఉద్దేశ్యముతో కూడిన పనిచేయమని ఆదేశించారని అర్థం!

"...నన్ను వెంబడించుము....ఇతరులు నీ తండ్రిని పాతిపెట్టనిమ్ము," .... మనం చేయడానికి మరింత ప్రాముఖ్యమైన పనులున్నాయి! (మత్తయి 8:22)

ఇది నీ 'సౌకర్యము' కొరకు ఇచ్చిన పిలుపుకాదు! నీవున్న చోట, మరియు భూదిగంతములవరకు సువార్తను విస్తరింపజేసి శిష్యులను తయారుచేయుటకు ఇచ్చిన పిలుపు!

**ఈ పని అస్సలు చేయకుండానే నీ జీవిత అంతమును చేరుకుంటావేమో, నీవు జాగ్రత్తగా చూచుకో!**

**ఒక్కడో ఒకచోట, ఎవరో ఒకర్ని కనుగొని, వారికి సువార్త చెప్పి, వారిని క్రీస్తుకు శిష్యునిగా చేయి!**

క్రీస్తు నీ జీవితంలో నిన్ను పిలిచింది ఒక పని చేస్తావనే ఉద్దేశ్యపూర్వకమైన పిలుపుతో!

**3] గొప్ప వెల చెల్లించాల్సిన ఆహ్వానం...**

మన జీవితంలోని కొన్ని భద్రతతోకూడిన స్థానాలను విడిచిపెట్టమని యేసు మనలను పిలుస్తున్నారు -కుటుంబాన్ని, స్నేహితులను, సౌకర్యాన్ని, భద్రతను. (మత్తయి 10:37-39)

ఆయన ఉద్దేశ్యాలు నెరవేర్చుటకొరకు మన జీవితంపై నియంత్రణను ఆయనకు వదిలిపెట్టి, ....పాపంనుండి స్వార్థంనుడి వెనకకు రమ్మని ఆయన పిలుస్తున్నారు.

పేతురు, యాకోబు, యోహానుల వలెనే, మత్తయి లేచి తన వృత్తిని విడిపెట్టాడు. వారి జీవితంలో ఇది చాలా పెద్ద, "ఖరీదైన" నిర్ణయం!

చెల్లించాల్సిన వెలనుగూర్చి యేసు బహిరంగంగా చెప్పారు! "తోడేళ్ళమధ్యకు గొఱ్ఱెలను పంపినట్లుగా నేను మిమ్మును పంపుతున్నాను" అని ఆయన అన్నాడు...... అంటే "మీరు ప్రమాదకరమైన ప్రదేశాలకు వెళతారు, నా దైవిక చిత్తము, పిలుపు ప్రకారం మీరు అక్కడ ఉంటారు!" అని దాని అర్థం.

గమనిక : ఇలాంటి వాక్యభాగాలను సర్వత్రా, అందరికీ ఆపాదించలేము! క్రైస్తవులందరూ తమ జీవితంలో ఒకేస్థాయిలో త్యాగం చేయాల్సిఉండదు, ఒకే విధంగా శ్రమలు పొందాల్సి ఉండదు. కాని, కనీసం కొంతమందయినా, గమనించదగిన త్యాగం, శ్రమ పొందడానికి ఇష్టపడి సేవచేయుటకు పిలువబడ్డారు! **"మనలో [అనేకులు] నిర్లక్ష్యంగా ఉండడంకంటే, క్షేమంగా ఉన్నామని అనుకునే ప్రమాదంలో పడే అవకాశం ఉంది!"** (అంటే క్షేమము, భద్రత, సౌకర్యం, డబ్బు అనే విగ్రహారాధనకు లోబడే ప్రమాదం).

**4] తృప్తినిచ్చే ఆహ్వానం.....**

మత్తయి 19:27-30 -పేతురు తననుగూర్చి, మిగిలిన శిష్యులనుగూర్చి, "మేము సమస్తమును విడిచిపెట్టి నిన్ను వెంబడించితిమి...." అన్నాడు. "యేసు వారితో ఇట్లనెను, 'పునర్జననమందు, మనుష్యకుమారుడు తన మహిమగల సింహాసనము మీద ఆసీనుడైయుండునపుడు నన్ను వెంబడించిన మీరును పండ్రెండు సింహాసనములమీద ఆసీనులై ఇశ్రాయేలు పండ్రెండు గోత్రములవారికి తీర్పు తీర్చుదురు. నా నామము నిమిత్తము అన్నదమ్ములనైనను అక్కచెల్లెండ్రనైనను తండ్రినైనను తల్లినైనను పిల్లలనైనను భూములనైనను ఇండ్లనైనను విడిచిపెట్టిన ప్రతివాడును నూరురెట్లుపొందును? ఇదిగాక నిత్యజీవము స్వతంత్రించుకొనును. మొదటివారు అనేకులు కడపటివారగుదురు, కడపటివారు మొదటివారగుదురు.'"

(లూకా 18:29-30లో ఇవే మాటలు ఇలా ఉంటాయి : "....దేవుని రాజ్యము నిమిత్తమై యింటినైనను భార్యనైనను అన్నదమ్ములనైనను తలిదండ్రులనైనను పిల్లలనైనను విడిచిపెట్టినవాడెవడును, ఇహమందు చాలరెట్లును పరమందు నిత్యజీవమును పొందకపోడని నిశ్చయముగా మీతో చెప్పుచున్నానని వారితో అనెను".)

నిజముగా క్రీస్తును అనుసరించువారిలోనికి స్థిరమైన, లోతైన శాంతి, సంతోషములు కలుగుతాయి! ఈ జీవితంలో వారు భరించడానికి పిలువబడిన త్యాగం, హింస వారికి దొరికిన భాగ్యముగా కనబడుతుంది. వారు తమకోసం సిద్ధపరచబడిన మహిమాన్వితమైన నిత్యత్వమును చూస్తున్నందున, అది భరించుటకు కృపను, సహనమును పొందుకుంటారు. (ప్రకటన 21, మొదలగు లేఖనాలు).

## బిల్లీ గ్రాహం గారినుండి కొన్ని ఆలోచనలు....

నీవు చెల్లించాల్సిన వెల గుర్తించాలి....

పైపైన ఉండే అత్యుత్సాహాన్ని యేసు ప్రోత్సహించలేదు. శిష్యుడుగా ఉండడానికి ఎంత వెల చెల్లించాల్సి వస్తుందో గమనించమని ఆయన ప్రజలను కోరారు. అనేకసార్లు బహుమంది జనసమూహములు తనను అనుసరించినపుడు, ఆయన వారివైపు తిరిగి, "మీరు చెల్లించాల్సిన వెలగురించి ఆలోచించారా? ఎవడైనను నన్ను వెంబడించాలంటే, వాడు తన సిలువను ఎత్తుకుని నన్ను వెంబడించాలని మీరు గుర్తించారా?" అని అడిగాడు.

అంతేకాక, "మీలో ఎవడైనను ఒక గోపురము కట్టింపగోరినయెడల దానిని కొనసాగించుటకు కావలసినది తనయొద్ద ఉన్నదో లేదో అని కూర్చుండి తగులుబడి మొదట లెక్క చూచుకొనడా?...ఆ ప్రకారమే మీలో తనకు కలిగినదంతయు విడిచిపెట్టనివాడు నా శిష్యుడు కానేరడు." అన్నాడాయన (లూకా 14:28, 33).

మొదట తాము చెల్లించాల్సిన వెల లెక్కకట్టకుండానే అనేకులు క్రీస్తువద్దకు వచ్చారు. ఈ వెలలో -మారుమనస్సు పొంది, పాపమును విడిచిపెట్టడం, అంతేకాక ప్రతిదినము క్రీస్తును నీ జీవితంలో బహిరంగంగా ఒప్పుకొనే విధంగా జీవించగలగడం అనేవి ఉన్నవి.

శిష్యత్వానికి ఉండాల్సిన కనీస అర్హతలు ఇవి. బలహీనులు, మెతకదనం గలవారు, పిరికివారు క్రైస్తవజీవితానికి పనికిరారు. ఏదేమైనా, ఎంత వెల చెల్లించినా, క్రైస్తవజీవితానికి అది తక్కువే. నీ సిలువ ఆయన కృపకంటే గొప్పదికాదని నీవు త్వరలోనే గుర్తిస్తావు. నీవు చదివే కాలేజిలో లేక ఉద్యోగం చేసే ప్రదేశంలో అవమానం అనే సిలువను ఎత్తుకున్నపుడు, దేవుని కృపను నీవు కనుగొనగలవు. ఆ కృప నీ ప్రతి అవసరత తీరడానికి చాలినంతకంటే ఎక్కువగా కనుగొంటావు.

శిష్యత్వంనుగూర్చి జేమ్స్ బాయిస్‌గారు వ్రాసిన పుస్తకంనుండి :
"శిష్యత్వం అంటే క్రీస్తును వెంబడించుటకు సమస్తమును విడిచిపెట్టడమే."

"....శిష్యత్వము అంటే క్రైస్తవ్యంలో రెండో మెట్టుగా భావించకూడదు, అంటే ఒకడు ముందు యేసుకు విశ్వాసిగా మారి, తరువాత తాను కావాలనుకుంటే శిష్యుడుగా మారవచ్చు అనుకోరాదు.  క్రైస్తవుడుగా మారడమంటే, ఆరంభంనుండి శిష్యత్వములో ఉన్నట్లే."

"...శిష్యత్వము కేవలం మనం లోనికి ప్రవేశించే గుమ్మము వంటిదికాదు, కాని అది అనుసరించవలసిన మార్గము, అంతేకాక....శిష్యుడైనవాడు ఆ మార్గమును తుదమట్టుకు అనుసరించడం ద్వారానే తన శిష్యత్వమును నిరూపించు కుంటాడు."

**శిష్యత్వపు అంతిమలక్ష్యం.....**

శిష్యత్వానికి అంతిమలక్ష్యం రోమా 8:29లో సంక్షేపంగా ఉంది : "....ఎందుకనగా తన కుమారుడు అనేక సహోదరులలో (సహోదరీలలో) జ్యేష్ఠుడగునట్లు, దేవుడెవరిని ముందు ఎరిగెనో, వారు తన కుమారునితో సారూప్యము గలవారవుటకు వారిని ముందుగా నిర్ణయించెను."

సర్వసృష్టిమీద సర్వాధికారము కలిగిన సార్వభౌముడైన దేవుడు, అసాధారణమైన విశిష్టమైన వ్యక్తిత్వం గలవాడు. తండ్రియైన దేవుడు తన కుమారుడైన యేసు తన రూపమును, పోలికను ప్రతిబింబిస్తున్నందుచేత ఆయనయందు (యేసునందు) సంతోషిస్తాడు, ఆనందిస్తాడు. "ఆయన అదృశ్యదేవుని స్వరూపి..." అని కొలస్సి 1:15లోను, "ఆయన దేవుని మహిమయొక్క తేజస్సును, ఆయన తత్వముయొక్క ప్రతిరూపము..." అని హెబ్రీ 1:3లో చూస్తాం.

"...తన కుమారునితో సారూప్యత గలవారవుటకు వారిని ముందుగా నిర్ణయించెను," అని రోమా 8:29లో ఉన్న మాటమీద జేమ్స్ బాయిస్‌గారు ఇలా వ్యాఖ్యానించారు :

"మనం ఈ మాటను సరిగా అర్థంచేసుకుంటే ఇది చాలా ప్రత్యేకమైన మాట.

ఇంకా నిర్మొహమాటంగా చెప్పాలంటే, యేసునందు విశ్వాసముంచిన ప్రతివ్యక్తిని యేసువలె మార్చివేయాలనేది దేవుని అసలైన ఉద్దేశ్యం అని దాని అర్థం. మరోలా చెప్పాలంటే, దేవుడు, తాను సృష్టించిన కోట్లాదిమంది పాపులను తనయొద్దకు పిలుచుకొని వారిలో క్రీస్తును పునఃసృష్టిచేసి, ఇంతకుముందు ఒక్కడే ఉన్న క్రీస్తును కోట్లాది మందిలో నింపి విశ్వమంతటినీ 'క్రీస్తులతో' నింపాలనేటంతగా తన కుమారునిబట్టి సంతోషిస్తున్నాడు."

జాన్ పైపర్ అనే సేవకుడు కూడా ఇలాంటి వ్యాఖ్య చేశారు : "మరొకమమాటలో చెప్పాలంటే, దేవుడు తన కుమారునిచుట్టూ ఆయన సజీవచిత్రాలతోనే నింపివేసి, ఆయనలా చేయబడిన ప్రతిరూపాలలో అసలైన ఆయనరూపము మరింతగా ప్రకాశింపజేయాలని ఉద్దేశించాడు......."

## కాబట్టి, వాక్యానుసారమైన శిష్యత్వము మార్పును కోరుతుంది అనేది స్పష్టం!

తాను రచించిన "ఆత్మీయ క్రమశిక్షణలు" అనే పుస్తకంలో, డొనాల్డ్ విట్నీ మార్పుకు కనీసం **3 ఉత్ప్రేరకాలు** (మార్పుకు కారకాలు) ఉన్నాయని గుర్తిస్తారు.

1] **ప్రజలు** – తలిదండ్రులు, ఉపాధ్యాయులు, స్నేహితులు, ఇరుగుపొరుగువారు, సహోద్యోగులు మొదలగువారు...

2] **పరిస్థితులు** – శ్రమలు, నిరుత్సాహాలు, విజయాలు, ఓటములు మొదలగునవి...

3] **ఆత్మీయ క్రమశిక్షణలు** –

మన జీవితంలోని ప్రజలు, పరిస్థితులు అధికశాతం మన స్వాధీనంలో ఉండవు. అయితే ప్రతి క్రైస్తవుడు "ఆత్మీయ క్రమశిక్షణల" విషయమై సంపూర్ణ నియంత్రణ తప్పక కలిగివుండాలి.

"ఆత్మీయ క్రమశిక్షణలు అంటే వ్యక్తిగతంగాను, సంస్థాగతంగాను ఆత్మీయతను అభివృద్ధిచేసే అలవాట్లు - అంటే వాక్యధ్యానం, బైబిల్ కాలములలోనుండి నాటి దేవుని ప్రజలు ఆచరించిన ఆచరణాత్మక క్రైస్తవజీవితపు అలవాట్లు. (డాన్ విట్నీ)

బైబిల్ చదవటం, వాక్యాన్ని కంఠస్థం చేయడం, ప్రార్థన, దేవుని వాక్యాన్ని వినడానికి (ప్రసంగాలకు, ఉపదేశాలకు) హాజరవ్వడం, ఇతర క్రైస్తవులతో సహవాసంలో ఉండటం వంటివి ఈ ఆత్మీయ క్రమశిక్షణలు.

**వ్యక్తిగత 'క్రమశిక్షణ' కీలకమైన మూలకం....**అపొస్తలుడైన పౌలు తిమోతితో -"........దేవభక్తి విషయములో నీకు నీవే సాధకము చేసికొనుము..." (1తిమోతి 4:7) అని చెప్పాడు. ఇక్కడ 'సాధకము' అని తర్జుమా చేయబడిన గ్రీకు భాషాపదం "జిమ్నాజో". "జిమ్నాజియం" అనే ఇంగ్లీషుపదం ఇందులోనుండే పుట్టింది. ('జిమ్' అనేమాట మీరు తరచూ వినివుంటారు.) అంటే వ్యక్తిగతమైన క్రమశిక్షణ, తర్ఫీదునుగూర్చి ఈ మాట చెబుతుంది.

"...అందరితో సమాధానమును పరిశుద్ధయు కలిగియుండుటకు ప్రయత్నించుడి. పరిశుద్ధత లేకుండ ఎవడును ప్రభువును చూడడు." అని హెబ్రీ. 12:14 చెబుతుంది.

కాబట్టి, దేవుని చిత్తము (శిష్యత్వము, క్రీస్తు సారూప్యతలోనికి మార్చబడటం) మన జీవితాలలో నెరవేరుటకు మనము వ్యక్తిగత క్రమశిక్షణ కలిగినవారముగా ఉండాలి. మనం ప్రయత్నం చేయకుండా, ప్రయాసపడకుండా అది సాధ్యం కాదు!

**ఆత్మీయ క్రమశిక్షణలయొక్క ఉద్దేశ్యం....**

1) మనము దేవుని కృపలో కొనసాగునట్లుగా చేస్తాయి (అంటే అవి దేవుని కృప మన జీవితంలోనికి ప్రవహించునట్లుగా అనుసంధానించే ఆత్మీయ గొట్టాలవంటివి (పైప్‌లైన్).

2) మన జీవితాలలో నిత్యత్వపు విశిష్టత కలిగిన కార్యములు చేయుటకు అవి మనకు శక్తినిస్తాయి.

3) మనము "దేవుని సర్వాంగకవచమును ధరించుకొనుటకు" (ఎఫెసి. 6:11) అవి కారణము.

4) ప్రతి నిజమైన క్రైస్తవుడు క్రీస్తుయొక్క సారూప్యతలోనికి మారునట్లుగా పరిశుద్ధాత్మ కార్యం చేయడానికి ఆత్మీయ క్రమశిక్షణలే సాధకాలు.

(ఒక ముఖ్యమైన హెచ్చరిక: ఆత్మీయ క్రమశిక్షణలు కలిగిఉన్నంత మాత్రాన మనం క్రీస్తులా మారిపోము. క్రైస్తవులు -ధర్మశాస్త్రానుసారులు, దేవుని ఆజ్ఞలకు విధేయులయ్యే సామర్థ్యము కలిగి ఉన్నవారుగా గర్వించిన స్వనీతిపరులైన పరిసయ్యులవలె ఉండకూడదు. లూకా 18:11-12; మత్తయి 5:20తో పోల్చి చూడండి)

## శిష్యత్వములోని సమస్య

గొప్ప ఆత్మీయ యుద్ధం మధ్యలో పనిచేయవలసి ఉన్నందున, శిష్యులను తయారుచేయడం కష్టతరమైనది, సంక్లిష్టమైనది.... ఈ లోకపు నాటకీయ నేపథ్యం వెనుక, విశ్వంలో ఒక నిజమైన పోరాటం సాగుతున్నది. అందులో దేవుని విరోధియైనవాడు, క్రీస్తు ఆదేశించినట్లు శిష్యులను తయారుచేయడం అనే పనిని విరోధించడానికి, ఆపడానికి, నిషేధించడానికి తన శాయశక్తులా ప్రయత్నం చేస్తున్నాడు. ఎఫెసీ 6:12లో అపొస్తలుడైన పౌలు ఈ ఆత్మీయపోరాటాన్ని ఈ మాటల్లో వివరించాడు, "....మనము పోరాడునది శరీరులతో (రక్తమాంసములతో) కాదు, గాని ప్రధానులతోను, అధికారులతోను, ప్రస్తుత అంధకారసంబంధులగు లోకనాథులతోను, ఆకాశమండలమందున్న దురాత్మల సమూహములతోను పోరాడుచున్నాము."

అంతేకాక, యోబు 1:6-12వచనాలు, దేవునికి సాతానుకు మధ్య జరుగుతున్న ఆత్మీయ పోటీని నాటకీయంగా చిత్రిస్తున్నాయి. దేవదూతలు వచ్చి దేవునికి తమను తాము కనపరచుకొను దేవుని సింహాసనముయెదుట, పరలోకంలో, ఈ సన్నివేశం కనబడుతుంది. సాతానుకూడా దేవదూతలతో కలసి వచ్చాడని మనకు తెలుస్తున్నది. నీవెక్కడనుండి వచ్చావని దేవుడు సాతానుని అడుగగా, వాడు, "....భూమిమీద అటు ఇటు తిరుగులాడుచు అందులో సంచరించుచు" వచ్చానని జవాబిస్తాడు. తరువాతి కథ భూమిమీదనున్న "యోబు" అనే మనుష్యుని పరిస్థితులనుగూర్చి జరిగే పోటీని తెలియజేస్తుంది. యోబుమీదికి శ్రమలు, శోధనలు పంపుటకు దేవుడు సాతానును అనుమతిస్తాడు. కాని చివరికి, దేవుడు ముందుగా చెప్పినట్లుగానే, సాతాను ఓడిపోతాడు, తన సేవకుడైన యోబునుబట్టి దేవునికి మహిమ కలుగుతుంది.

ఈ కథ క్రైస్తవునికి ఈలోకంలో తన జీవితాన్నిగూర్చి ఉన్న ప్రాథమిక దృక్పథాన్ని చూపిస్తుంది (అంటే క్రైస్తవుడు ఈ లోకాన్ని ఏదృష్టితో చూస్తాడో, జీవితంలోని పరిస్థితులను ఎలా వ్యాఖ్యానిస్తాడో అనే విధానాన్ని సూచిస్తుంది). సర్వసృష్టిలోను నిజమైన సర్వాధికారి దేవుడే. అపవాది ఆయన విరోధి. నేటి ప్రపంచం పతనమైన, శపించబడిన స్థితిలో ఉన్నది. తటస్థంగా ఉండటం కుదరని ఈలోకంలో, దేవుని ఎదిరిస్తూ, మానవాళిని నాశనం చేయడానికి

దురాత్మశక్తులు ప్రయత్నిస్తున్నాయి. ఈ దుష్టశక్తులు ప్రతి క్రైస్తవునిలోను కొనసాగుతున్న పాప స్వభావాన్ని ఉపయోగించుకుంటుంన్నందువల్ల, అతడు శిష్యుడుగా ఉండాలనే ప్రక్రియను ఇంకా సంక్లిష్టపరస్తున్నాయి. అయితే, క్రీస్తు సువార్తద్వారా రక్షణపొందిన వారికి, ఈ దుష్టశక్తులనుండి కాపుదల, చివరికి వాటిమీద విజయం దొరుకుతుంది.

## క్రైస్తవుని ఆత్మీయ యుద్ధము [వారి జీవితంలో శిష్యత్వపు పని], వారి మనస్సులోను, వారి ఆలోచనా విధానాన్నిబట్టి ఉంటుంది....

2 కొరింథి. 4:4, "దేవుని స్వరూపియైయున్న క్రీస్తు మహిమను కనుపరచు సువార్త ప్రకాశము వారికి ప్రకాశింపకుండు నిమిత్తము, ఈ యుగసంబంధమైన దేవత అవిశ్వాసులైనవారి మనోనేత్రములకు గ్రుడ్డితనము కలుగజేసెను."

2 కొరింథి 10:3-5, "మేము శరీరధారులమై నడుచుకొనుచున్నను శరీరప్రకారము యుద్ధము చేయుము. మా యుధ్ధోపకరణములు శరీరసంబంధమైనవి కావు గాని దేవునియెదుట దుర్గములను పడద్రోయజాలినంత బలము కలవైయున్నవి; మేము వితర్కములను, దేవుని గూర్చిన జ్ఞానమును అడ్డగించు ప్రతి ఆటంకమును పడద్రోసి ప్రతి ఆలోచనను క్రీస్తుకు లోబడునట్లు చెరపట్టి..."

కాబట్టి, క్రైస్తవుడు జయించడానికి, శరీర పాపేచ్ఛలనుండి, వాటినుండి కలిగే బంధకాలనుండి, దేవుని వాక్యజ్ఞానమునుగూర్చిన సత్యముద్వారా విడుదలపొందడానికి ప్రయత్నిస్తున్నాడు. యేసు తన శిష్యులతో, **"...మీరు నా వాక్యమందు నిలిచినవారైతే నిజముగా నాకు శిష్యులైయుండి సత్యమును గ్రహించెదరు; అప్పుడు సత్యము మిమ్మును స్వతంత్రులుగా చేయును.." [యోహాను 8:31-32] అన్నారు.**

క్రైస్తవుడు తన ఆత్మను దేవునివాక్యముతో పోషించుకుంటూ ఉన్నప్పుడు, వారి ఆలోచనలు, జీవితాన్ని, అందులో ఎదురయ్యే పరిస్థితులలో, దేవుని ఆత్మ పనిచేసి ఆశ్చర్యకరమైన రూపాంతరమును వారిలో కలుగజేస్తాడు. "కాబట్టి సహోదరులారా, పరిశుద్ధమును దేవునికి అనుకూలమునైన సజీవయాగముగా మీ శరీరములను ఆయనకు సమర్పించుకొనుడని దేవుని వాత్సల్యమునుబట్టి

మిమ్మును బతిమాలుకొనుచున్నాను. ఇట్టి సేవ మీకు యుక్తమైనది. మీరు ఈ లోక మర్యాదను అనుసరింపక ఉత్తమమును, అనుకూలమును సంపూర్ణమునై యున్న దేవుని చిత్తమేదో పరీక్షించి తెలిసికొనునట్లు మీ మనస్సుమారి నూతన మగుటవలన రూపాంతరము పొందుడి." అని రోమా12:1-2 చెబుతోంది.

దేవుని వాక్య సత్యముతో అనుదినము సంధించబడే క్రైస్తవుడు, క్రీస్తురూపంలోనికి రూపాంతరంపొందే అనుభవాన్ని పొందటం ఆరంభిస్తాడు. క్రీస్తురూపంలోనికి మారడమే శిష్యత్వపు చివరి లక్ష్యం (రోమా 8:29). "మనమందరమును ముసుకులేని ముఖముతో ప్రభువుయొక్క మహిమను అద్దమువలె ప్రతిఫలింపజేయుచు, మహిమనుండ అధికమహిమను పొందుచు, ప్రభువుయొక్క ఆత్మచేత ఆ పోలికగానే మార్చబడుచున్నాము" అని 2 కొరింథి. 3:18 చెబుతుంది.

కాబట్టి ఈ ఆత్మీయ యుద్ధ శిక్షణా శిబిరం అనే పుస్తకం, ఒకని జీవితంలో వ్యక్తిగత క్రమశిక్షణ అలవరచడానికి రూపొందించబడింది. అంతేకాక క్రైస్తవ పరిచారకులకు క్రీస్తు మహా ఆదేశం అయిన 'శిష్యులను తయారుచేసే' పనిలో సహాయకరంగా ఉండటానికి రూపొందించబడింది. ప్రతి క్రైస్తవుని అనుభవం లోనూ అనివార్యమైన ఈ గొప్ప ఆత్మీయ పోరాటం మధ్య, శిష్యులను తయారు చేయడం ఎలాగో అనే విధానాన్ని నిర్దిష్టంగా తెలియజేయడానికి ఈ పుస్తకం రూపొందించబడింది.

### మొదటి అధ్యాయంలో చర్చించడానికి ప్రశ్నలు

## ఆత్మీయ యుద్ధ శిక్షణ మరియు వ్యక్తిగత శిష్యత్వపు పని

**[శిష్యత్వము : వాక్యానుసారమైన ఆదేశం]**

1. మానవుని అంతిమగమ్యం ఏమిటి? దానికిని సువార్తకు, శిష్యులను తయారుచేయుటకు ఉన్న సంబంధమేమిటి?

2. 'సువార్త పునాది రెండు విషయాలమీద ఆధారపడింది.' అవి తెలియజేసి, క్లుప్తముగా వివరించండి.

3. ఈ అధ్యాయంలోని -క్రైస్తవునిగా మారడానికి 'ముందు', 'తరువాత' అనే తేడానుబట్టి, నిజమైన క్రైస్తవుని జీవితంలో సువార్త ప్రభావాన్నిగూర్చి, నీ స్వంత మాటల్లో క్లుప్తముగా వ్రాయుము (ఒకటి లేక రెండు వాక్యాలలో).

4. గొప్ప ఆదేశాన్ని అనుసరించి, సువార్తపనిచేయడం, కేవలం సువార్తను ప్రకటించడం మాత్రమే క్రీస్తు చేయమన్న పని కాదు. వివరించండి.

5. ఈ అధ్యాయంలోని సమాచారాన్ని ఆధారం చేసుకొని, "శిష్యుడు అంటే ఎవరు?" అనే ప్రశ్నకు మీ స్వంతమాటల్లో (ఒకటి లేక రెండు వాక్యాలలో) నిర్వచనం వ్రాయండి.

6. ఈ క్రింది వాక్యభాగాలను చదివి, ఆ వచనాలలో నిజమైన శిష్యుని గురించి ఏమి తెలుసుకున్నారో క్లుప్తంగా వ్రాయండి. యోహాను 8:31-32

   యోహాను 15:5, 8 (5వచనంలో "నిలిచివుండుట" అంటే ఏమిటి?)
   యోహాను 13:34-35

7. శిష్యత్వమునుగూర్చి డేవిడ్ ప్లాట్‌గారి ఉపదేశమునుండి ప్రశ్నలు: క్రీస్తు శిష్యులను పిలుచుటలో "ఉద్దేశ్యం" ఉంది అని డేవిడ్ ప్లాట్‌గారు అనడంలో, ఆయన భావం ఏమిటి?

   యేసు శిష్యత్వపు బోధనలో "తృప్తి" అంటే ఏమిటి? నీ వ్యాఖ్యానము

వ్రాయుము.

8. ముగ్గురు క్రైస్తవ నాయకులు (డేవిడ్ ప్లాట్, బిల్లీ గ్రాహం, జేమ్స్ బాయస్) శిష్యత్వానికి చెల్లించవలసిన "వెల"నుగూర్చి చెప్పినప్పడు వారి భావము ఏమిటో క్లుప్తంగా చర్చించుము. ప్రతి క్రైస్తవునికి ఇది భిన్నంగా ఎలా ఉంటుంది?

9. తాను క్రైస్తవుడనని చెప్పకుంటూ శిష్యుడు కావడానికి ఇష్టపడని వ్యక్తినిగూర్చి జేమ్స్ బాయస్ ఏమంటారు?

10. శిష్యత్వపు అంతిమలక్ష్యం ఏమిటి? (రోమా 8:29తో పోల్చండి)

11. ఆత్మీయ క్రమశిక్షణలనుగూర్చిన ప్రశ్నలు.....

'ఆత్మీయ క్రమశిక్షణలు' అంటే ఏమిటి? కొన్ని ఉదాహరణలు వ్రాయండి.

'వ్యక్తిగత క్రమశిక్షణ'కు శిష్యత్వమునకు గల సంబంధమేమి?

ఆత్మీయ క్రమశిక్షణల ఉద్దేశ్యం ఏమిటి?

ఆత్మీయ క్రమశిక్షణలను మాత్రమే నొక్కివక్కాణించడంలోని ప్రమాదమేమిటి?

12. 'శిష్యులను తయారుచేయడం' ఎందుకు కష్టమో వివరించుము.

13. శిష్యత్వము విషయములో మన "జ్ఞానము", "ఆలోచన"లకు ఉన్న ప్రాధాన్యతనుగూర్చి ఈ క్రింది వచనాలు ఏమి చెబుతున్నాయో వివరించండి : 2 కొరింథి. 4:4

2 కొరింథి 10:3-5

యోహాను 8:31-32

2 కొరింథి 3:18

14. ఆత్మీయ యుద్ధ శిక్షణ పుస్తకం యొక్క ఉద్దేశ్యం ఏమిటి? ప్రతి క్రైస్తవుని జీవితంలో దేవుని ఉద్దేశ్యమును నెరవేర్చుటకు అది ఎలా సహాయపడగలదు?

## రెండవ అధ్యాయము

# "యుద్ధ వ్యూహములు"

## నీవు యుద్ధంలో ఉన్నావు!

ప్రతి క్రైస్తవుడు యుద్ధంలో ఉన్నాడు! మనం జన్మించిన నాటినుండి మనం యుద్ధంలో ఉన్నాము. ఒకదానికొకటి విరుద్ధంగా తీవ్రంగా పోరాడుతున్న రెండు వేర్వేరు సైన్యాల్లో మనలో ప్రతిఒక్కరం ఉన్నాం. బైబిల్ ప్రకారం, దేవునికి ఆయన వెలుగు రాజ్యానికి, సాతానుకు వాడి రాజ్యంలోని చీకటిశక్తులకు మధ్య సృష్టికార్యాల వెనుక విశ్వయుద్ధం జరుగుతూ ఉంది. కొలస్సి. 1:13 ప్రకారం క్రైస్తవులు అంధకారసంబంధమైన రాజ్యములోనుండి విడిపించబడి వెలుగురాజ్య నివాలసులుగా చేయబడ్డారు. కాబట్టి క్రైస్తవులు ఈ యుద్ధంలో రెండు పక్షాలలోను పాల్గొన్నవారు.

ఈ లోకము సృజింపబడకముందే దేవునికి, సాతానుకు మధ్య ఆరంభమైన ఒక గొప్ప పోరాటమును గూర్చి బైబిల్‌నందు అనేక భాగాలలో మనకు కొన్ని వివరాలు ఇవ్వబడ్డాయి. మొదటి అధ్యాయంలో మనం చెప్పకున్నట్టుగా, యోబు గ్రంథములో, ఒకరోజు సాతానుడు దేవుని సింహాసనము ముందుకువచ్చి, దేవుని సేవకుడైన యోబునుగూర్చి సవాలు చేయడాన్ని గూర్చిన సన్నివేశం మనకు బయల్పరచబడింది (యోబు 1:6-12). ఈ లేఖనభాగంనుండి సాతానుడు దేవునికి విరోధి అనేసంగతి స్పష్టమౌతుంది. అయితే, వాడు దేవుని శక్తికి లోబడినవాడేనని కూడా మనకు స్పష్టముగా కనిపిస్తుంది. ఇక్కడ మనం గమనించాల్సిన ముఖ్యమైన విషయం ఏమిటంటే ఈ సంఘటనల వెనుక స్త్రీ, పురుషుల ఆత్మలనుగూర్చిన ఒక విశ్వయుద్ధం జరుగుతూ ఉన్నది అని!

మరొక ఆసక్తికరమైన వచనం 2పేతురు 2:4లో కనిపిస్తుంది. ఇక్కడ పాపము చేసిన దేవదూతలనుగూర్చిన సందర్భం ఉదహరించబడింది. దేవుడు వారిని విడిచిపెట్టక, "పాతాళలోకమందలి బిలములయందు....(అంత్య)తీర్పు తీర్చబడువరకు" వారిని బంధించి ఉంచాడు అని మనకు తెలుస్తుంది. ఆ దేవదూతలు ఎప్పడు పాపం చేసారో మనకు ఖాయంగా తెలీదు, కాని ఇది

భూమి సృజింపబడకముందే జరిగి ఉంటుందని చాలమంది బైబిల్ పండితులు నమ్ముతారు. ఈ దూతలు సాతానుడు దేవునిమీద తిరుగుబాటు చేసినపుడు వాడితో కలిసారని సాధారణంగా నమ్ముతారు. ఎఱ్ఱని ఘటసర్పమునుగూర్చిన ప్రస్తావన ప్రకటన 12:4లో ఉంటుంది, అది సాతాను. ''దాని తోక ఆకాశనక్షత్రములలో మూడవ భాగమునీడ్చి వాటిని భూమిమీద పడవేసెను" అని మనకు తెలుస్తుంది. ఈ నక్షత్రాలు దేవదూతలని చాలామంది నమ్ముతారు (యోబు 38:7 తో పోల్చి చూడండి). అవే బైబిల్‌నందు మనం చదివే దయ్యాలు/ అపవిత్రాత్మలు. ఇక్కడ మనం గమనించాల్సిన ముఖ్యమైన విషయం ఏమిటంటే ఇది ఆత్మలలోకంలో తిరుగుబాటు జరిగిందనే సంగతిని మనకు స్థిరపరస్తుంది. మనం ఇంతకుముందే చూచిన యోబుగ్రంథము వంటి మిగిలిన వాక్యభాగాల ప్రకారం, ఆత్మల లోకంలో జరిగిన ఈ తిరుగుబాటు మనం నివసిస్తున్న లోకంపై పడింది.

పాత నిబంధన గ్రంథంలోని ప్రవక్తల గ్రంథాలలో ఉన్న మరొక రెండు వాక్యభాగాలు (యెషయా 14:12-17; యెహెజ్కేలు 28:12-19), సాతానుని పతనానికి సంబంధించిన ద్వితీయస్థాయి సూచనలని అనేకులు భావిస్తారు. ఇందులో మొదటి సూచన భూమిమీద ఒక రాజును సూచిస్తున్నది. అయితే, దాని వివరణ భూమిమీదనున్న రాజును దాటి సాతానునికి ఆపాదించేంతగా ఉంటుంది. ఈ వాక్యభాగాలలో ఉన్న వివరణ మానవమాత్రుడైన రాజుకన్నా మించినది. నిజానికి, యెహెజ్కేలు గ్రంథంలోని భాగంలో ఉపయోగించిన మాటలు ఇలా ఉంటాయి "...నీవు నియమింపబడిన (సృజింపబడిన) దినమున.... నీవు అభిషేకమునొందిన కెరూబువై.... అందుకే నేను నిన్ను నియమించితిని." (13,14వచనాలు). "నీవు నియమింపబడిన దినము మొదలుకొని పాపము నీయందు కనబడువరకు ప్రవర్తన విషయములో నీవు యధార్థవంతుడుగా ఉంటివి." అని 15వ వచనం చెబుతుంది. "గనుక దేవుని పర్వతము మీద నీవుండకుండ నేను నిన్ను అపవిత్రపరచితిని....ఆశ్రయముగా ఉన్న కెరూబూ, .....నీ సౌందర్యము చూచుకొని నీవు గర్వించినవాడవై, నీ తేజస్సు చూచుకొని నీ జ్ఞానమును చెరుపుకుంటివి, కావున నేను నిన్ను నేలను పడవేసెదను...." (16, 17 వచనాలు). ఈ వచనాలు నిజంగా అపవాది ఆరంభాన్నిగూర్చి వ్రాయబడినట్లయితే, వాటి ప్రకారం అపవాది మొదట ఒక దేవదూతగా సృజింపబడ్డాడని తరువాత వాడు దేవునిమీద తిరుగుబాటు

చేసాడని తెలుస్తుంది.

ఆత్మలలోకంలో జరిగిన ఈ తిరుగుబాటు ఈ లోకము సృజింపబడక ముందే జరిగింది, ఎందుకంటే ఆదికాండములోని ఆరంభ అధ్యాయాలలోనే, ఏదేను తోటలో అపవాది శోధకుడుగా కనబడతాడు, ఎందుకంటే వాడు అప్పటికే దేవునికి విరోధిగా ఉన్నాడు. ఏదేనుతోటలోని సర్వము చెడ్డదిగా చూపించబడి నందున, అది ఆదికాండము మొదటి అధ్యాయములో సృజింపబడినది అయివుండదు ఎందుకంటే దేవుడు ఈ సృష్టిని పూర్తిచేసినపుడు అది ఆయన చూచినపుడు "చాల మంచిదిగా ఉండెను"(ఆది.1:31) అని వ్రాయబడింది. కాబట్టి అపవాది ఆరంభం ఈ లోకము సృజించకముందే జరిగిందనేది స్పష్టమౌతుంది. ఇక్కడ మనం గమనించాల్సిన ముఖ్యమైనవిషయం ఏమిటంటే **"సాతానుకు దేవునికి మధ్య ఉన్న ఈ గొప్ప పోరాటం, సాతాను ఏదేనువనంలోనికి వచ్చి జయించినందువల్ల ఈ లోకంలోనికి వచ్చింది".**

అనేక కారణాలనుబట్టి, ఆదికాండము 3:15 చాలా ముఖ్యమైన వచనం. ఎందుకంటే అది విశ్వంలో యుద్ధానికి మనకు ఉన్న సంబంధాన్ని గూర్చి అది తెలియజేస్తుంది. ఇందులో 1) ఈ లోకానికి సంబంధించి **యుద్ధం** దేవుడే ప్రకటించాడు; 2) **పాత్రలు** (నాయక ప్రతినాయకులు -హీరో విలన్) గుర్తించబడ్డారు (స్త్రీ సంతానమైన క్రీస్తు, ఆయన అనుచరులు, సర్పసంతానమైన అపవాది వాని అనుచరులు); 3) **ఫలితం** (స్త్రీ సంతానము విజయం పొందడం) నిశ్చయం.

## ఆత్మీయ యుద్ధం గురించి అవగాహన పెంపొందించుకొనుట

చాలామంది క్రైస్తవులకు, క్రైస్తవులందరూ ఆత్మీయయుద్ధంలో ఉన్నారని, కేవలం ఒప్పుకునేటంతవరకు మాత్రమే తెలును; అంటే వాళ్ళు 'దేవుని సర్వాంగకవచము'ను (ఎఫెసి. 6:11) గూర్చి చదివి ఉంటారు అంతేకాక అప్పుడప్పుడూ ప్రసంగ వేదికనుండి "ఆత్మీయ యుద్ధం" గూర్చి విని ఉంటారు, కాబట్టి ఏదో యుద్ధం అనేమాట మాత్రం తెలుసు. అయితే, **చాలమంది క్రైస్తవులకు యుద్ధ వీరుని మనస్తత్వం ఉండదు; అంటే తాము ఎల్లప్పుడూ ఆత్మీయయుద్ధంలో ఉన్నాము అనే అవగాహనతో వాళ్ళు అనుదినము చురుకుగా, గమనిస్తూ జీవించరు.**

మన ఆధునిక సంస్కృతిలో దీనికి ఒక కారణం ఉంది. మన సమాజంలో క్రైస్తవులైనవారికి వ్యతిరేకత పెరిగిపోతున్నప్పటికీ, ప్రాథమికంగా మత స్వాతంత్ర్యము, ఆర్థిక అభివృద్ధిగల సమాజంలో మనం జీవిస్తున్నాము. ప్రపంచంలోని మూడవ స్థాయి దేశాలలో ఉన్న క్రైస్తవ వ్యతిరేకులు, క్రూరులైన నియంతల పాలనలో ఉన్న క్రైస్తవులతో పోల్చితే మన జీవితం చాలా సుఖంగానే ఉంది. ఉత్తర కొరియాలో ఉన్న క్రైస్తవుల కళ్ళముందే వారి పిల్లలను ఉరితీయించి, తరువాత వారందరినీ క్రిందపడుకోబెట్టి ఒక రోడ్ రోలర్‌తో తొక్కిస్తుండగా ఒకరి తరువాత ఒకరు మరణించారు అని 'వాయస్ ఆఫ్ మార్టైర్స్' (హతసాక్షుల స్వరం) అనే పత్రికలో ఇచ్చిన నివేదిక చెబుతోంది. ఆత్మీయయుద్ధం బహిరంగంగా జరిగే ఇలాంటి పరిస్థితులలో, ఆ తీవ్రత తెలుస్తుంది. మనం వెంటనే దాడిచేసే విధానంలోనికి మారిపోతాం. బహిరంగంగా, కళ్ళముందు కనబడే యుద్ధం మనలను అప్రమత్తం చేస్తుంది.

అయితే వ్యక్తిగత శాంతి సౌఖ్యాలను, విశ్రాంతి, సంతోషం, మనోరంజనం, ఆటపాటలను ఎక్కువగా నొక్కి చెప్పే సమాజంలో మనం జీవిస్తున్నాం. ఇవి శాంతి సమయంలో ఉండే ఆశీర్వాదాలు. ఎడ్వర్డ్ వెల్చ్ అనే రచయిత, దురభ్యాసములను గూర్చి తాను వ్రాసిన పుస్తకంలో (ఆయన పుస్తకం త్రాగుడు, మాదకద్రవ్యాలు(డ్రగ్స్), లైంగికదురభ్యాసాలు, మొదలగువాటినిగూర్చిన క్రైస్తవ దృక్కోణాన్ని వివరిస్తుంది) ఈ సమస్యనుగూర్చి వ్యాఖ్యానిస్తాడు. ఈ పరిస్థితుల ఫలితంను గూర్చి మాట్లాడుతూ, "...మనలో చాలామంది మనం యుద్ధంలేని సమయంలో సెలవులలో ఉన్నట్లుగా ప్రవర్తిస్తున్నాం. ప్రజలు తమ ఉద్యోగాలకు, పనిపాటులకు వెళుతున్నప్పటికీ, సాదా సీదాగా, సెలవుల్లో వెళుతున్నట్లు వెళుతున్నారు, పూర్తిగా విశ్రాంతి, వినోదాలతో ఉన్నట్టు, వన్నులు ఏమీ చెల్లించనవసరం లేదు అన్నట్లు. ఏదైనా బాధకలిగేవరకూ చేసేయ్యటమే (అంటే ఆత్మీయ యుద్ధానికి సిద్ధపడటం వంటివి) అనే ఆలోచనే నిషిద్ధం అన్నట్లు. 'నీ జీవితంలో వత్తిడి తగ్గించుకో' అన్నదే ధ్యేయం అన్నట్లు జీవిస్తున్నారు.

"సమస్య ఏమిటంటే, క్రైస్తవులముగా మనం యుద్ధంలో ఉన్నామని మనం తరచూ మర్చిపోతుంటాం. ఇంకా భయంకరమైన సంగతి ఏమిటంటే, అసలు యుద్ధమొకటి ఉన్నదని మనకు తెలియనే తెలియదు! మనకొక శత్రువున్నాడు అని తెలిసే మిగిలిన యుద్ధాలవలె కాక, ఆత్మీయ యుద్ధం రహస్యంగా జరిగేది.

ఎవ్వరికీ గాయాలు తగలడం లేదు, దుర్వ్యసనాలు గలవారు కూడా వారి జీవితాలు బాగానే నడిపించేసుకుంటున్నారు. అంతా మామూలుగానే జరిగిపోతూ ఉంది. ఇంకా ఏమిటంటే మనకు మన శత్రువంటే...(అంటే పాపం మూలంగా వచ్చే సంతోషం) ఇష్టం కూడా. మనందరమూ ఎందుకు ఇలా ఏదోసెలవులో ఉన్నట్లు ప్రవర్తిస్తున్నామో అర్థం చేసుకోవడం సులభం.

**సారాంశం** : కాబట్టి ప్రతి క్రైస్తవుడు తానున్న ఈ ఆత్మీయయుద్ధంనుగూర్చిన నిజాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి. ఈ విషయంలో మనకెవరికీ ఎంపిక చేసుకునే అవకాశం లేదు. నేను ఈ యుద్ధంలో పాల్గొనను అని మనమెవరమూ అనడానికి వీల్లేదు. అది అసాధ్యం. అందువల్లే ప్రభువైన యేసు అన్నారు, "నా పక్షమున ఉండనివాడు నాకు విరోధి..." (మత్తయి 12:30). మధ్యస్థంగా ఉండడం అనే ప్రసక్తి లేదు.

ప్రతి క్రైస్తవునికి తన ఆత్మకున్న సమస్యలను (భయము, చింత, ఆందోళన, కోపం, కక్ష, ద్వేషం, కామాతురత మొదలగునవి) బైబిల్ ఏ దృష్టితో చూస్తుందో అన్న కనీస అవగాహన ఉండాలి. **క్రైస్తవుని మనస్సులో ఉన్న ఆలోచనా ప్రక్రియను పోరాటము, సంఘర్షణ అని బైబిల్ వ్యాఖ్యానిస్తుంది. మన ఆత్మలను నాశనం చేసే ప్రభావం చూపగల ఆత్మీయ శక్తులు ఈ లోకంలో ఉన్నాయని** క్రైస్తవుడు గుర్తిస్తాడు (ఉదాహరణ., 1 పేతురు 2:11).

# అంతరంగ ఆత్మీయ యుద్ధం

**మేము శరీరధారులమై నడుచుకొనుచున్నను శరీర ప్రకారము యుద్ధము చేయుము. మా యుద్ధోపకరణములు శరీరసంబంధమైనవి కావు గాని దేవునియెదుట దుర్గములను పడద్రోయ జాలినంత బలముకలవైయున్నవి; మేము వితర్కములను, దేవుని గూర్చిన జ్ఞానమును అడ్డగించు ప్రతి ఆటంకమును పడద్రోసి ప్రతి ఆలోచనను క్రీస్తుకు లోబడునట్లు చెరపట్టి... [2 కొరింథి 10:3-5]**

**ఏలయనగా మనము పోరాడునది శరీరులతో కాదు, గాని ప్రధానులతోను, అధికారుల తోను, ప్రస్తుత అంధకార సంబంధులగు లోకనాథులతోను, ఆకాశమండలమందున్న దురాత్మల సమూహములతోను పోరాడుచున్నాము [ఎఫెసీ. 6:12]**

ఈ రెండు వాక్యభాగాలు ప్రతి క్రైస్తవుడు ఉన్న యుద్ధముయొక్క స్వభావాన్నిగూర్చి అర్థంచేసుకోవడానికి ముఖ్యమైన అంశాలు కలిగివున్నాయి. క్రైస్తవుని యుద్ధము, లోకములోని యుద్ధము వంటిది కాదు అని పౌలు కొరింథీయులకు వ్రాసిన ఉత్తరంలోని భాగాన్నిబట్టి తెలుస్తునది. ఈ యుద్ధం వెనుక ఆత్మీయ శక్తులు ఉన్నాయని ఎఫెసీయులకు వ్రాసిన పత్రికలోని వాక్యభాగము వివరిస్తుంది.

ఈ యుద్ధంలో "దుర్గములు", "వితర్కములు", "ఆటంకములు", "ప్రతి ఆలోచనను ... చెరపట్టడం" వంటి విషయాలు ఉన్నాయని కొరింథీయులకు వ్రాసిన పత్రికలోని భాగములో తెలుస్తుంది. ఇవన్నీ, అంతరంగంలో, మనస్సులో, ఒకని ఆత్మలో జరుగుతున్నాయని మనం స్పష్టంగా గుర్తించవచ్చు!

పరిస్థితి ఇది, కాబట్టి క్రైస్తవులు (ఆత్మీయ దృక్కోణంలో) సైనికులవలె సిద్ధపడి శత్రువు దాడిని ఎదుర్కొని మంచి పోరాటము పోరాడాల్సిన అవసరం ఉంది. అందుకే పాఠకులను ఆత్మీయ యుద్ధ శిక్షణగుండా నడిపించాలని మా ఉద్దేశం. యుధ్ధములోనికి ధైర్యముగా, ఆత్మవిశ్వాసంతో వెళ్ళి, విజయవంతమైన అనుభవంలో గొప్పగా జీవించడానికి అవసరమైన తర్ఫీదు, జ్ఞానము, అనుభవాన్ని అందించాలనేది మా కోరిక.

## యుద్ధ వ్యూహములు

యుద్ధంలో ఉండే వివిధ వ్యూహములను పూర్తిగా పరిచయం చేసుకోవడంతో శుభారంభం చేద్దాం. ఒక చిన్న సైన్యం, తనకన్నా చాలా పెద్దదైన సైన్యాన్ని జయించడానికి, దానికన్నా మెరుగైన వ్యూహమే కారణమని చెప్పడానికి యుద్ధాల చరిత్రలో అనేక ఉదాహరణలు ఉన్నాయి. యుద్ధంలో విజయం అనేది కేవలం సంఖ్యమీద, బలంమీద ఆధారపడి ఉండదు కాని జ్ఞానము మీద, అనుభవం మీద, మెరుగైన వ్యూహం మీద అధారపడివుంటుంది.

క్రొత్త నిబంధన రచయితలు, సాతాను తన స్వంత వ్యూహములతో యుద్ధం చేస్తున్నాడనే సత్యాన్ని గుర్తించడం ఆసక్తికరం. ఉదాహరణకు, క్షమాపణను గూర్చిన ప్రత్యేకతనుగూర్చి చర్చిస్తూ, క్రైస్తవుడు క్షమాపణను అనుసరించుట మానకూడదని చెపుతూ, "....సాతాను మనలను మోసపరచకుండునట్లు...... మనము సాతాను **తంత్రములను** ఎరుగనివారము కాము..." అంటాడు అపోస్తలుడైన పౌలు (2 కొరింథి. 2:11) (అంటే సాతానుడు 'తంత్రములు' లేక 'వ్యూహములు' వాడుతున్నాడని). "తంత్రములు" అని ఇక్కడ వాడిన మాట, వైన్స్ నిఘంటువులోని అర్థం ప్రకారం, "ఆలోచించుకుని సిద్ధపరచిన,... ప్రణాళిక రచించిన, ఒక ఉద్దేశముతో చేసిన" పని. అంటే అది "వ్యూహము" లేక "యుక్తి".

అలాగే ఎఫెసి. 6:11లో ఎఫెసి క్రైస్తవులకు, "**అపవాది తంత్రములను** ఎదిరించుటకు..... దేవుని సర్వాంగ కవచమును ధరించుకొనుడి" అని వ్రాసాడు పౌలు. ఇంగ్లీషులో "విధానములు" (మెథడ్స్) అనే మాట వాడారు. ఇది ప్రణాళిక అనే భావాన్ని సూచిస్తుంది.

మన శత్రువైన సాతాను, మన ఆత్మలకు విరోధముగా చేసే యుద్ధములో ''తంత్రములు'' ఉపయోగిస్తే, మన స్వంత వ్యూహములతో వాటిని ఎదుర్కోవడానికి సిద్ధపడి ఉండడం మనకు మేలు.

ఈ అధ్యాయములో, లేఖనాలలో స్పష్టముగా నిర్దేశించబడిన నాలుగు ముఖ్యమైన వ్యూహాలను మనం గమనించుదాం. ఈ నాలుగు వ్యూహాలను క్రైస్తవులముగా మన జీవితాలలోనికి ఎలా అన్వయించుకుని అమలుపరచుకోవాలనేదే మిగిలిన అధ్యాయాలలో ఉన్న ఉపదేశం. ఇలాంటి వ్యూహములు చాలా ముఖ్యమైనవి ఎందుకంటే మనం ఏమి చేస్తున్నామో అనేది ఎందుకు

చేస్తున్నామో మనము జ్ఞాపకముంచుకోవడానికి ఇవి సహాయం చేస్తాయి. కొన్ని అనుదిన క్రమశిక్షణలు (మొదటి అధ్యాయంలోని "ఆత్మీయ క్రమశిక్షణలు" అనే అంశంపై వివరణ చూడండి) అనుసరించడం "ఎందుకు" అనే ప్రశ్నకు జవాబును అర్థం చేసుకోవడం ముఖ్యం. మనం కొన్ని వ్యూహముల ప్రకారం నడుచుకుంటున్నాము అనే విషయం అర్థమయితే, అలాంటి క్రమశిక్షణలు క్రమంగా, నియమప్రకారంగా చేయడానికి కావలసిన ప్రేరణ ప్రోత్సాహం కలుగుతుంది.

**మొదటి వ్యూహము**

# పరిశుద్ధత

## మన హృదయమనే తోటను కాచుకొనుట

**మూల వాక్యము : నీ హృదయములోనుండి జీవధారలు బయలుదేరును.**

**కాబట్టి అన్నిటికంటె ముఖ్యముగా నీ హృదయమును భద్రముగా కాపాడుకొనుము**

**సామెతలు 4:23**

దేవుడు మానవుని సృజించిన వెంటనే, "దేవుడైన యెహోవా నరుని తీసికొని ఏదెను తోటను సేద్యపరచుటకును దాని కాచుటకును దానిలో ఉంచెను" అని ఆదికాండము 2:15లో మనం చదువుతాం. కాచుటకు అనే మాటను, 'కాపలాకాయుటకు' అనే భావంతో ఇక్కడ వాడారని డా॥ జే ఆడమ్స్‌గారు వివరిస్తారు. ఇక్కడ వాడిన హెబ్రీ భాషా పదం మరలా 3:24; 4:9లో వాడారు, అక్కడ ఈ కాచుట అనే భావం స్పష్టంగా కనిపిస్తుంది. ఈ అర్థం, ఆదాము కేవలం సేద్యపరచడానికి మాత్రమే కాక, బహుశా - చెడు ప్రభావాలు, శత్రువు, పరుడు లోనికి రాకుండా కావలియుండుమని దేవుడు అతనికి ఆజ్ఞాపించిన భావాన్ని కలుగజేస్తుంది.

దాని అసలు అర్థం ఇదో కాదో కాని, చెడు ప్రభావాలు, పరులు లోనికి రాకుండా ఏదెను వనమును "కాయుట" అనేదానికిని, "మన హృదయములు అనే తోటను" కాచుకోవడానికి ఉన్న అవసరతను డా॥ ఆడమ్స్ ప్రతిపాదిస్తున్నారు. క్రైస్తవుడు తన అనుదిన ఆత్మీయ జీవితంలో చేస్తున్న యుద్ధంలో ఉపయోగించవలసిన ప్రాథమిక వ్యూహాన్ని ఈ ఉపమానం మనకు సూచిస్తుంది.

### సోమరివాని తోట

సామెతలు 24:30-31 వచనాలలలో ఈ ఉపమానం మనకు కనిపిస్తుంది. "సోమరివాని చేను నేను దాటిరాగా, తెలివిలేనివాని ద్రాక్షతోట నేను దాటి రాగా, ఇదిగో దానియందంతట ముండ్ల తుప్పలు బలిసియుండెను. దూలగొండ్లు దాని కప్పియుండెను. దాని రాతిగోడ పడియుండెను." ఈ దృశ్యం

మనకు అనేక విషయాలన బోధిస్తుంది, ఒక తోటను సేద్యం చేయడం, కావలికాయడం అనే అవసరతలను ధ్వనిస్తూనే,....మన మనస్సులను, ఆత్మలను కాచుకొనుటను, సేద్యపరచుటను గూర్చిన భావాన్ని కూడా ప్రతిపాదిస్తున్నది.

తోటలో కలుపు తీయడం, ఫలభరితంగాను, పచ్చగాను కాపాడుటను గూర్చి చక్కని వివరణ సామెతలు 4:23 లో కూడా కనిపిస్తుంది. ఈ వచనం చెపుతుంది, "నీ హృదయములోనుండి జీవధారలు బయలుదేరును కాబట్టి అన్నిటికంటె నీ హృదయమును భద్రముగా కాపాడుకొనుము". మరొక తర్జుమాలో "నీ హృదయము జీవపు ఊట, కాబట్టి అన్నిటికంటె మిన్నగా నీ హృదయమును కాచుకొనుము" అని చెబుతుంది.

మన హృదయములు సోమరివాని చేనువలె, పిచ్చిమొక్కలు బలిసిపోయి, చుట్టూ ఉన్న గోడ పడగొట్టబడి ఉండటాన్ని ఊహించుకోగలము. ఇది అపవిత్రమైన, క్రమశిక్షణలేని ఆత్మ స్థితి. మనం నమ్మకస్థులుగా, కష్టపడి పనిచేసే తోటమాలిగా మన హృదయములను కాచుకుంటూ, ఎప్పటికప్పడు
ఽ ˜ ల ు ఎ ˜ ) తీ స ˜ ు ఽ ˜ ు ం ట ా
ఉండకపోతే, లోభము, శరీరేచ్ఛలు, చింత, ద్వేషం అనే అనవసరమైన, నాశనకరమైన పిచ్చిమొక్కలు (హెబ్రీ. 12:15చూడండి) ఎదిగి మన అంతరంగాన్ని అపవిత్రం చేసి, నాశనం చేసేస్తాయి.

ఈ ఉత్ప్రేక్షకు ఉత్తమ ఉదాహరణ 'విత్తువాని ఉపమానము'. మత్తయి 13:22లో ప్రభువైన యేసు విత్తువాని ఉపమానములో, ముండ్లపొదలలో పడిన విత్తనాలనుగూర్చి వివరిస్తారు. "....ముండ్లపొదలలో విత్తబడినవాడు వాక్యము వినువాడే గాని ఐహిక విచారమును ధనమోసమును ఆ వాక్యమును అణచివేయును గనుక వాడు నిష్ఫలుడవును..." ఇక్కడ మరొకసారి ముళ్ళపొదలు, పిచ్చిమొక్కలు పెరగకుండా జాగ్రత్తపడాల్సిన తోటనుగూర్చిన ఉదాహరణ మనకు కనిపిస్తుంది (తోట పచ్చదనానికి మిగిలిన శత్రువులు -పక్షులు, రాళ్ళు).

బైబిల్‌నందు ఇలాంటి పరిస్థితిని వివరించే మరొక లేఖనభాగము హోషేయ 10:12-13వచనాలలో మనకు కనిపిస్తుంది. ఇక్కడ, మనుష్యుని గర్వము, మెడవంచనితనము, కరడుగట్టిన హృదయము అనేవ సమస్యలుగా చూస్తాము. ".....యెహోవాను వెదకుటకు ఇదే సమయము గనుక.... ఇదివరకెన్నడును దున్నని బీడుభూమి దున్నుడి" అంటాడు రచయిత.

**సారాంశం :** చివరిగా, ఈ ఆత్మీయ యుద్ధంలో మన ఆత్మను కాపాడుకునే ఒక ప్రధానమైన వ్యూహం ఏమిటంటే నాశనకరమైన, అపవిత్రమైన ప్రభావాలు మన హృదయాలమీద పడి, అవి అక్కడే నిలిచిపోయి మన ఆత్మకు క్షీణతను, నాశనాన్ని కలిగించకుండా ఉండునట్లు మన హృదయములను బహు జాగ్రత్తగాను, ఎల్లప్పుడూ కాపాడుకోవడం. దావీదుకు ఈ విషయం బాగా తెలుసు! అందుకే కీర్తన 139:23-24లో అతడిలా ప్రార్థించాడు, "దేవా, నన్ను పరిశోధించి నా హృదయమును తెలిసికొనుము, నన్ను పరీక్షించి నా ఆలోచనలను తెలిసికొనుము. నీకాయాసకరమైన మార్గము నాయందున్నదేమో చూడుము. నిత్యమార్గమున నన్ను నడిపింపుము." అంతేకాక కీర్తన 19:12లో దావీదు అంటున్నాడు, "తన పొరపాటులు కనుగొనగలవాడెవడు? నేను రహస్యముగా చేసిన తప్పులు క్షమించు....". దావీదు ఈ వ్యూహం ఎరిగినవాడని స్పష్టంగా కనిపిస్తుంది! "నా హృదయానుసారి" అని దేవుడు పిలిచిన ఈ మనుష్యుడు, చెడుమార్గములో పోకుండా తన హృదయాన్ని అనుదినము కాచుకొనుటగూర్చిన ప్రాముఖ్యతను ఎరిగినవాడు.

ఇలాంటి హృదయ పరిశుద్ధతనుగూర్చి క్రమమైన జాగ్రత్త వహించనవసరం లేదని చెప్పడానికి మనమెవరము? కీర్తనాకారుడు అంటున్నాడు : "యౌవనులు తమ నడతను ఎలా శుద్ధిపరచుకుంటారు? నీ వాక్యమునుబట్టి తమ ప్రవర్తన/ నడతను జాగ్రత్తగా చూచుకొనుటచేతనేకదా? నీ పూర్ణహృదయముతో నిన్ను వెదకియున్నాను, నన్ను నీ ఆజ్ఞలను విడిచి తిరుగనియ్యకుము. నీ యెదుట నేను పాపము చేయకుండునట్లు నా హృదయములో నీ వాక్యము ఉంచుకొనియున్నాను." (కీర్తన 119:9-11).

యోసేపును మాదిరిగా చూపుతూ, పవిత్రతయొక్క ప్రాముఖ్యతనుగూర్చి స్పర్జన్‌గారు ఒక ధ్యానమాలిక వ్రాసారు. పోతీఫరు భార్య వ్యభిచారము చేయుటకు యోసేపును ప్రేరేపించగా, అతడు "..... తన వస్త్రమును ఆమెచేతిలో విడిచిపెట్టి తప్పించుకొని బయటకు పారిపోయెను...." (ఆదికాండము 39:12). 'చెడుకార్యములనుండి దూరంగా, క్షేమంగా ఉండాలని కోరుకునేవారు, చెడు అవకాశాలనుండి దూరంగా పారిపోవాలి. శోధనకు కారణమయ్యేవాటినికూడా చూడకుండా మన కన్నులతో నిబంధన చేసుకోవాలి. ఎందుకంటే అటువంటి పాపములకు ఒక నిప్పురవ్వ మాత్రమే చాలు, క్షణంలో అది కార్చిచ్చుగా

మారిపోతుంది....నేను అపవాదిని ఎదిరిస్తే చాలు వాడు నా దగ్గర్నుండి పారిపోతాడు; కాని శరీర సంబంధమైన ఇచ్ఛలనుండి నేను తప్పనిసరిగా పారిపోవాలి లేకపోతే అవి నన్ను తప్పక జయించేస్తాయి." అని వ్యాఖ్యానిస్తాడు భక్తుడైన స్పర్జన్.

## రెండవ వ్యూహము

# కాపుదల

### మన ఆత్మ అనే పట్టణం చుట్టూ
### ఒక సంరక్షణా గోడను కట్టుకోవడం

**మూల వాక్యము : ప్రాకారము లేక పాడైన పురము ఎంతో**
**తన మనస్సును అణుచుకొనలేనివాడును అంతే.**
**సామెతలు 25:28**

రెండవ వ్యూహం సామెతలు 25:28లో చెప్పిన ఉపమానములో ప్రతిబింబిస్తున్నది. **"ప్రాకారము లేక పాడైన పురము ఎలాంటిదో, ఆత్మనిగ్రహం కొదవైనవాడు అంతే".** ఇక్కడ చుట్టూ రక్షణగా కట్టబడిన గోడలతో పటిష్టంగా ఉండాల్సిన ఒక పురాతనమైన పట్టణమునుగూర్చిన తలంపు కనిపిస్తున్నది. కాని ఆ గోడలు పడగొట్టబడ్డాయి, ఇంక సంరక్షణ అనేదే లేదు! నేను పురాతన యెరూషలేము, రోమా పట్టణాలను సందర్శించాను. యెరూషలేము, రోమ్, చైనా, బాబిలోన్ వంటి పురాతన పట్టణాలకు ఉన్న ప్రత్యేక లక్షణాలలో ఒకటి వాటిచుట్టూ కట్టబడిన గొప్ప ప్రాకారపు గోడలు. పురాతన కాలమునుండి మధ్యయుగం వరకు, శత్రువులు వచ్చి ఆక్రమించుకోకుండా ఉండేటట్లు చుట్టూ పటిష్టమైన రక్షణగోడలు ఉండటం ఆవశ్యకతగా ఉండేది.

సామెతల గ్రంథకర్త కూడా ఇదే ఊహను మానవ ఆత్మకు ఆపాదించి చెబుతున్నాడు. ఇక్కడ ఉన్న తలంపు ఏమిటంటే, మనం పాపం అనే ఉగ్రతకు, అంతరంగంలోనుండి పెల్లుబికి వచ్చే పాపపు ఇచ్ఛలు, అసూయ, లోభత్వము, ద్వేషము వంటి శక్తులను తట్టుకొని నిలబడాలంటే, మన ఆత్మ అనే పట్టణానికి చుట్టూ రక్షణ గోడను కట్టుకోవాలి. లేకపోతే, మన శత్రువు చేసే దాడులను ఎదుర్కోవడం మన వల్లకాక, ఎల్లప్పుడూ ఓడిపోతూనే ఉంటాం.

**"యథార్థమార్గము తప్పక నడుచుకొనువారికి ఆయన [దేవుడు] కేడెముగా నున్నాడు...."** (సామెత 2:7)

సామెతలు 2:8-16లో ఒక అద్భుతమైన వాక్యభాగం ఉన్నది. దేవుని సత్యము, జ్ఞానమును కలిగియుండుట ద్వారా కలిగే ఫలితం ఇది

.....న్యాయము తప్పిపోకుండాఆయనకనిపెట్టును,తన భక్తుల ప్రవర్తనను ఆయన కాచును.....జ్ఞానము నీ హృదయమున జొచ్చును, తెలివి నీకు

మనోహరముగానుండును. బుద్ధి నిన్ను కాపాడును, వివేచన నీకు కావలి కాయును. అది (జ్ఞానము) దుష్టుల మార్గమునుండియు, మూర్ఖముగా మాటలాడువారి చేతిలోనుండియు నిన్ను రక్షించును. అట్టివారు చీకటి త్రోవలలో నడువవలెనని యథార్థమార్గములను విడిచిపెట్టెదరు. కీడుచేయ సంతోషించుదురు, అతి మూర్ఖుల ప్రవర్తనయందు ఉల్లసించుదురు. వారు నడుచుకొను త్రోవలు వంకరవి, వారు కుటిలవర్తనులు.మరియు అది (జ్ఞానము) జారస్త్రీనుండి, మృదువుగా మాటలాడు పరస్త్రీనుండి నిన్ను రక్షించును.

1 పేతురు 2:11లో "**.....ఆత్మకు విరోధముగా పోరాడు శరీరాశలను విసర్జించ**" మని చెబుతున్నాడు పేతురు. ఇక్కడ ముఖ్యంగా "ఆత్మకు విరోధముగా పోరాడు" అనే మాటను గమనించండి. అంటే శరీరాశలు మన ఆత్మకు విరోధముగా పోరాడుతున్నాయన్నమాట. సాతాను పేర్లలో ఒకటి "అపొల్యోను", అంటే "నాశకుడు" (నాశనం చేసేవాడు). మన అంతరంగంలోని మనుష్యుని, అంటే మన ఆత్మను నాశనంచేయడానికి వాడు తిరుగుతున్నాడు! మన హృదయాలను పాడుచేయ డానికి వాడు ప్రయత్నిస్తున్నాడు. ఇది మనం గుర్తించి, వాడి దాడులను తట్టుకునే గోడలను మన ఆత్మచుట్టూ కట్టుకోవడానికి ప్రయాసపడాలి!

అంతేకాక, క్రైస్తవుడు దేవుని సర్వాంగకవచము ధరించాలి అని వివరిస్తూ (ఎఫెసి. 6:13), 16వ వచనంలో "దుష్టుని అగ్నిబాణము"లనుగూర్చి చెబుతోంది. మన ఆత్మలపై దాడిచేస్తున్న శత్రువైన అపవాది దాడులను ఎదుర్కొనేందుకు మన ఆత్మలచుట్టూ ప్రాకారము ఉండాల్సిన ఆవశ్యకత ఇక్కడ మనకు కనిపిస్తున్నది.

"ముండ్లును ఉరులును మూర్ఖుల మార్గములో ఉన్నవి. ***తన్ను కాపాడు కొనువాడు*** వాటికి దూరముగా ఉండును" సామెతలు 22:5. ఈ రెండవ వాక్యానుసారమైన ఆత్మీయ వ్యూహం, మన ఆత్మలను కాచుకొనుట యొక్క ప్రాముఖ్యతను తెలియజేసే మరొక సూచన ఇక్కడ ఇవ్వబడుతుంది!

**"యూదా దేశమందును యెరూషలేము పట్టణమందును**
**మాకు ఆశ్రయము(ప్రాకారము)నిచ్చుటకు కృప చూపితివి..." ఎజ్రా 9:9**

నెహెమ్యాగ్రంథం అంతా, యెరూషలేము పట్టణముచుట్టూ ప్రాకారము తిరిగి కట్టబడుటనుగూర్చిన సంభవం వ్రాయబడింది. అది నీ ఆత్మ అనే పట్టణము చుట్టూ ప్రాకారము కట్టుటనుగూర్చిన ఆత్మీయ అన్వయింపుకు వ్యూహము. నెహెమ్యా 4:7-9 వచనాలు, అలాంటి ప్రాకారము మనము కట్టబూనుకుంటే

శత్రువు ఆత్మీయంగా మనలను ఎలా విరోధిస్తాడో అనే ఆత్మీయ సూత్రములను మనకు బోధిస్తున్నది!

ఈ ఆత్మీయ యుద్ధము యొక్క సత్యమును అర్థంచేసుకోని ఇతరులు, నీవు "నీ ఆత్మచుట్టూ రక్షణ ప్రాకారము" కట్టుకోవడానికి చేసే ప్రయత్నాలను అనవసరమైన, వ్యర్థమైన, సమయాన్ని వృధాచేసే ప్రయత్నాలని నిన్ను ఒప్పించడానికి ప్రయత్నం చేస్తారు. దానికి బదులు లోకానుసారమైన అనేక మార్గాలను చూపడానికి ప్రయత్నిస్తారు.

**దీశాంఖ్యక్ష :** కాబట్టి, క్రైస్తవులను ఆత్మీయ యుద్ధానికి ఆయత్తపరచే మరొక వ్యూహం, శత్రువు మనమీద దాడి చేసినపుడు నిలిచివుండేలా, మన ఆత్మలచుట్టూ బలమైన ప్రాకారము కట్టుకునే ఆలోచన. అటువంటి "రక్షణ ప్రాకారము" మనం **కట్టుకోవాలి, దానిని జాగ్రత్తగా నిర్వహించుకోవాలి.**

దేవుడు తన ప్రజలైన ఇశ్రాయేలీయులతో పాత నిబంధన గ్రంథములో వ్యవహరించిన విధానాన్నిగూర్చి యెషయా 5:5 తెలియజేస్తుంది. కొన్నిసార్లు ఇశ్రాయేలీయులను ఆయన తన ద్రాక్షతోటగా పిలిచేవాడు. తన ప్రజలు సోమరులుగా, నిష్ఫలులుగా, అవిధేయులుగా ఉంటే వారిమీదకు వచ్చే ప్రమాదాన్నిగూర్చి ఆయన వారిని హెచ్చరించేవాడు.

> ఆలోచించుడి, నేను నా ద్రాక్షతోటకు చేయబోవు కార్యమును మీకు తెలియ జెప్పెదను.
>
> నేను అది మేసివేయబడునట్లు దాని కంచెను కొట్టి వేసెదను.
>
> అది త్రొక్కబడునట్లు దాని గోడను పడగొట్టి దాని పాడు చేసెదను....

మనం నేర్చుకోబోయే వ్యూహం మన ఆత్మచుట్టూ అటువంటి రక్షణ గోడ (...మన ఆత్మీయపోరాటంలో మనలను కాపాడుటకు దేవుడు వాడుకొనే గోడ) ఎలా కట్టుకోవాలో, దానిని ఎలా నిర్వహించాలో మనకు చూపించడానికి సహాయపడుతుంది.

## మూడవ వ్యూహం

# ప్రసంగించుట

### మనకు మనం ప్రసంగించుకొనుట నేర్చుకొనుట

**మూల వచనం : నా ప్రాణమా, నీవేల కృంగియున్నావు? నాలో నీవేల తొందరపడుచున్నావు?**

**దేవునియందు నిరీక్షణయుంచుము, ఆయనే నా రక్షణకర్త అనియు**
**నా దేవుడనియు చెప్పుకొనుచు ఇంకను నేను ఆయనను స్తుతించెదను.**
**కీర్తన 42:5**

డా॥ డి. మార్టిన్ లాయిడ్ జోన్స్‌గారు ఒక వైద్యుడు. ఆయన సేవకునిగా మారి, లోతైన తలంపులు గల తన ప్రసంగముల ద్వారా అంతర్జాతీయ ఖ్యాతిని సంపాదించినవాడు. ఆ ప్రసంగాలు అధికశాతం ఆయన కుటుంబసభ్యులద్వారానే అచ్చువేయబడ్డాయి. ఆయన పుస్తకాలలో ఒకదాని శీర్షిక "ఆత్మీయ కృంగుబాటు". అది సుప్రసిద్ధమైంది అంతేకాక కాపరి సలహాలు ఇవ్వడానికి, సార్వజనీయంగా క్రైస్తవులకు విలువైన దృక్కోణాన్ని ఇచ్చింది. ఆ పుస్తకంలో ఆయన అధికంగా నొక్కి వక్కాణించిన భాగం కీర్తన 42. ఈ కీర్తనలోని 5 మరియు 11 వచనాలలో కీర్తనాకారుడు ఈ మాటలను మరలా చెపుతాడు : **నా ప్రాణమా, నీవు ఏల కృంగియున్నావు? నాలో నీవేల తొందరపడుచున్నావు? దేవునియందు నిరీక్షణయుంచుము. ఆయనే నా రక్షణకర్త అనియు నా దేవుడనియు చెప్పుకొనుచు ఇంకను నేను ఆయనను స్తుతించెదను.**

ఈ వ్యాఖ్యలోని రెండు విషయాలను లాయిడ్‌జోన్స్‌గారు ఎత్తి చూపుతారు. మొదటిది, కీర్తనాకారుడు తనతో తాను మాట్లాడుకుంటున్నాడు! అతని సమస్య ఏమిటంటే, తన ఆత్మ తనలో తాను కృంగిపోయింది, అంటే బహుశా అతడు నిరాశతో నిరుత్సాహముతో కృంగిపోయాడు. ఇక్కడ నేర్చుకోవాల్సిన విషయమేమిటని కీర్తనాకారుడు చెపుతున్నాడంటే, తన పరిస్థితి కృంగజేస్తుంటే దానికి జవాబుగా కొన్ని ముఖ్యమైన సత్యాలను జ్ఞాపకం చేసుకుంటున్నాడు. ఇది ఆత్మీయతతో నిండిన, లేఖనానుసారమైన స్వీయ ముఖాముఖి (నిన్ను నీవు ఎదుర్కోవడం). రెండవది ఏమిటంటే, కీర్తనాకారుడు తనకు తాను చెప్పకుంటున్న సలహా, "దేవునియందు నిరీక్షణయుంచుము"

“దేవునియందు నిరీక్షణయుంచుము” అనే ప్రబోధం, సాధారణమైనదిగా కనిపించవచ్చు, ఆ మాట లేఖనాలలోని దానికి సంబంధించిన ఆలోచనలను మనకు జ్ఞాపకం తీసుకురావచ్చు. ఉదాహరణకు, యెషయా 26:3, “ఎవని మనస్సు నీమీద ఆనుకొనునో వానిని నీవు పూర్ణశాంతిగలవానిగా కాపాడుదువు. ఏలయనగా అతడు నీయందు విశ్వాసముంచి యున్నాడు.” అంతేకాదు, మనకు కొలస్సి. 3:1-2 వచనాలు కూడా జ్ఞాపకం రావచ్చు, “మీరు క్రీస్తుతోకూడ లేపబడినవారైతే పైనున్న వాటినే వెదకుడి, అక్కడ క్రీస్తు దేవుని కుడిపార్శ్వమున కూర్చుండియున్నాడు. పైనున్నవాటిమీదనే గాని భూసంబంధమైన వాటిమీద మనస్సుపెట్టుకొనకుడి”

ఇక్కడ ఉన్న ముఖ్యమైన సూత్రము ఏమిటంటే, దేవునివైపు చూడమని మనకు మనం జ్ఞాపకం చేసుకుంటూ, ఆయనను ఆయన మనకుచేసిన వాగ్దానములను గుర్తుచేసుకుంటూ మనతో మనం మాట్లాడుకోవడం ద్వారా లేక మనకు మనం “ప్రసంగించుకోవడం”ద్వారా మన ఆత్మలను కలతకు గురిచేసే విషయాలకు విరోధంగా మనము ఆత్మీయయుద్ధం చేయగలము. ఈ విషయమై మనకు జ్ఞానమునిచ్చే మరొక చాలా ప్రాముఖ్యమైన వాక్యభాగం పేతురు వ్రాసిన రెండవ పత్రిక, మొదటి అధ్యాయం. మూడవ వచనంలో “.......ఆయన దైవశక్తి జీవమునకును భక్తికిని మనకు కావలసినవాటినన్నిటినీ దయచేయు చున్నందున...'' అంటూ, తరువాతి భాగంలో మనకు అవసరమైనవన్నీ దేవుడు మనకిచ్చాడు అనే విషయాన్ని స్పష్టం చేసేందుకు రెండు విషయాలు చెబుతాడు -1) ఆయనగూర్చిన అనుభవజ్ఞానముద్వారా, ఇంకా 2) ఆయన చేసిన అమూల్యములును, అత్యధికమైన వాగ్దానములద్వారా.

తరువాత భాగములో ఈ అమూల్యమైన వాగ్దానములద్వారా మనము ఆయన దేవస్వభావమునందు పాలివారమై, లోకమందున్న భ్రష్టత్వమును తప్పించుకుంటామని చెబుతాడు. ఇది చాలా ప్రాముఖ్యమైన విషయం. మనం చెప్పకుంటున్న ఈ ఆత్మీయ యుద్ధంలో విజయం సాధించడానికి అవసరమైన ప్రతి వనరునూ దేవుడు మనకు అందుబాటులో ఉంచారు. **2 పేతురు 1అధ్యాయంలోని ఈ వాక్యభాగంలో, మనము 1] ఆయన అనుభవజ్ఞానములో ఎదుగుతూ, 2] ఆయన మనకిచ్చిన అమూల్యమైన వాగ్దానములు గట్టిగా పట్టుకుని, విశ్వసించితే, మనం యుద్ధం చేయడానికి అవసరమైన ఈ వనరులన్నీ మనం పొందుకోవచ్చునని దేవుడు చెబుతున్నారు. ఈ రెండింటిద్వారా “లోకములో దురాశవలన కలిగే భ్రష్టత్వమును తప్పించుకోవచ్చునని” ఆయన నిర్ధిష్టంగా చెబుతున్నారు.**

**సారాంశం**: ఇంతవరకు చెప్పకున్న విషయాలు ఒకచోటికి చేర్చి చూద్దాం. మన హృదయమనే ఈ తోటను కాపాడుకోవడం ఎలా? "యౌవనస్థులు తమ నడకను ఎలా శుద్ధిచేసుకుంటారు? నీ వాక్యమునుబట్టి జీవించుటచేతనే (తన ప్రవర్తనను కాచుకొనుట చేతనే) కదా" (కీర్తన 119:9). మన ఆత్మ అనే పట్టణం చుట్టూ ప్రాకారము ఎలా పునర్నిర్మించుకుంటాము (సామెతలు 25:28)? దేవుని ప్రశస్తమైన వాగ్దానములను మన హృదయములో దాచుకొనుట చేతనే : "నీయెదుట నేను పాపము చేయకుండునట్లు నా హృదయములో నీ వాక్యము ఉంచుకొనియున్నాను". దేవుని వాగ్దానములు మన ఆత్మచుట్టూ కట్టుకునే ప్రాకారానికి యిటుకలుగా మారిపోతాయి! మన మనస్సులో ఆత్మలో ఉన్న పోరాటములను జయించడానికి మనకు మనం ఎలా ప్రసంగించుకుంటాం? మన దగ్గర ప్రసంగాలకొరకు మంచి వాక్యభాగాలు ఉంటేనే అది సాధ్యమౌతుంది. మనం దేవుని అమూల్యమైన, అత్యధికమైన వాగ్దానాలను చదువుతూ, కంఠస్థం చేస్తూ, ధ్యానిస్తూ ఉన్నప్పడు అవి మనలో పెరుగుతూ ఉంటాయి (2 పేతురు 1:4).

## నాలుగవ వ్యూహాము

# ప్రాధాన్యత

### దృష్టిని కేంద్రీకరించుట లేక ఏకదృష్టి

**మూల వచనం : దేవుని రాజ్యమును ఆయన నీతిని మొదట వెదకుడి;**
**అప్పుడవన్నియు మీకనుగ్రహింపబడును.**
**మత్తయి 6:33**

**నీ స్వబుద్ధిని ఆధారము చేసికొనక నీ పూర్ణహృదయముతో యెహోవాయందు నమ్మకముంచుము;**
**నీ ప్రవర్తన అంతటియందు ఆయన అధికారమునకు ఒప్పుకొనుము,**
**అప్పుడు ఆయన నీ త్రోవలను సరాళము చేయును.**
**సామెతలు 3:5-6**

**నీ కన్నులు అటు ఇటు చూడక సరిగాను, నీ కనురెప్పలు నీ ముందర సూటిగాను చూడవలెను.**
**నీవు నడుచు మార్గమును సరాళము చేయుము, అప్పుడు నీ మార్గములన్నియు స్థిరములగును.**

**నీవు కుడితట్టుకైనను ఎడమతట్టుకైనను తిరుగకుము,**
**నీ పాదమును కీడునకు దూరముగా తొలగించుకొనుము.**
**సామెతలు 4:25-27**

మత్తయి 6:22-23 వచనాలలో యేసు మానవుని కంటిని ఒక ఉదాహరణగా చూపుతూ, అంతరంగములోని మన మనో నేత్రములనుగూర్చి ఉపదేశిస్తారు. "దేహమునకు దీపము కన్నే గనుక నీ కన్ను తేటగా ఉండినయెడల నీ దేహమంతయు వెలుగుమయమైయుండును. నీ కన్ను చెడినదైతే నీ దేహమంతయు చీకటిమయమైయుండును; నీలోనున్న వెలుగు చీకటియై యుండినయెడల ఆ చీకటి ఎంతో గొప్పది!"

యేసు అంటున్న "నీలోనున్న వెలుగు", ఈ మాట చివరిలో ఆయన మానవుని కంటిని ఉదాహరణగా చెబుతూ మన ఆత్మలో ఉన్న ఆత్మీయ వెలుగునుగూర్చిన ఒక ఆత్మీయసత్యాన్ని చెబుతున్నారు. ఈ వాక్యంయొక్క సందర్భం, దాని ముందున్న వచనాలు, తరువాతి వచనాలు చూస్తే, ప్రభువైన యేసు ద్విమనస్కత్వము అనే ప్రమాదాన్నిగూర్చి చెబుతున్నారని తెలుస్తుంది. ఉదాహరణకు, 19-21వచనాలలో, మనం భౌతిక సంపదలపై అపారమైన

దాహంతో ఉన్నట్లయితే, మన ఆత్మీయదృష్టి మసకబారిపోతుందని, మనలో ఉన్న ఆత్మీయ వెలుగు చీకటిగా మారిపోతుందని చూపుతుంది. 24వచనంలో, దీనినే సూచిస్తూ, మన హృదయాలు ఒకేసారి రెండుచోట్ల ఉండలేవని (ఇద్దరు యజమానులకు దాసులుగా ఉండలేమని) ఆయన స్పష్టంగా తెలియపరస్తున్నాడు. సరియైన ఆత్మీయదృష్టి ఉండటం అనేది అవును/కాదు అనే ప్రశ్న! ఆయన చెప్పేదేమిటంటే మన ఆత్మీయ దృష్టి స్థిరంగా ఉండాలి; ఏక మనస్సు, ఏక దృష్టి మనకుండాలి. మన హృదయాలలో దేవునికి నిజమైన **"ప్రాధాన్యత"** ఉండాలి. మన జీవిత పరిధిలో మిగిలినవన్నీ ఆయన తరువాతి స్థానంలోనే ఉండాలి. క్రీస్తు చెప్పేది ఏమిటంటే, క్రైస్తవుడు ఇద్దరు యజమానులకు దాసుడుగా ఉండలేడు. మనం రెండు లక్ష్యాలను ఒకటిగా చేయలేము, అంటే శరీరాన్ని తృప్తి పరచుకొంటూ, అదే సమయంలో దేవునిని మహిమపరచడం అనేవి రెండూ ఒకేసారి చేయలేము (గలతి.5:17చూడండి).

ద్విమనస్కత్వాన్నిగూర్చి, ఏకదృష్టిని అనే సమస్యను గూర్చి సామెతలు 4:25-27లో ఒక అద్భుతమైన వివరణ ఉంది. "నీ కన్నులు అటు ఇటు చూడక సరిగాను, నీ కనురెప్పలు నీ ముందర సూటిగాను చూడవలెను. నీవు నడుచు మార్గమును సరాళము చేయుము, అప్పుడు నీ మార్గములన్నియు స్థిరములగును. నీవు కుడితట్టుకైనను ఎడమతట్టుకైనను తిరుగకుము, నీ పాదమును కీడునకు దూరముగా తొలగించుకొనుము."

అదే అధ్యాయంలో, 11వచనంలో "జ్ఞానమార్గమును నేను నీకు బోధించియున్నాను, యథార్థమార్గములో నిన్ను నడిపించియున్నాను" అని చదువుతాము. 14,15 వచనాలు, "భక్తిహీనుల త్రోవను చేరకుము, దుష్టుల మార్గమున నడువకుము. దానియందు ప్రవేశింపక తప్పించుకొని తిరుగుము. దానినుండి తొలగి సాగిపొమ్ము." అని చెబుతాడు.

రెండు మార్గములను గూర్చిన ఇదే భావనను మత్తయి 7:13-14 వచనాలలో ప్రభువైన యేసు ఉపయోగించారు. "ఇరుకు ద్వారమున ప్రవేశించుడి; నాశనమునకు పోవు ద్వారము వెడల్పును, ఆ దారి విశాలమునై యున్నది, దాని ద్వారా ప్రవేశించువారు అనేకులు. జీవమునకు పోవు ద్వారము ఇరుకును ఆ దారి సంకుచితమునైయున్నది. దాని కనుగొనువారు కొందరే."

మొదటి కీర్తన కూడా నీతిమంతుల మార్గమునకు, భక్తిహీనుల మార్గమునకు మధ్య ఉన్న వ్యత్యాసమును స్పష్టంగా చెబుతుంది. ఈ భావన తరచుగా లేఖనాలలో కనిపిస్తుంది. అంతేకాదు 'పాపము' అను మాటకు క్రొత్తనిబంధనలో వాడిన గ్రీకుభాషా పదం "హమర్షియా", అంటే గురి తప్పడం, అంటే మార్గము తప్పడం, తప్పమార్గంలోకి వెళ్లడం అని సూచిస్తుంది.

యాకోబు పత్రికలో ఈ ద్విమనస్కత్వపు స్థితినిగూర్చి రెండు భాగాలలో చెబుతాడు. 1:8లో "ద్విమనస్కుడు తన సమస్తమార్గములలో అస్థిరుడు" అని, 4:7-8 వచనాలలో ఈ ద్విమనస్కుడు తన చెడు మార్గమును విడిచి దేవునితో తననుతాను అనుసంధానించుకోవాల్సిన అవసరాన్ని చెబుతాడు: "కాబట్టి దేవునికి లోబడియుడుడి, అపవాదిని ఎదిరించుడి, అప్పడు వాడు మీ యొద్దనుండి పారిపోవును. దేవునియొద్దకు రండి అప్పడాయన మీయొద్దకు వచ్చును. పాపులారా, మీ చేతులను శుభ్రము చేసికొనుడి; ద్విమనస్కులారా, మీ హృదయములను పరిశుద్ధపరచుకొనుడి."

**సారాంశం :** ఈ ఉపమానములో ఉన్న ముఖ్యమైన విషయం, మనం ఏకమనస్సుతో దేవుని వెంబడించాలనేదే. హెబ్రీయులకు వ్రాసిన పత్రిక 12వ అధ్యాయం మొదటి రెండు వచనాలు ఈ విషయం మనం అర్థం చేసుకోవడానికి సహాయపడతాయి. 11వ అధ్యాయములో, పాత నిబంధనలోని విశ్వాసవీరులనుగూర్చి చర్చించిన తరువాత, 12వ అధ్యాయం ఇలా ఆరంభమౌతుంది : "ఇంతగొప్ప సాక్షి సమూహము మేఘమువలె మనలను ఆవరించియున్నందున మనముకూడ ప్రతి భారమును, సులువుగా చిక్కులబెట్టు పాపమును విడిచిపెట్టి, విశ్వాసమునకు కర్తయు దానిని కొనసాగించువాడునైన యేసువైపు చూచుచు మనయెదుట ఉంచబడిన పందెములో ఓపికతో పరుగెత్తుదము. ....."

కాబట్టి ఇక్కడ ఇవ్వబడిన వ్యూహము ఏమిటంటే, ఈ లోకపు సంగతులమీద కాక, దేవునిమీద నిత్యత్వపు విషయాలమీద మన దృష్టిని నిలిపివుంచడానికి మనలను మనం క్రమశిక్షణలో ఉంచుకోవడమే (1 యోహాను 2:15-17తో పోల్చండి). నిత్యజీవానికి, దేవుని నిత్య రాజ్యానికి నడిపే ఇరుకైన తిన్నని మార్గములో కొనసాగడమే. మన జీవితకాలమంతా

నీతిమార్గములలో నడుచుటకు మనకు మనం జ్ఞాపకం చేసుకోవాలి. అంటే దుష్టుల మార్గమునుండి తొలగి జీవిస్తూ, మనం నడవడానికి దేవుడు మనలను పిలిచిన మార్గమునుండి తొలగకుండా ఉండటమే. ఇది మన జీవితాలలో మనం ప్రతి దినము అత్యధిక **ప్రాధాన్యత** నివ్వాల్సిన విషయం (మత్తయి 6:33).

2 దినవృత్తాంతములు 16:9 లో, "...తనయెదుట యథార్థహృదయము గలవారిని బలపరచుటకై యెహోవా కనుదృష్టి లోకమందంతట సంచారము చేయుచున్నది.." అని చెప్పినందున, ఇది చాలా ప్రాముఖ్యమైన వ్యూహం. కాబట్టి ఏకదృష్టి కలిగియుండుట దేవుని సమృద్ధి దీవెనలకు కారణమౌతుంది!

## రెండవ అధ్యాయములో చర్చించే ప్రశ్నలు

# "యుద్ధ వ్యూహములు"

1. క్రైస్తవుని మనస్సులోని ఆలోచనా ప్రక్రియను .............................................................. మరియు .......................................................అని బైబిల్ వ్యాఖ్యానిస్తుంది.(పేజి 38)

**2 కొరింథి. 10:3-5 వచనాల వెలుగులో ఈ క్రింది ప్రశ్నలుచర్చించుము.**

ఈ వాక్యభాగం ప్రకారం ఎక్కువ యుద్ధాలు ఎక్కడ జరుగుతున్నాయి?

5 వచనం ప్రకారం ఇలాంటి యుద్ధంలో ఎలాంటి కార్యములు జరుగుతున్నాయి?

మీ వ్యక్తిగత ఆలోచనా జీవితంలోనుండి కొన్ని ఆచరణాత్మకమైన ఉదాహరణలు, ఈ వాక్యభాగంలోని క్రింద ఇవ్వబడిన పదములకు మాదిరిగా వ్రాయండి:

"బలమైన దుర్గములు"
"వితర్కములు"
"ఆటంకములు"
"ప్రతి ఆలోచనను క్రీస్తుకు లోబడునట్లు చెరపట్టి..."

2. ఈ అధ్యాయములో క్లుప్తముగా వివరించిన, బైబిల్‌లో వర్ణించిన గొప్ప ఆత్మీయపోరాటాన్నిగూర్చి నీ స్వంత మాటలలో వర్ణించుము. (34-35 పేజిలు)

3. చాలామంది క్రైస్తవులకు వీరుని మనస్థత్వం లేనట్లుగా కనిపించడానికి కారణమేమిటి? (36-37 పేజిలు)

4. "వ్యూహము" అనే మాటను నీవెలా నిర్వచిస్తావు?

5. ఆత్మీయ 'వ్యూహములు' ఎందుకు ముఖ్యమైనవి? ఆత్మీయ వ్యూహములను గూర్చి అర్థం చేసుకోవడం మన క్రైస్తవ విశ్వాసంలో సహనమునకు ఎలా సహాయపడుతుంది? (38 పేజి)

6. మొదటి వ్యూహము ఏమిటి? దానిని క్లుప్తముగా వివరించుము. (40-43 పేజిలు)

వ్యూహం పేరు :

మూల వాక్యము :

సారాంశం నీ స్వంత మాటలలో :

సామెతలు 24:30-31లో ఉన్న హెచ్చరిక ఏమిటి?

మత్తయి 13:22లోని ముండ్లపొదలు ఏమిటి?

7. రెండవ వ్యూహము ఏమిటి? దాని సారాంశము క్లుప్తముగా వ్రాయండి. (44-46 పేజిలు)

వ్యూహము:

మూలవచనం:

సారాంశం నీ స్వంత మాటల్లో:

1 పేతురు 2:11, ఎఫెసి. 6:16 వచనాల భావం ఏమిటి? (45పేజి)

మన ఆత్మ చుట్టూ రక్షణ ప్రాకారమును మనం ఎలా కట్టుకోవాలి? (46పేజి)

ద్వితీయెూవ. 23:14 "పరిశుద్ధత"ను "కావుదలను" ఎలా అనుసంధానిస్తుంది?

8. మూడవ వ్యూహమును వ్రాసి, దాని సారాంశమును తెలపండి. (47-49 పేజిలు)

వ్యూహము:

మూల వాక్యము:

సారాంశం నీ స్వంత మాటల్లో

కీర్తన 42:5, 11వచనాలకు ఈ భావనకు ఉన్న సంబంధం ఏమిటి?

ఈ వ్యూహమును అమలు పరచుటకు మనం ఏ విషయంలో ప్రభావవంతముగా ఉండాలి?

(2 పేతురు 1:3తో పోల్చండి)

9. నాలుగవ వ్యూహమును వ్రాసి వివరించండి.

వ్యూహము:

మూలవాక్యము:

సారాంశం నీ స్వంత మాటలలో:

యాకోబు 1:8 ప్రకారం 'ద్విమనస్కత్వం' యొక్క ప్రభావం ఏమిటి? దీని అర్థం ఏమిటని నీవనుకుంటున్నావు?

సామెతలు 3:5-6లో ఇవ్వబడిన సత్యము "ఏక దృష్టి"తో ఏమి సంబంధం కలిగివుంది?

ఈ క్రింద ఇవ్వబడిన బైబిల్ వ్యక్తులు ఏకదృష్టి గలవారా, లేక ద్విమనస్కులా వ్రాసి ఎందుకో వివరించండి:

యోసేపు (యాకోబు కుమారుడు)

సంసోను:

దానియేలు:

సొలొమోను:

10. మొదటి అధ్యాయము నీకు పూర్తిగా అర్థం అయిందని నిరూపించుకోవడానికి ఈ క్రింది విషయాలు చేయడానికి సిద్ధపడుము.

ఎ) ఆత్మీయ యుద్ధమునుగూర్చిన భావనలు సరైనవేనని చెప్పటకు 2 కొరింథి. 10:3-5వచనాల విశిష్టతను చర్చించుటకు

బి) నాలుగు వ్యూహములు చెప్పడానికి

సి) ఒక్కొక్క వ్యూహమునకు ఇచ్చిన మూల వాక్యమును చెప్పడానికి (కంఠస్థంగా లేక సారాంశం చెప్పడానికి)

డి) నాలుగు వ్యూహములు ఎలా పనిచేస్తాయో నీ స్వంతమాటలలో చెప్పడానికి (అలాగే ప్రతి వ్యూహము నీ స్వంత జీవితంలో అన్వయించుకోవడాన్నిగూర్చి ఉదాహరణలు చెప్పడానికి).

### మూడవ అధ్యాయము

# దేవుని విశ్రాంతిలోనికి ప్రవేశించుట

## దేవుని వాగ్దానములతో విశ్వాసమును కలుపుకొనుట

పాత నిబంధన గ్రంథంలోని సంఖ్యాకాండములో (13, 14 అధ్యాయాలు చదవండి), ఇశ్రాయేలీయుల చరిత్రలో చాలా భావగర్భితమైన, అద్భుతమైన కథ ఉన్నది. కాదేషు బర్నేయ అనేచోట జరిగిన సంఘటన వృత్తాంతం అది. దేవుడు ఐగుప్తులోని బానిసత్వమునుండి ఇశ్రాయేలును ఆశ్చర్యకరముగా విడిపించాడు. అరణ్యముగుండా వారిని నడిపించిన తరువాత, దేవుడు తాను అబ్రహాముకు, అతని సంతానమంతటికి వాగ్దానము చేసిన దేశములో ప్రవేశించే అవకాశం వారికి ఇవ్వబోతున్న సందర్భం అది.

కనాను దేశమును వేగుచూచి ఇశ్రాయేలు ప్రజలకు వర్తమానము తీసుకురావడానికి 12మంది వేగులవారిని పంపమని దేవుడు మోషేకు సెలవిచ్చాడు. ఆ వేగులవారు ఆ దేశము నిజముగా పాలు తేనెలు ప్రవహించే దేశమని, అయితే "....ఆ దేశములో నివసించే జనులు బలవంతులు; వారి పట్టణములు ప్రాకారములు గలవి, అవి మిక్కిలి గొప్పవి" అని నివేదిక తీసుకుని, కాదేషు బర్నేయకు తిరిగివచ్చారు. వేగులవారిలో ఒకడైన కాలేబు, "మనము నిశ్చయముగా వెళ్ళుదము; దాని స్వాధీనపరచుకొందుము; దాని జయించుటకు మన శక్తి చాలునని" ప్రజలతో చెప్పాడు. అతని మాటలు దేవునియందు ఆయన వాగ్దానములయందు ఉన్న విశ్వాసమును ప్రతిబించాయి.

అయితే మిగిలిన పదిమంది వేగులవారు చెడ్డసమాచారమును చెప్పారు, "ఆ జనులు మనకంటె బలవంతులు; మనము వారిమీదికి పోజాలము" అన్నారు. ఆ దేశములో ఉన్నత దేహులు ఉన్నారని చెప్పారు. "మా దృష్టికి మేము మిడతల వలె ఉంటిమి, వారి దృష్టికిని అలాగే ఉంటిమి" అని చెప్పారు వాళ్ళు. ఈ సమాచారములో దేవునియందు, ఆయన వాగ్దానములయందు వారికున్న అవిశ్వాసము, మనుష్యునియందు వారి భయము ప్రతిబింబించింది (సామెతలు 29:25 చూడండి).

ఆ 12మంది వేగులవారిలో ఒకడైన యెహోషువ, కనాను దేశములో ఉన్న ప్రజలకు భయపడి, దానిలో ప్రశేశించి స్వాధీనపరచుకొనుటకు

తిరస్కరించడం ద్వారా, దేవుని మీద తిరుగుబాటు చేయవద్దని ప్రజలను హెచ్చరించాడు. దేవుడు తమతో ఉంటానని, ఆ దేశమును ఇస్తానని వాగ్దానము చేసాడు కాబట్టి, భయపడవద్దని అతడు ఇశ్రయేలీయులకు చెప్పాడు.

దేవునియందు, ఆయన వాగ్దానములయందు విశ్వసించుటకు యెహోషువ కాలేబులు ఎంత ప్రోత్సహించినా, ఇశ్రాయేలీయులు మిగిలిన 10మంది వేగులవారు చెప్పిన చెడ్డ సమాచారమును నమ్మి, దేవునియందు విశ్వసించుటకు, ఆ దేశములో ప్రవేశించుటకు నిరాకరించారు. తత్ఫలితంగా, దేవుడు వారిమీద కోపగించి, ఆ అవిశ్వాసపు తరములో ఉన్న వారందరూ మరణించేవారకు, 40 సంవత్సరాలపాటు వారిని మరలా అరణ్యములో తిరుగులాడునట్లుగా వెనక్కి పంపివేసాడు. ఇది జరిగిన తరువాత, యెహోషువ కాలేబు మినహా, మిగిలిన వారంతా క్రొత్త తరమువారున్న ఇశ్రాయేలు చివరికి వాగ్దాన దేశములో ప్రవేశించింది.

పాత నిబంధనలో ఉన్న ఈ యథార్థగాథ మంచి ఉదాహరణగా అపొస్తలుడైన పౌలు 1 కొరింథి 10:6, 11 వచనాలలో ఉటంకించాడు : "వారు ఆశించిన ప్రకారము మనము చెడ్డవాటిని ఆశించకుండునట్లు ఈ సంగతులు మనకు దృష్టాంతములుగా ఉన్నవి.......ఈ సంగతులు వారికి దృష్టాంతములుగా సంభవించి, యుగాంతమందున్న మనకు బుద్ధికలుగుటకై వ్రాయబడెను."

**కాదేషు బర్నేయ వద్ద జరిగిన సంభవముయొక్క ఆత్మీయ సారాంశము క్రొత్త నిబంధనలోని హెబ్రీయులకు వ్రాసిన పత్రికలో మనం కనుగొనవచ్చును.** (హెబ్రీ. 3:7 - 4:11). ఈ వాక్యభాగము కాదేషు బర్నేయలో జరిగిన సంఘటనను ఉటంకించిన కీర్తన 95ను ఇందులో రచయిత ప్రస్తావిస్తాడు. కీర్తనాకారుని ద్వారా దేవుడు అంటున్నాడు : "నలుబది ఏండ్లకాలము ఆ తరమువారివలన నేను విసికి -వారు హృదయమున తప్పిపోవు ప్రజలు; వారు నా మార్గములు తెలిసికొనలేదని అనుకొంటిని. కావున నేను కోపించి -వీరెన్నడును నా విశ్రాంతిలో ప్రవేశింపకూడదని ప్రమాణము చేసితిని."

హెబ్రీ పత్రిక రచయిత **వాగ్దాన దేశములో ప్రవేశించుట అంటే దేవుని "విశ్రాంతి"లో ప్రవేశించుట అని 95వ కీర్తన తెలియజేస్తున్నది** అనే సత్యాన్ని నొక్కి వక్కాణిస్తున్నాడు (కీర్తన 95:11చూడండి). హెబ్రీ 3:19లో "కాగా అవిశ్వాసముచేతనే వారు ప్రవేశింపలేకపోయిరని" మనకు తెలుస్తుంది. తరువాత **హెబ్రీయులకు పత్రికలో 4వ**

**అధ్యాయంలో, నాడు కాదేషు బర్నేయ వద్ద జరిగిన దాని ఆత్మీయ సారాంశమును నేటి క్రైస్తవులకు రచయిత తెలియజేస్తున్నాడు......**

"ఆయన విశ్రాంతిలో ప్రవేశించుదుమను వాగ్దానము ఇంక నిలిచియుండగా, మీలో ఎవడైనను ఒకవేళ ఆ వాగ్దానము పొందకుండ తప్పిపోవునేమో అని భయము కలిగియుందము. వారికి ప్రకటింపబడినట్లు మనకును సువార్త ప్రకటింపబడెను గాని వారు వినిన వారితో విశ్వాసము గలవారై కలిసియుండలేదు గనుక విన్న వాక్యము వారికి నిష్ప్రయోజనమైనదాయెను...... విశ్వాసులమైన మనము ఆ విశ్రాంతిలో ప్రవేశించుచున్నాము" (హెబ్రీ. 4:1-3).

పాత నిబంధనలో ఇశ్రాయేలు వైఫల్యము మరలా కీర్తన 106:24-25లో పునరావృతమయ్యింది. "వారు రమ్యమైన దేశమును నిరాకరించిరి, **ఆయన మాట నమ్మకపోయిరి. యెహోవా మాట ఆకింపక వారు తమ గుడారములో సణుగుకొనిరి." కాబట్టి కాదేషు బర్నేయ కథ మనలను అవిశ్వాసము అనే పాపమునుగూర్చి, మరీ ముఖ్యముగా దేవుని వాగ్దానములు విశ్వసించకపోవడాన్ని గూర్చి హెచ్చరించుటకు ఇవ్వబడినదని స్పష్టమౌతుంది.** ఆయన వాగ్దానములను నమ్మి, దేవుని వాగ్దానములకు విధేయులుగా ఉండుటకు అది ఇవ్వబడింది.

## దేవుని వాగ్దానములు, దాచబడిన నిధి

దేవుని వాగ్దానముల విలువ మరియు ప్రాముఖ్యతనుగూర్చి బైబిల్ మరి విశేషముగా చెప్పచున్నది. ఈ వాగ్దానములు బైబిల్‌నందంతటా చెదరిపోయి ఉన్నవి.

ఛార్లెస్ స్పర్జన్‌గారు వ్రాసిన ఉదయకాలపు ధ్యానమాలికలో, ఆయన అంటాడు : "దేవుని వాగ్దానములు విసరిపారవేసే చిత్తుకాగితములవలె ఎప్పడును భావించరాదు. వాటిని వాడుకోవాలని దేవుని ఉద్దేశం. దేవుని బంగారము పిసినారి దగ్గర ఉన్న డబ్బులాంటిది కాదు, వ్యాపారం కోసం వాడుకోవడానికి ముద్రించిన నోట్లవంటిది. ఆయన వాగ్దానములు చెలామణి కావడంకన్నా ప్రభువు ఇంకేమీ కోరడు. ఆయన తన బిడ్డలు ఆ వాగ్దానములు చేతబూని తన వద్దకు వచ్చి, "ప్రభువా, నీవు మాట ఇచ్చినదానిని నెరవేర్చుము" అని అడుగుట చూడాలని ఎంతో ఆశిస్తున్నాడు. ఆయన వాగ్దానములు ఎత్తి

ప్రార్థించినపుడు, మనము దేవునిని ఘనపరస్తున్నాము. ఒక క్రైస్తవుడు వాగ్దానాన్ని గుర్తించికూడా, దానిని దేవునియొద్దకు తీసుకువెళ్ళకపోవడం దేవునికి అవమానం; కాని ఒకడు కృపాసనము దగ్గరకు వెళ్ళి, "ప్రభువా, ఇది తప్ప నాకు మరొక సిఫారసు లేదు, 'నీవే అన్నావు కదా;" అంటే వెంటనే ఆ కోరిక అనుగ్రహించబడుతుంది. మన పరలోకపు బ్యాంకు గవర్నరు, తాను ముద్రించిన నోట్లను చెల్లేటట్లు చేయడానికి సంతోషముగా ఎదురుచూస్తున్నాడు. వాగ్దానమునకు ఎన్నడూ తుప్పు పట్టనీయకు. దానికి ఎన్నడూ చెద చేరనీయకు. వాగ్దానమును వరదూసి, పరిశుద్ధతకొరకైన హింసకై వాడు. నీవు ఆయన వాగ్దానములు ఆయనకు జ్ఞాపకం చేస్తూ ఎప్పుడు కావాలంటే అప్పుడు వాటిని వాడుకోవడం ఆయనకు ఇబ్బంది కలిగిస్తుందని భావించకు. అవసరత ఉన్నవారు ఆయనకు బిగ్గరగా మొఱ్ఱపెట్టాలని ఆయన ఆశపడుతున్నాడు. దయ చూపుట ఆయనకు ఇష్టం. నీవు అడగడానికి సిద్ధపడిన దానికంటే ఆయన వినుటకు ఎక్కువ ఇష్టపడుతున్నాడు."

సామెతలు 2:1-6 జ్ఞానము కోరుకునే విశ్వాసులు, "...ఆజ్ఞలను... దాచుకొన" మని చెబుతోంది (1వచనం). దేవుని వాగ్దానాలలో ఉన్న జ్ఞానము, తెలివి, వివేచన కొరకు **"...వెండిని వెదకినట్లు... దాచబడిన ధనమును వెదకినట్లు....."** వెదకాలని చెబుతోంది. "నా మాటలు మనస్సున నుంచుకొనుము, నా ఆజ్ఞలను నీయొద్ద దాచిపెట్టుకొనుము. ...నీ కనుపాప వలె నా ఉపదేశమును కాపాడినయెడల నీవు బ్రదుకుదువు. నీ వ్రేళ్లకు వాటిని కట్టుకొనుము, నీ హృదయమను పలకమీద వాటిని వ్రాసికొనుము..." అని చెపుతోంది సామెతలు 7:1-3. **"....వెండిని ఆశపడక నా ఉపదేశము అంగీకరించుడి, మేలిమి బంగారునాశింపక తెలివినొందుడి. జ్ఞానము ముత్యములకన్నా శ్రేష్టమైనది, విలువగల సొత్తులేవియు దానితో సాటికావు." 19వచనంలో దేవుని జ్ఞానమునుగూర్చి, "మేలిమి బంగారముకంటెను, అపరంజికంటెను నావలన కలుగు ఫలము మంచిది, ప్రశస్తమైన వెండికంటె నావలన కలుగు వచ్చుబడి దొడ్డది."**

దేవుడు "...జీవమునకును భక్తికిని కావలసినవాటినన్నిటిని..." మనకు అనుగ్రహించారని 2 పేతురు 1:3-4 మనకు తెలియజేస్తున్నది. అన్నిటికీ మూలము రెండు విషయాలు అని ఈ వాక్యభాగం చెబుతోంది : 1) దేవుని జ్ఞానము, ఆయన గుణలక్షణాలు; 2) "అమూల్యములును అత్యధికములైన ఆయన వాగ్దానముల"ద్వారా, ఈ రెండింటిని- **మనము "దురాశను అనుసరించుటవలన లోకమందున్న**

**భ్రష్టత్వమును ఈ వాగ్దానముల మూలముగా తప్పించుకొని, దేవస్వభావము నందు పాలివారగునట్లుగా వాటిని(వాగ్దానములు) అనుగ్రహించెను."**

## దేవుని వాగ్దానాలను గంభీరంగా తీసుకోవాలి!

మన అనుదిన ఆత్మీయ పోరాటంలో మనకు విజయమును ఇవ్వడానికి ఈ వాగ్దానాలను దేవుడు ఏర్పాటు చేసినట్లయితే, (అవి అందుకే ఏర్పాటు చేయబడ్డాయని మనకు స్పష్టంగా తెలియజేసారు) వాటిని నిజంగా గంభీరంగా తీసుకోవాలి. కాదేషు బర్నేయ వద్ద పాపము దేవుని వాగ్దానాలను జనులు ఉన్నవి ఉన్నట్టుగా తీసుకోకపోవడంవల్లే జరిగింది. దేవుని వాగ్దానాలు ఉన్నవి అని కేవలం తెలుసుకుంటే మాత్రమే సరిపోదు! ఆ వాగ్దానాలను మనము అలవాటు ప్రకారంగా కంఠస్థం చేసి, మన అనుదిన జీవితాలలో వాటిమీద ఆనుకొనుట నేర్చుకోవాలి.

చాలామంది క్రైస్తవుల అభిప్రాయం ఏమిటంటే, వాక్యాలు కంఠస్థం చేయడం కేవలం సండేస్కూలు పిల్లలకేనని. చాలామంది క్రైస్తవులు వాక్యమును కంఠస్థం చేసే బాధ్యతను తప్పించుకోవడానికి రకరకాల కారణాలు చెబుతారు: అలా కంఠస్థం చేయడంవల్ల మాకు ఏ మేలు కలుగలేదు అని; నాకు జ్ఞాపకశక్తి తక్కువ అని. ఈ విషయంలో కొందరు ప్రత్యేకమైన వరమును కలిగివుండటం నిజమే గాని, ప్రతి ఒక్కరూ తమ తమ జ్ఞాపకశక్తి స్థాయినిబట్టి ఈ పని చేయవచ్చు!

కీర్తనాకారుడు అంటున్నాడు, "నేను పాపముచేయకుండునట్లు నీ వాక్యమును నా హృదయములో ఉంచుకొన్నాను" అని (కీర్తన 119:11). మరొక మాటలో చెప్పాలంటే, పాపమునుండి తప్పించుకోవడానికి అతడు దేవునివాక్యంలోని ముఖ్యమైన భాగాలను కంఠస్థం చేసాడు. మరికొన్ని వాక్యభాగాలను చూస్తే, అతడు దేవుని వాక్యాన్ని కంఠస్థం చేయడమే కాక, ఆ వాక్యమును ధ్యానిస్తూనే ఉన్నాడని తెలుస్తుంది (కీర్తన 1). "చెవియొగ్గి జ్ఞానుల ఉపదేశము ఆలకింపుము, నేను కలుగజేయు తెలివిని పొందుటకు మనస్సునిమ్ము. నీ అంతరంగమందు వాటిని నిలుపుకొనుట ఎంతో మంచిది, పోకుండ అవి నీ పెదవులమీద ఉండనిమ్ము" అంటాడు సామెతలు 22:17,18వచనాలలో (1 పేతురు 3:15కూడా చూడండి).

**ముగింపులో :**

**1] దేవుని వాక్యములో ఉన్న వాగ్దానములను మనం గంభీరంగా [సీరియస్‌గా] తీసుకోవాలి.**

**2] "దాచబడిన నిధికొరకు వెదకినట్లు" వాటికొరకు వెదకాలి, వాటిని మన దగ్గర "భద్రపరచుకోవాలి".**

**3] వాటిని మనం కంఠస్థంచేసి, మన జీవితంలో వాటిని అన్వయించుకొనేటట్లు వాటినిగూర్చి ధ్యానించాలి.**

**4] ఈ వాగ్దానాలను మనం నమ్మాలి, వాటియందు భరోసా ఉంచాలి [అంటే వాటితో మన విశ్వాసాన్ని కలుపుకోవాలి.]**

**5] మన జీవితంలోనికి శ్రమ, శోధన, పరీక్ష వచ్చినపుడు వాటిని ప్రభావవంతముగా ఉపయోగించడానికి మనం సిద్ధంగా ఉండాల్సిన అవసరం ఉంది [ఎఫెసి 6:13].**

## నిర్దిష్టమైన వాగ్దానాలు వాటి అన్వయించుకోవడం

ఈ అధ్యాయంలో మిగిలిన భాగం "దురాశను అనుసరించుటవలన లోకమందున్న భ్రష్టత్వమును తప్పించుకొని, దేవస్వభావమునందు పాలివారగునట్లుగా" అనుగ్రహించబడిన దేవుని వాగ్దానాలనుగూర్చిన అనేక ఉదాహరణలు ఇస్తున్నాం.

## "దేవుడు నా ప్రార్థనలు వింటున్నాడని నాకు అనిపించడం లేదు"

చాలమంది క్రైస్తవులు ప్రార్థించడం మొదలుపెట్టగానే, వారికి తరచుగా కలిగే అనుభవం ఏమిటంటే, వారు ఒంటరిగా ఉన్నట్లు కలిగే భావన, దేవుడు తమ ప్రార్థనలను ఆలకించడం లేదు అనే భావన! మన ప్రార్థనలు పైకప్పుకు తగిలి మరలా వెనక్కి వచ్చేస్తున్నాయని మనకనిపిస్తుంది! మనకు ఇలా అనిపించినప్పడు, చాలా నిరుత్సాహం కలుగుతుంది. చాలసార్లు మనకు కలిగే ఈ నిరుత్సాహాన్నే సాతాను ఆయుధంగా వాడుకుని, దేవునితో మనం అర్థవంతమైన అనుదిన సహవాసాన్ని గడపకుండా ప్రయత్నిస్తాడు. ఇలాంటి నిరుత్సాహాన్ని మనం ఎలా అధిగమించాలి? దేవుడు మన ప్రార్థనలను వింటున్నాడని, మనం ఆయనకు పెట్టే మొఱ్ఱను ఆయన దృష్టిస్తున్నాడని మనకు ఎలా నిశ్చయత కలుగుతుంది?

మొదటిగా, కొన్నిసార్లు మన ప్రార్థనలు మన జీవితంలోని పాపములవలన

ఆటంకపరచబడే అవకాశం ఉన్నదని మనం గుర్తించాలి. ఉదాహరణకు, కీర్తన 66:18 చెపుతోంది, "నేను నా హృదయములో పాపమును లక్ష్యము చేసినయెడల ప్రభువు నా మనవి వినకపోవును". ఇంకా ఇతర వాక్యభాగాలుకూడా ఈ విషయాన్ని ధృవీకరిస్తాయి (సామెతలు 28:9; యెషయా 1:15; 58:4; 1 పేతురు 3:7 చూడండి). ఇలాంటి పరిస్థితిలో, మనము లేఖనానుసారముగా ఆ పాపమును ఒప్పకొని, దానివిషయమై మారుమనస్సు పొందాలి (1యోహాను 1:9; కీర్తన 51; కీర్తన 32). (గమనించండి : లేఖనానుసారంగా పాపమును ఒప్పకొనుట, క్షమాపణనుగూర్చి 6వ అధ్యాయంలో చూడండి).

అయితే, ఒకవేళ మనం మారుమనస్సు పొందకుండా ఏదైనా పాపంలో ఇష్టపూర్వకంగా కొనసాగకపోతున్నా, దేవుడు మన ప్రార్థన వింటున్నట్లుగా అనిపించదు. **అప్పుడు మనము ఈ క్రింద ఇచ్చిన దేవుని వాగ్దానాలను మనకు మనం జ్ఞాపకం చేసుకోవాలి [అంటే "మనకు మనం ప్రసంగించు"కోవాలి]. దేవుడు వింటున్నాడని, మనలను పట్టించుకుంటున్నాడని ఈ వాగ్దానములు మనకు నిశ్చయతను ఇస్తాయి!** ఈ వాగ్దానాలను మనం ముఖాముఖిగా ఎదుర్కొన్నపుడు, దేవుడు మన ప్రార్థనలను వింటున్నాడో లేదో, మనగురించి పట్టించుకుంటున్నాడో లేదో లేక ఆయన మనకు ఇచ్చిన ఈ వాగ్దానాలు అబద్ధమేమో (అది అసాధ్యం - తీతు 1:21) అనే విషయం మీకు స్పష్టమైపోతుంది. అప్పుడు మనకు కలిగే భావనలను మనం తృణీకరించి, విశ్వాసముతో ప్రార్థించుట నేర్చుకుంటూ, ఆయన మనలను గూర్చి జాగ్రత్త వహిస్తున్నాడు, మన ప్రార్థనలు వింటున్నాడు అనే విషయాన్ని స్వీకరించి విశ్వసిస్తాం. **ఈ విధంగా చేయడంలో మనం విఫలమైతే, మనం కూడా కాదేషు బర్నేయలోని పాపం చేసినట్లే. దేవుని వాగ్దానములతో విశ్వాసమును కలుపుకొనుటలో విఫలమైనట్టే, తత్ఫలితంగా, ఆయన విశ్రాంతిలో ప్రవేశించడం కూడా సాధ్యంకాదు** (హెబ్రీ. 4:2-3 తరువాత వచనాలు).

యాకోబు 4:8 "దేవునియొద్దకు రండి అప్పడాయన మీయొద్దకు వచ్చును..."

సామెతలు 15:8 "యథార్థవంతుల ప్రార్థన ఆయనకు ఆనందకరము"

యెషయా 30:18 "మీయందు దయచూపవలెనని యెహోవా ఆలస్యము చేయుచున్నాడు, మిమ్మును కరుణింపవలెనని ఆయన నిలువబడియున్నాడు..... ఆయన నిమిత్తము కనిపెట్టుకొనువారందరు ధన్యులు."

కీర్తన 34:15 "యెహోవా దృష్టి నీతిమంతులమీద నున్నది, ఆయన చెవులు వారి మొరలకు ఒగ్గియున్నవి."

సామెతలు 15: 29 "భక్తిహీనులకు యెహోవా దూరస్థుడు, నీతిమంతుల ప్రార్థన ఆయన అంగీకరించును."

కీర్తన 34:17 "నీతిమంతులు మొఱ్ఱపెట్టగా యెహోవా ఆలకించును, వారి శ్రమలన్నిటిలోనుండి వారిని విడిపించును."

కీర్తన 145:18 "తనకు మొఱ్ఱపెట్టువారికందరికి......యెహోవా సమీపముగా ఉన్నాడు."

కీర్తన 65:2 "ప్రార్థన ఆలకించువాడా, సర్వశరీరులు నీయొద్దకు వచ్చెదరు."

హెబ్రీ. 4:15 "మన ప్రధానయాజకుడు మన బలహీనతలయందు మనతో సహానుభవము లేనివాడు కాదు..."

హెబ్రీ 4:16 "...మనము కనికరించబడి సమయోచితమైన సహాయము కొరకు కృప పొందునట్లు ధైర్యముతో కృపాసనమునొద్దకు చేరుదుము."

1 పేతురు 5:7 "ఆయన మిమ్మునుగూర్చి చింతించుచున్నాడు గనుక మీ చింత యావత్తు ఆయనమీద వేయుడి." (కీర్తన 55:22 తోకూడా పోల్చిచూడండి).

## "దేవునికి నిజంగా తెలుసా?"

అనేక క్రైస్తవులు ప్రార్థించుట ఆరంభించగానే వారిని వచ్చే మరొక సమస్య, వారి జీవితంలో ప్రస్తుతం వారు ఎదుర్కుంటున్న సమస్య దేవునికి తెలుసో లేదో, లేక ఆయన అర్థంచేసుకుంటాడో లేదోనని. దేవుని వాగ్దానాలను మనం జ్ఞాపకం చేసుకోవడం నిజంగా నెమ్మదిని మనశ్శాంతిని కలిగిస్తుంది, ఎందుకంటే అది **మన జీవితంలో ప్రతి సంగతి ఆయనకు తెలుసు, ఆయన** మనకు ఏమి జరిగినా, మన గురించిన సమస్తమును ఆయన **పట్టించుకుంటున్నాడు అనేసంగతి విషయంలో మనకు నిశ్చయత కలిగిస్తుంది.**

కీర్తన 33:13-15 "యెహోవా ఆకాశములో నుండి కనిపెట్టుచున్నాడు, ఆయన నరులందరినీ దృష్టించుచున్నాడు. తానున్న నివాసస్థలములోనుండి భూలోకనివాసులందరినీ ఆయన చూచుచున్నాడు. ఆయన వారందరి

హృదయములను ఏకరీతిగా నిర్మించినవాడు, వారి క్రియలన్నియు విచారించువాడు వారిని దర్శించువాడు."

కీర్తన 139:1-6 "యెహోవా నీవు నన్ను పరిశోధించి తెలిసికొని యున్నావు. నేను కూర్చుండుట నేను లేచుట నీకు తెలియును. నాకు తలంపు పుట్టకమునుపే నీవు నా మనస్సు గ్రహించుచున్నావు. నా నడకను నా పడకను నీవు పరిశీలన చేసియున్నావు, నా చర్యలన్నిటిని నీవు బాగుగా తెలిసికొని యున్నావు. యెహోవా, మాట నా నాలుకకు రాకమునుపే అది నీకు పూర్తిగా తెలిసియున్నది. వెనుకను ముందును నీవు నన్ను ఆవరించియున్నావు నీ చేయి నా మీద ఉంచియున్నావు. ఇట్టి తెలివి నాకు మించినది అది అగోచరము అది నాకందదు."

సామెతలు 5:21 "నరుని మార్గములను యెహోవా ఎరుగును, వాని నడతలన్నిటిని ఆయన గుర్తించును."

హెబ్రీ. 4:13 "ఆయన దృష్టికి కనబడని సృష్టము ఏదియు లేదు. మనమెవనికి లెక్క యొప్ప చెప్పవలసియున్నదో ఆ దేవుని కన్నులకు సమస్తమును మరుగులేక తేటగా ఉన్నది."

సామెతలు 15:3 "యెహోవా కన్నులు ప్రతి స్థలముమీద నుండును, చెడ్డవారిని మంచివారిని అవి చూచుచుండును."

యోబు 34:21-22 "ఆయన దృష్టి నరుల మార్గములమీద నుంచబడి యున్నది, ఆయన వారి నడకలన్నియు కనిపెట్టి చూచుచున్నాడు. దుష్క్రియలు చేయువారు దాగుకొనుటకు చీకటియైనను మరణాంధకారమైనను లేదు."

యోబు 7:17-18 "మనుష్యుడు ఏపాటివాడు; అతని ఘనపరచనేల? అతని మీద నీవు మనస్సు నిలపనేల? ప్రతి పగలు నీవతని దర్శింపనేల? ప్రతి క్షణమున నీవతని శోధింపనేల?"

మత్తయి 10:29-30 "రెండు పిచ్చుకలు కాసుకు అమ్మబడును కదా; అయినను మీ తండ్రి సెలవులేక వాటిలో ఒకటైనను నేలను పడదు. మీ తలవెండ్రుకలన్నియు లెక్కింపబడియున్నవి గనుక మీరు భయపడకుడి."

కీర్తన 121:7-8 "ఏ అపాయము రాకుండ యెహోవా నిన్ను కాపాడును, ఆయన నీ ప్రాణమును కాపాడును. ఇది మొదలుకొని నిరంతరము నీ రాకపోకల యందు యెహోవా నిన్ను కాపాడును."

1 దినవృత్తాంతము 28:9 ".....యెహోవా అందరి హృదయమును పరిశోధించువాడును, ఆలోచనలన్నిటని సంకల్పములన్నిటిని ఎరిగినవాడునై యున్నాడు."

## దేవుడు నిజంగా శ్రద్ధవహిస్తాడా?

ఆయన సన్నిధి మనతో ఎల్లప్పుడూ ఉంటుందని, ఆయన నమ్మకంగా మనయెడల శ్రద్ధ వహిస్తారని కూడా మనకు మనం గుర్తుచేసుకోవలసిన (అంటే మనకు మనం ప్రసంగించుకోవలసిన) అవసరత ఉన్నది. మనము రక్షణ పొందిన తరువాత, మనము అంధకార సంబంధమైన రాజ్యమునుండి విడుదలపొంది దేవుని రాజ్యనివాసులుగా చేయబడ్డాము అనే విషయాన్ని మనకు మనం జ్ఞాపకం చేసుకుంటూ ఉండాలి (కొలస్సి 1:13). మనమిప్పుడు అధికారపూర్వకంగా పరలోక రాజ్య పౌరులము (ఫిలిప్పి 3:20), కాబట్టి పరలోకరాజ్య పౌరులకుండాల్సిన ఆధిక్యతలన్నీ మనకు ఉన్నాయి.

మనము ఇప్పడు దేవునియెదుట మిగిలినవారికి లేని ప్రత్యేకమైన ఆధిక్యత, భాగ్యము కలిగియున్నామని గుర్తించాల్సి ఉంది (1యోహాను 5:19). ఈ భాగ్యము కలగడానికి మనము యోగ్యులమని కాదు లేక మిగిలినవారికంటే మంచివారమని కాదు గాని అది దేవుడు మనకు అనుగ్రహించిన కృప మూలముగానని గుర్తించాలి (కృప అంటే యోగ్యతలేనివారికి ఇవ్వబడే భాగ్యము).

మనము నిజానికి దేవుని పిల్లలుగా దత్తత తీసుకొనబడ్డాము (ఎఫెసి 1:5; రోమా 8:14-18). దేవుని పిల్లలముగా, మనమాయనకు ప్రియులము. మనమాయనను "తండ్రీ" అని పిలవాలని ఆయన కోరుతున్నారు. అంతేకాక, ఆయన పిల్లలుగా ఆయన మనకొరకు బాగా శ్రద్ధచూపిస్తున్నారు, మనలను కాపాడుతున్నారు, జాగ్రత్తగా గమనిస్తున్నారు. ఆయన మన కేడెము, సంరక్షణ. భూమిమీదనున్న మన తల్లిదండ్రులవలె, మనకొరకు ఆయన హృదయములో శ్రేష్టమైన ఆలోచనలు ఉన్నాయి (యిర్మీయా 29:11).

**ఈ సంగతులన్ని సత్యమని దేవుని వాక్యములోని వాగ్దానములను మనం నమ్మినట్లయితే, అది మనకు ఆత్మలో అత్యధిక సంరక్షణను, నిశ్చయతను శాంతిని ఇస్తుంది. ఈ వాగ్దానములు నమ్మకపోతే, మనము దేవుని విశ్రాంతిలో ప్రవేశించము.**

1 యోహాను 3:1 "మనము దేవుని పిల్లలమని పిలువబడునట్లు తండ్రి మనకెట్టి ప్రేమ ననుగ్రహించెనో చూడుడి; మనము దేవుని పిల్లలమే."

రోమా 8:15-17 "ఏలయనగా మరల భయపడుటయు మీరు దాస్యపు

ఆత్మను పొందలేదుగాని దత్తపుత్రాత్మను పొందితిరి. ఆ ఆత్మ కలిగివారమైన మనము -అబ్బా తండ్రీ అని మొఱ్ఱపెట్టుచున్నాము. మనము దేవుని పిల్లలమని ఆత్మ తానే మన ఆత్మతో కూడా సాక్ష్యమిచ్చుచున్నాడు. మనము పిల్లలమైతే వారసులము, అనగా దేవుని వారసులము....క్రీస్తుతోడి వారసులము."

యెషయా 43:4 "...నీవు నాదృష్టికి ప్రియుడవైనందున ఘనుడవైతివి నేను నిన్ను ప్రేమించుచున్నాను..."

యోహాను 17:9 "నేను వారికొరకు ప్రార్థన చేయుచున్నాను; లోకము కొరకు ప్రార్థన చేయుటలేదు, నీవు నాకు అనుగ్రహించియున్నవారు నీవారైనందున వారికొరకే ప్రార్థన చేయుచున్నాను." (విమోచింప బడినవారు లోకములో ఉన్నవారికన్నా ఎంత ప్రత్యేకమైనవారని క్రీస్తు మాటలు చెబుతున్నాయో గమనించండి. అది కేవలం దేవుని కృపవలనే.)

రోమా 5:1,2 "కాబట్టి విశ్వాసమూలమున మనము నీతిమంతులముగా తీర్చబడి, మన ప్రభువైన యేసుక్రీస్తుద్వారా దేవునితో సమాధానము కలిగియుందము. మరియు ఆయనద్వారా మనము విశ్వాసము వలన ఈ కృపయందు ప్రవేశము గలవారమై, అందులో నిలిచియుండి, దేవుని మహిమనుగూర్చిన నిరీక్షణను బట్టి అతిశయపడుచున్నాము." (అంటే ఆయన కృపనుబట్టి క్రైస్తవులమైన మనకు దేవునియెదుట ఈ "నిలిచియుండే" స్థానం ఉన్నది. ఇది మిగిలినవారికి లేని స్థానము భాగ్యము! అయితే మనం చేసినది ఏదీ దానికి కారణం కాదు, దేవుని కృపద్వారా రక్షించబడి, ఆయనయందలి విశ్వాసము ద్వారా నీతిమంతులుగా తీర్చబడుటనుబట్టియే!).

రోమా 8:28 "దేవుని ప్రేమించువారికి, అనగా ఆయన సంకల్పము చొప్పున పిలువబడినవారికి, మేలు కలుగుటకై సమస్తమును సమకూడి జరుగుచున్నవని యెరుగుదుము."

**"నేను ఒంటరివాడను! నన్నెవరూ అర్థం చేసుకోరు!**
**దేవుడు నన్ను విడిచిపెట్టేసినట్లు అనిపిస్తుంది!"**

మనశ్శాంతి లేకుండటకు మరొక కారణము ఒంటరితనం. కొన్నిసార్లు మన సమస్యలనుగూర్చి అర్థంచేసుకొని, మన మేలు కోరేవారు, నిజంగా

మనలను అర్థంచేసుకునేవారు ఎవరూ లేరనిపిస్తుంది. సహాయం కోసం ఎవరివైపు చూడాలో తెలియని పరిస్థితి ఎదురౌతుంది. అయితే, మరొకసారి, **"ఇది నిజం కాదు! ఇది దేవుని జ్ఞానముకన్నా తనను తాను హెచ్చించుకునే మరో ఆలోచన కాబట్టి అది క్రిందకు పడద్రోయబడాలి** (2 కొరింథి. 10:3-4) ఈ లోకంలో మనకు ఎవరూ లేరు -దేవుడు కూడా లేడు అనిపించే ఆలోచన ఎప్పడు మిమ్ములను వెంటాడినా సరే, ఆ అబద్ధాన్ని తరిమివేసే దేవుని వాక్య సత్యమును మనం జ్ఞాపకం చేసుకోవాలి. **మనము సత్యమును మనకు మనం 'ప్రసంగించు'కోవాలి** (కీర్తన 42:5; యోహాను 8:31)". మనం ఉపయోగించదగ్గ కొన్ని "ప్రసంగ భాగాలు" ఇవిగో:

ఎఫెసి 2:11-12 "...మునుపు.....నిరీక్షణ లేనివారును, లోకమందు దేవుడు లేనివారునైయుండి, క్రీస్తుకు దూరస్థులై యుంటిరని మీరు జ్ఞాపకము చేసికొనుడి.....అయినను **మునుపు దూరస్థులైన మీరు ఇప్పుడు క్రీస్తుయేసునందు క్రీస్తు రక్తమువలన సమీపస్థులై యున్నారు."**

యెషయా 41:10 "...**నేను నీకు తోడైయున్నాను**, భయపడకుము నేను నీ దేవుడనైయున్నాను; దిగులుపడకుము నేను నిన్ను బలపరతును, నీకు సహాయము చేయువాడను నేనే, నీతియను నా దక్షిణ హస్తముతో నిన్ను ఆదుకొందును."

యెహోషువ 1:9 "...నిబ్బరముగలిగి ధైర్యముగానుండుము, దిగులు పడకుము జడియకుము....నీ దేవుడైన యెహోవా నీకు తోడైయుండును."

మత్తయి 28:20 "....ఇదిగో నేను యుగ సమాప్తివరకు సదాకాలము మీతోకూడ ఉన్నాను.."

కీర్తన 23:4 "గాఢాంధకారపులోయలో నేను నడచినను ఏ అపాయమునకు నేను భయపడను. నీవు నాకు తోడైయుందువు; నీ దుడ్డుకఱ్ఱయు నీ దండమును నన్ను ఆదరించును...."

దేవుడు మనలను విడిచిపెట్టేసాడు, ఆయన మనకు దూరమైపోయాడు, మనం ఒంటరివారము అనే భావన కలగటం క్రైస్తవ జీవితంలో సాధారణంగా జరిగేదే. ఒంటరితనం, ఆత్మలో వేదన కలిగినపుడు "యెహోవా నన్ను విడిచిపెట్టి

యున్నాడు. ప్రభువు నన్ను మరచియున్నాడు" (యెషయా 49:14) అని వెళ్ళిపెడతాం. ఇది అపవాదియొక్క మరొక అబద్ధం (యోహాను 8:44చూడండి). మరొకసారి మన భావోద్వేగాలను నమ్ముదామా, లేక దేవుని వాక్య సత్యమును ఆయన వాగ్దానములను నమ్ముదామా లేదా అనేది మన ఇష్టం. **మనం దేవుని వాగ్దానములను నమ్మటకు నిశ్చయించుకుంటేనే మన ఆత్మలకు దేవుడు ఏర్పాటుచేసిన విశ్రాంతిలోనికి ప్రవేశిస్తాం [అంటే దేవుని వాగ్దానాలతో విశ్వాసమును కలుపుకుంటేనే! (హెబ్రీ 4:2].**

యెషయా 49:15-16 స్త్రీ తన గర్భమున పుట్టిన బిడ్డను కరుణింపకుండ తన చంటిపిల్లను మరచునా? వారైన మరచుదురు గాని నేను నిన్ను మరువను. చూడుము నా యరచేతులమీదనే నిన్ను చెక్కియున్నాను."

యెషయా 46:3-4 "...గర్భమున పుట్టినది మొదలుకొని నాచేత భరింపబడినవారలారా, తల్లి ఒడిలో కూర్చుండినది మొదలుకొని నేను చంకపెట్టుకొనినవారలారా, నా మాట ఆలకించుడి. ముదిమి వచ్చువరకు నిన్ను ఎత్తికొనువాడను నేనే తలవెండ్రుకలు నెరయువరకు నిన్ను ఎత్తికొనువాడను నేనే. నేనే చేసియున్నాను, చంకపెట్టుకొనువాడను నేనే. నిన్ను ఎత్తికొనుచు రక్షించువాడను నేనే."

యెషయా 54:10 "పర్వతములు తొలగిపోయినను మెట్టలు తత్తరిల్లినను నా కృప నిన్ను విడిచిపోదు."

హెబ్రీ 13:5 "నిన్ను ఏమాత్రమును విడువను, నిన్ను ఎన్నడును ఎడబాయను..."

రోమా 8:37-39 "అయినను మనలను ప్రేమించినవాని ద్వారా మనము వీటన్నిటిలో అత్యధిక విజయము పొందుచున్నాము. మరణమైనను జీవమైనను దేవదూతలైనను ప్రధానులైనను ఉన్నవియైనను రాబోవునవియైనను అధికారులైనను ఎత్తయినను లోతైనను సృష్టింపబడిన మరి ఏదైనను, మన ప్రభువైన క్రీస్తు యేసునందలి దేవుని ప్రేమనుండి మనలను ఎడబాప నేరవని రూఢిగా నమ్ముచున్నాను."

విలాపవాక్యములు 3:22-23 "యెహోవా కృపగలవాడు, ఆయన వాత్సల్యత యెడతెగక నిలుచునది... అనుదినము నూతనముగా ఆయనకు వాత్సల్యత పుట్టుచున్నది నీవు ఎంతైన నమ్మదగినవాడవు."

లేఖనాలలో చాలా తరచుగా ఇవ్వబడిన ఆజ్ఞ "భయపడకుము" అని. మానవులమైన మనము చాలా త్వరగా భయపడే స్వభావం కలిగియున్నందున కావున ఈ ఆజ్ఞ ఇవ్వబడింది అనుటలో సందేహం లేదు. ఏ దేశంలోనైనా, ఏ మనుష్యునికైనా ఇది మామూలే. తమ చుట్టూ ఉన్న ప్రమాదాలపై దృష్టి ఉంచడం మొదలుపెట్టినపుడు క్రైస్తవులు కూడా అనేకసార్లు భయాందోళనలకు గురిఅవుతారు. అబ్రహాము భయపడి అబీమెలెకుతో అబద్దం చెప్పాడు (ఆదికాండము 20:9-13). భయాన్నిబట్టి మనం అనేకసార్లు మంచిపనులు చేయలేము. ఇది అపవాదియొక్క మరొక తంత్రము అని మనం గుర్తించాల్సి ఉంది (2 కొరింథి. 2:11). వాడు మనకు ఉరి ఒడ్డడానికి (సామెతలు 29:25) మనుష్య భయాన్ని ఉపయోగిస్తాడు. మనం పరిస్థితులకో, మనుష్యులకో భయపడుతూ ఉంటాం. మనల్ని ఎవరైనా తృణీకరిస్తారేమోనని భయపడతాం. మనకు రానున్న రోజుల్లో ఏమి జరుగబోతోందో నని భయపడతాం. మరణానికి భయపడతాం. పేదరికమును గురించి, ఆర్థిక సంక్షోభాన్నిగూర్చి భయపడతాం. కొంతమందికి, ఈ సమస్య ఎంత భయంకరంగా ఉంటుందంటే, భయంతో చచ్చుబడిపోతారు. మరొకసారి, ఈ భయము అనే సమస్యను ఎదుర్కోవడానికి దేవుని నిర్దిష్టమైన వాగ్దానాలు మనకు తెలిసి ఉండాలి. ఒకవేళ తెలియకపోతే దేవుడు మన ఆత్మలకు అనుగ్రహించిన "విశ్రాంతి"ని కోల్పోయే ప్రమాదం ఉంది.

కీర్తన 56:3 "నాకు భయము సంభవించు దినమున నిన్ను ఆశ్రయించుచున్నాను."

కీర్తన 32:7 "నా దాగుచోటు నీవే, శ్రమలోనుండి నీవు నన్ను రక్షించెదవు. విమోచన గానములతో నీవు నన్ను ఆవరించెదవు."

కీర్తన 34:7 "యెహోవాయందు భయభక్తులుగల వారిచుట్టు ఆయన దూత కావలియుండి వారిని రక్షించును."

సామెతలు 18:10 "యెహోవా నామము బలమైన దుర్గము, నీతిమంతుడు అందులోనికి పరుగెత్తి సురక్షితముగా నుండును."

ద్వితీయోపదేశకాండము 33:27 ''శాశ్వతుడైన దేవుడు నీకు నివాసస్థలము, నిత్యముగనుండు బాహువులు నీ క్రిందనుండును."

కీర్తన 27:1 "యెహోవా నాకు వెలుగును రక్షణయునై యున్నాడు, నేను ఎవరికి భయపడుదును? యెహోవా నా ప్రాణదుర్గము, ఎవరికి వెరతును?"

యెషయా 43:1-5 ''....నేను నిన్ను విమోచించియున్నాను భయపడకుము, పేరుపెట్టి నిన్ను పిలిచియున్నాను, నీవు నా సొత్తు. నీవు జలములలోబడి దాటునప్పుడు నేను నీకు తోడైయుందును. నదులలో బడి వెళ్లునప్పుడు అవి నీమీద పొర్లిపారవు. నీవు అగ్ని మధ్యను నడచునప్పుడు కాలిపోవు, జ్వాలలు నిన్ను కాల్చవు. యెహోవానగు నేను నీకు దేవుడను,...నీవు నా దృష్టికి ప్రియుడవైనందున ఘనుడవైతివి, నేను నిన్ను ప్రేమించుచున్నాను.... భయపడకుము నేను నీకు తోడైయున్నాను."

కీర్తన 46:1-2 "దేవుడు మనకు ఆశ్రయమును దుర్గమునైయున్నాడు, ఆపత్కాలములో ఆయన నమ్ముకొనదగిన సహాయకుడు. కావున భూమి మార్పునొందినను నడిసముద్రములలో పర్వతములు మునిగినను వాటి జలములు ఘోషించుచు నురుగు కట్టినను, ఆ పొంగునకు పర్వతములు కదలినను మనము భయపడము."

**"కాని నేను చాలా అసాధ్యమైన పరిస్థితిలో ఉన్నాను!"**

కొంతమంది క్రైస్తవులు, తాము బైబిల్ ఇచ్చే వాగ్దానాలకు మించిన పరిస్థితుల్లో ఉన్నామని భావిస్తారు. **కొన్నిసార్లు మనకున్నలాంటి భయంకరమైన శోధనలు ప్రపంచంలో ఇంకెవరికీ లేవని భావించి మనమీద మనం జాలిపడే ధోరణి మనందరిలోనూ ఉంటుంది.** ఆసక్తికరమైన విషయమేమిటంటే, బైబిల్ మనలోని ఈ ధోరణిని గుర్తించి, దానికి జవాబునివ్వడం! "సాధారణముగా మనుష్యులకు కలుగు శోధన తప్ప మరి ఏదియు మీకు సంభవింపలేదు" అని చెబుతూ 1 కొరింథి. 10:13 "దేవుడు నమ్మదగినవాడు; మీరు సహింపగలిగినంతకంటె ఎక్కువగా ఆయన మిమ్మును శోధింపబడనియ్యడు" అని భరోసా ఇస్తుంది.

అంతేకాదు 1 పేతురు 5:8-9లో, "నిబ్బరమైన బుద్ధిగలవారై మెలకువగా

ఉండుడి; మీ విరోధియైన అపవాది గర్జించు సింహమువలె ఎవరిని మ్రింగుదునా అని వెదకుచు తిరుగుచున్నాడు. **లోకమందున్న మీ సహోదరులయందు ఈ విధమైన శ్రమలే నెరవేరుచున్నవని యెరిగి,** విశ్వాసమందు స్థిరులై వానిని ఎదిరించుడి."

కీర్తనల గ్రంథము, ఇంకా మిగిలిన లేఖనాలలో, రచయితలు, తాము ఎంత భయంకరమైన పరిస్థితిలో ఉండగా తమ ప్రార్థనలను దేవుడు ఆలకించి తమ పరిస్థితులలోనుండి విడిపించాడో, ఎలా తమ క్లిష్టపరిస్థితిలోనికి ఆయన దిగివచ్చారో అనే సాక్ష్యములతో నిండి ఉన్నాయి.

కీర్తన 69:1 "దేవా, జలములు నా ప్రాణముమీద పొర్లుచున్నవి, నన్ను రక్షింపుము."

కీర్తన 18:6, 16-17 "నా శ్రమలో నేను యెహోవాకు మొఱ్ఱపెట్టితిని, నా దేవునికి ప్రార్థన చేసితిని. ఆయన తన ఆలయములో ఆలకించి నా ప్రార్థననంగీకరించెను. నా మొఱ్ఱ ఆయన సన్నిధిని చేరి ఆయన చెవులజొచ్చెను. ఉన్నతస్థలము నుండి చెయ్యిచాపి ఆయన నన్ను పట్టుకొనెను, నన్ను పట్టుకొని మహా జలరాసులలోనుండి తీసెను......ఆయన నన్ను రక్షించెను."

విలాపవాక్యములు 3:55-58 "యెహోవా అగాధమైన బంధీగృహములో నుండి నేను నీ నామమునుబట్టి మొఱ్ఱపెట్టగా... నీవు నా శబ్ధము ఆలకించితివి..... నేను నీకు మొరలిడిన దినమున నీవు నాయొద్దకు వచ్చితివి, -భయపడకుమి అని నీవు చెప్పితివి......నా ప్రాణవిషయమైన వ్యాజ్యెములను వాదించితివి, నా జీవమును విమోచించితివి."

కీర్తన 25:15-17 "నా కనుదృష్టి యెల్లప్పుడు యెహోవావైపునకే తిరిగియున్నది ఆయన నా పాదములను వలలోనుండి విడిపించును. నేను ఏకాకిని, బాధపడువాడను, నావైపు తిరిగి నన్ను కరుణింపుము. నా హృదయవేదనలు అతి విస్తారములు, ఇక్కట్టులోనుండి నన్ను విడిపింపుము."

కీర్తన 34:6, "ఈ దీనుడు మొఱ్ఱపెట్టగా యెహోవా ఆలకించెను, అతని శ్రమలన్నిటిలోనుండి అతని రక్షించెను...." 4వచనం "నేను యెహోవాయొద్ద విచారణచేయగా ఆయన నాకుత్తరమిచ్చెను, నాకు కలిగిన భయములన్నిటిలో నుండి ఆయన నన్ను తప్పించెను."

కీర్తన 40:2 “నాశనకరమైన గుంటలోనుండియు, జిగటగల దొంగ ఊబిలోనుండియు ఆయన నన్ను పైకెత్తెను. నా పాదములు బండమీద నిలిపి నా అడుగులు స్థిరపరచెను.”

కీర్తన 34:19 “నీతిమంతునికి కలుగు ఆపదలు అనేకములు, వాటి అన్నిటిలోనుండి యెహోవా వానిని విడిపించును.”

ప్రతి క్రైస్తవుడు కొన్నిసమయాలలో ముందుకు సాగలేనంతగా అలసి సొలసిపోతాడు. అయితే మన అలసటకు లోబడిపోతే, మన ఆత్మీయ జీవితాలలో మనం నిష్ఫలముగాను, ముందుకు సాగకుండా నిలిచిపోయేవారముగాను ఉంటాము. ఇలాంటి సమయాలలో దేవుని వాక్యములో కొన్ని నిర్దిష్టమైన వాగ్దానాలు మనకు మనం జ్ఞాపకం చేసుకోవాల్సి ఉంటుంది, వాటిని చూద్దాం.

కీర్తన 62:1-2 "నా ప్రాణము దేవుని నమ్ముకుని మౌనముగా ఉన్నది. ఆయనవలన నాకు రక్షణ కలుగును. ఆయనే నా ఆశ్రయదుర్గము, ఆయనే నా రక్షణకర్త. ఎత్తయిన నా కోట ఆయనే, నేను అంతగా కదలింపబడను."

మత్తయి 11:28-30 "ప్రయాసపడి భారము మోసికొనుచున్న సమస్త జనులారా, నా యొద్దకు రండి; నేను మీకు విశ్రాంతి కలుగజేతును. నేను సాత్వికుడను దీనమనస్సు గలవాడను గనుక మీమీద నా కాడి ఎత్తికొని నా యొద్ద నేర్చుకొనుడి; అప్పడు మీ ప్రాణములకు విశ్రాంతి దొరకును. ఏలయనగా నా కాడి సుళువుగాను నా భారము తేలికగాను ఉన్నది."

యెషయా 40:31 "యెహోవా కొరకు ఎదురుచూచువారు నూతన బలము పొందుదురు. వారు పక్షిరాజుల వలె రెక్కలుచాపి పైకి ఎగురుదురు. అలయక పరుగెత్తుదురు సొమ్మసిల్లక నడచిపోవుదురు."

కీర్తన 27:14 "యెహోవా కొరకు కనిపెట్టుకొనియుండుము, ధైర్యము తెచ్చుకొని నీ హృదయమును నిబ్బరముగా నుంచుకొనుము. యెహోవా కొరకు కనిపెట్టుకొని యుండుము."

**ముగింపు :** మంచి బైబిల్ పదకోశమును ఉపయోగించి, ప్రతి విధమైన పోరాటానికి కావలసిన వాగ్దానాలను కనుగొనండి. ఇంకా కొన్ని పుస్తకాలు కూడా లభ్యమవుతున్నాయి. 'దేవుని వాగ్దానములు' అనే పుస్తకంలో అంశాలవారీగా దేవుని వాగ్దానములు కూర్చబడి ఉన్నాయి. క్రైస్తవ గ్రంథశాలలో అవి దొరకుతాయి. అంతేకాక, మీ అనుదిన వాక్య ధ్యానంలో, అలాంటి వాగ్దానాలు దొరకినప్పడు వాటిని "పట్టుకోండి". వాటిని "దాచియుంచుకోండి"! వెంటనే మీ నోటు పుస్తకంలోనో లేక బైబిల్‌లోనో వ్రాసి పెట్టుకోండి. ఇది ఒక

జీవితకాలపు అలవాటుగా చేసుకోండి. సంవత్సరాలు గడిచేకొద్దీ మీరు తయారుచేసిన వాక్యముల పట్టిక మీకు ఆశ్చర్యం కలిగించేటంత గొప్పనిధిగా మారుతుంది. **మీరు ముఖ్యమైన వచనాలను కంఠస్థం చేసి, క్రమంగా వాటిని ధ్యానిస్తే, మీ ఆత్మలో గొప్పశాంతిని, ఇంతకు ముందులేని ఆత్మబలాన్ని కలిగివుండటం గమనిస్తారు.** అంతేకాక అవసరమైనప్పుడు "మీకు మీరు ప్రసంగించుకోవడానికి" సంసిద్ధులుగా ఉండటం కనుగొంటారు! (కీర్తన 42:5).

> దేవుని వాక్యము "ఆత్మ ఖడ్గము", కాని నీవు నీ మనస్సు అనే అంబుల పొదిలో దాచుకోని ఆయుధాన్ని పరిశుద్ధాత్మ నీకివ్వలేరు. ఒక నిర్ణయం తీసుకోవాల్సిన పరిస్థితిలో నడిపింపు అవసరాన్ని, లేక ఒక కష్టమైన శోధన పరిస్థితిలో, విజయంకోసం మీ పోరాటాన్ని ఒకసారి ఊహించుకోండి. పరిశుద్ధాత్మ మీ మనస్సులోని ఆయుధాగారానికి పరుగెత్తుకు వెళ్ళారనుకోండి, కాని ఆయనకు కేవలం యోహాను 3:16, ఆదికాండము 1:1, లేకపోతే గొప్ప ఆదేశం మాత్రమే దొరికాయనుకోండి. అవి గొప్ప ఖడ్గాలే, కాని అవి అన్ని యుద్ధాల కొరకు చేయబడినవి కావు. పరిశుద్ధాత్మ వాడుకొనునట్లుగా మన వ్యక్తిగత ఆత్మీయ ఆయుధాగారాన్ని వివిధ ఖడ్గాలు/ఆయుధాలతో ఎలా నింపుకోవాలి?

ఈ వాగ్దానాలు నిజంగా అద్భుతమైనవే! అయితే వాటి సౌందర్యాన్ని మాత్రమే చూచుకుంటూ మీరు దాటిపోతే, మీకు శోధన, శ్రమ కలిగినపుడు అవి మీకు చాలా కొంచెమే మేలు చేస్తాయి. అలాంటి వాగ్దానాలను "కూర్చుకుని" వాటిని **ధ్యానించండి.** ఆయా వాగ్దానాలకు సంబంధించిన జీవితంలోని శ్రమల సమయంలో వాటిపై నిర్దిష్టంగా ఏకాగ్రత చూపి, వాటిని నమ్మండి. **కాదేషు బర్నేయ జ్ఞాపకముందికదా? ఈ వాగ్దానాలతో ఆయా పరిస్థితుల మధ్య విశ్వాసము కలుపుకోకపోతే, నీ ఆత్మ దేవుని విశ్రాంతిలోనికి ప్రవేశించదు. దీనికి నీ వ్యక్తిగత తోడ్పాటు కావాలి. అందుకు క్రమశిక్షణ అవసరం. ఇదే ఆత్మీయ ఎదుగుదలకు, విజయానికి రహస్యం.**

### మూడవ అధ్యాయానికి చర్చా సహకారి

## “దేవుని విశ్రాంతిలోనికి ప్రవేశించుట”

1. కాదేషు బర్నేయలో జరిగిన సంభవానికి ఉన్న ఆత్మీయ విలువనుగూర్చి నీ స్వంత మాటలలో వివరించుము. (59 పేజి)

2. దేవుని వాగ్దానములనుగూర్చి మనకు ఎలాంటి వైఖరి ఉండాలి? ఈ వైఖరిని మనం ఎలా చూపించగలము? (యెహోషువ, కాలేబులతో పోల్చుకోండి). (60-62పేజి)

3. దేవుని వాగ్దానములు మనకేమి చేయగలవు? (2పేతురు 1:3-4) (61 పేజి)

4. దేవుడు మన ప్రార్థనలను పట్టించుకోవడంలేదు అని మనకు అనిపించినప్పడు, మనవేమి చేయగలము? ఇలా మనకు అనిపించినప్పడు మనము కాపాడుకోవలసినది ఏమిటి? (63-64 పేజిలు)

5. **మన జీవితాలలో జరుగుతున్న విషయాలనుగూర్చి దేవుడు శ్రద్ధ వహిస్తున్నాడు [లేక ఆయనకు తెలుసు]** అని మనకు ఎలా తెలుస్తుంది? మనం ఎలాంటి పరిస్థితులగుండా వెళుతున్నామో ఆయనకు తెలుసు అని మనకెలా తెలుస్తుంది? (64-65 పేజిలు)

6. ఈ లోకంలో ఇంకా చాలామంది మనుష్యులుండగా **దేవుడు మనకొరకు శ్రద్ధవహిస్తున్నాడు** అని మనకు ఎలా తెలుస్తుంది? (దేవుడు మనకొరకు శ్రద్ధవహిస్తున్నాడని మనకు తెలియడం ప్రాముఖ్యం అని మీరెందుకు అనుకుంటున్నారు? (67-68 పేజిలు)

7. దేవునికి క్రైస్తవుని యెడల ప్రత్యేకమైన ఆసక్తి ఉన్నదని నిరూపించి, మనమెప్పడూ ఒంటరిగా లేము అనే విధంగా ఉన్న క్రైస్తవునికి, దేవునికి మధ్య సంబంధమును వివరించుము. లేఖనాలలో ఇది వివరింపబడిన కొన్ని విధానాలు ఏవి?(69-70 పేజిలు=)

8. సాధారణంగా క్రైస్తవునికి భయం కలిగించేది ఏమిటి? అలాంటి సమయాలలో క్రైస్తవుని దృష్టి దేనిమీద ఉండాలి? (72 పేజి)

9. మనలను భయపెట్టే విషయాలు ఎలాంటివి? (72 పేజి)

10. భయం మనమీద చూపే ప్రభావాలు ఎలాంటివి? (72 పేజి)

11. ఈ భయానికి విరుగుడుగా ఏమి చేయాలి? అది ఎలా చేయాలి?

12. **మనకొక్కరికే ఈ అసాధ్యమైన పరిస్థితి** అని మనం ఊహించుకునే సమయాలలో లేఖనము మనకేమి చెబుతున్నది? (73-74 పేజిలు)

13. అలాంటి పరిస్థితిలో నీకు నీవెలా "ప్రసంగించుకుంటావు"?

1 కొరింథి. 10:13

1 పేతురు 5:8-9

14. మనం అలసి సొలసినపుడు ఎలాంటి ప్రమాదాలను ఎదుర్కొంటాం? (75 పేజి)

15. నీవు ముందుకు సాగలేనంత అలసి సొలసినట్లుగా నీకనిపించినపుడు, నీకు నీవు ఎలాంటి "ప్రసంగం" చేసుకుంటావు? (75పేజి)

16. నీవు భౌతికంగా అలసిపోయినప్పడు, "ఆత్మీయముగా" బలపరచబడటం సాధ్యమని నీవనుకుంటున్నావా? అవి ఒకదానిమీద ఒకటి ఎలా ప్రభావం చూపుతాయని నీవనుకుంటున్నావు? భౌతికంగా అలసిపోవుట, ఆత్మీయంగా అలసిపోవుటకు ఉన్న సంబంధాన్ని చర్చించుము.

## నాలుగవ అధ్యాయం

# ఆత్మను పోషించుట

రెండవ అధ్యాయములోని వ్యూహములను మన జీవితంలో అనుదినము అనుక్షణము విజయవంతముగా అన్వయించుకొనలేకపోతే, మన మీద నిలిచియుండే ప్రభావము కలుగదు. దీనికి మన ఆశానిగ్రహము, క్రమశిక్షణ, సహనము కలిగివుండుట అవసరము. అంతేకాక కొన్ని ప్రాథమికమైన విధానాలు, నైపుణ్యాలలో మనం పట్టుసాధించాల్సి ఉంటుంది. ఈ అధ్యాయంలో అదే మనం చూడబోతున్నాం.

నీవు నీ జీవితంలో ఒక నిర్దిష్టమైన పాపముతో (అది త్రాగుడు, జూదము, డ్రగ్స్, లైంగికపాపము, కోపం, చాడీలు, ఇంకా ఏదైనా ఇలాంటి పాపములు) పోరాడుతున్నావేమో. లేకపోతే నీవు కోపం (ఆగ్రహం, కక్షలకు కొందరు బానిసలుగా మారడానికి కారణం ఇదే), చింత, భయము, కృంగుబాటు వంటి పాపపూరిత ఆలోచనా విధానాలతో పోరాడుతున్నావేమో. ఒంటరితనం, నిరుత్సాహం అనే సమస్యలతో పోరాడుతున్నావేమో. లేక నీ సమస్య ఏదైనా ఒక విషయమై స్వాధీనంలేని కోరిక అయివుండవచ్చు. నీ సమస్య ఏమైనా, లేక ఒకవేళ నీవు దేవునితో ఒక అనుదిన నడకనుగూర్చి, లేక అర్థవంతమైన ధ్యానజీవితాన్ని స్థిరపరచుకోవాలనుకుంటున్నావేమో, అయితే ఈ అధ్యాయంలోని సమాచారం నీకు అత్యద్భుతమైన సహాయకారిగా ఉంటుంది. నీ అనుదిన జీవితంలో దీనిని క్రమంగా, క్రమశిక్షణతో అనుసరిస్తే గొప్ప ఫలితాలు చూడగలవు.

నీవు క్రైస్తవుడవైతే, ఈ నైపుణ్యాలను, విధానాలను పరిశుద్ధాత్మపై సంపూర్ణంగా ఆధారపడి, ఆయనకు లోబడి క్షుణ్ణంగా నేర్చుకుంటే, నీ ఆత్మలో గొప్ప మానసిక, ఆత్మీయ స్థిరత్వాన్ని అనుభవిస్తావు. "సమస్త జ్ఞానమునకు మించిన దేవుని సమాధానమును" (ఫిలిప్పీ 4:7) నీవు వ్యక్తిగతంగా అనుభవించగలవు. నీవు అపవాది దాడులలో హానిపొందకుండా కాచుకోగలుగుతావు (1 పేతురు 5:8), నీ ఆత్మకు విరోధముగా పోరాడు దురాశలను ఎదుర్కోవడానికి సిద్ధపడగలవు (1 పేతురు 2:11).

ఈ అధ్యాయంలో ఉన్న అంశాలు మొదటగా కొన్ని సూచనలు,

విధానాలు, మెళకువలు, అంతేకాక రెండవ అధ్యాయంలో ఇచ్చిన వ్యూహాలను అనుసరించడానికి కావలసిన లేఖన సమాచారము, నీ అనుదిన దేవుని సాంగత్యమును బలపరచడానికి ఉపయోగపడుతుంది. ఈ సమాచారమంతా చదివి జాగ్రత్తగా ధ్యానించి, అధ్యాయం చివరిలో ఉన్న చర్చా సహకారిలోని ప్రశ్నలకు జవాబులు వ్రాయండి. తరవాతి అధ్యాయాలు, రెండవ అధ్యాయంలోని వ్యూహాలను అమలు చేయడానికి కావలసిన మరిన్ని ఆలోచనలు ఇవ్వడంద్వారా సహకరిస్తాయి.

## దేవునితో నీ అనుదిన సాన్నిహిత్యం కొరకు ఒక నిర్ధిష్టమైన సమయాన్ని, స్థలాన్ని నిర్ధారించుకో

"ఆజ్ఞలన్నిటిలో ప్రధానమైనది ఏమిటి?" అని యేసును అడిగినప్పుడు, "నీ పూర్ణహృదయముతోను, నీ పూర్ణాత్మతోను, నీ పూర్ణమనస్సుతోను నీ దేవుడైన ప్రభువున ప్రేమింపవలెననునదియే" అని ఆయన జవాబిచ్చారు (మత్తయి 22:37). దేవునిని మన జీవితంలో కేంద్రస్థానములో ఉంచాలని చెప్పే ఈ సూత్రము లేఖనాలన్నిటిలో తరచూ కనిపిస్తుంది. 2 దినవృత్తాంతములు 16:9లో "తనయెడల యథార్థహృదయముగలవారిని బలపరచుటకై యెహోవా కనుదృష్టి లోకమందంతట సంచారము చేయుచున్నది" అని చూస్తాము. సామెతలు 3:5-6వచనాలు సుపరిచితం: "నీ స్వబుద్ధిని ఆధారము చేసికొనక నీ పూర్ణహృదయముతో యెహోవాయందు నమ్మకముంచుము. నీ ప్రవర్తన అంతటియందు ఆయన అధికారమును ఒప్పుకొనుము, అప్పుడు ఆయన నీత్రోవలను సరాళము చేయును." మత్తయి 6:33 లో ప్రభువైన యేసు చెప్పారు, "దేవుని రాజ్యమును ఆయన నీతిని మొదట వెదకుడి, అప్పుడు మీకవన్నియును అనుగ్రహించబడును."

ప్రశ్న: ప్రతిరోజు ఉదయాన్నే దేవుని ఘనపరచడానికి మనం కనీసం ప్రయత్నించకుండా, గొప్ప ఆజ్ఞను పాటించడానికి మేము ప్రయత్నిస్తున్నామని ఎలా చెప్పగలము? అనేక సమస్యలతో ఉన్న అనేకమందికి అనేక సంవత్సరాలుగా నేను సలహాలిస్తూ వచ్చాను. **సుమారుగా ప్రతిసారి, ప్రతి సమస్య మూలంలో, సలహాకోసం వచ్చిన వ్యక్తి తన అనుదిన జీవితంలో దేవుని సన్నిధిలో ప్రభావవంతముగా సమయం గడపలేకపోతున్నాడనే సత్యాన్ని కనుగొని**

నేను ఆశ్చర్యపోయాను. దాని ఫలితంగా, జీవితంలోని మిగిలిన విషయాలు పతనమవ్వడం ప్రారంభించాయి. కాబట్టి, **దేవునితో వ్యక్తిగత ధ్యానసమయం అనుదినము మొదలుపెట్టడమే సమస్యకు జవాబివ్వడానికి ఆరంభస్థానం!** ఈ విషయాన్ని గూర్చి ఇంతకంటే నొక్కి వక్కాణించడం కష్టం. దేవుడు పది ఆజ్ఞలను ఇచ్చినపుడు, ఆయన అన్నారు, "...నీ దేవుడనైన యెహోవాను నేనే; నేనే దాసుల గృహమైన ఐగుప్తుదేశములోనుండి నిన్ను వెలుపలికి రప్పించితిని," అని చెప్పి "నేను తప్ప వేరొక దేవుడు నీకు ఉండకూడదు.....ఏలయనగా నీ దేవుడనైన యెహోవానగు నేను రోషముగల దేవుడను...." అన్నారు (నిర్గమ 20:1-5).

మన జీవితంలో ఆయనను విడిచిపెట్టి మిగతావాటికన్నిటికీ స్థానం ఇస్తే దేవుడు ఒప్పడు. మన దినచర్యలో, ఆయనతో అనుదినము గడపడానికి సమయాన్ని కేటాయించకపోతే, ఇతర విషయాలు ఆయనకంటే మనకు ముఖ్యమైన విషయాలన్నమాట. అంటే ఈ ముఖ్యమైన విషయాలు దేవునికంటే ముఖ్యమైనవిగా, ఆయన స్థానంలో "విగ్రహాలు"గా మారిపోతున్నాయి. మన దేవుడు మన జీవితాలలో ముఖ్యమైన స్థానాన్ని కోరుకునే "రోషము" గల దేవుడు. కాబట్టి మన జీవితంలో ప్రతి దినము నిర్ధిష్టమైన, శ్రేష్టమైన సమయాన్ని ఆయనకిచ్చుటద్వారా ఆయనను ఘనపరచుట మనం నేర్చుకోవాలి.

నేను ఇక్కడ చెప్పేదేమిటంటే, దేవుడు అనుదినము మన ఆరాధనకు అర్హుడు, అంతేకాదు ఆయన మనం అనుదినము ఆయనను ఆరాధించాలని కోరుకుంటున్నాడు. దావీదు జీవితాన్నిగూర్చి వ్యాఖ్యానము వ్రాసిన యూగిన్ పీటర్సన్ అంటారు : "ఆరాధన మనం దేవునితో ఉద్దేశ్యపూర్వకముగా ఏర్పాటుచేసుకున్న సమయం స్థలం. అంటే ఆయన సమయానికి స్థలానికి పరిమితుడని కాదు, మనకు మనమిచ్చుకునే ప్రాముఖ్యత ఎంత ఎక్కువంటే, మనం దానిని క్రమంగా దేవునికి అలవాటు చేయకపోతే, మిగిలిన సమయాల్లో స్థలాల్లో అసలు దేవుని దగ్గరకే వెళ్లనీయదు.

## "పరలోకపు మన్నా"

దేవుడు ఇశ్రాయేలీయులను అరణ్యములో అద్భుతంగా పరలోకపు మన్నాతో పోషించినప్పుడు, ఈ విషయమై ఒక నిర్ధిష్టమైన సూచన

నిర్గమకాండము16వ అధ్యాయంలో ఇచ్చారు (నిర్గమ. 16 చదవండి.). పాత నిబంధనలోని ఇట్టి సన్నివేశాలు, క్రొత్తనిబంధన కాలంలో నెరవేర్చబడబోయే సాదృష్యాలను, ఛాయలను సూచిస్తున్నాయని క్రొత్త నిబంధన తెలియజేస్తున్నది (1 కొరింథి. 10:6,11; కొలస్సి 2:16-17; హెబ్రీ 10:1 మొదలగునవి). ఈ పరలోకపు మన్నానుగూర్చి కూడా అంతే. నిజానికి క్రొత్త నిబంధనలో "భుజించుటకు పరలోకమునుండి ఆయన ఆహారము వారికి అనుగ్రహించెను అని వ్రాయబడినట్టు, మన పితరులు అరణ్యములో మన్నాను భుజించిరని" జనులు ఆయనతో చెప్పగా, ప్రభువైన యేసు ఇలా చెప్పారు, "జీవాహారము నేనే; నాయొద్దకు వచ్చువాడు ఏమాత్రమును ఆకలిగొనడు..." (యోహాను 6:31,35). 51వ వచనంలో యేసు, పాత నిబంధనలో సాదృశ్యముగా ఇవ్వబడిన పరలోకపు ఆహారముయొక్క నెరవేర్పు తానేనని స్పష్టముగా సూచించారు: "పరలోకమునుండి దిగివచ్చిన జీవాహారము నేనే; ఎవడైనను ఈ ఆహారమును భుజించితే వాడెల్లప్పుడును జీవించును. మరియు నేనిచ్చు ఆహారము లోకమునకు జీవముకొరకైన నా శరీరమే అని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను." మరొకచోట యేసు చెప్పారు, "మనుష్యుడు ఆహారమువలన మాత్రము కాదు గాని దేవుని నోటనుండి వచ్చు ప్రతి మాటవలన జీవించును".

**కాబట్టి, అరణ్యములో ఇశ్రాయేలీయులను పోషించుటకు మన్నాను ఇచ్చుట, క్రొత్త నిబంధనయుగంలో మనము క్రీస్తును ఆయన వాక్యమును (బైబిల్)బట్టి పోషించబడుటకు సాదృశ్యముగా ఉన్నది. ఈ పాత నిబంధన సూచన నుండి ఈ అంశములను గమనించండి :**

**1. మన్నా పరలోకమునుండి వచ్చిన అసాధారణమైన బహుమతి:**

మోషే వెంబడి సీనాయి అరణ్యములో ప్రయాణించిన ప్రజల సంఖ్య 20లక్షలు ఉంటుందని కొందరు లెక్కకట్టారు. సీనాయి అనేది చాలా వేడిగా, శుష్కించిపోయిన ఎడారి ప్రాంతం అత్యధికంగా ఉన్న 23,500చదరపు మైళ్ళ ద్వీపకల్పం. చంద్రునిమీద నడచిన వ్యోమగాములు వ్యాఖ్యానించింది ఏమిటంటే, చంద్రునిఉపరితలం వంటి ప్రదేశం భూమిమీద సీనాయి ద్వీపకల్పం ఒక్కటేనని. కాబట్టి అక్కడ అంతమంది ప్రజలు, అంతకాలంపాటు ప్రయాణం చేయడం ప్రమాదకరం.

అంతమంది ప్రజలకు 40 సంవత్సరాలపాటు ఆహారం, మంచినీరు

అందించడం అద్భుతానికి తక్కువేమీ కాదు. ఈ ప్రజలకు దేవుడు మన్నా ఇచ్చి పోషించడం మొదలు పెట్టినప్పడు, ఆయన ఇశ్రాయేలీయులకు ఆజ్ఞాపించిన దేమిటంటే, వారు ప్రతిరోజు మన్నాను కూర్చుకొనవలెనని. నిర్గమకాండము 16:21లో చూస్తే వాళ్ళు ప్రతి ఉదయము మన్నాను కూర్చుకున్నారని తెలుస్తుంది. 19వ వచనం చెబుతుంది, మరుసటి ఉదయం వరకు దానిలో మిగిలిన దానిని మిగల్చకూడదు. ప్రతిరోజు తాజాగా మన్నాను కూర్చుకోవాలి. నిర్గమకాండమును వ్యాఖ్యానిస్తూ ఎ.డబ్ల్యు పింక్ ఇలా వ్రాసారు:.....

"ఈ ఇరవైలక్షలమందిలో ప్రతి ఒక్కరు ఒక 'ఓమెరు' చొప్పన మన్నాను కూర్చుకోవాలి. ఒక ఓమెరు సుమారు అరలీటరు ఉంటుంది. అంటే సుమారు 10లక్షల లీటర్లు. అంటే 20 లక్షలమందికి 4,500 టన్నులు. అంటే 30 బోగీలు (పెట్టెలు) కలిగిన 10 రైళ్ళు, ఒక్కొక్క బోగీలో 15టన్నులు నింపుకుని వెళ్ళాలి, అదీ ఒక్కరోజు ఆహారం. సంవత్సరానికి 10లక్షల టన్నుల ఆహారం ఇశ్రాయేలీయులు కూర్చుకునేవారు. మర్చిపోకండి, ఇలా 40సంవత్సరాలు జరిగింది!"

మన్నాతో దేవుని వాక్యాన్ని పోల్చుతూ పింక్ అంటారు: "దానితో సమానమైన, దానంత అద్భుతమైన, అంతటి దైవత్వం బైబిల్‌కున్నది."

ఈ విషయాలన్నీ నిర్గమకాండము 16:4లో చదివే మాటలకు మరిగొప్ప అర్థాన్నిస్తాయి, "యెహోవా మోషేను చూచి, - ఇదిగో నేను ఆకాశమునుండి మీకొరకు ఆహారము కురిపించెదను..." అదేవిధముగా, **బైబిల్ దేవుని సజీవమైన మాట; అది పరలోకంనుండి దిగివచ్చి, ప్రతిరోజు క్రైస్తవుని ఆత్మను పోషించే ఆత్మీయ ఆహారం, అది అద్భుతమైన వరము.**

క్రొత్త నిబంధనలోని రెండు వచనాలు ఈ సత్యాన్ని బయల్పరుస్తాయి : 1) 2 తిమోతి 3:16 "దైవావేశమువలన కలిగిన ప్రతి లేఖనము...." (ప్రతి లేఖనము దేవుని ఊపిరినుండి కలిగినది). 2) 2 పేతురు 1:20-21 "ఏలయనగా ప్రవచనము ఎప్పడును మనుష్యుని ఇచ్ఛనుబట్టి కలుగలేదు గాని మనుష్యులు పరిశుద్ధాత్మవలన ప్రేరేపింపబడినవారై దేవుని మూలముగ పలికిరి."

**2. మన్నాను ప్రతిరోజు కూర్చుకునేవారు:**

నిర్గమకాండము 16:4లో "యెహోవా మోషేను చూచి -ఇదిగో నేను ఆకాశమునుండి మీ కొరకు ఆహారము కురిపించెదను. **...ఈ ప్రజలు వెళ్లి ఏనాటి బత్తెము ఆనాడే కూర్చుకొనవలెను...**" కాబట్టి ఇశ్రాయేలీయులు ఈరోజు కూర్చుకున్న మన్నా, రేపటికి సరిపోదు. **ప్రతి రోజు క్రొత్తగా మన్నాను కూర్చుకోవాలి.**

దీని ఆత్మీయ అన్వయింపు చాలా స్పష్టం. శరీరాన్ని ఎలా చూచుకుంటామో ఆత్మను అలానే చూచుకోవాలి, ఇది పట్టించుకోకుండా, మన ఆత్మీయ ఆహారం క్రమంలేకుడా తీసుకుంటే, ఫలితాలు ప్రమాదకరంగా ఉంటాయి. మనం ఆదివారం మాత్రం భోజనం చేసి, వారమంతా ఆ భోజనంతోనే సరిపెట్టుకోవాలంటే శరీరం ఏమైపోతుంది? మన ఆత్మ శరీరముకన్నా తక్కువ ప్రాధాన్యత కలిగిందని ఎలా అనుకుంటాం? అసలు నీ ఆత్మకదా నిత్యము ఉండేది. దేవుడు తన వాక్యంలో అనుగ్రహించిన మన్నాతో మన ఆత్మలను జాగ్రత్తగా ప్రతిరోజు పోషించుకోవాలనుకోవడం మరింత అర్థవంతముగా అనిపించడం లేదా?

కీర్తనాకారుడు అంటున్నాడు, "సదాకాలము యెహోవాయందు నా గురి నిలుపుచున్నాను. ఆయన నా కుడిపార్శ్వమున ఉన్నాడు గనుక నేను కదల్చబడను." (కీర్తన 16:8). అదేవిధముగా మనము ప్రభువుపై "సదాకాలము గురి నిలపాలి." ప్రతిరోజు ఆయన సన్నిధిలో, అర్థవంతమైన రీతిలో సమయం గడపే క్రమశిక్షణ అలవరచుకోవాలి (కీర్తన 16:8; 63:8; యెహోషువ 23:8).

**3. మన్నాను ఉదయమే కూర్చుకోవాలి :**

నిర్గమకాండము 16:8లో "మరియు మోషే - మీరు తినుటకై సాయంకాలమున మాంసమును ఉదయమున చాలినంత ఆహారమును యెహోవా మీకియ్యగాను......", 21వచనం "వారు అనుదినము ఉదయమున ఒక్కొక్కడు తన యింటివారి భోజనమునకు తగినట్టుగా కూర్చుకొనిరి..." అదేవిధముగా, మనం దేవునికి, ఆయన వాక్యమునకు శ్రేష్టమైన గడియను ఇవ్వాలి. అనుదినము ఈ లోకమును, శరీరమును, అపవాదిని ఎదుర్కొనుట అంటే ఏమిటో లేఖనానుసారముగా మనకు తెలిసినట్లయితే, అప్పుడు లోకములోనికి వెళ్ళడానికి ముందు ప్రతి ఉదయమున ప్రభువుతో

సమయంగడిపి మన మనస్సును "రూపాంతరపరచు"కోవడం (రోమా 12:2)యొక్క ప్రాముఖ్యత మనకు అర్థం అవుతుంది. "ఉదయమున నీవు సిద్ధపడి, ఉదయమున సీనాయి కొండయెక్కి, అక్కడ శిఖరముమీద నా సన్నిధిని నిలిచియుండవలెను." (నిర్గమకాండము 34:2). ఈ సత్యముయొక్క ప్రాధాన్యతను గూర్చి ఒకాయన వ్రాసిన అద్భుతమైన కవిత ఇది:

**ఉదయమున...**

వేకువరేఖలు విచ్చుకుంటున్న శ్రేష్టమైన సమయాన,
ఉదయాన్నే కలిసాను నా దేవునితో
ఆయన సన్నిధి సూర్యోదయమై వచ్చి,
నింపింది నాయెదను ఆయన మహిమతో.
రోజంతా ఆయన సన్నిధి నాతోడుగా, ఆయనే నాకు నీడగా,
మా ప్రయాణం సాగింది సాఫీగా, సముద్రమంతా ఉన్నా అల్లకల్లోలంగా.
మిగిలిన ఓడలు చెదరిపోయాయి, పగిలిపోయాయి,
మిగతా ఓడలన్నీ కుమలిపోయాయి కృంగిపోయాయి.
వారిని అతలాకుతలం చేసిన తుఫాను అలలే మాకు శాంతిప్రదాతలయ్యాయి,
వారిని చెదరగొట్టిన పెనుతుఫానులు మాకు సేదదీర్చే చిరుగాలులయ్యాయి.

అప్పుడు గుర్తుకువచ్చాయి, నేను ఆయన సన్నిధిని కోల్పోయిన ఉదయాలు,
దు:ఖముతో గుండె నిండగా, పశ్చాత్తాపంతో నిండి పొర్లాయి నా కన్నులు.

తెలిసింది రహస్యం నాకు, సులువుగా కాదు నేర్చుకున్న సమరంలో,
వెదకితే ప్రభువును వేకువలో, ఉంటావు రోజంతా నీవాయన నీడలో.

4. **మన్నాను తినాలి :**

ఇది చాలా ప్రాముఖ్యమైన విషయం. కేవలం చూచి ఆనందించడానికి మన్నాను ఇవ్వలేదు దేవుడు. ఇశ్రాయేలీయులు దానిని తినాలి. **తినే ప్రక్రియలో మూడు విషయాలు ఇమిడి ఉన్నాయి. అవి ఆత్మీయక్షేత్రంలో కూడా సూచనలుగా ఉన్నాయి అంటారు ఎ.డబ్ల్యు. పింక్.** (గమనిక: ఇందులో ఉన్న అత్యధికభాగం పింక్‌గారి నిర్గమకాండము వ్యాఖ్యానములోనుండి సంగ్రహించబడ్డాయి.)

## వినియోగం

"వినియోగించడం" అంటే మనముందున్న ఆహారంలో కొంత భాగాన్ని మనం తీసుకుని మనదిగా చేసుకోవడం. నేను భోజనం బల్లదగ్గర కూర్చుని ఉండవచ్చు. అన్ని రకాల రుచికరమైన పోషకాహారాలు, నాకు కావలసిన అన్ని రకాల భోజన పదార్థాలు నాముందు ఉన్నాయి. నాముందు ఉంచబడిన ఆహారముల వల్ల నాకు ఏమైనా మేలు/ఉపయోగం కలగాలంటే, **నా కొరకు ఆ ఆహారాన్ని వినియోగించుకునేటట్లు తీసుకోవాలి.**

అన్ని యుగాలలోని పరిశుద్ధులందరికీ కావలసిన బ్రహ్మాండమైన సంపూర్ణ వనరులు దేవుడు తన వాక్యంలో ఏర్పాటుచేసాడు. ఆయన మనముందు "...సమస్త జనముల నిమిత్తము క్రొవ్వినవాటితో...(ఆత్మీయమైన) విందు....." ఏర్పాటుచేసి ఉంచారు (యెషయా 25:6). క్రైస్తవులమైన మనమందరము రక్షకుని ఆయన రక్షణను మన ఆత్మలో స్వీకరించినట్లుగానే, ఆయన వాక్యములోని వాగ్దానాలను, కట్టడలను స్వీకరించి, అనుదినచర్యలలో వాటిచే పోషించబడాలి. ఈ "వినియోగం" అనే ఆలోచన క్రింద నేను రెండు విషయాలను చెబుతాను:

1) **"సేకరించు వాని లక్షణం"ను అనుసరించుట.** పిల్లలు, ఇంకా చాలమంది పెద్దలు అందరూ మెచ్చుకునే ఏదో ఒకటి "సేకరించే" పని చేస్తారు (అంటే స్టాంపులుగాని, నాణేలుగాని, తూనీగలు, మొదలైనవి సేకరించే హాబీ). క్రైస్తవులు ఇదే ప్రక్రియను దేవుని వాక్యము చదవి పఠిస్తున్నపుడు, మనకు ప్రశస్తమైనదిగా అనిపించిన వాక్యభాగాన్ని, లేక మనము కనుగొన్న నిర్దిష్టమైన

వాగ్దానాలను కనుగొన్నపుడు, **గొప్ప ఆవిష్కరణ చేసినవారికి కలిగేటంత ఉత్సాహం కలగాలి.** మనం ఆ వాగ్దానాలను 3x5 సైజు కార్డులపై వ్రాసుకొని, తరచుగా చూడడానికి, ధ్యానించడానికి, కంఠస్థము చేయడానికి, ప్రోత్సాహానికి దాచి ఉంచుకోవాలి. ముఖ్యమైన వాక్యభాగాలను కూడా గుర్తించి, వాటినికూడా అలా వ్రాసి ఉంచుకోవాలి.

మోంటాన అరణ్యంలో సంవత్సరాల తరబడి ప్రతిరోజు బంగారాన్ని వెదకేవాడ్ని ఊహించుకోండి. ఒకరోజు, ఒక మూలన ఉన్న చిన్న సెలయేరులో వెదకుతూ, “యురేకా!!! నాకు దొరికింది!!!” అని అరచాడు. అతని చేతిలో ఒక పెద్ద బంగారపు ముక్క ఉన్నది! అతడు కొంతసేపు దాన్ని చూస్తూ సంతోషించి, దాన్ని మరలా సెలయేటిలోకి విసిరేసి, మరలా బంగారం కోసం వెదకడం కొనసాగించాడు. తరువాత కొన్ని నెలలకు మరలా ఒకరోజు హఠాత్తుగా మళ్ళీ అరుస్తాడు “యురేకా!!” అని. మరలా అతని చేతిలో ఇంకొక బంగారపు ముక్క! కాని అతడు కొంతసేపు సంతోషించి, మరలా తన విచిత్రమైన అలవాటు ప్రకారం దాన్ని నీటిలోకి విసిరేసి, ఇంకా బంగారం కోసం వెదకడం కొనసాగిస్తాడు. ప్రశ్న : ఇందులో ఉన్న పొరపాటు ఏమిటి?

మనం ప్రతిసారి ప్రసంగం విన్నపుడు, లేక బైబిల్ చదివినపుడు, లేక ఏదో క్రైస్తవ సాహిత్యం చదివినపుడు అందులోనుండి ఒక అద్భుతమైన వాగ్దానం లేక సత్యం మనముందు బయల్పరచబడుతుంది. మీరో, లేక మీకు ప్రియమైనవారో అనుభవిస్తున్న శ్రమలో ఆదరణ ఇచ్చే మాటగా అది ఉంటుంది. దానిని మనం ‘‘సేకరించి’’ భవిష్యత్తులో ఉపయోగించుకునేటట్లు భద్రపరచలేదనుకోండి, మనం ఆ బంగారం వెదకేవాడిలాగానే, కాదు అంతకంటే దారుణం, ఎందుకంటే అతడు వెదకేది అశాశ్వతమైన, భూసంబంధమైన నిధి, కాని మనకు దొరికిన వాగ్దానం శాశ్వతమైనది, పరలోకపు నిధి! సామెతలు 2:1-6లో దేవుడు విశ్వాసులకు చెబుతున్నాడు, జ్ఞానమంటే “ఆజ్ఞలను దాచుకొనుట” అని. దేవుని వాగ్దానములలో ఉన్న జ్ఞానము, తెలివి, వివేచనలను మనము “వెండిని వెదకినట్లు.....దాచబడిన ధనమును వెదకినట్లు....” వెదకాలని దేవుడు చెబుతున్నాడు.

**2) దేవుని వాక్య సత్యములను వ్యక్తిగతంగా స్వంతం చేసుకోవడం. (వ్యక్తిగతీకరించుకోవడం).** గలతి 2:20లో అపోస్తలుడైన పౌలు దీనిని ఎలా

చేస్తున్నాడో చూడండి. దేవుని కుమారుని గూర్చి, "లోకమునకు రక్షకుడు" అని నైరూప్యరీతిలో కాక **"...నన్ను ప్రేమించి, నా కొరకు తన్నుతాను** అర్పించుకున్న..." అంటున్నాడు. ఉదాహరణకు యోహాను 3:16తోను, రోమా 8:38-39 వచనాలతోను ఇంకా మిగిలిన దేవుని వాక్య వాగ్దానాలతోను ఇలా చేయడానికి ప్రయత్నించండి. 'ప్రతివాడును', 'మేము' అనే మాటలకు బదులు మీ పేరు పెట్టుకొని చూడండి. దేవుని వాగ్దానాలను "వినియోగ"పరచుకోవడం అంటే ఆ వాగ్దానాలు వ్యక్తిగతంగా నీకు అన్వయిస్తాయని విశ్వసించడం!

## "నమలడం"

నా ముందు ఉన్న రకరకాల భోజనపదార్థాలు నా ప్లేటులో పెట్టుకొని, నావిగా చేసుకున్న తరువాత, ఆహారం నా నోటిలో ఉంచుకుని దానిని నమలాలి. **నేను దానిని మ్రింగడానికి ముందు, ఆ ఆహారాన్ని నెమ్మదిగా, పూర్తిగా నమలాలి.** అలా చేయకపోతే (కంగారుగా తింటే), కడుపు తన పని తాను చేయడానికి అనుకూలంగా ఆహారాన్ని సిద్ధపరచనట్టే. ఫలితం కడుపు పాడైపోయి, ఆ ఆహారంలోని పోషకాలు పూర్తిస్థాయిలో మన శరీరానికి ఉపయోగపడకుండా అయిపోతాయి.

ఆత్మీయ విషయాలలో కూడా అంతే. **మన ఆత్మలు వాక్యములోని పూర్తి ఆత్మీయ పోషకాలను పొందుకోవాలంటే జీవాహారము (దేవుని వాక్యము) పూర్తిగా నమిలి తినాలి. "నమలడం" అంటే దేవుని వాక్యాన్ని ధ్యానించడం!** పరుగులు తీస్తున్న మన ప్రపంచంలో, ధ్యానించడం అనేది పూర్తిగా అంతరించిపోయిన కళలా అయిపోయింది. అందుకే చాలామంది విశ్వాసులు లేఖనాల్లోని వచనాలు ఏవి ఎక్కడున్నాయో గుర్తుండటంలేదని ఫిర్యాదు చేస్తున్నారు. ఇలా ఎందుకు జరుగుతుందంటే, ఈ వాక్యభాగాలు చదివినపుడు, త్వరత్వరగా చదివేసి వాటిని ప్రక్కన పెట్టేసినందువల్ల. రహస్యం ఏమిటంటే, **వాటిని మనసులో మరలా గుర్తుతెచ్చుకుంటూండాలి! మనం వాటిని "మననం" చేయాల్సివుంది.** అలా చేయడం వల్ల ఆ వాక్యభాగాలు ఎక్కడున్నాయో మనకు మనసులో గుర్తుండిపోతాయి, మరీ ముఖ్యంగా వాటిలో ఉన్న లోతైన సత్యము, మన జీవితాలకు అది ఎలా అన్వయించబడుతుంది అనేది గుర్తుండిపోతుంది.

దేవుని వాక్యం ధ్యానం చేయడానికి మీకు ఉపయోగపడే మూడు విధానాలు (టెక్నిక్స్) క్రింద ఇస్తున్నాం.

### 1) విశ్లేషణాత్మక విధానం

కీర్తన 1లోని వ్యక్తి ధన్యుడు కావడానికి కారణం, అతడు "దేవుని ధర్మశాస్త్రమందు ఆనందించుచు, దివారాత్రులు దానిని ధ్యానించు"ట. కాబట్టి మనం కూడా ధ్యానించుట నేర్చుకోవాలి! దేవుని వాక్యమును ధ్యానించుటనుగూర్చి ఎ.డబ్ల్యు.పింక్ ఒక శ్రేష్ఠమైన విధానాన్ని వివరిస్తాడు. దీనిని మనం **"విశ్లేషణాత్మక విధానం"** అని పిలుచుకోవచ్చు. పింక్ ఈ విధంగా దానిని వివరిస్తారు:

> "దేవుని వాక్యమును భుజించడానికి ఇది ఒక ఉదాహరణ. దిన ప్రారంభంలో ఒక వచనాన్ని తీసుకోండి; ఒక కాగితం మీద దానిని వ్రాసుకుని, జేబులో పెట్టుకోండి. మీకు అవకాశం దొరకినప్పడల్లా దాన్ని తీసి చదువుకోండి. ఆ వచనంనుండి ఒక దీవెనను ఇవ్వమని ప్రభువును అడగండి. ఆ వాక్యంలోని అందాన్ని, ప్రాశస్త్యాన్ని బయలుపరచమని అడగండి. తరువాత ఆ వాక్యంలోని ప్రతి పదాన్నిగూర్చి ఆలోచించండి. ఆ వచనాన్ని ప్రశ్నించండి, ఇంకా లోతైన భావాన్ని కనుగొనుటకు వెదకండి."

ఒక వాగ్దానాన్ని లేక వాక్యభాగాన్ని తీసుకుని, అందులోని ఒక్కొక్క మాట లేక భావాన్ని తీసుకుని వాటిని ప్రశ్నించడన్ని గూర్చి పింక్ ఇచ్చిన ఉదాహరణ సారాంశం ఇది!

**పింక్ సుపరిచితమైన కీర్తన 23:4ను ఉదాహరణగా ఉపయోగిస్తాడు:**

"మరణచ్ఛాయ గల లోయలో నేను సంచరించినను......"

గమనిక: రచయిత ఎందుకని అస్పష్టంగా మాట్లాడుతున్నాడు?

"నేను మరణచ్ఛాయగల లోయలో సంచరించినపుడు" అని అనవచ్చు కదా! ఏదో ఒకరోజు నేను ఈ లోయలో నడవడానికి పిలవబడడం నిశ్చయమే కదా? కాని, దానిని ధ్యానించిన కొద్దిసేపటి తరువాత, నాకు 1 కొరింథి 15:51 గుర్తువచ్చింది. అక్కడ "మనమందరము నిద్రించము

కాని... మనమందరము మార్పు పొందుదుము." అని వ్రాయబడింది. అప్పడు నేను భూమి మీద భౌతిక మరణము చూడని తరములో నేను జీవిస్తున్నానేమో అనే ఆలోచన నన్ను గట్టిగా పట్టుకుంది. నా జీవితకాలంలోనే ప్రభువు తిరిగి వస్తాడేమో! అది సాధ్యమే! మనం దీనినిగూర్చి ధ్యానించాలి!

- తరువాత, ఈ వచనంలోని ముఖ్యాంశాన్నిగూర్చి ఆలోచించు, "మరణచ్ఛాయగల లోయ".

గమనిక: మరణించడం ఒక లోయలోబడి వెళ్ళడానికి ఎందుకు పోల్చారు? ఈ పోలికకు సంబంధించిన ఆలోచనలు ఏమిటి?

నీవు ఆగి దీనినిగూర్చి ధ్యానించడం మొదలుపెడితే, సాధారణంగా లోయ అనేది ప్రతికూలమైన ఆలోచన కాదు అనిపిస్తుంది. "లోయ" సమాధానమునకు, ఫలభరితమైన, సుందరమైన, ప్రయాణానికి సులువైనది అని సూచిస్తుంది. "లోయ" అనేది "పర్వతానికి" భిన్నమైనది. పర్వతాలు ఎక్కడానికి కష్టమైనవి, ప్రమాదకరమైనవి. దానికి భిన్నంగా ఇది ఆహ్లాదకరమైన, క్షేమకరమైన మార్గాన్ని సూచిస్తుంది.

- తరువాత, కీర్తనాకారుడు చెబుతున్న సత్యాన్ని గమనించండి...... "మరణచ్ఛాయగల లోయలో నేను సంచరించినను..". గమనించండి అతడు "సంచరిస్తున్నాడు", భయముతో పరుగెత్తడం లేదు. ఇది సమాధానముగా ఉన్న ప్రయాణం, భయాకనమైనది కాదు. అంతేకాదు గమనించండి, అతడు ఈ మరణపు లోయలో ఉండడం లేదు, కేవలం దాన్ని దాటి మరొక స్థాయి మహిమకు వెళుతున్నాడు అంతే!

- తరువాత, దాని పేరు గమనించండి -మరణచ్ఛాయగల లోయ. ఇదేమిటి? "ఛాయ" అంటే ఏమిటి? నిజమే కొన్నిసార్లు నీడలు మనుష్యులను భయపెడతాయి, ముఖ్యంగా పిల్లలను బాగా భయపెడతాయి. అయితే నిజానికి ఛాయలు/నీడలకు మనలను గాయపరచే శక్తి లేదు. నీడ అనేది అసలు కీడే చేయలేని వాటిలో ఒకటి!

- చివరిగా ఈ మాటలను గమనించండి: "ఏ అపాయమునకు నేను భయపడను. నీవు నాకు తోడైయుందువు". రచయిత నేర్చుకున్న

విషయం ఏమిటంటే, మరణం- ఎక్కడానికి ప్రమాదకరమైన, కష్టమైన పర్వతం కాదు, కాని సమాధానకరమైన, దాటడానికి సులువైన లోయ అని. అక్కడ నీడకు తప్ప దేనికీ భయపడనవసరం లేదని తెలిసి, "ఏ అపాయమునకు నేను భయపడను!" అని ప్రకటిస్తున్నాడు.

- ఇంకా ముందుకువెళ్తే (నీవు నాకు తోడైయుందువు అనే మాటల దగ్గరకు వెళ్తే) ఆ అనుభవాన్ని భరించగలిగే అనుభవంగా చేసినవాడు అతనికి తెలుసు. నిజానికి ఈ లోయగుండా అతడు నడుస్తున్నపుడు ఆయన తనతోపాటు ఉంటాడు!

**అన్వయింపు:** దేవుని వాక్యాన్ని ధానించడానికైన ఈ (విశ్లేషణాత్మక) విధానం వెంటనే మొదలుపెట్టకపోతే ఏ ప్రయోజనం ఉండదు! దేవుడు నీవు ఏ వచనాన్ని, ఏ వాగ్దానాన్ని ధ్యానించాలని కోరుతున్నాడో చూపించమని ప్రార్థించు. తరువాత ఒక 3x5 కార్డు తీసుకొని ఆ వాక్యమును దానిమీద వ్రాసి, రోజంతా నీతోపాటు ఉంచుకొని, పింక్ సూచించిన పద్ధతిలో ధ్యానించండి. నీవు రాత్రి ఇంటికి వచ్చిన తరువాత, ఈ వచనంలోని సత్యంపై స్పష్టత కలిగించే వచనాలు తెలుసుకోవడానికి నీ బైబిల్‌నందు ఈ వచనానికి ఉన్న అనుబంధవాక్యాలను చూడు, లేక ఏదైనా వేరే పుస్తకాల సహాయం తీసుకో.

## 2) మంచుబంతి చుట్టడం

ఈ విదానంతోపాటు ధ్యానించడానికి ఉపయోగపడే మరొక విధానం "**మంచుబంతి చుట్టడం**". మీరు మంచుతో, మంచులో ఒక బంతిని చుట్టడం మొదలుపెడితే అది పెరిగిపోయినట్లుగా, మీరు ధ్యానం చేస్తున్న వచనానికి దగ్గర సంబంధం కలిగివున్న లేఖనాల్లోని ఇతర వచనాలు, ఇంకా వాగ్దానాలు "సేకరించ"వచ్చు. యౌవనస్థులు కొన్నిసార్లు వారికి ఇష్టమైనవి బేస్‌బాల్ కార్డులు, నాణేలు, సీతాకోకచిలుకలు సేకరిస్తూ ఉంటారు. ఇది సేకరించువాడి ఇష్టం. మనం ఇటువంటి చిన్నచిన్న వాటిని సేకరించే సమయం తీసుకునేటట్లు అయితే, నిత్యత్వపు ఫలితాలు ఇచ్చే దేవుని వాక్యంలోని వాగ్దానాలను సేకరించడానికి మన శక్తిని ఎందుకు వాడకూడదు? ఈ విధానానికి కొన్ని అంశాలు ఏమిటంటే- దేవుని సన్నిధి మనతో ఎల్లప్పడూ ఉన్నది, మనమీద దేవుని కాపుదల, మనకొరకైన దేవుని ప్రేమ. ఇటువంటి సత్యాలనుగూర్చి ధ్యానించడం నీ ఆత్మకు పోషణగాను, బలపరచేవిగాను ఉంటాయి!

**3) సహసంబంధ విధానం**

ధ్యానించడానికి మరొక విధానం **సహసంబంధ విధానం.** ఇక్కడ దేవుని వాక్యంలో మీరు జీవితంలో ఎదుర్కొంటున్న శ్రమలు ఇబ్బందులు, సమస్యలకు సంబంధించిన వాగ్దానాలను, వాక్యభాగాలను కనుగొంటారు. ప్రతి ఉదయం, దేవుని వాక్యంలో మీరు కనుగొన్న వాగ్దానాల వెలుగులో మీ సమస్యలనుగూర్చి ఆలోచించండి, ప్రార్థించండి.

## సారూప్యము

ఇది వినియోగించడం, నమలడం ద్వారా వచ్చే **ఫలితం.** (గమనిక: ఇది మనం చేసేది కాదు, మనం పైన చేసిన విధానాల ద్వారా వచ్చే ఫలం, ఫలితం!) నేను వినియోగించుకున్న (నమిలి, మ్రింగిన) భౌతిక ఆహారం, శరీరంలోనికి వెళ్లి రక్తముగాను, శరీరకణాలుగాను రూపాంతరం చెందింది. ఫలితం నూతన జీవం, శక్తి, బలం, మరింత ఆరోగ్యకరమైన రూపం నాకు వస్తుంది. అంతేకాదు, వేర్వేరు వ్యాధికారక క్రిములతో పోరాడటానికి నా శరీరం సమాయత్తమవుతుంది.

నేను ఆత్మీయ ఆహారం తీసుకున్నప్పుడు కూడ జరిగేది అదే. నేను ఆత్మలోనికి తీసుకున్న ఆత్మీయ ఆహారం, సరిగా జీర్ణం అయితే, నాలో బలాన్ని నూతన స్వభావాన్ని పెంపొందిస్తుంది. ఈ పాపలోకంలో నా విశ్వాసాన్ని, దేవునితో నా అనుదిన నడకను, సేవను బలపరుస్తుంది. అది ఆత్మీయ "వ్యాధికారక క్రిములైన" శోధన మరియు పాపేచ్ఛలనుండి నన్ను కాపాడుతుంది.

ఈ "సారూప్యత"లోనికి మార్చబడటం జరుగుతున్నదా లేదా అని మనం ఎలా తెలుసుకుంటామో చూద్దాం. **పరలోకమునుండి వచ్చిన మన ఆత్మీయ మన్నా అయిన దేవుని వాక్యం నా అనుదినచర్యలలో, దేవునికోసం నేను చేసే పరిచర్యలో నన్ను నియంత్రించేదిగా లేకపోతే అది నన్ను సారూప్యతలోనికి మార్చడం లేదన్నమాట.**

**సారాంశము అన్వయము :** కాబట్టి ప్రభువుతో నీవు ప్రతిరోజు గడుపుటకు నిర్ధిష్టమైన సమయాన్ని, స్థలాన్ని కేటాయించడం విషయంలో నీవు గంభీరంగా వ్యవహరించాలి.

**అలారం పెట్టుకో :** రోజూ లేచే సమయంకన్నా ముందు లేచేటట్లుగా నీవు అలారం పెట్టుకోవడానికి నిర్ణయించుకోవాలి. తెల్లవారుఝామున లేవడానికి అనుకూలంగా రాత్రి పడకకు వెళ్లే సమయాన్ని కూడా క్రమపరచుకోవల్సి రావచ్చును.

**మంచిస్థలాన్ని నిర్ణయించుకో :** నీ దృష్టి మళ్లకుండా ఉండే ప్రదేశాన్ని ఎంచుకో. ఫోన్, రేడియో, టి.వి. కట్టేయి. మీ ఇంట్లో చిన్నపిల్లలు ఉన్నట్లయితే, తదనుగుణంగా నీ ప్రణాళిక ఉండాలి. నీవు ఒంటరిగా ఉండగలవని అనుకోవద్దు,ఒంటరిగా ఉండేటట్లుగా ఏర్పాటు చేసుకోండి! నీకు అవసరమైనవన్నీ దగ్గరగా ఉండేటట్లు చూచుకో, తగినంత వెలుతురు ఉండేటట్లు చూచుకోండి.

**అవసరమైనవన్నీ నీతో ఉండేటట్లుగా ముందుగానే చూచుకోండి :** నీ బైబిల్, అనుదిన ధ్యాన సహకారి, ప్రార్థనా పట్టిక, పెన్ను, కాగితం, పుస్తకం వీటన్నిటినీ నీకు సులువుగా కనబడే చోట, నీకు అవసరమయ్యేంత వరకు వాటిని జాగ్రత్తగా ఉండేటట్లు ఏర్పాటు చేసుకోండి. వాటిని ఎవరూ కదపకుండా ఉండే ప్రదేశంలో ఉంచుకోండి.

**40రోజుల చార్టు ఉపయోగించండి :** ఉదయకాలంలో దేవునితో నీ ధ్యానసమయాన్ని విజయవంతముగా ముగించిన తరువాత టిక్ పెట్టుకోవాలి. కనీసం ఇలా 40రోజులు చేయాలి. ఒక్కరోజు తప్పిపోయినా మరలా అప్పటినుండి నలభైరోజులు వరసగా చేయాలి. అనుభవజ్ఞులు చెప్పేదేమిటంటే, ఏ పనైనా నలభైరోజులు క్రమం తప్పకుండా చేస్తే, అది జీవితంలో భాగంగా మారిపోయి, అలవాటుగా స్థిరపడిపోతుంది. అయితే ఒక్కరోజు అది క్రమం తప్పినా అలవాటుగా మారదు!

**కంఠస్థవాక్య కార్డు విధానం :** ఇంతకుముందు చర్చించిన విధానాలను అనుసరించి, 3x5 కార్డులు వాక్యాన్ని కంఠస్థ పెట్టడానికి, ధ్యానానికి ఉ పయోగించండి. రెండు కట్టలుగా కంఠస్థ వాక్యాలను రబ్బరు బ్యాండ్‌తో కట్టి ఉంచండి :1) మీరు ప్రార్థించి, వాక్యాన్ని పఠించినపుడు దేవుడు నడిపించిన బంగారు వాక్యములు మొదటి గుంపుగా ఉంచుకోండి; ఈ వచనాలు మీ ఆత్మీయ అవసరాలకు, మీ శోధనలలో మీకు ఆదరణ, శక్తిని ఇచ్చే వచనాలు

అని మీకు తెలిసినవి ఈ గుంపులోనికి వస్తాయి; 2) ఇవి మీరు ఇప్పటికే వీటిని పూర్తిగా ధ్యానించి స్వంతం చేసుకున్న వచనాల గుంపు. అయినా ఇవి క్రమంగా మరలా చదువుతూ ఉండాలి!

**వ్యక్తిగత ప్రార్థనా సహకార పట్టికను వాడి (అపెండిక్స్ లో చూడండి)** మీ అనుదిన వ్యక్తిగత ప్రార్థనా పట్టికను తయారుచేసుకోండి. ఈ ప్రార్థనా పట్టిక సమయం గడిచేకొద్దీ, మారుతూ ఉంటుంది. ఇది మీ అనుదిన జీవన పోరాటానికి తగినట్టుగా ఎప్పటికప్పడు మార్పులు చేసుకుంటూ ప్రస్తుత పరిస్థితికి అనుగుణంగా ఉండాలి.

**బైబిల్ పఠన చరిత్రను వాడండి (అపెండిక్స్‌లో చూడండి)** మీరు బైబిల్ చదివే వేగంకొద్దీ, దేవుని వాక్యాన్ని పూర్తిగా చదివేటట్లుగా, అనుదినం చదవడానికి అనుకూలంగా గుర్తుంచుకోవడానికి ఈ పట్టికను వాడండి.

**బాధ్యతా భాగస్వామితో కలసి పనిచేయండి:** మీతోపాటు క్రమంగా (వారానికి ఒకసారిగాని, లేక రెండువారాలకు ఒకసారి గాని) కలసి, మీ కొరకు బాధ్యత వహించేలా ఉండే ఒక బలమైన క్రైస్తవుని కనుగొనండి. సాధారణంగా ముఖాముఖిగా కలుసుకోవడం చాలా మంచిది. అయితే ఈ రోజుల్లో టెలిఫోన్ ద్వారా కలుసుకున్నా ముఖాముఖి కలుసుకున్నట్లే. రెండు వారాలకు ఒక్కసారన్నా కలుసుకోకపోతే, అంత మంచి ప్రభావం ఉండదు.

నీ బాధ్యతా భాగస్వామి ప్రభువుతో నీ నడక విషయమైన క్రమశిక్షణనుగూర్చి నిన్ను "లెక్క అడిగేవాడుగా" ఉండాలి. అతడు నిన్ను ప్రోత్సహించేవాడుగాను, నీవు చేసుకున్న సమర్పణ విషయంలో నీవు క్రమంగా ఉన్నావో లేదో అని- నీవు చదువుతున్న లేఖనభాగం ఏమిటని; నీవు కంఠస్థం చేస్తున్న, ధ్యానిస్తున్న వచనాలు ఏమిటని; నీవు కంఠస్థం చేసిన వాక్యాల పట్టిక పెరుగుతుందో లేదోనని; నీ 40రోజుల పట్టిక ప్రకారం ఉంటున్నావో లేదోనని; మొదలైన అన్ని విషయాలు నిన్ను ప్రశ్నించేవాడుగా ఉండాలి.

**ముగింపు :** యేసు ప్రభువును అనుసరించువారిని **"శిష్యులు"** అని పిలిచారు. స్వాభావికంగానే అందులో **"క్రమ శిక్షణ"** అనే ఆలోచన కనిపిస్తుంది. 1 తిమోతి 4:7లో అపొస్తలుడైన పౌలు తిమోతితో :"...దేవభక్తి విషయములో నీకు నీవే సాధకము చేసికొనుము" అంటాడు. మనము ఈ అధ్యాయములో చర్చించిన

విషయాలు, క్రైస్తవ జీవితంలోని కొన్ని "క్రమశిక్షణలు". క్రైస్తవులముగా, దేవుణ్ణి ప్రక్కనపెట్టి లేక ఆయనకు చాలా తక్కువ సమయమిచ్చి లేక ఆయనను పట్టించుకోకుండా, మనకిష్టము వచ్చినట్లు జీవించడానికి మనం పిలువబడలేదు. క్రీస్తు మరణములో ఆయన ప్రాయశ్చిత్తార్థ కార్యముయొక్క ఉద్దేశం మనకు తెలియపరచబడింది.... "....జీవించువారికమీదట తమ కొరకు కాక, తమ నిమిత్తము మృతిపొంది తిరిగి లేచినవానికొరకే జీవించుటకు ఆయన అందరికొరకు మృతిపొందెననియు నిశ్చయించుకొనుచున్నాము..." (2 కొరింథి. 5:15). కాబట్టి, మనము ఈ క్రమశిక్షణలు రోజువారిగా క్రమంగా పాటిస్తూ, ఆయన వాక్యంతోను, ఆయన సన్నిధిలోను గడపాలి (1 తిమోతి 4:7). ఈ క్రమము మన ఆత్మీయ స్థితిని బలపరచి, మన అనుదిన జీవితంలోని అనివార్యమైన ఆత్మీయ పోరాటంకొరకు మనలను సిద్ధపరుస్తుంది. తత్ఫలితంగా మనం విజయవంతమైన యోధులుగా ఉంటాము.

**ఒక హెచ్చరిక మాట** ఇక్కడ చెప్పడంద్వారా సమతుల్యం కాపాడాలి. మనం అన్ని రకాల ఆచారసంబంధమైన పద్ధతులు విధానాలు మన జీవితంలో అనుసరించినా దేవునితో నిజమైన సన్నిహిత సహవాసాన్ని అనుసరించలేక పోవచ్చు. ప్రభువైన యేసు "వ్యర్థముగా" మరలా మరలా చేయడాన్నిగూర్చి హెచ్చరించారు (మత్తయి 6:7- వ్యర్థముగా వచించుట మరొక తర్జుమాలో ఏ అర్థం లేకుండా మరలా మరలా చేయడం అని అనువదించారు). పైకి మతాచారాలను అనుసరిస్తూ, అంతరంగంలో నిజమైన భక్తిలేని మతనాయకులకు యేసు గద్దిస్తూ కొన్ని కఠినమైన మాటలు మాట్లాడారు. ఆయన వారిని, "చచ్చినవారి ఎముకలతోను సమస్త కల్మషముతోను నిండియున్న...సున్నము కొట్టిన సమాధులు" అని సంబోధించారు (మత్తయి 23:27). **బైబిల్ ప్రకారమైన క్రైస్తవ్యం హృదయానికి సంబంధించిన మతం అని ఎల్లప్పుడూ గుర్తుపెట్టుకోండి!** ఆత్మీయ క్రమశిక్షణలు ఉన్న జీవితం మనకు అవసరం కాని కేవలం ఆ క్రమశిక్షణలు పాటించడమే దేవునితో మన సహవాసానికి యధార్థమైన నిశ్చయత అని ఆలోచించకుండా చూచుకోండి.

ఆత్మీయ క్రమశిక్షణలు పాటించడం మాత్రమే గురిగా ఉండకూడదు! 19వ శతాబ్దపు గొప్ప బ్రిటిష్ రిఫార్మ్డ్ బాప్టిస్టు ప్రసంగీకుడు, ఛార్లెస్ స్పర్జన్ ఇలా అన్నారు : ''అన్నిటికంటె మిన్నగా నేను క్రీస్తుతో సహవాసాన్ని

పెంపొందించుకోవాలి... (ఇక్కడ స్పర్జన్‌గారు ఆత్మీయ క్రమశిక్షణలనుగూర్చి మాట్లాడుతున్నారు)...అయితే అది నా సమాధానమునకు కారణం కాదు గాని- గమనించండి- అది కేవలం ఒక మార్గంగా మాత్రమే పనికొస్తుంది." దేవుడు ఆత్మయైయున్నాడు, ఆయనను ఆరాధించువారు ఆత్మతోను సత్యముతోను ఆరాధించవలెను.

## నాలుగవ అధ్యాయం కొరకు చర్చించుటకు ప్రశ్నలు

# “ఆత్మను పోషించుట”

1. అనుదినము మనము ఎదుర్కొంటున్న ఆత్మీయ యుద్ధం, మన ఆత్మలో మనం చేసే పోరాటాలను గూర్చి వ్యవహరించడంలో “ఆరంభ స్థానం” ఏది? (83 పేజి)

2. నిర్గమకాండము 16 లో ఇశ్రాయేలీయులు పరలోకమునుండి మన్నాతో పోషింపబడుటలోని ఆత్మీయ ప్రత్యేకత ఏమిటి? (84-85 పేజిలు)

3. లక్షలాది హెబ్రీ ప్రజలను పోషించుటకు ఆకాశమునుండి మన్నా మంచులా కురవడం, స్పష్టంగా ఒక అసాధారణమైన సంఘటన. బైబిల్ ఏవిధంగా అసాధారణమైనది? (85 పేజి)

4. దేవుని వాక్యమును ప్రతి రోజు చదివి, ధ్యానించి, ప్రార్థించుట క్రైస్తవులకు ఎందుకు ప్రాముఖ్యమైనది? (86 పేజి)

5. ఉదయకాలపు ధ్యానసమయం మూలంగా కలిగే లాభం ఏమిటి? (87 పేజి)

6. దేవుని వాక్యమును మనం భుజించాలి అనే విషయాన్ని గూర్చి చెబుతూ, ఎ.డబ్ల్యు. పింక్ ఉదహరించిన తినుట అను ప్రక్రియలోని మూడు సంగతులు ఏమిటి? ("నమలడం" అనే మాట నా ఎంపిక కాదు, పింక్‌గారి మాటలని గమనించండి). (88-89 పేజీలు)

7. క్రైస్తవుడు దేవుని వాక్యమును ఆరగించుటను గూర్చి "వినియోగం" అనేమాట ఎలా చెప్పబడింది? (87-88 పేజీలు)

8. వినియోగం లో రెండు సంగతులు ఉన్నాయి. వాటిని వ్రాసి, ఒక్కొక్కదానిని క్లుప్తముగా వివరించండి. (90-91 పేజీలు)

9. క్రైస్తవుడు దేవుని వాక్యంతో పోషించబడడంలో "నమలడం" దేనిని వివరిస్తుంది? (88-89 పేజీలు)

10. దేవుని వాక్యములోని వాగ్దానాలను ధ్యానించడాన్ని గూర్చిన మూడు విధానాలను వ్రాసి, వాటిని నీ స్వంతమాటలలో క్లుప్తీకరించుము. (90-93పేజీలు)

11. దేవుని వాక్యంతో పోషించబడడంలో క్రైస్తవునికి “సారూప్యత” భావం ఏమిటి? (93 పేజి)

12. దేవుని వాక్యము తన ఆత్మలో ‘సారూప్యత’ కలిగించిందని క్రైస్తవునికి ఎలా తెలుస్తుంది? (93 పేజి)

13. “40 రోజుల చార్టు” ఏమిటి? అది ఎలా పనిచేస్తుంది, దాని ఉద్దేశం ఏమిటో వివరించండి. (94 పేజి)

14. “వ్యక్తిగత ప్రార్థనా జాబితాకు సహకారి” అనగా ఏమిటి? దానిని ఎలా వాడాలి? (94-95 పేజిలు)

15. కంఠత వాక్య కార్డును ఎలా వాడాలో వివరించండి. (94పేజి)

16. “బైబిల్ పఠన చరిత్ర” అంటే ఏమిటి? దానిని ఎలా ఉపయోగించాలో వివరించండి. (95 పేజి)

17. "బాధ్యతా భాగస్వామి" అంటే ఏమిటి? బాధ్యతా భాగస్వామి చేసే పనులు ఏమిటి? (95-96 పేజిలు)

18. దీనంతటిలో "క్రమశిక్షణ" పాత్ర ఏమిటి?. క్రైస్తవ జీవితంలోని కొన్ని క్రమశిక్షణలు ఏమిటి? ఈ క్రమశిక్షణలను నీవు క్రమముగా, ప్రభావవంతముగా పాటిస్తున్నావా? వాటిని నీ జీవితంలో అమలు పరచడానికి నీవేమి చేస్తావు? (నిర్ధిష్టమైన ప్రణాళికలు, సోపానాలు వ్రాసి వాటిని అనుసరించడం ఆరంభించండి). (96 పేజి)

19. ఆత్మీయ క్రమశిక్షణ అమలుచేయడం చాలా ప్రాముఖ్యమైనప్పటికీ, మన జీవితంలోనికి ఈ క్రమమును, క్రమశిక్షణను స్థిరపరచుకోవడంలో ఎలాంటి ప్రమాదాలను తప్పించుకోవాలి? (96 పేజి)

## ఐదవ అధ్యాయం

# శత్రువుకు పనిచెప్పడం

## (ఆత్మీయపోరాట స్వభావాన్ని అర్థం చేసుకోవడం, సంక్షోభ సమయాలలో
## ప్రభువు మీద ఆధారపడుటను గూర్చిన ప్రాముఖ్యత)

## ఆత్మీయ పోరాట స్వభావము

(ముందుగా కావలసిన ఒక ముఖ్యమైన విషయం)

ఎలాంటి యుద్ధమైనా తెలివిగా చేయాలంటే, **మనం ఎదుర్కొనే శత్రువు బలగాలనుగూర్చిన ఖచ్చితమైన అంచనా ఉండాలి.** ప్రభువైన యేసు తానే స్వయంగా అన్నారు, "...ఏ రాజైనను మరియొక రాజుతో యుద్ధము చేయబోవునప్పుడు తనమీదికి ఇరువదివేలమందితో వచ్చువానిని పదివేలమందితో ఎదిరింప శక్తి తనకు కలదో లేదో అని కూర్చుండి మొదట ఆలోచింపడా?" (లూకా 14:31).

క్రైస్తవులుగా మనమంతా, మన జీవితాలలో శత్రువును ప్రతిరోజు ఎదుర్కుంటాం. తప్పనిసరిగా కొన్ని రోజులలో మిగతా రోజులకన్నా కఠినమైన పరిస్థితులు ఉంటాయి (ఎఫెసి. 6:13); **అయినప్పటికీ, మనం ప్రతిరోజు మన శత్రువును గూర్చిన అవగాహనతో- వాడు మార్చే వేషాలు, వాడే తంత్రాలు, మనలను వాడు ఎదిరించే శక్తిని గూర్చి ఎరిగి యుద్ధంలో ప్రవేశించాలి.**

## లోకము, శరీరము, సాతాను

క్రైస్తవుని శత్రువులు : లోకము, శరీరము, సాతాను అని బైబిల్ స్పష్టంగా బోధిస్తున్నది. నిజానికి సాతానే లోకమును శరీరమును మనకు విరోధముగా రేపేవాడు కాబట్టి వాడే ప్రధాన శత్రువు.

## లోకము

స్వార్థం, లోభిత్వం, అత్యాశ, సుఖము అనే తన సూత్రాలమీద సాతాను అవిశ్వాసులైన మానవాళిని తన స్వాధీనంలో ఉండునట్లు కట్టిన క్రమమే

"లోకము". ఈ లోక పద్ధతి పైకి మతభక్తితో కూడినదిగా, శాస్త్రీయంగా, నాగరికత ఉన్నట్టుగా, శృంగారమైనదిగా కనిపిస్తుంది గాని అంతర్లీనంగా స్వార్థపోరాటాల తోను, అత్యాశతోను నిండిపోయి ఉన్నది. అపవాది ఈ లోకపు విషయాలను (సుఖము, ధనము, పేరు ప్రఖ్యాతులు, అధికారం మొ॥నవి) తీసుకుని రక్షణ పొందని ప్రజలకు దేవుని సత్యము కనపించనీయకుండా వారిని గ్రుడ్డివారుగా చేసేస్తున్నాడు (2 కొరింథి. 4:4). తత్ఫలితంగా లోకంలోని ప్రజలు ఆత్మీయ గ్రుడ్డితనమును ఎరుగక, సాతాను చేతిలో పావులుగా మారిపోయారని తెలియకుండా ఉన్నారు. (ఈ క్రింది వచనాలు లోకము క్రైస్తవునికి శత్రువు అనే విషయాన్నిగూర్చిన బైబిల్ బోధను తెలియజేస్తున్నాయి: మత్తయి 4:8-9; యోహాను 12:31; 14:30; 18:36; 2 కొరింథి. 4:4; ఎఫెసి. 2:2; 6:12; 1యోహాను 2:15-17).

## శరీరము

బైబిల్‌లో "శరీరము" అంటే మనందరిలో ఉన్న **"పాప నియమము"**నకు లోనైన భౌతిక దేహము. రోమా 7లో మనలో నివసిస్తున్న పాప నియమమునుగూర్చి పౌలు వివరించాడు.... "...మేలైనది చేయవలెనను కోరిక నాకు కలుగుచున్నది గాని, దానిని చేయుట నాకు కలుగుట లేదు. నేను చేయగోరు మేలు చేయక చేయగోరని కీడు చేయుచున్నాను. నేను కోరనిదానిని చేసినయెడల, దానిని చేయునది నాయందు నివసించు పాపమేగాని యికను నేను కాదు. కాబట్టి మేలు చేయగోరు నాకు కీడు చేయుట కలుగుచున్నదను ఒక నియమము కనబడుచున్నది. అంతరంగ పురుషునిబట్టి దేవుని ధర్మశాస్త్రమునందు నేను ఆనందించుచున్నాను గాని వేరొక నియమము నా అవయవములలో ఉన్నట్టు నాకు కనబడుచున్నది. అది నా మనస్సునందున్న ధర్మశాస్త్రముతో పోరాడుచు నా అవయవములలోనున్న పాపనియమమునకు నన్ను చెరపట్టి లోబరచుకొనుచున్నది." (18-23 వచనాలు). మనం ఆదాము సంతానము కనుక, ఈ పాపనియమము అనేది మనం జన్మించిన సమయంలోనే మనకు సంక్రమించినది. పాపము ఆదాము మూలముగా ఈ లోకములోనికి ప్రవేశించింది, కాని అది మనందరి ద్వారా వ్యాపించింది (రోమా 5:12).

కాబట్టి ప్రతి క్రైస్తవుడు తనలో ఈ **"పాపనియమము"** ఉన్నదనే సత్యం

తెలుసుకోవాలి, అది తనను స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తుంటుందని ఎరగాలి. మన జీవితాలలో ప్రతిరోజు మనం అదుపుచేయాల్సిన బలమైన ప్రభావం ఇది. క్రైస్తవుడు ఈ పాపనియమమును తనమీద పరిపాలన చేయనివ్వకుండా చూసుకోవాలని రోమా 6:11-14లో అపొస్తలుడైన పౌలు స్పష్టంగా చెబుతున్నాడు.

"...ఆత్మకు విరోధముగా పోరాడు శరీరాశలు.." అని 1 పేతురు 2:11 చెబుతుంది. లోకమును, శరీరమును వాడుకుని, ఈ పాపేచ్ఛలు లేక శరీరాశలు మనలో పుట్టించేవాడు సాతానే. **ఈ బలమైన కోరికల ప్రభావమునకు లోనవ్వకుండా ఉండడానికి మొదటి అడుగు ఏమిటంటే అవి ఎక్కడనుండి వస్తున్నాయో అర్థం చేసుకోవడం. అంటే ఈ ఆత్మలో పాపనియమము మనలోనే ఉన్నదని మనం అర్థం చేసుకోవాలి.** అది అదృశ్యంగా ఉంటుంది, (దీనిని ఎక్స్‌రే ద్వారా గాని, ఆపరేషన్ ద్వారాగాని కనుగొనలేము), కాని నిజం! "శరీరానుసారముగా నడుచుకొనుట" అని బైబిల్ చెప్పిందంటే దాని అర్థం, ఈ పాపనియమమును మన మర్త్య శరీముపై పెత్తనం చేయనిస్తున్నామన్నమాట. అదే **"శరీరము"**, అదే మన **గొప్ప శత్రువు!**

ప్యూరిటన్ రచయిత రిచర్డ్ బాక్స్‌టర్, "మన రక్షణకు సేనాధిపతియైన క్రీస్తును అనుసరించుటకు నిబంధన చేసుకున్న వారివలె, నీ జీవితకాలమంతా శరీరముతో, లోకముతో సాతానుతో - నైపుణ్యముతో, మెలకువతో, కృతనిశ్చయంతో, ధైర్యముగా యుద్ధం చేయి." అని అంటూ, "శరీరము ... అదే మన గొప్ప శత్రువు!" అని ముగిస్తాడు.

## అపవాది

ఈ లోకములో క్రైస్తవుని దృక్పథంలో ఉండాల్సినది- దేవునికి క్రైస్తవునికి అపవాది అనే శత్రువు ఉన్నాడు అనే సత్యం (1 పేతురు 5:8). చాలామంది బైబిల్ పండితుల విశ్వాసం ప్రకారం అపవాది ఒక పతనమైన దేవదూత (యెషయా 14:12-17? యెహెజ్కేలు 28:12-19 వాక్యభాగాలలోని గూఢార్థాన్ని సంభావ్యతగా తీసుకుంటే). లేఖనం బోధించేది వాడు 'దయ్యములకు అధిపతి' అని (మత్తయి 12:24); 'వాయుమండల సంబంధమైన అధిపతి' (ఎఫెసి. 2:2); 'లోకాధికారి' (యోహాను 14:30). వాడు సువార్త

సత్యము లోకములోని ప్రజలకు కనబడనీయకుండా, వారిని గ్రుడ్డివారిని చేసే ఈ 'యుగసంబంధమైన దేవత' కూడా (2 కొరింథి 4:4).

మానవుడ్ని (ఏదేను వనములో) శోధించడం ద్వారా తాను పొందిన అధికారాన్ని ఉపయోగించి, పాపమును తిరుగుబాటును ఈ లోకములోనికి తెచ్చి, ప్రస్తుత ప్రపంచ వ్యవస్థపై ప్రత్యేక అధికారము కలిగినవాడుగా, అపవాదిని గూర్చి లేఖనం బోధిస్తుంది (ఆదికాండము 3:4; యోహాను 8:44; 2 కొరింథి 11:14).

రిచర్డ్ బాక్స్టర్ అపవాదిని గూర్చి ఇలా అన్నాడు:

"...పాపియైన మనుష్యుడు తనకు తానుగా ఎదుర్కొనలేని బలమైన శత్రువు వీడు. పాపరహిత యుగంలోనే మనలను వాడు జయించాడంటే, ఇప్పుడు ఇంకా ఏమి చేయగలడో కదా! వాడు ప్రమాదకరమైనవాడు.....................కాబట్టి యేసు తానే మన పక్షముగా దిగివచ్చాడు "మన రక్షణకు సైన్యాధిపతిగా", (హెబ్రీ. 2:10). లోకము రెండు సైన్యాలుగా మారిపోయింది: క్రీస్తు రాజుగా, సైన్యాధికారిగా, ఆయన దూతలు, (హెబ్రీ. 2:14) పరిశుద్ధులు ఆయన సైన్యంగా కలిగింది ఒక ప్రక్క, సాతాను, వాడితోపతనమైన దూతలు, క్రీస్తును తృణీకరించిన ప్రజలు మరోప్రక్క. ఈ రెండు సైన్యాల మధ్య జరిగేదే లోకంలో గొప్ప యుద్ధం."

## సంక్షోభ సమయంలో ప్రభువుపై ఆనుకొనుటయొక్క ప్రాధాన్యత

అపొస్తలుడైన పౌలు ఎఫెసీ సంఘానికి వ్రాసిన పత్రికలోని ఆరవ అధ్యాయంలో ఆత్మీయ యుద్ధాన్నిగూర్చి ఒక అద్భుతమైన వాక్యభాగం ఉన్నది. పన్నెండవ వచనంలో ఆయన సూచిస్తాడు, **ఈ లోకంలో మనం ఎదుర్కొనే పోరాటాలు, శోధనలు కేవలం ప్రజలు, అధికారులు లేక మనం చూసే చుట్టూ ఉన్న పరిస్థితులను బట్టి కలిగినవని మనం అనుకోకూడదు. క్రైస్తవులముగా, మన జీవితాలలో జరిగే సంఘటనలు, పరిస్థితులనుగూర్చి దీనికంటే లోతైన దృక్కోణం మనకుండాలి- "ఏలయనగా మనము పోరాడునది శరీరులతో**

**కాదు, గాని ప్రధానులతోను, అధికారులతోను, ప్రస్తుత అంధకార సంబంధులగు లోకనాధులతోను, ఆకాశమండలమందున్న దురాత్మల సమూహములతోను పోరాడుచున్నాము."**

ఈ లోకము (కొన్నిసార్లు మంచిదిగాను, కీడు చేయనిదిగాను కనిపించినప్పటికీ) ఈ ఆత్మీయమైన అంధకార శక్తులచేత ముట్టడించబడి ఉన్నది. ఈ ప్రత్యేక అంధకార దళాలు ప్రతిరోజు క్రైస్తవులపై గురిపెడుతూ దాడిచేస్తున్నాయనే సంగతి క్రైస్తవులు గుర్తించాలి. ఆత్మీయ యుద్ధాన్నిగూర్చిన వాక్యభాగంలోని పరిచయ వాక్కులలో అపొస్తలుడైన పౌలు **"...ప్రభువుయొక్క మహా శక్తినిబట్టి ఆయనయందు బలవంతులై యుండుడి...."** అంటూ ఆరంభించాడు. క్రీస్తును, ఆయన వాక్యబోధను అనుసరించుటకు చేసే ప్రతి ప్రయత్నానికి ఆత్మీయ ఆటంకాలు కలుగుట అనివార్యమని క్రైస్తవులముగా మనం గుర్తించాలి.

ఇది మన అనుదిన జీవితంలో ఎంతోకొంత ఎల్లప్పడూ నిజమౌతుంది. ఏమైనప్పటికీ, ఎఫెసి. 6:13 ప్రకారం కొన్నిరోజులు, సాతాను వాడి సైన్యము మనమీద వ్యక్తిగతముగా దాడికి దృష్టి కేంద్రీకరిస్తారని మనకు తెలుస్తున్నది. అందువల్లే పౌలు చెబుతున్నాడు, "...మీరు ఆపద్దినమందు......నిలువబడుటకును శక్తిమంతులగునట్లు దేవుని సర్వాంగ కవచమును ధరించుకొనుడి."

ఇక్కడ ఉన్న ఉపదేశము ఏమిటంటే క్రైస్తవులముగా మనము ప్రతి రోజు సిద్ధపడి వుంటే, ఇలాంటి బలమైన సాతాను దాడులను ఎదుర్కోవడానికి ఆయత్తమవుతాం. ఇక్కడ మనం చెప్పే ముఖ్యమైన విషయం ఏమిటంటే (అలాంటి సమయాలు వచ్చినవుడు) **మొదట ఇలాంటి ఆత్మీయమైన విషయాలను గుర్తించడానికి మనలను మనం సిద్ధపరచుకుని, వెంటనే ప్రభువువైపుకు తిరగడం అలవాటు చేసుకోవాలి.** మన సాధారణ బుద్ధి సణగడం, ఫిర్యాదు చేయడం, మన స్వంత మార్గమేదైనా చూచుకొని అందులోనుండి బయటపడడం. మనం విషయాలను మన చేతుల్లోకి తీసుకొని, 'ఎలా ఐతే ఏముంది, చివరికి బయటపడ్డామా లేదా' అనే ముగింపుకు వచ్చేస్తాం, మన విధానం పూర్తిగా లేఖనానుసారమైనది కాకపోయినా పర్వాలేదనుకుంటాం.

మన లోపం ఏమిటంటే మనము కనీసం ప్రభువునుగూర్చి ఆలోచించనైనా లేదు; మనం మనమీద ఆధారపడి మన స్వంత తంత్రాలు, నిష్కాపట్యమును గూర్చియే ఆలోచిస్తాం (యిర్మియా 17:5-8). ఫలితం ఏమిటంటే మనం పాపపు శక్తులచేతిలో ఓడిపోయాం. దీన్ని మార్చడానికి, **జీవితంలోని పైపైన ఉండే చిరాకులు, శోధనలను దాటి, వాటి వెనుక ఉన్న అంధకారశక్తుల ప్రభావాన్ని చూడగలగాలి, వెంటనే ప్రభువు నామమునుబట్టి ప్రార్థనచేసి ఆయన బలాన్ని, అధికారయుతమైన స్థానాన్ని తీసుకోవడం అలవాటు చేసుకొనే క్రమశిక్షణగా తర్ఫీదు పొందాలి!**

## “రెఫీదీము జ్ఞాపకం చేసుకోండి!”

ఇలాంటి ఆత్మీయ పోరాటాలలో ప్రభువుమీద ఆధారపడే అవసరతను కళ్లకుకట్టినట్లు వివరించే ఒక అద్భుతమైన లేఖనభాగం పాతనిబంధన గ్రంథంలో ఉన్నది. ఈ వాక్యభాగము నిర్గమకాండము 17:8-16 వచనాలలో కనబడుతుంది. దేవుడు ఇశ్రాయేలీయులను అద్భుతమైన రీతిలో ఐగుప్తులోని దాస్యత్వములోనుండి విడిపించిన కొద్ది వారముల తరువాత అరణ్యములో **“రెఫీదీము”** అనేచోటికి వచ్చినపుడు, అమాలేకీయులతో జరిగిన యుద్ధానికి సంబంధించిన సంఘటన మనం ఇక్కడ చూస్తాం. అమాలేకీయుల సేన ఇశ్రయేలీయుల సేనకు ఎదురుగా వస్తుందని మనం చదువుతాం. మోషే యెహోషువను పిలచి, కొందరు యోధులను తీసుకుని, అమాలేకీయులతో యుద్ధం చేయమని చెబుతాడు. మోషే, అహరోను హూరులను తీసుకుని కొండమీదికి వెళ్తాడు. 11వచనం, “మోషే తన చెయ్యి పైకెత్తినపుడు ఇశ్రాయేలీయులు గెలిచిరి; మోషే తన చెయ్యి దింపినప్పుడు అమాలేకీయులు గెలిచిరి.” కాబట్టి తరువాతి వచనంలో చూస్తే, “మోషే చేతులు బరువెక్కగా, వారు ఒక రాయి తీసికొనివచ్చి అతడు దానిమీద కూర్చుండుటకై దాని వేసిరి. అహరోను హూరులు ఒకడు ఈప్రక్కను, ఒకడు ఆప్రక్కను అతని చేతులను ఆదుకొనగా అతని చేతులు సూర్యాస్తమయమువరకు నిలుకడగా ఉండెను. ఈ విధముగా ఇశ్రాయేలీయులు అమాలేకీయులను ఓడించారు. క్రొత్తనిబంధనలో, పాతనిబంధనలోని అలాంటి సంఘటనలనుగూర్చి మాట్లాడుతూ, “ఈ సంగతులు దృష్టాంతములుగా వారికి సంభవించి, యుగాంతమందున్న మనకు బుద్ధికలుగుటకై వ్రాయబడెను.” అంటాడు అపొస్తలుడైన పౌలు (1 కొరింథి.10:11). మరో మాటలో చెప్పాలంటే, **పాతనిబంధనలో ఇశ్రాయేలీయుల అనుభవాలు** (ఇప్పుడే మనం వివరించుకున్న నిర్గమకాండము 17లోని సంఘటనలాంటివి), **క్రైస్తవ జీవితవిధానములో మనలను నడిపించుటకు, ఉపదేశము ఇచ్చుటకు నేటి క్రైస్తవులకొరకు ముఖ్యమైన ఆత్మీయ పాఠాలుగా దేవుడు ఇచ్చాడు.**

## అమాలేకీయులు ఎవరు?
## వారు దేనికి సాదృశ్యంగా ఉన్నారు?

పౌలు చెప్పినదాన్నిబట్టి, ఇశ్రాయేలీయులకు అమాలేకీయులకు జరిగిన

యుద్ధాన్ని చూస్తే, మన స్వంత ఆత్మీయ యుద్ధంలో సహాయపడే కొన్ని ఆత్మీయసత్యాలు గోచరిస్తాయి. ఉదాహరణకు, అమాలేకీయులు ఎవరు, వారు దేనిని సూచిస్తున్నారు? కొందరు వ్యాఖ్యాతలు చెప్పిన తలంపు ఏమిటంటే, **అమాలేకీయులు ఏశావు మనుమడైన అమాలేకు సంతానము.** ఏశావు, యాకోబుకు కవల సోదరుడు, మీకు జ్ఞాపకం ఉన్నట్లయితే, ఏశావు ప్రభువునుగూర్చిన విషయాలను పెద్దగా పట్టించుకునేవాడు కాదు (అంటే తన తాతయైన అబ్రహాముకు దేవుడు ఎలా ప్రత్యక్షమయ్యాడో, అతనితో ఎలా నిబంధన చేసాడో, అలాగే అతనికి చేసిన అద్భుతమైన వాగ్దానాలు అతని సంతానమైనందున తనకు కూడా వర్తిస్తాయి అనే విషయాలకు విలువనివ్వలేదు).

ఏశావు వేటగాడు, క్రీడాకారుడు. అతడు ఆత్మీయ విషయాలకంటే వేటకు క్రీడకే ఎక్కువ ప్రాధాన్యత నిచ్చాడు. దేవుడు తనకొరకు రచించిన ప్రణాళికలు, ఉద్దేశములకంటే తన శరీరసంబంధమైన తృష్ణను తీర్చుకోవడానికే ఎక్కువ ఆసక్తి చూపినవాడు. నిజానికి, ఏశావు జీవితంలో జరిగిన ఒక నిర్దిష్టమైన సంఘటనగూర్చి బైబిల్‌నందు ఇవ్వబడింది. అదేమిటంటే, ఒకరోజు అతడు వేటాడి వచ్చేసరికి ఆకలివేసింది. తన సోదరుడైన యాకోబు తయారుచేసిన చిక్కుడుకాయ వంటకానికి బదులుగా తన జ్యేష్ఠత్వాన్ని ఇచ్చేసాడు ఏశావు (ఆదికాండము 25:29-34).

అమాలేకీయులు ఇశ్రయేలుకు బద్ధశత్రువులుగా మారిపోయారు, శరీరములో ముల్లులా, వారి ఆత్మీయ, జాతీయ జీవితానికి కీడుగా నిలిచారు. నిర్గమకాండము 17:16లోని ఈ కథ ముగింపులో, "దేవుడైన యెహోవాకు అమాలేకీయులతో తరతరములకు యుద్ధమని" మనకు తెలియపరచబడింది. ఈ సత్యాలనుబట్టి, కొందరు వ్యాఖ్యాతలు **అమాలేకీయులు దేవునికిని, ఆయన ప్రజలకును (క్రైస్తవులకు) విరోధముగా పోరాడే ఈ లోకపు దుష్టశక్తులు (ముఖ్యముగా "శరీరము")** అని వ్యాఖ్యానించారు.

ఉదాహరణకు, అమాలేకీయులు అంటే కొంతమందిలో అక్రమ లైంగిక సంబంధం కావచ్చు, మరికొంతమందిలో విపరీతంగా త్రాగడం కావచ్చు. మరికొందరికి దేవుని సేవించుటకు, తమ జీవితాలలో ఆయనకు ఇవ్వాల్సిన

ప్రాధాన్యతను ఇవ్వకుండా భౌతిక వస్తువులకు (కార్లు, ఇళ్ళు మొ॥), వ్యక్తిగత సమాధానము లేక సౌఖ్యము వంటి వాటితో పాపపూరిత ప్రేమ అయివుండవచ్చు. ఇంకా కొందరికి అది సుఖము లేక అధికారము లేక పేరు ప్రఖ్యాతులకోసమైన వెంపర్లాట అయి వుండవచ్చు. అందువల్లనే ప్రభువైన యేసు తన శిష్యులతో చెప్పారు, "ఈ లోకములో మీకు శ్రమ కలుగును" అని (యోహాను 16:33).

**సాధారణంగా, వీటివలన వచ్చే ఫలితం ఆత్మలో భయం, చింత, ఆందోళన, తొందర, కృంగుబాటు, నిరుత్సాహం, నిరాశ.** ఇవన్నీ దేవునియందు విశ్వాసము ఉంచనివారికి, దేవుని చుట్టూ కాక తమచుట్టూ స్వార్థ ప్రపంచాన్ని నిర్మించుకునేవారికి కలిగే ఫలితాలు. అపవాదికివ్వబడిన పేర్లలో ఒకటి **"అపొల్యోను"** అంటే "నాశనం చేసేవాడు". వాడు మన ఆత్మను నాశనం చేయడానికి పంతం పట్టాడు (1 పేతురు 2:11). కాబట్టి ఈ విషయాలన్నిటిలో మనం వాడితో యుద్ధం చేయాల్సి వుంది! నిర్గమకాండము 17లో ఉన్న వాక్యభాగం (రెఫీదీములో ఇశ్రాయేలీయుల అనుభవం) ఈ యుధ్ధాలలో మనం విజయం సాధించడానికి కావలసిన రహస్యాన్ని తెలియజేస్తున్నది.

## మోషే చేతులు పైకెత్తుటలో ఉన్న ప్రాధాన్యత ఏమిటి?

పైకెత్తబడిన మోషే చేతులు ప్రార్థనకు, అమాలేకీయులతో యుద్ధంలో ఇశ్రాయేలీయులు విజయం సాధించడానికి కావలసిన శక్తిని దేవునిదగ్గరనుండి వెదకడానికి సూచనగా ఉన్నాయనేది స్పష్టం. కాని అతని చేతిలో ఉన్న "దేవుని కఱ్ఱ" (నిర్గమ. 17:9) కూడా ప్రాముఖ్యం. మోషే కఱ్ఱనుపట్టుకొని చేతులు పైకెత్తినంతసేపు ఇశ్రాయేలీయులు గెలుపొందడం, అతడు చేతులు దించగానే అమాలేకీయులు గెలవడంలో అంతరార్థం ఏమిటి?

ఒక ఆలోచన, ఆ కఱ్ఱ దేవుని సన్నిధికి, ఆయన శక్తికి ప్రతీక అనేది. మోషే చేతిలోని ఈ కఱ్ఱ, నైలునది నీళ్లను రక్తముగా మార్చినది, ఐగుప్తుమీదకు భయంకరమైన తెగుళ్ళు తీసుకువచ్చి అద్భుతాలు చేసినది. ఈ కఱ్ఱనే దేవుడు ఎఱ్ఱ సముద్రము మీదకి చాపమన్నప్పుడు, అది విడిపోగా, ఇశ్రాయేలీయులు ఎఱ్ఱ సముద్రము మధ్యలో ఆరిన నేలను నడచిపోయారు. తరువాత హోరేబువద్ద మోషే ఇదే కఱ్ఱతో బండను కొట్టగా, అందులోనుండి నీళ్ళు ఉబికి వచ్చాయి.

మోషే పర్వతము మీదికి వెళ్ళినపుడు చేతికఱ్ఱను తీసుకువెళ్ళాడని నిర్గమకాండము 17:9 స్పష్టంగా చెబుతుంది. కాబట్టి అతడు తన చేతిని ఎత్తినపుడు, అది ఒక ధ్వజమును ఎత్తినట్లుగా ఉంది. 'దేవుని నామములు' అనే పుస్తకాన్ని వ్రాసిన నాతాన్ స్టోన్, "…. పురాతన కాలంలో ధ్వజము అంటే నేడు మనకున్నట్లుగా జెండా అయి ఉండనక్కరలేదు. ఒక కొయ్యకు చివర సూర్యకాంతిలో మెరిసే ఒక ఆభరణం తగిలించినా చాలు, అది ధ్వజముగా ఉండేది. నిజానికి "మెరుస్తున్న" అనే అర్థం ఉన్న హెబ్రీ భాషాపదం "కొయ్య", "కఱ్ఱ", "స్థాయి" లేక "ధ్వజము"గా అనువదించబడింది. కాబట్టి **పైకెత్తబడిన కఱ్ఱ దేవుని ప్రజలు ఆయనచుట్టూ చేరాలి అనే గుర్తు చూపుతుంది! పైకెత్తబడిన కఱ్ఱ ఇశ్రాయేలు దేవుని సైన్యం అనే సత్యానికి చిహ్నం, దేవుడే యుద్ధాన్ని గెలుస్తాడు అనే భావాన్ని సూచిస్తుంది. ఈ ధ్వజము క్రింద ఇశ్రాయేలు యుద్ధం చేసినపుడు విజయం సాధించింది. తన స్వంత శక్తితో ప్రయత్నించినపుడు ఓడిపోయింది** (సంఖ్యాకాండము 14:41-45).

**సారాంశం, ముగింపు :** కాబట్టి, ప్రతి క్రైస్తవుడు తన స్వంత ఆత్మీయ సరంజామాతో పనిచేయడం తెలుసుకోవలసిన అవసరం ఉంది. మనందరిలో **పాపనియమము** ఉన్నది (రోమా 7:20). మనలో ఉన్న ఈ బలమైన శక్తి మన శరీరాన్ని స్వాధీనపరచుకొని ప్రభావం చూపిస్తుంది, దానినే బైబిల్ **ఁఒఖారీఇఊఊఉ** లేక **"పాపస్వభావం"** అని పిలుస్తుంది. అత్యంత ప్రమాదకరమైన శత్రువు ఇది. అపవాది కూడా మన శత్రువే. వాడు లోకాన్ని, శరీరాన్ని వాడుకొని ప్రజలమీద పెత్తనం చెలాయిస్తున్నాడు.

కొన్ని సమయాల్లో మనమీద జరిగే ఆత్మీయ దాడి బహు భయానకంగా ఉంటుంది అని మనం గుర్తించాలి (ూబ్ఁవిఇఊఉ ఎఫెసి. 6:13). ఆత్మీయంగా **రెఫీదీము అంటే ఇదే. మోషే చేతులు క్రిందికి దించినపుడు అమాలేకీయులు గెలిచినట్లుగానే, మన సంక్షోభ సమయంలో దేవుని వైపు తిరిగి ఆయనమీద ఆధారపడకపోతే లోకము, శరీరము, అపవాది మనమీద విజయం సాధిస్తారు. కాబట్టి మనం క్రమశిక్షణలో (సిద్ధపడి) ఉండాలి.**

## ఆచరణాత్మక అన్వయింపు
## (సత్వర ప్రణాళికలు):

తెలివైన పని ఏమిటంటే, ఇలాంటి భీకరమైన దాడులు జరిగినపుడు అవసరమైనవి ముందుగానే సిద్ధపరచి వుంచుకోవాలి. మనలో ప్రతి ఒక్కరికి ఆకర్షించే పాపములు, తరచుగా మనం లోబడిపోయే బలహీనతలు ఉంటాయి. "...సులువుగా చిక్కులబెట్టు పాపములు..." అంటాడు హెబ్రీ పత్రికాకారుడు (హెబ్రీ.12:1). విశ్వాసులు ఏదో సమస్యతో పోరాడుతుంటేనే సలహాకోసం వస్తారు.

**"సత్వర ప్రణాళిక" అంటే శోధన లేక సంక్షోభం రాకముందే దానిని ఎదుర్కోవడానికి జాగ్రత్తగా, ప్రార్థనాపూర్వకముగా ఒక్కొక్కమెట్టుగా తయారుచేసుకున్న ప్రణాళిక.** ఉదాహరణకు, నిరుత్సాహంతో కృంగుబాటుతో ఉన్నవారికి ఈ సత్వర ప్రణాళిక ఇలా ఉండవచ్చు:

1) ఈ శ్రమలో, ప్రార్థించి, దేవునిపై నీకున్న నమ్మకాన్ని గుర్తించు. జ్ఞానం కొరకు (యాకోబు 1:5), సహాయం కొరకు అడుగు.

2) నీవు తగినంత విశ్రాంతి, ఎక్సర్‌సైజు చేస్తున్నావో లేదో నిన్ను నీవే ప్రశ్నించుకో. ఒకవేళ జవాబు లేదు/కాదు అయితే అది మార్చుకోవడానికి ప్రయత్నించు. ఈ కృంగుబాటుకు ఇంకా ఏవైనా భౌతిక కారణాలున్నాయా?

3) ఇలాంటి కృంగుబాటు ఆలోచనలకు రావడానికి కారణమేమిటి అని నిర్దిష్టంగా తెలుసుకో. అలాంటి ఆలోచనలను విశ్లేషించి, లేఖనాల వెలుగులో సత్యమును కనుగొనుము. భక్తిహీనమైన, అసత్య ఆలోచనలన్నిటినీ "విడిచిపెట్టి", వాటి స్థానంలో దైవిక ఆలోచనలను, సత్యమును స్పష్టంగా ప్రతిబింబించే ఆలోచనలను ఉంచు (అంటే "ధరించు").

4) కీర్తన 42 చదివి, అదే ప్రక్రియను అభ్యసించు (సత్యమును నీకు నీవు ప్రసంగించుకొనుట). సత్యమే నిన్ను స్వతంత్రుని చేస్తుందని గుర్తుంచుకో (యోహాను 8:31).

5) నీవు బాధ్యతగా చేయవలసిన పనులు- నీ అనుదిన చర్యలు, ఇంటిపని, తోటపని వంటివి- చురుకుగా చేయడానికి నిన్ను నీవు బలవంతము చేసుకో. ఉద్దేశ్యపూర్వకముగా, కృంగుబాటు ఆలోచనలనుండి తప్పించుకోవడానికి వేరే పనులలో తీరికలేకుండా ఉండు. కృంగుబాటు ఆలోచనలకు చోటివ్వకు!

6) నీ బాధ్యతా భాగస్వామికి గాని లేక ఒక మంచి భక్తిగల క్రైస్తవునితో నీ పరిస్థితి చెప్పకుని, నీ పోరాటాన్నిగూర్చి అతనితో కలసి ప్రార్థించు.

7) ప్రశాంతంగా కూర్చుని, ఈ పోరాటముగుండా వెళుతుండగా, నీ సమయాన్ని తెలివిగా వాడుకోవడానికి ఒక ప్రణాళిక వ్రాసుకో. ఆ ప్రణాళిక అమలు చేయి! భక్తిహీనమైన, ప్రతికూల ఆలోచనలకు అవకాశం ఇవ్వవద్దు.

8) ఆత్మను ఉల్లాసపరచే సంగీతం విను.

9) నీ పరిస్థితికి సరిపోలే దేవుని వాగ్దానాలను సమీక్షించుకో (యిర్మియా 29:11). వాటిమీద ధ్యానము చేస్తూ, వాటిని దేవునితో చెప్ప.

పాపమునుగూర్చి, నీతినిగూర్చి గంభీరంగా తీసుకోవడం, ముందుగానే సత్వర ప్రణాళిక రచించుకోవడం తెలివిని ప్రతిబింబిస్తుంది, దేవుని ఘనపరుస్తుంది. నీవున్న ఆత్మీయ యుద్ధమునుగూర్చి, దానిలో నీ పాత్రనుగూర్చి నీవు గంభీరంగా ఉన్నావని సూచిస్తుంది. నీవు దేవుని రాజ్యములో ఒక మంచి సైనికుడవని తెలియపరుస్తుంది.

## ఐదవ అధ్యాయాన్ని గూర్చిన చర్చించే ప్రశ్నలు

# "శత్రువుకు పనిచెప్పడం"

### ప్రతి సంక్షోభంలో ప్రభువువైపుకు తిరగడం నేర్చుకొనుట

1) క్రైస్తవుని ఆత్మీయ యుద్ధంలో ప్రభావవంతమైన ఫలితాలు రాబట్టే అత్యంత ప్రాముఖ్యమైన దాన్ని ఈ అధ్యాయంలో వివరించాము. అదేమిటో క్లుప్తముగా వ్రాయండి. (ఉదాహరణకు "ఆత్మీయ పోరాట స్వభావము" చూడండి). (101 పేజి)

2) ప్రతి క్రైస్తవునికి ఉన్న ముగ్గురు శత్రువులనుగూర్చి క్లుప్తముగా మీ సొంత మాటలలో వివరించండి. (101-102 పేజి)

ఎ)

బి)

సి)

3) మనకు అత్యంత ప్రధాన శత్రువు ఎవరు? దానిని జయించడానికి మొదటి మెట్టు ఏమిటి? (103 పేజి)

4) ఈ జీవితంలోని పోరాటాలు శ్రమలను క్రైస్తవుడు ఏవిధంగా దృష్టించాలి? (103-104 పేజి)

5) మన జీవితంలో ఏదైనా సంక్షోభం తలెత్తితే మనం వెంటనే ఎలా స్పందించాలి? (107-108 పేజిలు)

6) నేటి క్రైస్తవులకు నాటి "రెఫీదీము" సంఘటన ఎలాంటి విలువగలది? (109 పేజి)

7) అమాలేకీయులు ఎవరు? వాళ్ళు దేనిని సూచిస్తున్నారు? (106-107 పేజిలు)

8) అపొల్యోను ఎవరు? ఈ పేరుకున్న ప్రత్యేకత ఏమిటి? (108 పేజి)

9) రెఫీదీము వద్ద మోషే చేతులు పైకెత్తుటకున్న ప్రాధాన్యత ఏమిటి? ఇందులో మనకున్న పాఠం ఏమిటి? (108 -109 పేజీలు)

10) మోషే చేతిలోని కఱ్ఱ దేనిని సూచిస్తుంది? ఇక్కడ మనం నేర్చుకునే పాఠం ఏమిటి? (108 -109 పేజీలు)

11) ఎఫెసి. 6:13లో ఉన్న "ఆపద్దినము" ఏమిటి? (105 పేజీ)

12) "సత్వర ప్రణాళిక" అంటే ఏమిటి? అది ఎలా పనిచేస్తుంది? ( 110-111 పేజీలు)

13) మీ జీవితంలో పాపముతో చేస్తున్న పోరాటంలో, దేవుని మీదకు మీ దృష్టిని మరల్చడం ద్వారా సహాయం పొందిన సందర్భాన్ని వివరించండి. నేడు నీ జీవితంలోని ఏ విభాగాలలో దేవుని మీదకు నీ దృష్టిని మళ్ళించాల్సిన అవసరం ఉంది?

### ఆరవ అధ్యాయం

## "హృదయపూర్వకంగా వెంబడించుట"

**"-నేను యెష్షయి కుమారుడైన దావీదును కనుగొంటిని;**
**అతడు నా యిష్టానుసారుడైన మనుష్యుడు..."**
**(అపో.కార్యములు 13:22)**

ప్రతిరోజు దేవునితో నడవాలనే మీ వెదకులాటలో మీరు విజయం సాధించాలనుకుంటే, మీకు అన్నింటికంటే అత్యవసరమైనది దేవుని యెడల హృదయపూర్వకమైన భక్తిని కలిగియుండటమే. దావీదు విషయమైతే అపో.కా. 13:22లో చెప్పినట్లు అతడు "....నా యిష్టానుసారుడైన మనుష్యుడు.." అంటున్నాడు. దేవుడు మన హృదయంలోని యథార్థమైన విశ్వాసమును బట్టి సంతోషిస్తున్నాడు అనడం ఎంత గొప్ప నిశ్చయతను కలిగిస్తుంది! ఇంకా చెప్పాలంటే, ఇది సాధించలేని లక్ష్యం కాదు. దావీదు జీవితాన్ని మనం చదివినప్పుడు, అతడుకూడా మనలాంటి పాపియేనని కనుగొంటాం. అయితే అతని వైఫల్యాలను ప్రక్కన పెట్టి, దేవుడు అతనిని "...నా యిష్టానుసారుడు (హృదయానుసారుడు)" అని పిలుస్తున్నాడు.

దేవుడు మననుండి కోరేది ఆయన యెడల హృదయపూర్వకమైన భక్తి. ఆయన మనలో చూసేది దానికోసమే, ఆయన స్పందించేది దానికే. 2 దినవృత్తాంతములు 16:9 చెబుతుంది, "తనయెడల యథార్థహృదయము గలవారిని బలపరచుటకై యెహోవా కనుదృష్టి లోకమందంతట సంచారము చేయుచున్నది." "మీరు నన్ను వెదకినయెడల, పూర్ణమనస్సుతో నన్ను గూర్చి విచారణ చేయునెడల మీరు నన్ను కనుగొందురు" అంటాడు దేవుడు యిర్మియా 29:13లో.

ప్రాథమికంగా దేవునియెడల హృదయపూర్వకమైన భక్తి కలిగియుండుటలో మూడు విషయాలు ఉన్నాయి: 1) దేవునికి మన జీవితంలో మొదటి ప్రాధాన్యత నివ్వడం, 2) ఆయనయెదుట పారదర్శకంగాను దీనహృదయులగాను ఉండటం, 3) ఆయన చిత్తానుసారంగా మన జీవితాలను మలచుకోవడం.

## దేవునికి మన జీవితంలో ప్రథమ ప్రాధాన్యతనిచ్చుట

దేవుడు పది ఆజ్ఞలను ఇచ్చినపుడు, "నేనుతప్ప వేరొకదేవుడు నీకుండకూడదు", ఇంకా "నీ దేవుడనైన యెహోవానగు నేను రోషముగల దేవుడను", అని తన ప్రజలతో ఆయన అన్నారు (నిర్గమకాండము 20:3,5).

మన జీవితాలలో దేవుని పూర్ణహృదయముతో వెదకుటకు ఈ సత్యాన్ని ఆచరణాత్మకంగా తీసుకుంటే, **ప్రతి విషయమును గూర్చి మొదట ఆయనయొద్దకు వెళ్ళాలి,** మన జీవితంలోని అన్ని విషయాలలో ఆయన చిత్తమును వెదకాలి అనేది ఆయన కోరిక అని స్పష్టం అవుతుంది. తరువాత మన జీవితంలోని అన్ని విషయాలు ఆయన చిత్తప్రకారము మార్పు చేసుకోవాలి.

గుర్తుంచుకోండి, మన పాపపూరితమైన, శారీరక స్వభావము అలాంటి ఆలోచనకే పోరాటం మొదలుపెట్టేస్తుంది. మన స్వార్థపూరితమైన పాప స్వభావాన్నిబట్టి, మన జీవితంలోని మిగిలిన అన్ని విషయాలకు ప్రాధాన్యత నివ్వడానికి ఇష్టపడతాం. కాబట్టి, ఈ ప్రయత్నంలో మనం పోరాటం చేయడానికి సిద్ధపడి ఉండాల్సిన అవసరం ఉంది. మన భవిష్యత్తు ప్రణాళికలు, మన కుటుంబాలు, ఇళ్ళు, కార్లు, సెలవులు మొదలగు వాటి ప్రాముఖ్యతను గూర్చి చింతించే అవకాశం ఉంది. కాని ప్రభువైన యేసు అన్నారు: "దేవుని రాజ్యమును నీతిని మొదట వెదకుడి, అప్పుడవన్నియు మీకనుగ్రహించబడును." (మత్తయి 6:33).

## ఆయన యెదుట పారదర్శకంగా దీనత్వముతో ఉండుట

మరలా దావీదే మనకు ముఖ్యమైన ఉదాహరణ. కీర్తన 139:23-24 వచనాల్లో దావీదు అంటున్నాడు, "దేవా నన్ను పరిశోధించి నా హృదయమును తెలిసికొనుము. నన్ను పరీక్షించి నా ఆలోచనలను తెలిసికొనుము. నీకాయాసకరమైన మార్గము నాయందున్నదేమో చూడుము, నిత్యమార్గమున నన్ను నడిపించుము." ప్రభువు యెదుట దాపరికం లేకుండా (పారదర్శకంగా) ఉండటమంటే ఏమిటో అనేదానికి సరియైన దృష్టంగా కనిపిస్తుంది కదా ఈ ప్రార్థన! దావీదు ఏమీ దాచుకోవడానికిగాని, తనదంటూ ఏదీ పట్టుకోవడానికిగాని లేదన్నట్లు ప్రవర్తిస్తున్నాడు. సర్వజ్ఞానియైన దేవుని, తన

అంతరంగములోని సమస్తమును పరీక్షించడానికి ఆహ్వానిస్తున్నాడు. దేవుడు అతనిని "...నా హృదయానుసారుడు" అని పిలవడానికి ఇది ఒక ముఖ్యమైన కారణం. కాబట్టి, మనం దేవునిని ప్రతిరోజు వెదకుచుండగా, ఇలాంటి వైఖరిని పెంపొందించుకోవలసిన అవసరం ఉంది.

### దృష్టిని మరల్చకుండా ఉండటం

దేవునికి, ఆయనను తమ జీవితాలద్వారా ఘనపరచాలనుకునే ప్రతివారికి విరోధంగా పనిచేసే ఆత్మశక్తులు బహుగా ప్రభావం చూపే ప్రపంచంలో మనం జీవిస్తున్నామని మనసులో గుర్తుంచుకోండి (ఎఫెసి 2:1-3; 6:12). కాబట్టి మన శత్రువైన అపవాది, మనం హృదయపూర్వకంగా దేవునిని వెదకకుండా, ఆయన సేవ చేయకుండా చేయడానికి వాడు చేయగలిగినంతా చేస్తాడు. వాడు లోకాన్ని, మన పాప శరీరాన్ని వాడుకొని మనం ఇరుకైన తిన్నని దేవుని దారిలో నడవకుండా దృష్టి మళ్ళించడానికి, దేవునిని మన జీవితాలలో రెండవ స్థానానికే పరిమితం చేసేటట్లుగా చేయడానికి అన్ని ప్రయత్నాలు చేస్తాడు.

### ఇరుకైన తిన్నని దారి

కాబట్టి, క్రైస్తవులముగా మనము ఈ లోకములో "...పరదేశులమును యాత్రికులమునై యున్నాము..." (1పేతురు 2:11) అని ప్రతిరోజు మనకు మనం జ్ఞాపకం చేసుకోవాలి. దేవుడు మనకొరకు ఒక దారిని సిద్ధపరచి వుంచాడు, నిత్యజీవానికి, ఆశీర్వాదానికి నడిపించే దారి, పాపపు అరణ్యములో ఇరుకైన దారి. బైబిల్ "మనస్సును రూపాంతరపరచు" కోమన్నప్పడు (రోమా 12:2; కొలస్సి 3:10), దాని అర్థం ఆయన మనముందు ఉంచి, మనలను నడువమన్న ఆ మార్గములో నడిచేటట్లు మన మనస్సను ప్రతిరోజు దేవునిపై కేంద్రికరించాలని.

బైబిల్ నేర్పించే క్రైస్తవ్యం ఈ ఇరుకైన, తిన్నని దారిలో ఓపికతో నడుచుటనుగూర్చి ముఖ్యముగా చెబుతుంది. పర్వత ప్రసంగంలో ప్రభువైన యేసు చెప్పారు, "ఇరుకు ద్వారమున ప్రవేశించుడి; నాశనమునకు పోవు ద్వారము వెడల్పును, ఆ దారి విశాలమునై యున్నది, దాని ద్వారా

ప్రవేశించువారు అనేకులు. జీవమునకు పోవు ద్వారము ఇరుకును ఆ దారి సంకుచితమునై యున్నది, దాని కనుగొనువారు కొందరే." (మత్తయి 7:13-14).

ఈ రెండు మార్గముల సిద్ధాంతం బైబిల్లోని పెద్ద అంశాలలో ఒకటి. క్రైస్తవుడు దానిని అర్థంచేసుకుని, దాని వెలుగులో తన క్రైస్తవ జీవితాన్ని పరిశీలించుకోవడం చాలా కీలకం. దేవుడు ఇరుకైన తిన్నని మార్గంలో నడవడానికి క్రైస్తవుణ్ణి పిలిచాడు. ఈ "తిన్నని, ఇరుకైన మార్గము" ఏమిటో ఒక్కసారి ఆలోచించి చూడండి.

## "తిన్నని, ఇరుకైన మార్గం" ఏమిటి? ఈ మార్గంలో నడవడం అంటే అర్థం ఏమిటి?

ఈ తిన్నని ఇరుకైన మార్గమేమిటో అన్న ప్రశ్నకు సరియైన వ్యాఖ్యానం ప్రభువైన యేసు మత్తయి 7:13-14లో చెప్పిన సందర్భంలోనే ఉన్నది. ఆ సందర్భం పర్వత ప్రసంగం. కాబట్టి, మీరు మత్తయి సువార్తలోని ఐదవ అధ్యాయం నుండి ఏడవ అధ్యాయం వరకు ఉన్న పర్వత ప్రసంగాన్ని చదివితే, ఇరుకుమార్గములో నడవడం అంటే ఏమిటో కొన్ని నిర్ధిష్ట విషయాలలో నీకు అర్థం అవుతుంది.

ఉదాహరణకు, ఇరుకైన, తిన్నని మార్గంలో నడవడం అంటే నైతికవిలువలు కలిగిన మంచి వ్యక్తిత్వం (మత్తయి 5:3-12); లోకములో అనుకూల ప్రభావమును చూపించే మాదిరికరమైన జీవితాన్ని జీవించడం (5:13-16); నీతినిగూర్చి జాగ్రత్త వహించడం (5:17-20); వేర్పాటుకు కారణమయ్యే కోపము, కక్షలు లేకుండా ఉండడం (5:21-26); వివాహంలో నమ్మకంగా జీవించడం, వ్యభిచారము, లైంగికపాపములకు దూరంగా ఉండటం, నీ భాగస్వామికి విశ్వాసపాత్రులుగా ఉండడం, వివాహంలో నిలిచివుండటం (5:27-32); యథార్థంగా ఉండటం (5:33-42); నీ శత్రువులను కూడా ప్రేమించుట నేర్చుకోవడం (5:43-48); ఇంకా ఇంకా...! దేవుని రాజ్యమునకు, ఆయన నీతికి అత్యంత గొప్ప స్థానాన్ని ఇచ్చే జీవితాన్ని జీవించడమే ఇరుకైన తిన్నని మార్గములో నడవడం (5:19-33).

కీర్తన 23:3లో చెప్పిన "....నీతిమార్గములో నడవడం" అనే విషయాన్ని గూర్చి సామెతలగ్రంథంలో విస్తృతమైన వివరణ కనిపిస్తుంది. "నీ కన్నులు అటు

ఇటు చూడక సరిగాను, నీ కనురెప్పలు నీ ముందర సూటిగాను చూడవలెను. నీవు నడుచు మార్గమును సరాళము చేయుము, అప్పుడు నీ మార్గములన్నియు స్థిరములగును. నీవు కుడితట్టుకైనను ఎడమతట్టుకైనను తిరుగకుము, నీ పాదమును కీడునకు దూరముగా తొలగించుకొనుము." (సామెతలు 4:25-27). జ్ఞానము "...దుష్టుల మార్గమునుండియు, మూర్ఖముగా మాటలాడువారి చేతిలోనుండియు నిన్ను రక్షించును." దుష్టులు, "....చీకటి త్రోవలలో నడువవలెనని యథార్థమార్గములను విడిచిపెట్టెదరు. కీడు చేయ సంతోషించెదరు, అతి మూర్ఖుల ప్రవర్తనయందు ఉల్లసించుదురు."(2:12-14).

తిన్నని మార్గమునుండి తొలగి, వ్యభిచారిణిని ఎదుర్కొనుటనుగూర్చి సామెతల గ్రంథం హెచ్చరిస్తుంది. వ్యభిచారిణి ఇల్లు "..మృత్యువునొద్దకు దారితీయును, అది నడుచు త్రోవలు ప్రేతలయొద్దకు చేరును" (2:18); "దాని నడతలు మరణమునకు దిగుటకు దారితీయును, దాని అడుగులు పాతాళమునకు చక్కగా చేరును" (5:5). "జార స్త్రీయుండు ఛాయకు పోక నీ మార్గము దానికి దూరముగా చేసికొనుము, దాని యింటి వాకిటి దగ్గరకు వెళ్లకుము" అని హెచ్చరిస్తుంది సామెతలు 5:8. "జారస్త్రీ మార్గముతట్టు నీ మనస్సు తొలగనియ్యకుము, దారితప్పి అది నడుచు త్రోవలలోనికి పోకుము. అది గాయపరచి పడద్రోసినవారు అనేకులు... దాని యిల్లు పాతాళమునకు పోవు మార్గము..." (7:25-27). దాని బదులుగా "...నీ యౌవన కాలపు భార్యయందు సంతోషింపుము...ఆమె రొమ్ములవలన నీవు ఎల్లప్పుడు తృప్తినొందుచుండుము, ఆమె ప్రేమచేత నిత్యము బద్ధుడవై యుండుము" అని చెబుతుంది సామెతలు 5:18-19.

జీవమునకు నడుపు తిన్నని మార్గములో నిలచియుండుటకు, నాశనమునకు నడిపే విశాలమార్గమును తప్పించుకొనుటకు ఇది ఒక మంచి ఉదాహరణ. ఇదే సూత్రం ఇరుకైన తిన్నని మార్గమును తప్పించే మిగతా అన్ని పాపపూరిత ప్రవర్తనలయెడల అన్వయించబడాలి. సోమరివానిగురించి (6:6-11); నాలుకను అజాగ్రత్తగా వాడడం గురించి (12:18; 13:3; 15:4); మోసపూరితంగా సంపాదించిన ధనంగూర్చి (13:11); చెడ్డ స్నేహాలనుగూర్చి (13:20; 23:20; 22:24; 24:21); పేదలను పట్టించుకోనివారిని, వారిని అణగద్రొక్కువారినిగూర్చి (14:31); కౄరులైనవారిని గూర్చి(16:29); గర్విష్టులకు విరోధంగాను (21:24); పిసినారితనానికి విరోధంగా (23:4; 28:20,22); అసూయనుగూర్చి (27:4); మొండివారికి, మూర్ఖులకు విరోధంగా (29:1);

పట్టించుకోని తలిదండ్రులను (29:15) మొదలగు వాటిని గూర్చి సామెతలగ్రంథం హెచ్చరిస్తుంది. విశ్వాసి ఈ మార్గములలో వెళ్ళకుండా జాగ్రత్తపడునట్లుగా, చెడ్డమార్గములనుగూర్చి ఇవ్వబడిన హెచ్చరికలు ఇవి! అవి పర్వత ప్రసంగంలోను ఇంకా లేఖనాలలో వేరే చోట్ల చెప్పబడిన నీతి మార్గములకు విరుద్ధమైనవి.

## ఏకమనస్సు

లేఖనములో వాడిన మరొక పోలిక (పూర్ణహృదయముతో భక్తి, ఇరుకైన తిన్నని మార్గములో నడుచుటతోపాటు) దృష్టి మరల్చకుండా ఉండటంయొక్క ప్రాముఖ్యతను తెలియజేసే ఆలోచన- ఏక మనసుతో ఉండుట. దేవుని హృదయానుసారుడైన దావీదు అంటాడు, ''ద్విమనస్కులను నేను ద్వేషించుచున్నాను'' (కీర్తన 119:113). ద్విమనస్కుడు తన సమస్తమార్గములలో అస్థిరుడు అంటాడు యాకోబు (1:8).

ద్విమనస్కత్వాన్ని పూర్ణహృదయముతో దేవుని వెదకుటకు ఇష్టపడకపోవడం అని మనం నిర్వచించవచ్చు. అంతేకాక, ఇరుకైన తిన్నని దారిలోను, నాశనానికి నడిపించే విశాలమార్గంలోను ఒకేసారి నడవడానికి ప్రయత్నిస్తున్నట్లు అని కూడా దీనిని నిర్వచించవచ్చు.

ఏకమనస్సుతో ఉండటం అంటే ఆత్మీయ వివేచనను జ్ఞానమును సాధనము చేయుట. మన జీవితంలోని అన్ని పరిస్థితులను దేవుని వాక్య వెలుగులో చూసే సామర్థ్యాన్ని పెంపొందించుకొని, తత్ఫలితముగా సరియైన నిర్ణయాలు తీసుకోవడం అని భావం చెప్పవచ్చు.

ప్రభువైన యేసు తానే చెప్పారు, "కన్ను దేహమునకు దీపము" అని. మన శరీరంలో ఉన్న భౌతికనేత్రం గూర్చి ఆయన ఈ మాట చెప్పలేదు, మన ఆత్మీయ దృష్టినిగూర్చి చెప్పారు. "నీ కన్ను మంచిదైతే నీ దేహమంతయు వెలుగుతో నిండి ఉంటుంది. నీ కన్ను చెడినదైతే (అంటే మన ఆత్మీయ వివేచన ఈ లోకపు పాపసంబంధమైన వాటిమీద ఉంటే) నీ దేహమంతయు చీకటితో నిండిపోవును. నీలోనున్న వెలుగు చీకటియై ఉంటే, ఆ చీకటి ఎంత గొప్పది!" మరొకలా చెప్పాలంటే మనం మన పాపపు ఇచ్ఛలను, దేవునిని ఒకేసారి

సేవించాలనుకుంటే (ద్విమనస్కుడు అదే చేస్తాడు), మనం గ్రుడ్డివాని వలె (ఆత్మీయంగా) తొట్రిల్లుతాము. "ద్విమనస్కుడు తన సమస్తమార్గములలో అస్థిరుడు" అని యాకోబు 1:8లో ఈ ఆలోచన మనం ఇంతకుముందే చూశాం.

కాబట్టి ఈ ద్విమనస్కత్వము అనే శాపమును మనం జాగ్రత్తగా తప్పించుకోవాలి. అలా చేయాలంటే మన పూర్ణ హృదయముతో దేవుని వెదకాలి, మనకొరకు ఆయన ఏర్పరచిన ఇరుకైన తిన్నని మార్గముపై మన దృష్టిని కేంద్రీకరించాలి. ఈ సత్యాలతో ఏకీభవిస్తే మాత్రమే సరిపోదు. మీ జీవితంలో ఏకమనస్సు ఏకదృష్టి కలిగిఉండడానికి ప్రయాసపడి ఆచరించాలి.

## పునర్నిర్మాణము

మన జీవితానికి కేంద్రముగా దేవుని ఉంచుకోవడానికి మనం నిర్ణయించుకున్న తరువాత, మనము **పునర్నిర్మించు** కొనే పనిని చేయాలి. పునర్నిర్మించుకోవడం అంటే నా భావం, ప్రతి విషయంలో దేవుడు కేంద్ర బిందువుగా ఉండేటట్లు మన జీవితాన్ని మనం క్రమపరచుకోవాలి. ఈ పుస్తకంలోని రెండవ అధ్యాయంలో ఇచ్చిన ప్రాథమిక క్రమశిక్షణలు ఈ భాగంలో ముఖ్య పాత్ర పోషిస్తాయి (అంటే ప్రార్థన, వాక్యపఠనం, లేఖనాలను కంఠస్థం చేయడం, ధ్యానించడం, క్రమంగా సంఘానికి వెళ్లడం, క్రమంగా సహవాసములో ఉండటం అనే విషయాలలో ఏమాత్రం రాజీలేకుండా స్థిరపరచబడడం).

దేవుని మన దినచర్యలో కేంద్రముగా ఉంచుకోవడాన్ని గూర్చి సామెతలు 3:5-6 వచనాలలో మంచి ఆలోచన ఉన్నది. "నీ స్వబుద్ధిని ఆధారము చేసికొనక, నీ పూర్ణహృదయముతో యెహోవాయందు నమ్మకముంచుము. నీ ప్రవర్తన అంతటియందు ఆయన అధికారమునకు ఒప్పకొనుము, అప్పుడు ఆయన నీ త్రోవలను సరాళము చేయును". **ముఖ్యముగా ఈ ఆదేశాన్ని గమనించండి-** "నీ ప్రవర్తన అంతటియందు ఆయన అధికారమునకు ఒప్పకొనుము" (మరొక తర్జుమాలో నీ మార్గములన్నిటిలో ఆయనను గుర్తుంచుకో). మన స్వభావాన్నిబట్టి మనం ఇలా చేయలేము. మనం పెంచి పోషించుకోవలసిన ఒక క్రమశిక్షణ ఇది!

ఆయనను "గుర్తుంచుకొనుట" లేక "అధికారమునకు ఒప్పకొనుట" అంటే

జ్ఞానముకొరకు, విజయముకొరకు ఆయనమీద ఆధారపడినట్లు ఒప్పుకొనుట. అంటే మన అనుదిన జీవితంలోని ప్రతి వివరంలోనికి ఆయనను రమ్మని ప్రత్యేకంగా ఆహ్వానించుట. అంటే మనం చేసే ప్రతి పనిలో ఆయన జ్ఞానమును, నడిపింపును, కృపను వెదకడం. "నీ పనులభారము యెహోవామీద ఉంచుము(నీవు చేసేప్రణాళికలు ఆయనకు చెప్పి, అప్పగించు), అప్పుడు నీ ఉద్దేశములు సఫలమగును" అని చెప్తుంది సామెతలు 16:3. దీని అర్థం మనం ఒక విషయాన్నిగూర్చి దేవునికి ప్రార్థించినందువల్ల అది సఫలమౌతుందని కాదు. ఎందుకంటే కొన్నిసార్లు మనం ఆయనకు అప్పగించిన ప్రణాళికలో కొన్ని విషయాలను ఆయన కొట్టివేస్తాడు, మరింత మెరుగైన క్రొత్త ఆలోచనలు అక్కడ నింపుతాడు. కాని, దేవునిని మన ప్రణాళికలో ఉంచుకోవడం వల్ల, మనం శ్రేష్ఠమైన విజయాన్ని పొందుతామనేది ఇక్కడ ఉన్న ఆలోచన!!

**(నీ ప్రవర్తన అంతటియందు ఆయన అధికారమునకు ఒప్పుకొనుము..అనే మాటకు)**

## ఆచరణాత్మకమైన సూచనలు

మీ అనుదిన ప్రార్థనా సమయంతోపాటు మీరు చేయగలిగే నిర్దిష్టమైన పనుల జాబితా క్రింద ఇస్తున్నాం. ("నీ ప్రవర్తన అంతటియందు ఆయన అధికారమునకు ఒప్పుకొను"మనే సామెతలు 3:5-6లోని మాట మనస్సులో ఉంచుకోండి.) ఈ విషయాలు వ్యవస్థీకృత స్వభావము కలవి, కాబట్టి మంచివి. "దేవుడు సమాధానమునకే కర్త గాని అల్లరికి కర్త కాడు" అని 1కొరింథి.14:33 చెబుతోంది. అదే అధ్యాయంలో 40వచనం "...సమస్తమును మర్యాదగాను క్రమముగాను జరుగనియ్యుడి" అని చెబుతుంది. మన జీవితాన్ని మన చెప్పుచేతలలోనికి తీసుకొని క్రమంగాను, పద్ధతిగాను, క్రమశిక్షణ (ముఖ్యంగా ఆధ్యాత్మిక విషయాలలో) అలవరచుకోకపోతే, మన శత్రువుకు మన ఇరుకైన తిన్నని మార్గంలో నడవకుండా దారి తప్పించడానికి సులువుగా వాడి చేతికి చిక్కుతాం.

**1) ప్రతిరోజు "చెయ్యాల్సిన పనులు" జాబితా వ్రాసుకోండి.** ఇలా చేయడంవల్ల చాలా లాభాలున్నాయి. మనముందున్న సమయాన్ని సరిగా ఉపయోగించుకోవడానికి సహాయపడుతుంది. "దినములు చెడ్డవి గనుక మీరు

సమయమును పోనియ్యక సద్వినియోగము చేసుకొనుచు అజ్ఞానులవలె కాక జ్ఞానులవలె నడుచుకొనునట్లు జాగ్రత్తగా చూచుకొనుడి. ఇందునిమిత్తము మీరు అవివేకులు కాక ప్రభువుయొక్క చిత్తమేమిటో గ్రహించుకొనుడి." అని చెబుతోంది ఎఫెసి 5:15-17. ఇలా వ్రాసుకుంటే మనం పని పూర్తిచేసాం అనే తృప్తికూడా దొరకుతుంది. సాయంత్రం మనమేమి చేశామో సరిచూసుకుని, మిగిలిన పనులను రేపటికి కొనసాగించవచ్చు.

ఈ జాబితాలో  ఇంటిపనులు, ఎవర్ని కలుసుకోవాలి, తీసుకోవలసిన నిర్ణయాలు, కూటములు, గుర్తుంచుకోవలసినవి (అంటే ఎక్సర్‌సైజ్, పుట్టినరోజు లేక కృతజ్ఞత కార్డులు పంపడం, ఫోన్ చేయాల్సినవారు వంటివి). **ముఖ్యమైన విషయం ఏమిటంటే అవి ఎంత చిన్నవైనా, పట్టించుకోనవసరం లేనట్టుగా అనిపించినా వీటన్నిటిగురించి ప్రార్థన చేయడం.** నీ పనులన్నీ ఇరుకైన తిన్నని మార్గములో నడిచేటట్లుగా ఉన్నాయో లేదో ప్రార్థనాపూర్వకంగా బేరీజువేసుకో!

**2) నీ వ్యక్తిగత "నెలలో కార్యక్రమములు" ప్రతిరోజు చూసుకోవాలి.** ఇదికూడా ఒక సహాయకరమైన క్రమశిక్షణ అనడానికి చాలా కారణాలున్నాయి. "తమ ప్రవర్తనను కనిపెట్టియుడుట వివేకుల జ్ఞానమునకు లక్షణము" అని చెబుతుంది సామెతలు 14:8. సమావేశాలు, కూటములు, పుట్టినరోజులు, ఈరోజులోగా ఈ పనిచేయాలి అని వ్రాసుకున్నపనులు మొ॥ నీ పనిని సులభతరం చేసాయని గ్రహిస్తావు. దీని ఫలితంగా, ఇతరులు నిన్ను ఆలోచనాపరుడు, బాధ్యతగలవాడు, నమ్మదగిన వ్యక్తినిగా గుర్తిస్తారు. ఒక క్రైస్తవునికి ఇది మంచి సాక్ష్యము. నీవు వ్రాసుకున్న విషయాలను గూర్చి నీవు ప్రార్థించి దేవుని జ్ఞానమును వెదకినపుడు (యాకోబు 1:5), నీ సమయాన్ని మరింత జ్ఞానయుక్తంగా ఎలా వాడుకోవాలో దేవుడు నీకు నేర్పిస్తారని నీవుకూడా గమనిస్తావు.

నీ సమయాన్ని కేటాయించుకుంటున్నపుడు, వేటికి ప్రాధాన్యత ఇవ్వాలో కావలసిన జ్ఞానమునివ్వమని దేవుని ప్రార్థించు. ఎక్కడ వద్దు అని చెప్పాలో ఆ విషయంలో సున్నితంగా వ్యవహరించు. నీ కార్యక్రమాల జాబితా నీవు చూస్తున్నపుడు, సామెతలు 3:5-6 వచనాలలో ఉన్నమాటలనే ప్రార్థించు. "నా ప్రవర్తన అంతటియందు నీ అధికారము" ఉండాలి, కాబట్టి నీవు వాగ్దానము చేసినట్టు నా"త్రోవలను సరాళము చేయు"మని ప్రార్థించు. దేవుడు నీ జీవితంలో

పనిచేస్తుండగా, ఆశ్చర్యకరమైన, శక్తిగల కార్యములు నీ జీవితంలో జరగడం నీవు చూస్తావు. నీవు గొప్ప సమాధానము, ధైర్యం అనుభవిస్తావు ఎందుకంటే వీటన్నిటిగూర్చి ప్రార్థించావని నీకు తెలుసు, నీవు చేయగలిగింది చేసావు, మిగిలింది దేవుని చేతుల్లో ఉంది!

3) **గుండెల్లో ఉండే విషయాల పట్టిక వ్రాసి ఉంచుకో.** నీవు చేయాలనుకున్న ప్రాజెక్టులు, కాని వెంటనే మొదలుపెట్టలేని పనులు వ్రాసి ఉంచుకో. దేవునితో ఈ విషయాలనుగూర్చి కూడా చెప్పు. ఇవి నిన్ను తొలిచేస్తున్న విషయాలు అని చెప్పి, ఈ విషయాలను తగిన సమయంలో ఎలా పరిష్కరించాలో అనే విషయంలో ఆయనయందు విశ్వాసముంచు. ఇదికూడా నీకు గొప్ప శాంతిని ఇస్తుంది. “మీ చింత యావత్తు ఆయనమీద వేయుడి ఎందుకంటే ఆయన మిమ్మునుగూర్చి చింతించుచున్నాడు” (1పేతురు 5:7).

4) **“పట్టుకున్న ఆలోచనలు” పుస్తకం దగ్గర ఉంచుకో.** ఈ పుస్తకంలో మొదటి పేజి విషయసూచికగా పెట్టుకుని, భవిష్యత్తులో ఏర్పాటు చేయాలనుకుంటున్న సమావేశములు, ప్రాజెక్టులు, విశేషమైన పరిస్థితులు, అనుబంధాలు, నిర్దిష్టమైన అంశాలు, విషయాలు, సెలవులను గురించిన ప్రణాళికలు, ప్రయాణాలు మిగిలిన విషయాలకు పేజిలు కేటాయించి అవి ఏ పేజిలో ఉన్నాయో విషయసూచికలో వ్రాసుకోండి. ఈ ఆలోచనలు, ప్రణాళికల గురించి ప్రార్థిస్తున్నపుడు, దేవుడు మరింత విజయాన్ని ఇచ్చే మరింత ప్రభావవంతముగా ఉండే క్రొత్త ఆలోచనలు ఇస్తారు.

“....ప్రతి ఆలోచనను క్రీస్తుకు లోబడునట్లు చెరపట్టి...” అన్న 2 కొరింథి 10:5 వచనాన్ని గుర్తుంచుకోండి. కాబట్టి ఈ ఆలోచనల సంకలనం అనుదిన ప్రార్థనాంశంగా ఉండాలి. ఈ ఆలోచనలన్నిటిని దేవుని సత్యపు వెలుగులో తరచుగా పరీక్షించుకోవాలి. మీ ఆలోచనలు బైబిల్ ప్రకారం సరియైనవా కావా సరిచూసుకోండి. మీ ఆలోచనలు, ప్రణాళికలు ఇరుకైన తిన్నని మార్గములో నడచుటకు అనుగుణంగా ఉన్నవా లేవా అని గమనించుకోండి.

ఈ ఆలోచనా సంకలనం గూర్చి మీరు ప్రార్థిస్తుండగా, దేవుడు తనకు ఇష్టంకాని విషయాలను బయల్పరచవచ్చు. అలా చేస్తే, “మేము శరీరధారులమై నడుచుకొనుచున్నను శరీర ప్రకారము యుద్ధము చేయము. మా

యుద్ధోపకరణములు శరీరసంబంధమైనవి కావుగాని, దేవునియెదుట దుర్గములను పడద్రోయజాలినంత బలము కలవై యున్నవి; వేము వితర్కములను, దేవునిగూర్చిన జ్ఞానమును అడ్డగించు ప్రతి ఆటంకమును పడద్రోసి ప్రతి ఆలోచనను క్రీస్తుకు లోబడునట్లు చెరపట్టి..." అనే పైన చెప్పకున్న మాటల సందర్భాన్ని 2 కొరింథి10:3-5 వచనాలు గుర్తుతెచ్చుకోండి.

5) **"ఇబ్బందుల జాబితా" తయారుచేసి ఉంచండి.** (దీన్ని విశేష భారముల పట్టిక అనికూడా పిలవవచ్చు). ఈ పట్టికలోని విషయాలు నీ జీవితంలో నీకు అత్యంత బాధాకరమైన, భారమైన విషయాలు. ఒక తప్పిపోయిన కుమారుడు, లేక సరిచేయబడని వివాదం, ఇష్టములేని నిర్ణయం, లేక నీ జీవితంలో కష్టమైన శ్రమ ఏదైనా సరే ఇందులో వ్రాసుకో.

ముఖ్యమైన విషయం ఏమిటంటే, ఎందుకు ఈ పట్టిక వ్రాస్తున్నావంటే- నీ ఆత్మలోతుల్లో నిన్ను ఇబ్బందిపెడుతున్న సమస్యలనుగూర్చి దేవునికి ప్రార్థించడానికి. వీటినిగూర్చి నీవు ప్రార్థిస్తుండగా, ఈ వాగ్దానములు దేవునికి జ్ఞాపకంచేస్తున్నట్లుగా ప్రార్థించు: 1) కీర్తన 34:17 "నీతిమంతులు మొఱ్ఱపెట్టగా యెహోవా ఆలకించును, వారి శ్రమలన్నిటిలోనుండి వారిని ఆయన విడిపించును." 2) 1 పేతురు 5:7 "ఆయన మిమ్మునుగూర్చి చింతించుచున్నాడు గనుక మీ చింతయావత్తు ఆయనమీద వేయుడి".

అంతేకాక, నీ శ్రమలను దేవుని యెదుటికి తెస్తున్నపుడు, ఫిలిప్పీ. 4:6-7వచనాలలోని ఆయన వాగ్దానమును జ్ఞాపకం చేసుకో, "దేనినిగూర్చియు చింతపడకుడి గాని ప్రతి విషయములోను ప్రార్థన విజ్ఞాపనములచేత కృతజ్ఞతాపూర్వకముగా మీ విన్నపములు దేవునికి తెలియజేయుడి. అప్పడు సమస్త జ్ఞానమునకు మించిన దేవుని సమాధానము యేసుక్రీస్తువలన మీ హృదయములకును మీ తలంపులకును కావలియుండును."

## ఆరవ అధ్యాయానికి చర్చా సహకారి

# "హృదయపూర్వకంగా వెంబడించుట"

1. దేవునికి హృదయపూర్వక భక్తిలో ఉన్న మూడు విషయాలు వ్రాయండి. (115 పేజి)

ఎ)

బి)

సి)

2. నిర్గమకాండము 20:3,5 వచనాలు చదివి దాని భావమును ధ్యానించండి. (116 పేజి)

ఎ) "నేను తప్ప వేరొక దేవుడు నీకు ఉండకూడదు" అనే మాటలలో నీకు ఏభావం స్ఫురిస్తుంది? మనజీవితాలలో ఇది ఎలా అన్వయించుకోవాలి? కొన్ని నిర్ధిష్టమైన ఉదాహరణలు ఏమిటి?

బి) "నీ దేవుడనైన యెహోవానగు నేను రోషముగల దేవుడను" అనే మాటలలో నీకు ఏ భావం కనిపిస్తుంది?

3) ప్రభువుకు మన జీవితాలలో ప్రథమ ప్రాధాన్యత ఇవ్వడం సులువైన విషయం కాదు. ఎందుకు?

4) మత్తయి 6:33లో ప్రభువు మనకు చెప్పినట్లు చేస్తే, ఆయన ఇచ్చిన అభయము ఏమిటి? కీర్తన 139:23-24లో దావీదు ఉన్నట్టుగా, దేవునియెదుట లేక ఇతర మనుష్యులయెదుట పారదర్శకంగా, ఏమీ దాచుకోకండా ఉండటం మనకు కష్టం అనిపించడానికి కారణాలు ఏమిటి?

ఇటువంటి ఆటంకాలనుగూర్చి మనం ఏమి చేయాలి?

5) "మనసు రూపాంతరము"చెందడం అంటే ఏమిటి? (117 పేజి)

6) **"ఇరుకైన తిన్నని మార్గం"** గూర్చి మీ సొంతమాటల్లో ఆలోచనాపూర్వకంగా, వివరణాత్మకమైన క్లుప్త సారాంశం వ్రాయండి. (118 -119 పేజిలు)

7) **"ఏకమనస్సు"** ను గూర్చి మీ సొంతమాటల్లో ఆలోచనాపూర్వకంగా, వివరణాత్మకమైన క్లుప్త సారాంశం వ్రాయండి. (120 పేజి)

8) **"పునర్నిర్మాణము"** నుగూర్చి మీ సొంతమాటల్లో ఆలోచనాపూర్వకంగా, వివరణాత్మకమైన క్లుప్త సారాంశం వ్రాయండి. (121 పేజి)

9) అధ్యాయం చివరిలో ఉన్న "నీ ప్రవర్తన అంతటియందు ఆయన అధికారమునకు ఒప్పుకొనుము" అనే మాటనుగూర్చిన సూచనలలో...... (122 పేజి)

ఎ) ఈ సూచనలు మీకు మనశ్శాంతిని ఇవ్వడంలో ఎలా సహాయపడతాయి?

బి) ఈ సూచనలను అమలుపరచడం, ప్రభువుతో మీ నడకను ఎలా బలపరస్తుంది?

సి) ఈ క్రింద ఇవ్వబడిన లేఖనాలను అనుసరించి మీ ప్రార్థనా జీవితంలో ఈ క్రమశిక్షణలను అమలు పరస్తే మీకు కలిగే నిర్దిష్టమైన ఉపయోగాలు (కీర్తన 103:2) వ్రాయండి.

- 2 దినవృత్తాంతములు 16:9

- మత్తయి 6:33

- ఫిలిప్పీ. 4:6-7

- సామెతలు 16:3

- సామెతలు 3:5-6

10) "నేను యెష్షయి కుమారుడైన దావీదును కనుగొంటిని; అతడు నా యిష్టానుసారుడైన మనుష్యుడు..." అని దేవుడు అపో.కార్య. 13:22లో దావీదునుగూర్చి అనడంలో భావమేమిటి? ఇది దావీదునుగూర్చి విశేషంగా ఏమి చెబుతుంది?

దావీదు "అద్భుతమైన పరిశుద్ధుడా"? అందువల్లే దేవుడు అలా చెప్పారా? దేవునియెదుట అలాంటి మెప్పు పొందుట మిగతా విశ్వాసులకు సాధ్యమేనా? సాధ్యమైతే ఎలా? సాధ్యం కాకపోతే ఎందుకు?

11) మీ జీవితంలో ఎప్పుడైనా దేవుని ఆలోచన తీసుకోకుండా నిర్ణయం తీసుకున్న ఒక సమయాన్ని గూర్చి చర్చించండి. ఫలితాలు ఎలా ఉన్నాయి?

12) దేవుని నీ ప్రథమ ప్రాధాన్యతగా చేసుకుని, ఆయనను హృదయపూర్వకముగా నమ్మినందున విజయం సాధించిన సందర్భం ఏమైనా జ్ఞాపకం ఉందా? దేవుడు నిన్ను నడిపించిన విధానాన్నిగూర్చి చర్చించుము.

## ఏడవ అధ్యాయం

# "తిరిగి సమకూర్చడం"

### క్రియాత్మక "మాష్" బృందాన్ని నిర్వహించడం

"మాష్" అనే టివి సీరియల్ మీలో చాలామందికి గుర్తుండవచ్చు. ఇది పూర్తిగా లోకానుసారమైన సీరియల్, క్రైస్తవ దృక్పథంలో మెచ్చదగింది ఇందులో ఏమీ లేదు. అయితే, ఇది ఏ యుద్ధ ప్రయత్నంలోనైనా ప్రాముఖ్యమైన "Mobile Army Surgical Hospitals" (మన 108 లాంటి వాహనాలు)అనేవి నేడు ఉండటానికి కారణమయ్యింది. యుద్ధం జరిగినచోట పెద్దసంఖ్యలో ప్రమాదాలు జరుగుతాయి, అనేకులు గాయపడతారు. కొరియాతో యుద్ధంలోను, ఇతర మిలిటరీ యుద్ధాలలో ఈ "మాష్" బృందాలు తీవ్రంగా గాయపడిన అనేకమంది సైనికుల ప్రాణాలు కాపాడాయి. ఇవే లేకపోతే వారి ప్రాణాలు నిలిచేవి కావు. తరచుగా తీవ్ర గాయాలు తగలనివారు సరియైన చికిత్సతో బాగయ్యిన తరువాత వారి వారి పనులకు వెళ్ళిపోయేవారు.

ఈ లోకంలో ప్రతిరోజు క్రైస్తవుడు ఎదుర్కొనే ఆత్మీయ యుద్ధంలో ఈ "మాష్" ఆలోచన ఆత్మీయంగా అన్వయించుకుందాం. క్రైస్తవ సైనికులు శత్రువు దాడిలో తరచు గాయాలపాలౌతారు. ఈ గాయాలు పాపము, అపరాధభావన, నిరాశ, ఆందోళన, కృంగుబాటు, ఒంటరితనం, తృణీకారం, మొదలైనవి అవి తెచ్చే ఫలితాల రూపంలో ఉంటాయి.

సాతాను వాడి సైన్యం మన ఆత్మలమీద ఈ గాయాలు చేయడమే కాక, ఒకసారి గాయపడిన వారి గాయాలు ఇంకా రేపుతూ ఉండటం కూడా వాడికి బాగా తెలుసు. కాబట్టి తమ ఆత్మ గాయపడేటట్లు శత్రువు దాడిచేసినప్పడు, క్రైస్తవులకు దేవుని "మాష్" బృందంలో ఆత్మీయ వైద్యం ఎలా వాడుకోవాలో తెలిసి ఉండటం చాలా ప్రాముఖ్యం.

మనం పాపం చేసినపుడు సాతానుడు మనలను పనిచేయనివ్వకుండా చేయడంలో మన అజ్ఞానమే వాడికి ఆయుధం. పాపము అపరాధభావనల సమస్య వచ్చినపుడు క్రైస్తవుడు ఏమి చేయాలో జవాబును పూర్తిగా దేవుడు సిద్ధంచేసి ఉంచాడని సాతానుకు తెలుసు. అయితే ఈ సత్యం మనకు తెలియకపోతే వాడు మన అజ్ఞానాన్ని ఆయుధంగా వాడుకుంటాడు, లేక ఆ

సత్యాన్ని వక్రీకరించి మన పాపము, అపరాధభావన నుండి తేరుకోవడానికి మార్గములేదు అని మనం నమ్మేలా చేస్తాడు. "...వాడు అబద్ధమాడునప్పుడు తన స్వభావము అనుసరించియే మాటలాడును; వాడు అబద్ధికుడును, అబద్ధమునకు జనకుడునైయున్నాడు" (యోహాను 8:44)అని యేసు సాతాను గూర్చి తన శిష్యులతో చెప్పాడని గుర్తుంచుకోండి.

కాబట్టి, మనం పాపంలో పడినపుడు, లేక మనకు అపరాధభావన కలిగినపుడు, దేవుడు మన క్షమాపణకొరకు సిద్ధపరచిన విషయాలనుగూర్చిన సరియైన ఆచరణాత్మక జ్ఞానం మనకు ఉండడం చాలా ప్రాముఖ్యం. అలాంటి సమయాలలో, మనలో ఉన్న మన ఆత్మ, మనస్సు గాయపడ్డాయని అర్థం, కాని దేవుడు మనలను వెంటనే బాగుచేసి జీవితపోరాటాన్ని ఎదుర్కొనడానికి సిద్ధపడేలా ఒక ఆత్మీయ "మాష్" బృందం ఏర్పాటు చేసారు.

## మనం ప్రతిరోజు ఉపయోగించి వాడుకోవలసిన ప్రాథమిక సత్యాలు

### 1) మనమీద నేరారోపణ (నిందమోపడం) చేసేవాడు సాతాను!

పాపమును, అపరాధభావనను ఉపయోగించి ఆత్మీయ యుద్ధంలో క్రైస్తవులను గాయపరచి వికలాంగులను చేసి పనికిరాకుండా చేయడంలో సాతాను దిట్ట. "... మీ శత్రువైన అపవాది గర్జించు సింహమువలె ఎవరిని మ్రింగుదునా అని వెదకుచు తిరుగుచున్నాడు" అని 1పేతురు 5:8 చెబుతున్నది గుర్తుపెట్టుకోండి. ప్రకటన 12:10లో ".....రాత్రింబగళ్ళు మన దేవునియెదుట **సహోదరులమీద నిందలు మోపేవాడు..."** అని వానిని పిలిచారు. అపరాధభావన వలన కలిగే ఫలితానికి మనం సందేహంలో పడతామని అపవాదికి తెలుసు. ఎందుకంటే

మనం పాపులమని మనకు తెలుసు, దేవుడు మనలను స్వీకరించాలంటే మనము ఏదో ఒక మంచి పని చేయాలి అనే మనస్థత్వం మనలో పాతుకుపోయి ఉన్నది. ఫలితంగా, మనం పాపం చేసినప్పడు, ఆ పాపం దేవుడు క్షమించడానికి ఆయనను మెప్పించాలని మనం ఆలోచిస్తాం. దేవుడు మనలను క్షమించేటంతగా, కృపనిచ్చేటంతగా మనం చేయగలిగామో లేదో మనకు నిజంగా ఎన్నటికీ తెలియదు.

అంతేకాకుండా, మనం దారుణంగా విఫలమయ్యేవారమని, బైబిల్ చదువుతూ, ప్రార్థిస్తూ, చర్చికి వెళుతూ మనలను మనం క్రైస్తవులమని పిలుచుకుంటూ మనలను మనం మోసం చేసుకుంటున్నామని సాతాను మనకు సలహా ఇస్తుంటాడు.

ఇలాంటి ఆలోచన అంతా సత్యాన్ని వక్రీకరించడమే (అంటే దేవునియెదుట సరియైన రీతిలో నిలబడడం అనేది మనం చేసే క్రియలమీద ఆధారపడి ఉంటుంది అనే ఆలోచన తప్ప). సత్యం ఏమిటంటే, యేసు క్రీస్తు మనలను ఎప్పడో దేవుడు స్వీకరించేవారినిగా చేసేశారు (ఎఫెసి 1:6), అంతేకాక, దేవుడు మనలను అంగీకరించడానికి, స్వీకరించడానికి ఇంక వేరే మార్గం ప్రస్తుతంలోగాని, భవిష్యత్‌లోగాని లేనే లేదు! మనం దేవుని అంగీకారాన్ని మొట్టమొదటిసారి రక్షణలోనికి వచ్చినపుడు ఎలా పొందుకున్నామో ఇప్పడు కూడా అలాగే పొందుకుంటాము - "క్రీస్తులో, క్రీస్తుద్వారా!"

## 2) యేసుక్రీస్తు దేవునియెదుట మన వకీలు (న్యాయవాది).

1యోహాను 2:1-2వచనాలు, "నా చిన్నపిల్లలారా, మీరు పాపము చేయకుండుటకై యీ సంగతులను మీకు వ్రాయుచున్నాను. ఎవడైనను పాపము చేసినయెడల నీతిమంతుడైన యేసుక్రీస్తు అను ఉత్తరవాది (ఆదరణకర్త లేక న్యాయవాది) తండ్రియొద్ద మనకున్నాడు. ఆయనే మన పాపములకు ప్రాయశ్చిత్తమైయున్నాడు; మన పాపములకు మాత్రమే కాదు, సర్వలోకమునకును శాంతికరమై యున్నాడు."

బైబిల్ ఎంత వాస్తవికమైనదో గమనించండి. ఈ వచనంలో చెప్పేది, ప్రాథమికంగా బైబిల్ విషయంలో కూడా సత్యం, అంటే యీ సంగతులు ఎందుకు వ్రాయబడ్డాయి? "...మీరు పాపము చేయకుండా ఉండుటకు". అదే

దాని లక్ష్యం, ఉద్దేశం. అయితే, రక్షణపొందినపుడు క్రైస్తవులు సంపూర్ణ పాపరహిత స్థితిలోనికి ప్రవేశిస్తారు అని బైబిల్ బోధించడం లేదు. కొన్నిసార్లు మనందరమూ పడిపోతాము. "అనేక విషయములలో మనందరమూ తొట్రిల్లుచున్నాము.." అంటాడు యాకోబు 3:2. లేఖనాలు క్రైస్తవులు పాపరహితులని బోధించవు, కాని వారు తక్కువగా పాపం చేస్తారని బోధిస్తాయి! నిజానికి 1 యోహాను 1:8 చెబుతోంది, "మనము పాపము చేయలేదని చెప్పకున్నయెడల దేవునిని అబద్ధికునిగా చేయువారమగుదుము; మరియు ఆయన వాక్యము (సత్యము) మనలో ఉండదు."

తరువాత, మనం పాపం చేసినపుడు దేవుడు ఏర్పాటు చేసిన మార్గమును తరువాతి వచనం వివరిస్తుంది, "ఎవడైనను పాపము చేసినయెడల మన పక్షముగా దేవునితో మాటలాడే నీతిమంతుడు -యేసుక్రీస్తు, తండ్రి దగ్గర మనకున్నాడు." హెబ్రీ 8:1-2 ".....మన ప్రధానయాజకుడు యేసు, సిలువపై తన రక్తము కార్చుట ద్వారా మనందరి పాపములకు ప్రాయశ్చిత్తం చేసి, పరలోకమందున్న ఆలయంలో తండ్రి కుడిపార్శ్వమున కూర్చుండియున్నాడు." అని చెబుతోంది. "ఈయన తనద్వారా దేవునియొద్దకు వచ్చువారి పక్షమున", (అంటే క్రైస్తవుల పక్షమున) "విజ్ఞాపన చేయుటకు నిరంతరము జీవించుచున్నాడు." అని చెపుతుంది హెబ్రీ.7:25.

కాబట్టి, అన్ని తరములలో ఉన్న క్రైస్తవులందరికొరకు, వారు పాపము చేసినపుడు, తండ్రితో వారి పక్షముగా మాటలాడడానికి యేసు నిరంతరము సజీవుడుగా ఉన్నారు! పరలోకపు తండ్రితో ప్రభువైన యేసు ఉన్నారు అనే సత్యం, దేవుని ధర్మశాస్త్రం అడిగే ప్రతిది, సిలువమీద యేసు చిందించిన రక్తము ద్వారా తృప్తి పరచబడింది అనడానికి ఆధారం. ఆయన చెల్లించిన వెల, మనం రక్షణపొందడానికి ముందు చేసిన పాపములకే కాదు, మన పాపములన్నిటికీ సరిపోతుంది (కొలస్సి 2:13).

కాబట్టి, అపవాది మన మనస్సాక్షిమీద దోషము మోపినపుడు (మనం సాతానుతో మాటాడలేము,...కేవలం ఊహ). మన పాపమునుగూర్చి, వైఫల్యాన్నిగూర్చి వాడు చేస్తున్న ఆరోపణలన్నీ నిజమేనని గుర్తించాలి. మనమేమైయున్నామో దాన్నిబట్టి, మనం చేసిన క్రియలనుబట్టి, మనం

దేవునియెదుటికి రావడానికి గాని, ఆయనకు ప్రార్థించుటకు గాని యోగ్యులము కాదు అని వాడితో ఏకీభవించాలి. అయితే, మన స్వంత నీతితో మనము దేవుని యెదుటికి రాలేదని (యెషయా 64:6), మనం పాపంలో పడిన తరువాత/ విఫలమైన తరువాత కూడా (1యోహాను 1:7,9) దేవునితో సహవాసానికి, ఆయనతో అనుదినము నడవగలగడానికి మనకున్న యోగ్యత, యేసుక్రీస్తు రక్తము మన పాపములన్నిటిని కడివేసినందున మాత్రమేనని తరువాత వాడికి వివరించాల్సి ఉంది. దేవుడు క్రీస్తుయొక్క పరిపూర్ణ నీతి మనకు ధరింపజేసినందున, ఆయన దృష్టిలో మనము స్వీకృతులమయ్యామని (యెషయా 61:10; 2 కొరింథి 5:21) సాతానుకు గుర్తు చేయాలి.

సాతాను పాపమును(మన ఆలోచనలో) అపరాధభావనను మోపినపుడు ఈ సత్యమైన సరియైన విధానాన్ని అనుసరించాలి అనడంలో సందేహం లేదు. ప్రకటన 12:10-11 ఈ విషయాన్ని స్థిరపరస్తుంది. క్రైస్తవులు ఎలా విజయం సాధిస్తారంటే, "....-రాత్రింబగళ్ళు మన దేవునియెదుట మన సహోదరులమీద నేరము మోపువాడు ...వారు గొఱ్ఱెపిల్ల రక్తమును బట్టియు, తామిచ్చిన సాక్ష్యమును బట్టియు వానిని జయించియున్నారు". విశ్వాసముతో 1యోహాను 1:7 అన్వయించు కోవడంద్వారా ఇది జరిగింది.

**3) దేవునితో మనకున్న "బంధం", మరియు "సహవాసం" మధ్య ఉన్న తేడాను మనం పరిపూర్ణంగా అర్థం చేసుకోవాలి.**

మనం రక్షణ పొందక మునుపు, మన పాపమునుబట్టి మనం దేవునితో పూర్తిగా దూరస్థులమై యున్నాము (ఎఫెసి.2:11-12). ఆ సమయంలో, దేవుడు మనకు 'పరలోకపు తండ్రి' కాదు. నిజానికి, మతాన్ని వేషంగా ధరించి, రక్షణ పొందని నాటి యూదా నాయకులతో యేసు అన్నారు, "..మీరు మీ తండ్రియగు అపవాది సంబంధులు..." (యోహాను 8:44). స్త్రీ సంతానమునకు, సర్ప సంతానమునకు (ఆదికాండము 3:15) మధ్య వ్యత్యాసాన్ని లేఖనాలందంతటా చూస్తాము. రక్షణ పొందనివారు నిజమైన దేవుని పిల్లలు కారు. వారు రక్షణ ద్వారా ఆయనతో బంధంలో ఉన్నవారు కారు.

అయితే యోహాను 1:12 చెబుతుంది, "..తనను ఎందరు అంగీకరించిరో వారందరికీ, అనగా తన నామమునందు విశ్వాసముంచిన

వారికి, దేవుని పిల్లలగుటకు ఆయన అధికారము అనుగ్రహించెను." క్రైస్తవులను గూర్చి అపొస్తలుడైన పౌలు చెప్పాడు, "....ఆ ఆత్మ కలిగినవారమైన మనము -అబ్బా తండ్రీ అని మొఱ్ఱపెట్టుచున్నాము. మనము దేవుని పిల్లలమని ఆత్మ తానే మన ఆత్మతోకూడ సాక్ష్యమిచ్చుచున్నాడు." (రోమా 8:15-16). "మనము దేవుని పిల్లలమని పిలువబడునట్లు తండ్రి మనకెట్టి ప్రేమ ననుగ్రహించెనో చూడుడి; మనము దేవుని పిల్లలమే!..." అని అపొస్తలుడైన యోహాను కూడా అంటున్నాడు (1యోహాను 3:1).

ప్రభువైన యేసుక్రీస్తునందలి విశ్వాసముద్వారా మనము దేవుని పిల్లలమైనపుడు, మనం ఆయనతో **ఒక నిత్య అనుబంధం**లోనికి ప్రవేశించాం (రోమా 8:38-39; యోహాను 10:27-29; ఫిలిప్పీ. 1:6). ఈ **అనుబంధాన్ని** ఏదీ ఎన్నడూ కొట్టివేయలేదు! ఒకవిధంగా చెప్పాలంటే, ఇది నీకు జన్మనిచ్చిన తల్లిదండ్రులతో నీకున్న సంబంధం లాంటిది. ఏదీ ఎన్నడూ ఆ అనుబంధాన్ని మార్చలేదు. వాళ్లెన్నటికీ నీకు జన్మనిచ్చిన తల్లిదండ్రులే. నీకు వారికి ఎల్లప్పడూ ఇదే సంబంధం.

అయితే, మనం మన ఇంటిలో, మనకు జన్మనిచ్చిన తలిదండ్రులతో ఉంటున్నపుడు, కొన్నిసార్లు వారికి మనకు మధ్య, సమస్యలు తుఫాను మేఘాలవలె వస్తాయి. బహుశా వారి అధికారమునకు మనం లోబడకపోవడమో, లేక తిరగబడడమో జరుగుతుంది. ఇలాంటి సమయాల్లో, మన తలిదండ్రులతో మనకుండే సహవాసములో ఇబ్బందులు వస్తాయి. వారితో మనకున్న **సహవాసం** ఇదివరకు ఉన్నంత మధురంగా ఉండదు. అయితే, **ౢదీవిఊంఒఙ్ఞఖు** మాత్రం అలాగే ఉంటుంది! వారు మనకు ఇంకా జన్మనిచ్చిన తలిదండ్రులే, దానిని ఏదీ ఎన్నడూ మార్చలేదు. అయితే మన తలిదండ్రులతో మనకున్న **సహవాసం** కొన్నిసార్లు చెడిపోతుంది.

దేవునితో మన అనుదిన అనుబంధంలో (నడకలో) ఇది జరుగుతుంది. మనలను దేవుడు దత్తత తీసుకున్నారు (ఎఫెసి. 1:5). **అనుబంధంలో** మనం దేవుని ప్రియమైన పిల్లలం. దానిని ఏదీ ఎన్నడూ మార్చజాలదు (ఫిలిప్పి 1:6). అయితే మనము దేవునికి విరోధముగా పాపము చేసినప్పడు, దేవునితో మన **సహవాసం**లోని మాధుర్యం, సాన్నిహిత్యం కోల్పోతాం.

యోహాను వ్రాసిన మొదటి పత్రికలోని మొదటి అధ్యాయం దేవునితో మన "**సహవాసం**"ను గూర్చియే గాని, మనమాయన దత్తపుత్రులముగా చేయబడ్డ "**అనుబంధం**"గూర్చిన విషయం కాదు. ఈ వాక్యభాగంలోని "సహవాసం" అనేమాటను గమనించండి:

> "మాతో కూడ మీకును **సహవాసము** కలుగునట్లు మేము చూచినదానిని వినినదానిని మీకును తెలియజేయుచున్నాము. మన **సహవాస**మైతే తండ్రితో కూడను ఆయన కుమారుడైన యేసు క్రీస్తుతో కూడను ఉన్నది. మీ సంతోషము పరిపూర్ణమవుటకై మేమీ సంగతులను వ్రాయుచున్నాము. మేమాయన వలన విని మీకు ప్రకటించు వర్తమానమేమనగా -దేవుడు వెలుగైయున్నాడు. ఆయనయందు చీకటి ఎంతమాత్రమును లేదు. ఆయనతోకూడ **సహవాసము** గలవారమని చెప్పకొని చీకటిలో నడచినయెడల మనమబద్ధమాడుచు సత్యమును జరిగింపకుందుము. అయితే ఆయన వెలుగులో నున్న ప్రకారము మనమును వెలుగులో నడచినయెడల మనము అన్యోన్య **సహవాసము** గలవారమై యుందుము. అప్పడు ఆయన కుమారుడైన యేసు రక్తము ప్రతి పాపమునుండి మనలను పవిత్రులనుగా చేయును." (1యోహాను 1:3-7).

దేవునితో మన సహవాసము పాడైనప్పడు, మనము దేవునికి సమీపముగా లేమని, ఆయన మనలనుబట్టి సంతోషించడం లేదని మనకు తెలుస్తుంది. మనం అపవిత్రులమనే అపరాధభావన మనకు కలుగుతుంది. అదేమీ లేదు అన్నట్టుగా మన జీవించడానికి ప్రయత్నించినా, మనలోపల సంతోషము ఉండదు, ఖాళీగా అనిపిస్తుంది. దేవుని సంతోషము సమాధానము పోగొట్టుకున్నాం. మన ఆత్మలో అశాంతి, మనసులో విచారము నిండిపోతుంది. ఈ స్థితిలో మన జీవిస్తుంటే, మనం అపజయాలతో జీవిస్తుంటాం. పశ్చాత్తాపపడకుండా ఇదే స్థితిలో మనం కొనసాగినపుడు దేవుడు మనతో ఉండడు అంటే ఆయన ఆశీర్వాదము మనమీద ఉండదు. మనం మన పరలోకపు తండ్రి సహవాసంలో లేమన్నమాట. ఈ సమస్యకు ఒకే పరిష్కారం **"తల్లిదండ్రుల క్షమాపణ".**

**4) "న్యాయ క్షమాపణ"కు, "తల్లిదండ్రుల క్షమాపణ"కు మధ్య తేడాను మనం తప్పక అర్థంచేసుకోవాలి.**

దేవుని క్షమాపణ, దేవుని క్షమాపణే. అది ఎక్కడ బయల్పరచబడినా దాని స్వభావంలోను, నాణ్యతలోను తప్పనిసరిగా ఏ తేడా ఉండదు.. మనం ఇప్పుడు చర్చించుకుంటున్న -సహవాసము, అనుబంధము దగ్గరకు వచ్చేసరికి, దేవుని క్షమాపణను రెండు విధానాలలో అర్థంచేసుకోవడం మనకు సహాయకరముగా ఉంటుంది.

## న్యాయబద్ధమైన క్షమాపణ

ఉదాహరణకు మనం రక్షణ స్వీకరించినపుడు దేవుడు మనకిచ్చిన క్షమాపణ, దానిని మనం **"న్యాయపరంగా ఇవ్వబడిన క్షమాపణ"** అని తలంచవచ్చు. ఈ మాట మన ఆత్మల అంతిమగమ్యానికి సంబంధించి దేవుడిచ్చిన క్షమాపణ. గొప్ప అంత్యతీర్పురోజున సమస్త మానవుల అంతిమ గమ్యం చివరిగా నిర్ణయించబడుతుంది అని బైబిల్ బోధిస్తుంది (ప్రకటన 20:11-15). ఆ గొప్పదినమున తమ పాపములకు క్షమాపణ పొందకుండా దేవునియెదుట నిలబడేవారు, నిత్యనాశనానికి త్రోసివేయబడతారు. తమ పాపములకు క్షమాపణ అనుభవించినవారు ఈ సమయంలో నిత్యజీవంలోనికి ప్రవేశిస్తారు. ఈ క్షమాపణను "న్యాయబద్ధమైన క్షమాపణ"గా వివరిస్తున్నాం.

యిర్మీయా 31లో, ప్రవక్తయైన యిర్మీయా ద్వారా దేవుడు క్రొత్త నిబంధనగూర్చి మాట్లాడుతున్నాడు. 34వచనం చివరిలో ఈ మాటలు మనం చదువుతాం, "...నేను వారి దోషములను క్షమించి వారి పాపములను ఇకనెన్నడును జ్ఞాపకము చేసికొనను..." దేవుడు ఈ క్షమాపణనుగూర్చి ఇలా వివరించడం చాలా ఆసక్తిగా ఉంటుంది. **"...నేను... వారి పాపములను ఇకనెన్నడును జ్ఞాపకము చేసికొనను".** ఈ తిరుగుబాట్లు ఇంతకుముందు ఎప్పడూ జరగలేదు అన్నట్లుగా వీటిని మరచిపోతానని దేవుని భావం కాదనేది స్పష్టం. ఎందుకంటే ఆయన సర్వజ్ఞాని కాబట్టి ఆ భావంతో ఆయన ఏదీ మరచిపోయే అవకాశం లేదు. ఆయన అన్ని విషయాలను ఎల్లప్పడూ ఎరిగియుంటాడు! అలాకాకుండా, ఈ వ్యాఖ్య న్యాయస్థానంలో, ఒక కేసు విచారణ ఆరంభించే సమయంలో, ప్రతివాదిపై అభియోగాలను వాది తరుపున

న్యాయవాది చెబుతున్నపుడు వాడే పదజాలం. కాబట్టి దేవుడు చెబుతున్నదేమిటంటే, ఆ అంత్యతీర్పు రోజున, అక్కడ ఉన్నవారందరిముందు మన పాపములను అభియోగాలుగా మోపను అంటున్నారు. "ఆయన మన పాపములను ఇకనెన్నడును జ్ఞాపకము చేసికొనడు" అంటే భావం ఇదే. మన పాపముల నిమిత్తమైన శిక్షను క్రీస్తు భరించినందువల్ల, మన పాపముల నిమిత్తమై ఇక న్యాయబద్ధమైన ఆరోపణ ఏదీ మనపై మోపబడదు. ఈ "న్యాయబద్ధమైన క్షమాపణ"గూర్చి స్పష్టంగా తెలియజేసే కీలక లేఖనాలు చాలా ఉన్నాయి. ఉదాహరణకు, కీర్తన 103:12 -"పడమటికి తూర్పు ఎంతదూరమో, ఆయన మన అతిక్రమములను మనకు అంత దూరపరచి యున్నాడు". వేరే మాటల్లో చెప్పాలంటే, మన పాపములన్నీ పూర్తిగా, సంపూర్ణంగా తొలగిపోయాయి అనే భావన ఇందులో కనిపిస్తుంది. మీకా 7:19లో మన పాపములన్నిటిని దేవుడు "..సముద్రపు అగాధములో పడవేస్తాడు" అని చెబుతాడు. మరలా ఇక్కడ మన పాపములు క్షమించబడటాన్ని గూర్చి నొక్కి వక్కాణించే చిత్రం కనిపిస్తుంది. ఆ చివరి తీర్పురోజున అవి ఇక న్యాయస్థానం ముందుకు తీసుకుని రావడం అసాధ్యం అనేది అసలు విషయం. ఇదే "న్యాయబద్ధమైన క్షమాపణ".

క్రీస్తుద్వారా దేవుని క్షమాపణనుగూర్చిన విషయాన్ని కళ్ళకుకట్టినట్టుగా వివరించే మరొక లేఖనభాగం ఉన్నది. అది కొలస్సి 2:13-14, "...దేవుడు వ్రాతరూపకమైన ఆజ్ఞలవలన మనమీద ఋణముగాను, మనకు విరోధముగాను నుండిన పత్రమును మేకులతో సిలువకు కొట్టి, దానిమీద చేవ్రాతను తుడిచివేసి, మనకు అడ్డములేకుండ దానిని ఎత్తివేసి మన అపరాధములనన్నిటిని క్షమించి, ఆయనతోకూడ మిమ్మును జీవింపచేసెను...". ఇది న్యాయబద్ధమైన క్షమాపణకు ఒక అద్భుతమైన ఉదాహరణ. సిలువమీద క్రీస్తు మన పాపములన్నిటికి వెలచెల్లించినందున, మన పాపముల లెక్క పూర్తిచేయబడింది అనే సత్యానికి ఇది వివరణ. అంత్యతీర్పు రోజున మనకు విరోధముగా, వాటిని మరలా ఎన్నడూ "గుర్తుచేసుకోనని" దేవుడు వాగ్దానం చేసారు. అది "న్యాయబద్ధమైన క్షమాపణ"!

## తల్లిదండ్రుల క్షమాపణ

మన పాపములు "న్యాయబద్ధమైన క్షమాపణ" ద్వారా "తుడిచివేయబడి" (యెషయా 43:25), అంత్యతీర్పులో మనకు విరోధముగా ఏమాత్రం ఆరోపించబడనప్పటికీ, అనుదినజీవితంలో మన పరలోకపు తండ్రి ప్రేమకు విరోధముగా మనం పాపం చేసినప్పుడెల్లా మనము ఇంకా దేవునిని అభ్యంతరపరస్తున్నాము. అంత్య తీర్పు దినమున దేవుడు మనకు పాపక్షమాపణను వాగ్దానం చేసారు కనుక మనం పాపము చేసినా దేవుడు ఏమీ అనుకోడు అనేది తప్పడు ఆలోచన అనే విషయం కాస్త లోకజ్ఞానం ఉన్నవారెవరికైనా తెలుస్తుంది. అదే లోకజ్ఞానం మనకు దేవుడు క్రీస్తుద్వారా చూపించిన మహాద్భుతమైన ప్రేమను ఎరిగికూడా ఆయనకు విరోధముగా పాపము చేస్తే మనలనుబట్టి ఆయన ఆనందించడు అనే సంగతిని తెలియజేస్తుంది. అలాంటి ద్రోహమును ఆయన ఉపేక్షించడు. అలాంటి సమయాలలో ఆయన మనలనుబట్టి బాధపడతారు, అభ్యంతరపడతారు. అప్పడే తల్లిదండ్రుల క్షమాపణ అవసరం ఉంటుంది. ఎఫెసి 4:30 మన లోకజ్ఞానం యొక్క సందిగ్ధాన్ని స్థిరపరుస్తుంది. అన్ని రకముల పాపపూరిత ప్రవర్తననుండి క్రైస్తవులు దూరంగా ఉండాలి అనే చెప్పే మాటల మధ్యలో "....దేవుని పరిశుద్ధాత్మను దు:ఖపరచకుడి.." అనే మాటలు వ్రాయబడ్డాయి. వెంటనే, తమ పాపముల విషయమై ఏ సందేహము లేకుండా క్షమాపణ పొందిన క్రైస్తవులు సహితం, తమ పాపములనుబట్టి దేవుని ఆత్మకు క్షోభ కలుగజేసే అవకాశం ఉన్నదని గుర్తిస్తాం. అయితే దీని అర్థం వారు పాపం చేసినప్పటినుండి దేవుని దత్తపుత్రులు కాకుండా పోతారు అని కాదు. ఆయన శాశ్వతమైన ప్రేమపై ఆధారపడిన ఆ అనుబంధాన్ని ఏదీ నాశనం చేయలేదు అని లేఖనం మనకు స్పష్టం చేస్తుంది (రోమా 8:38-39). అయినప్పటికీ, ఆయనకు బాధకలుగకుండా వారు ఆయనకు విరోధముగా పాపము చేయలేరు అనేది సూచిస్తుంది.

మనకు జన్మనిచ్చిన తల్లిదండ్రులతో మనకున్న అనుబంధానికి ఇది సమాంతరముగా ఉన్నది గమనించారా? మన అవిధేయతనుబట్టి, తిరుగుబాటునుబట్టి వారితో మనకున్న సహవాసము చెడిపోతుంది, అయినప్పటికీ వాళ్ళు మనకు జన్మనిచ్చిన తల్లిదండ్రులే! కొన్నిసార్లు మనకు వాళ్ళకు మాటలు లేకపోవచ్చు, కాని అనుబంధం మాత్రం ఇంకా ఉంది. మన పరలోకపు తండ్రితో మన అనుబంధంకూడా అలాంటిదే అని లేఖనాలు సూచిస్తున్నాయి.

"నా హృదయములో నేను పాపమును లక్ష్యముచేసిన యెడల, ప్రభువు నా మనవి వినకపోవును" అంటాడు కీర్తనాకారుడు (కీర్తన 66:18). తన పాపములకు న్యాయబద్ధమైన క్షమాపణ పొందిన క్రైస్తవుడు కూడా, పాపము చేస్తే దేవునితో సహవాసాన్ని కోల్పోతాడు అనడానికి స్పష్టమైన ఉదాహరణ ఇది. 1 పేతురు 3:7లో కూడా అటువంటి వ్యాఖ్య మనకు కనిపిస్తుంది. "....పురుషులారా (భర్తలారా), జీవమను కృపావరములో మీ భార్యలు మీతో పాలివారైయున్నారని యెరిగి యెక్కువ బలహీనమైన ఘటమని భార్యను సన్మానించి, మీ ప్రార్థనలకు అభ్యంతరము కలుగకుండునట్లు జ్ఞానముచొప్పున వారితో కాపురము చేయుడి." ఇక్కడ మరలా పాపపూరితమైన ప్రవర్తన దేవునితో మన సహవాసమును పాడుచేస్తుంది అని స్పష్టంగా తెలియపరచబడింది. అతనికి పాపము విషయమై న్యాయబద్ధమైన క్షమాపణ అనుగ్రహించిన తరువాత కూడా క్రైస్తవుడు పాపం చేస్తే దేవుడు ఎక్కువ బాధపడతాడు.

ఇక్కడే మనము **తల్లిదండ్రుల క్షమాపణగా** చెప్పకుంటున్న మరొక క్షమాపణ మనకు కనిపిస్తుంది. 1యోహాను 1:9 మనకు ఇలాంటి క్షమాపణనుగూర్చి తెలియజేస్తుంది: ''మనపాపములను మనము ఒప్పకొనినయెడల, ఆయన నమ్మదగినవాడును నీతిమంతుడును గనుక ఆయన మన పాపములను క్షమించి సమస్త దుర్నీతినుండి మనలను పవిత్రులనుగా చేయును." ఇది క్రైస్తవులు, క్రీస్తును అంగీకరించిన తరువాత చేసిన నిర్దిష్టమైన పాపములనుగూర్చి సూచిస్తున్న మాట. మనం పాపం చేసామని, దేవున్ని బాధపెట్టామని, మనయెడల ఆయన దయను కృపను వంచించామని, అలాంటి తగని పనినిబట్టి సిగ్గుపడుతున్నామని ఒప్పకుంటున్న ఒప్పకోలు ఇది. మనం పాపం చేయడం ద్వారా పరిశుద్ధాత్మను దుఃఖపరచామని మనం గుర్తించి, తద్వారా దేవునితో మన సహవాసాన్ని, అన్యోన్యతను పోగొట్టుకున్నాం అని ఎరుగుతున్నాం.

ఇలాంటి పాపముల విషయమై పశ్చాత్తాప పడవలసిన అవసరతనుగూర్చి ప్రభువైన యేసుకూడా ఉపదేశించారని మనకు స్పష్టమే. ఒక ఉదాహరణ ప్రభువు నేర్పించిన ప్రార్థనలోనే ఉన్నది. "మా యెడల అపరాధము చేసినవారిని మేము క్షమించిన ప్రకారము మా అపరాధములను క్షమించుము" అని ప్రార్థించమని ఆయన తన శిష్యులకు నేర్పించారు (మత్తయి 6:12). వారి పాపములు అంత్యతీర్పులోనికి రాకుండా క్షమించబడినపుడు (అంటే

న్యాయబద్ధమైన క్షమాపణ పొందిన తరువాత), వారు అనుదిన జీవితంలో చేసే పాపములనుగూర్చి పట్టించుకోనవసరం లేదు కదా? కాని ప్రభువు తన శిష్యులకు ఎందుకు క్షమాపణకొరకు ప్రార్థించమని చెబుతున్నారు? ఆయన ఈ ప్రార్థన వారికి, వారిద్వారా మనకు నేర్పిస్తున్నారు. ఈ ప్రార్థన వెనుక ఉన్న ఆలోచన మనం ప్రతిరోజు ఇలా ప్రార్థించాలనే!

యోహాను సువార్త 13అధ్యాయం లో యేసు తన శిష్యుల పాదములను కడుగుట కూడా ఇదే సూత్రాన్ని ఉపదేశిస్తున్నట్లు కనిపిస్తుంది. యేసు శిష్యుల పాదాలను కడిగినపుడు, అది ఒక ప్రత్యేకమైన మాదిరిగా ఉండాలని చేసాడని స్పష్టమౌతుంది. అది సేవక-నాయకత్వ సూత్రాన్ని నేర్పిస్తుంది అనేది నిజమే. అయితే, ఆయన పాదాలను కడిగిన తరువాత చెప్పిన మాటలు, ఈ పాపపూరిత లోకంలో జీవిస్తున్న క్రైస్తవులకు ప్రతిదినము శుద్ధిచేసుకొని, పవిత్రపరచుకోవడాన్నిగూర్చిన అవసరతను సూచించే విషయాన్ని బోధిస్తున్నారు.

“నా పాదములను మాత్రమే కాక నా చేతులు నా తల కూడా కడుగుము” (యోహాను 13:9)అని పేతురు అన్నప్పుడు, యేసు ఇచ్చిన జవాబు, “స్నానము చేసినవాడు పాదములు తప్ప మరేమియు కడుగుకొన నక్కరలేదు, అతడు కేవలము పవిత్రుడయ్యెను...” (10వచనం). ఈ మాటలు -ప్రభువైన యేసు క్రీస్తునందు విశ్వాసముంచినవారు, ప్రాముఖ్యంగా వారి పాపములు క్షమించబడి (న్యాయబద్ధమైన క్షమాపణ పొంది)యున్నారు (అంత్యతీర్పులో వారి పాపములు జ్ఞప్తికి రాని విధంగా క్షమాపణ పొందారు), అయితే విశ్వాసి ఈ పాపలోకంలో తిరుగుతున్నందున వారి ఆత్మీయ పాదాలు ప్రతి దినము కడుగుకోవలసిన అవసరత ఉన్నది అని సూచిస్తున్నాయి. ప్రతిరోజు పాపమును ఒప్పుకొని, పరలోకపు తండ్రితో సన్నిహితమైన సహవాసాన్ని నూతనపరచుకోమన్న ఆలోచనను స్థిరపరస్తున్నది. 1 యోహాను 1:9 చెపుతున్నటువంటి క్షమాపణ ఇదేననిపిస్తుంది.

**5) 1యోహాను 1:9 వచనాన్ని మనం హృదయపూర్వకంగా అనుసరించడం నేర్చుకోవాలి.**

1యోహాను 1:9లో ఉన్న మాటల్ని, దురుపయోగం చేసి పూర్తిగా యాంత్రికంగా ఉపయోగించుకునే ప్రమాదం ఉన్నదనేది మనకు స్పష్టంగా తెలుస్తుంది. ఈ

వచనాన్ని ఏదో మంత్రదండంలా ఉపయోగించి, మన పాపంమీద ఆ మంత్రదండాన్ని ఆడించడం వల్ల మన పాపములు తొలగిపోయేటట్లుగా ఇవ్వబడింది కాదు. ఈ వచనాన్ని మనం చేసిన పాపములనుండి విడిపించే మంత్రంలా చదువుతూ/చెబుతూ, దేవునికి విరోధంగా చేసిన పాపమును బట్టి హృదయంలో నిజమైన పశ్చాత్తాపం లేకపోతే, మన హృదయపులోతుల్లో మరలా ఆ పాపం చేద్దామనే ఉద్దేశం కలిగి ఉన్నట్లయితే, దేవుడు అటువంటి ప్రార్థనతో సంతోషిస్తాడని మనం ఆశించకూడదు. దేవునితో ఎప్పటిలా ఉండేలా మన సన్నిహిత సంబంధం తిరిగి పొందుకుంటామని ఆశపడకూడదు. హెబ్రీ. 4:13లో "...దేవుని కన్నులకు సమస్తమును మరుగులేక తేటగా ఉన్నది" అని బైబిల్ చెబుతోంది. ఇంకా అనేకచోట్ల, దేవుడు మన హృదయాలను పరిశీలనగా చూస్తున్నాడని లేఖనాలు చెబుతున్నాయి (1 దినవృత్తాంతము 28:9; కీర్తన 7:9; యిర్మియా 17:10; ప్రకటన 2:23).

ఈ వచనాన్ని సరిగ్గా ఉపయోగించడానికి రహస్యం దేవునియెదుట మన హృదయ స్థితిమీద ఆధారపడి వున్నది. ఒక పాపి దేవునియెదుట తన పాపముతో ఎలా వ్యవహరించాలో అన్న విషయానికి మాదిరి, బైబిలంతటిలో దావీదుకన్నా ఎవరూ లేరు. దేవుడే దావీదును "...నా హృదయానుసారుడు.." అని పిలుస్తున్నాడు (అపో. కార్యములు 13:22). 51వ కీర్తన, 32వ కీర్తనలనుగూర్చి మనం ఆలోచించినపుడు, దేవునియెదుట పాపము, అపరాధభావన అనే సమస్యలను ఎలా పరిష్కరించుకోవాలో అనేవిషయంలో దావీదుకున్న హృదయ పరిజ్ఞానంయొక్క లోతును మనం గుర్తించగలం. దేవునికి విరోధముగా పాపము చేసి, దేవుడు మనమీద పెట్టుకున్న ఆశలను వమ్ముచేసి, దేవుడు మనలనుబట్టి భయంకరంగా అభ్యంతరపడేటట్లు చేసిన తరువాత కూడా, ఆయనతో సాన్నిహిత్యాన్ని ఎలా తిరిగిపొందుకోవాలో దావీదు దృష్టాంతముగా చూపిస్తాడు. దావీదు దేవుని యెదుట తన పాపమును ఎలా ఒప్పుకున్నాడో చెప్పడానికి ఉదాహరణగా గమనించండి:

కీర్తన 139:23-24, "దేవా నన్ను పరిశోధించి నా హృదయమును తెలిసికొనుము, నన్ను పరీక్షించి నా ఆలోచనలను తెలిసికొనుము. నీకాయాసకరమైన మార్గము నాయందున్నదేమో చూడుము, నిత్యమార్గమున నన్ను నడిపించుము."

కీర్తన 51:10, "దేవా, నాయందు శుద్ధ హృదయము కలుగజేయుము, నా అంతరంగములో స్థిరమైన మనస్సు నూతనముగా పుట్టించుము."

కీర్తన 66:18, "నా హృదయములో నేను పాపమును లక్ష్యము చేసినయెడల, ప్రభువు నా మనవి వినకపోవును."

కీర్తన 19:14, "నా నోటి మాటలు నా హృదయధ్యానము నీ దృష్టికి అంగీకృతములగునుగాక."

దావీదు దేవునియెదుట తన పాపమును ఒప్పుకున్నపుడు ఎలాంటి హృదయవైఖరి కలిగియున్నాడో, అలాంటి వైఖరి మనకు కూడా ఉండునట్లు ఇలాంటి వాక్యభాగాలను మనం కంఠస్థం చేసి వాటిని ధ్యానించాలి. దేవుని పరిశీలనా దృష్టికి దావీదు హృదయమును తెరచి సిద్ధముగా ఉన్నాడు అనేది స్పష్టం. నిజానికి అతడు తన హృదయాన్ని పరీక్షించమని, ఆయనకు అభ్యంతరం కలిగించే విషయాలు తన హృదయంలో ఉంటే చూపించమని దేవునిని ఆహ్వానిస్తున్నాడు. మన పాపము అపరాధభావన విషయములో దేవునివద్దకు వెళ్ళినపుడు ఇలాంటి సంపూర్ణ యథార్థతతో ప్రభువు యెదుటికి మనం వెళ్ళాలి.

తాను పాపంచేసి దేవునిని బాధపెట్టానని దావీదుకు తెలిసినపుడు, తన హృదయం దేవుని యెదుట సరిగాలేదు అని తనకు తెలిసిన వెంటనే, తనలో శుద్ధహృదయం, సమ్మతిగల మనస్సును కలుగజేయుమని దావీదు ప్రార్థిస్తున్నాడు. ఈయన తనమీద తాను జాలిపడుతూ, కోపంతో మునిగి ఉండడంతో సంతృప్తి చెందినవాడుగా లేడు. పాపమనే కేన్సర్ తన హృదయాన్ని విషంతో నింపడానికి అనుమతించదలచుకోలేదు. దేవుని యెదుట శుద్ధమైన నూతన ఆరంభంకొరకు మొఱ్ఱపెడుతున్నాడు. అనుదినము మనం చేయాల్సినది అదే! దేవునితో అనుదినము క్రమం తప్పకుండా నడవడానికి రహస్యం ఇదే.

దావీదు హృదయం వేషధారణ లేనిదిగా ఉంది. తాను ఇంకా హృదయంలో ఏదైనా పాపంతో ఆటలాడుతుంటే, దేవుడు దానిమూలంగా మోసపోడు అని అతనికి తెలుసు. నిజానికి, తన హృదయంలో రహస్య పాపం ఉన్నది అనేవిషయం తాను అంగీకరించకుండా, నిరాకరిస్తూ కొనసాగితే తనను తానే మోసం చేసుకుంటున్నాడని అతనికి తెలుసు. దేవునికి తెలుసని దావీదుకు

తెలుసు, కాబట్టి దేవుడు తనతో సహవాసానికి ఇష్టపడడని, తన ప్రార్థనలను వినడని కూడా దావీదుకు తెలుసు (కీర్తన 66:18). కాబట్టి తన వేషధారణ అంతటిని కడగమని, తన నోటి మాటలు హృదయధ్యానము దేవునికి అంగీకారమగునట్లుగా దేవునిని బ్రతిమాలుకుంటున్నాడు.

**6) దేవుడు క్షమించడానికి ఇష్టపడుతున్నాడు, క్షమించడానికి సిద్ధంగా ఉన్నాడు అనే విషయంలో బైబిల్ ప్రకారం సరియైన దృక్కోణాన్ని కలిగియుండాలి.**

దేవుడు మన పాపాన్ని బట్టి మనమీద కక్షగట్టి, సులువుగా క్షమించడానికి ఇష్టపడటంలేదు అని సాతాను మనలను ఒప్పించగలిగితే, వాడు మనలను రోజుల తరబడి, వారాల తరబడి, నెలల తరబడి హృదయాన్ని బరువెక్కించే అపరాధభావనతో మనముండేలా చేయవచ్చు. ఎంతగా అంటే, వాడు మనల్ని నేలను పడవేసి, మరల లేవకుండా తన కాలిక్రింద మనలను అణచివేసేటంత!

మరలా ఇక్కడ, సత్యమే మనలను స్వతంత్రులుగా చేస్తుంది (యోహాను 8:31). దేవుని స్వభావాన్నిగూర్చి సాతాను చెప్పే ఈ అబద్ధాన్ని మనం నమ్మకుండా ఉంటే, ఈ అంశాన్నిగూర్చి లేఖనము బోధించేదాన్ని నమ్మితే, మనం జారిపడినా (పాపం చేసినా) క్రిందపడి ఉండాల్సిన అవసరం లేదు!

మీకా 7:7-9, "...నేను క్రింద పడినను, తిరిగి లేతును; నేను అంధకారమందు కూర్చున్నను యెహోవా నాకు వెలుగుగానుండును."

సామెతలు 24:16, "నీతిమంతుడు ఏడుమారులు పడినను తిరిగి లేచును, ఆపత్కాలమందు భక్తిహీనులు కూలుదురు."

కీర్తన 30:5, "ఆయన కోపము నిమిషమాత్రముండును, ఆయన దయ ఆయుష్కాలమంతయు నిలుచును. సాయంకాలమున ఏడ్పువచ్చి, రాత్రి యుండినను ఉదయమున సంతోషము కలుగును."

కీర్తన 103:8-10, "యెహోవా దయాదాక్షిణ్యపూర్ణుడు, దీర్ఘశాంతుడు, కృపా సమృద్ధిగలవాడు. ఆయన ఎల్లప్పుడు వ్యాజ్యెమాడువాడు కాడు, ఆయన నిత్యము కోపించువాడు కాడు. మన పాపములను బట్టి మనకు ప్రతికారము

చేయలేదు, మన దోషములనుబట్టి మనకు ప్రతిఫలమియ్యలేదు."

కీర్తన 103:13,14 "తండ్రి తన కుమారులయెడల జాలిపడునట్లు యెహోవా తనయందు భయభక్తులు గలవారియెడల జాలిపడును. మనము నిర్మింపబడిన రీతి ఆయనకు తెలిసేయున్నది, మనము మంటివారమని ఆయన జ్ఞాపకము చేసికొనుచున్నాడు."

1 సమూయేలు 12:20-22, "భయపడకుడి, మీరు ఈ కీడు చేసినమాట నిజమే, అయినను యెహోవాను విసర్జింపకుండ ఆయనను అనుసరించుచు పూర్ణహృదయముతో ఆయనను సేవించుడి...... ఆయనను విసర్జింపువారు ప్రయోజనముమాలినవై రక్షింపలేని మాయా స్వరూపములను అనుసరించుదురు... యెహోవా మిమ్మును తన జనముగా చేసికొనుటకు ఇష్టము గలిగియున్నాడు; తన ఘనమైన నామము నిమిత్తము తన జనులను ఆయన విడనాడడు."

కీర్తన 130:3-4, "యెహోవా, నీవు దోషములను కనిపెట్టి చూచినయెడల, ప్రభువా, ఎవడు నిలువగలడు? అయినను జనులు నీయందు భయభక్తులు నిలుపునట్లు నీయొద్ద క్షమాపణ దొరుకును."

యాకోబు 3:2, "..మనమందరము అనేక విషయములలో తొట్రిల్లుచున్నాము.."

కీర్తన 65:3, "నా మీద మోపబడిన దోషములు భరింపజాలనివి, మా అతిక్రమముల నిమిత్తము నీవే ప్రాయశ్చిత్తము చేయుదువు."

2 సమూయేలు 24:14-16లో, తన పాపమునుబట్టి భూమి మీదనున్న తన శత్రువుల చేతిలో శిక్ష అనుభవిస్తాడా లేక ప్రభువుచే శిక్షించబడాలా అనే ప్రశ్నకు దావీదు జవాబు, "..యెహోవా బహు వాత్సల్యత గలవాడు గనుక మనుష్యుని చేతిలో పడకుండ యెహోవా చేతిలోనే పడుదుముగాక...."

**ముగింపు:** విజయవంతమైన క్రైస్తవ జీవితాన్ని జీవించడానికి రహస్యం- ప్రతిరోజు దేవునికి దగ్గరగా నడచుట నేర్చుకోవడంలోనే ఉన్నది! అది దేవునితో యథార్థమైన

సాన్నిహిత్యంలో నడవటం అలవరచుకొనుటలోను, అటువంటి సహవాసంను కాపాడుకొనుటలోనే ఉన్నది. ఇది లేకుంటే, మనం ఓడిపోతూనే ఉంటాం!

మన దేవుడు అనంత పరిశుద్ధుడు. ఆయనకు సమీపంగా నడవాలంటే, మనం మన పాపముతో, అపరాధభావనతో ఎలా వ్యవహరించాలో నేర్చుకోవాలి. ఈ ప్రక్రియలో ప్రాముఖ్యమైనది- ప్రతి దినము, క్రమముగా, హృదయపూర్వకముగా మన పాపములను ఒప్పుకొనుట, ఆ పాపములు క్షమించబడడానికి క్రీస్తునందు, ఆయన మనకొరకు కార్చిన రక్తము ఆధారంగా దేవుని నమ్మకత్వమునందు విశ్వసించుట. ప్రకటన 12:10-11వచనాలు తెలియజేసేది ఇదే, "...రాత్రింబగళ్ళు మన దేవునియెదుట మన సహోదరులమీద నేరము మోపువాడు **పడద్రోయబడియున్నాడు...వారు గొఱ్ఱెపిల్ల రక్తమునుబట్టియు, తామిచ్చిన సాక్ష్యమును బట్టియు వానిని జయించియున్నారు..."**

**ఆచరణాత్మక సూచన :** నీవు తరచుగా ఏ పాపములలో పడిపోతున్నావని నీవు ఎరుగుదువో, ఏ పాపముల విషయమై జాగ్రత్తగా ఉండాల్సివుందో ఒక పట్టిక తయారుచేయుము. ప్రతిరోజు నీ ప్రార్థన సమయంలో ఈ పట్టికను ఉపయోగించి ప్రార్థించు. కేవలం ఆ పట్టికను మరలా మరలా చదవటం వ్యర్థమని గమనించు. అయితే, గడచిన రోజును ఆ పట్టికతో పోల్చి చూచి, ఆ రోజు ఎలాగడచిందో లెక్కకట్టడం చేస్తే, అలాంటి పట్టిక వల్ల గొప్ప లాభం ఉంటుంది! మన ఈ విషయమై ఎంత పట్టుదలతో ఉన్నామో, మన జీవితాలలో ఆయనను బాధపెట్టే పాపముల విషయమై ఎంత గంభీరంగా ఆలోచిస్తున్నామో దేవుడు కూడా తెలుసుకుంటారు.

## నాలుగవ అధ్యాయమునుగూర్చిన చర్చించే ప్రశ్నలు

# “తిరిగి సమకూర్చడం”

### క్రియాత్మక “మాష్” బృందాన్ని నిర్వహించడం

1. ప్రతి క్రైస్తవునికి ఒక “ఆత్మీయ ‘మాష్’ బృందం” ఎందుకు అవసరమో క్లుప్తముగా వివరించండి. (131 పేజి)

2. క్రైస్తవులను ఆత్మీయంగా గాయపరచుటకు లేక వికలాంగులను చేయుటకు అపవాది ఎలాంటి పరికరాలను వాడతాడు? (132 పేజి)

3. మన పాపం విషయానికొచ్చేసరికి 1యోహాను 1:5-2:2 వచనాలు నిజజీవితంలో సమతౌల్యాన్ని ఎలా కాపాడుతాయి? (133 పేజి)

4. ప్రకటన 12:10,11 ప్రకారం మనమీద నేరము మోపేవాడెవరు? వాడి దోషారోపణకు మనము ఎలా స్పందించాలో క్లుప్తముగా వ్రాయండి. (135 పేజి)

5. క్రైస్తవులముగా దేవునితో మనకున్న “అనుబంధానికి”, “సహవాసానికి” ఉన్న తేడాను క్లుప్తముగా వివరించండి. (136 పేజి)

6. 1యోహాను 1అధ్యాయంలో, యోహాను "అనుబంధాన్ని" గూర్చి కాక "సహవాసము"నుగూర్చి చెబుతున్నాడు అనడానికి రుజువు ఏమిటి? (136-137 పేజిలు)

7. మనం దేవునికి విరోధముగా పాపం చేసి, ఆ పాపమునుగూర్చి పశ్చాత్తాప పడకపోతే ఏమి జరుగుతుంది? (137 పేజి)

8. "న్యాయబద్ధమైన క్షమాపణ", "తల్లిదండ్రుల క్షమాపణ" ల మధ్య తేడాను వివరించండి. (138-142 పేజిలు)

9. దేవుడు మన పాపములను మరల జ్ఞాపకం చేసుకోను అన్న యిర్మియా 31:34 యొక్కభావము ఏమిటి? దేవుడు సర్వజ్ఞాని కదా, ఆయన మరచిపోవడం ఎలా సాధ్యం? (138 పేజి)

10. న్యాయబద్ధమైన క్షమాపణకు సంబంధించిన వాక్యముల చుట్టూ వృత్తము గీయండి, తల్లిదండ్రుల క్షమాపణకు సంబంధించిన వాక్యముల చుట్టూ చతురస్రం గీయండి:

| | | |
|---|---|---|
| ఎఫెసి 4:30; | యిర్మియా 31:34; | కీర్తన 66:18; |
| 1పేతురు 3:7; | కీర్తన 103:12; | 1యోహాను 1:9; |

కొలస్సి 2:13-14; మీకా 7:19; మత్తయి 6:12;
యోహాను 13:2-17; యెషయా 43:25

11. 1యోహాను 1:9వచనాన్ని ఎలా అపార్థం చేసుకునే అవకాశాలున్నాయి, ఎలా దుర్వినియోగం చేసే అవకాశాలున్నాయి? (142 పేజి)

12. మన పాపములు దేవునితో ఒప్పకొనే విషయంలో పాత నిబంధనలోని రాజైన దావీదు ఒక మంచి ఉదాహరణగా ఎలా ఉన్నాడు? 142-143 పేజిలు)

13. మన పాపములను మనము ఒప్పకొనునప్పడు దేవుని గురించి మనం ఏమి మనసులో ఉంచుకోవాలి? (144 పేజి)

14. మన పాపములను మనము ఒప్పకొనునప్పడు మన గురించి మనం ఏమి మనసులో ఉంచుకోవాలి? (యిర్మియా 17:9)

15. "నీ హృయమనే తోటను కాపాడుకొనుట" అనే మొదటి అధ్యాయములో చర్చించిన వ్యూహానికి 1యోహాను 1:9 లోని పాపమును ఒప్పకొనుట ఎలా అన్వయించవచ్చో గమనించారా? ఎలాగో చెప్పండి?

## ఎనిమిదవ అధ్యాయం

# "సహనము"

**"కాగా నా ప్రియ సహోదరులారా, మీ ప్రయాసము ప్రభువునందు వ్యర్థముకాదని యెరిగి, స్థిరులును, కదలనివారును ప్రభువు కార్యాభివృద్ధియందు ఎప్పటికిని ఆసక్తులునై యుండుడి."**

**1 కొరింథి. 15:58**

నా ఉదయకాల ధ్యానసమయాలు గడపడానికి నాకు ఒక ఇష్టమైన చోటు ఉంది. నా సంఘం ఒక సౌకర్యవంతమైన లెదర్ రిక్లెయినర్ (చర్మంతో చేసిన వెనక్కి ఆనుకోవడానికి సరిచేసుకునే కుర్చీ), ప్రక్కనే ఒక చిన్న బల్ల దానిమీద ఒక లైటు ఇచ్చారు. ఒకసారి కొద్దిరోజులపాటు ఆ లైటు మిణుకు మిణుకుమనటం మొదలుపెట్టింది. వెలుగు చీకటిల మధ్య చాలా విసుగువుట్టింది. నేనైతే లైటు మార్చివేయాలి లేదా సమస్య ఏమిటో చూడాల్సివుంది అనుకున్నాను. అదృష్టవశాత్తు నేను మొదటిగా చేసిన ప్రయత్నమే సమస్యను తెలియజేసేసింది. ఆ లైటుకు స్విచ్చు వైరుపైనే ఇచ్చాడు. ఆ స్విచ్చు మీద ఉన్న చిన్న నట్టును నేను బిగించగానే లైటు బాగయ్యిపోయింది. ఇక వెలుగు చీకటిలమధ్య ఉండకుండా, సౌకర్యవంతమైన వెలుగు నా పఠనానికి, ధ్యానానికి ఆటకం లేకుండా అయింది.

సమస్య, వదులైన నట్టు లేక విద్యుత్ ప్రవాహంలో అవరోధం. ఒకవేళ బల్బు వదులుగా ఉన్నా అదే సమస్య వచ్చేది. ఒకవేళ విద్యుచ్ఛక్తితో స్థిరమైన అనుసంధానం లేకపోతే లైటు మిణుకు మిణుకుమంటుంది.

తన శిష్యులు "లోకమునకు వెలుగు" అని ప్రభువైన యేసు చెప్పారు (మత్తయి 6:35). ఫిలిప్పీలో ఉన్న క్రైస్తవులు "నక్షత్రములవలె వెలగాలని" కాంక్షను వెలిబుచ్చాడు అపొస్తలుడైన పౌలు (ఫిలిప్పీ 2:16). కాని **మన వెలుగుకు ఆధారమైన శక్తితో మనం స్థిరంగా సంధించబడకపోతే, ఈ నశించిన, మరణతుల్యమైన లోకంలో ప్రయోజనకరమైన బలమైన కాంతిని ఇవ్వలేము. అలా జరగాలంటే ఆత్మీయ క్రమశిక్షణలలో సహనము కలిగివుండటం ఒక్కటే మార్గం!** మనకు ఆత్మీయశక్తినిచ్చే మూలమునకు అనుసంధానంలో ఉండాలి. మన జీవితాలు నిత్యత్వపు విలువలు కలిగిన

విషయాలు సాధించాలంటే, దేవునికి ఇష్టమైనవి, అంత్యదినమున బహుమతిని తెచ్చే పనులు చేయాలంటే, మనం అనుదినము విడువక దేవునితో నడిచే అనుభవాన్ని సంపాదించుకోవాలి. మనం క్రమంగా, విడువకుండా మనకు శక్తిని ఇచ్చే మూలమునకు సంధించబడకపోతే, మనచుట్టూ ఉన్నవారికి వెలుగును ఇవ్వలేం.

చాలామందికి, ఆత్మీయ క్రమశిక్షణలలో నమ్మకంగా సహనంగా ఉండలేకపోవడనికి కారణం అనుదిన జీవితంలో తీరికలేకపోవడవే. చాలామంది క్రైస్తవులకు తెలుసు అనుదిన ప్రార్థన, బైబిల్ పఠనం, వాక్యం కరస్థం చేయడం, ధ్యానం చేయాలి అని; కాని ఇలాంటి ఆత్మీయ క్రమశిక్షణలు క్రమంగా దైనందిన అలవాటుగా చేసుకొనలేకపోతున్నారు. ప్రతి నిజమైన విశ్వాసిలో పరిశుద్ధాత్మ నివసించి, ప్రభువుతో అనుదిన సహవాసానికి లోతైన కోరికను కలిగిస్తారు. సమస్య మన బద్ధకపు శరీరము, జీవితంలోని కలత చికాకులు.

ప్రభువుతో క్రమమైన, మానని నడకలో మనలను స్థిరపడనీయకుండా చేయడానికి అపవాది దగ్గర చాలా తెలివైన వాదనలు ఉన్నాయి. వాడికిష్టమైన, చాలా విజయవంతమైన ఆలోచన ఒకటి: "జీవితం నెమ్మదించినపుడు, నా ఆత్మీయ జీవితాన్నిగూర్చి నేనేం చేయాలో అది చాలా గంభీరంగా చేస్తాను". కాని నిజం ఏమిటంటే, మనలో చాలామందికి, జీవితం ఎప్పడూ నెమ్మదించదు! రెండు ప్రాథమిక సత్యాలను మనం ఎదుర్కోవాలి : 1) మనకు తీరిక ఎప్పడూ ఉండదు; 2) చాలామంది దేవుని ప్రజలు తీరికలేకుండా ఉన్నవాళ్లే!

ప్రభువైన యేసుక్రీస్తు సహితం తీరికలేనివాడే! సువార్తల్లో ఆయన రోజంతా పరిచర్య చేసి, కొన్నిసార్లు రాత్రుళ్ళు కూడా పరిచర్య చేసి, మరలా పెందలకడే లేచి ప్రార్థించి మరలా తరువాతి గ్రామానికి పరిచర్యకు కొనసాగిపోయేవారు. కొన్ని రాత్రులు ఆయనసలు నిద్ర పోనేలేదు. జనులు ఆయనను కలుసుకోవడానికి, ఆయనతో సమయం గడపడానికి పోటెత్తేవారు. ఆయన శరీరకంగా బాగా అలసిపోయినందున ఒక సందర్భంలో, తుఫానుతో కొట్టబడుతున్న ఒక చిన్న దోనెలో నిద్రపోయారు. "పనికి సంబంధించిన వత్తిడి" గురించి ఆయనకు బాగా తెలుసు. ఆయన, అపొస్తలుడైన పౌలు నేడు జీవించి ఉన్నట్లయితే, ఈ తరము వారు వారిద్దరినీ, శరీరాలను పట్టించుకోని పని

రాక్షసులు అని ముద్ర వేసేవారే!

ముఖ్యమైన విషయం ఏమిటంటే, ఆత్మీయ క్రమశిక్షణలు కేవలం చాలా ఖాళీ సమయం ఉండే క్రైస్తవుల కోసం మాత్రమే ఉద్దేశించబడినవి కావు! దేవుడు విశ్వాసులందరికీ ఇచ్చిన ఆజ్ఞ, మనందరమూ ఆయనను పూర్ణహృదయముతో, మనస్సుతో, బలముతో ప్రేమించాలి, అలాగే మనవలె మన పొరుగువారిని ప్రేమించాలని. ఇది మన ఖాళీ సమయాల్లో చేసే పనికాదు! ఇప్పుడు పాఠకుల్లో కొందరు అనడం నేను వింటున్నాను, "సరే కాని నా కార్యక్రమాల సంగతి మీకు తెలియదు, నా జీవితం ఎలాంటిదో మీకు తెలియదు" అని. అలాంటి వారికి క్రీస్తు తానే స్వయంగా చెప్పిన మాటలు మాత్రమే నేను చెప్పగలను, "...దేవుని రాజ్యమును ఆయన నీతిని మొదట వెదకుడి, అప్పుడవన్నియును మీకనుగ్రహించబడును." (మత్తయి 6:33). క్రీస్తు ఇచ్చిన ఈ ఆజ్ఞకు విధేయత చూపడానికి విశ్వాస స్పందన అవసరమని నేను నమ్ముతున్నాను! ఆయన మనకు ఇచ్చిన ఆజ్ఞలకు ప్రాధాన్యతనిచ్చి ఆయనయందు మనకున్న నమ్మకాన్ని విశ్వాసాన్ని కనుపరస్తే, మనకు అవసరమైనవి, అంతకంటె ఎక్కువ బహుమతులిస్తాడని మనకు తెలియపరచబడుచున్నది.

నిజానికి, ఆత్మీయ క్రమశిక్షణలు పాటించడం, మనకు మన జీవితంలోని ప్రాధాన్యతలు క్రమపరచుకోవడానికి అధిక జ్ఞానమునిస్తుంది. దేవునితో గడపడానికి మనకు సమయం లేదు అనే సత్యం, మన జీవితంలోని ప్రాధాన్యతల విషయంలో మనం సరిగా ప్రవర్తించడం లేదు అనడానికి ఉదాహరణ. నిజంగా ఉపయోగపడే, ప్రాముఖ్యమైన విషయాలు ఏమిటో ఆయన మనకు చూపేలా ఆయనను విశ్వసించడం మంచిది కదా! ఇప్పటికైనా మన జీవితంలో ఉదయకాలపు ధ్యానము వంటి ఆత్మీయ క్రమశిక్షణల విషయంలో సహనంగా ఉండునట్లు హృదయములో ఉద్దేశించుకుందాం. మనం మన సమర్పణ విషయంలో సాకులు చెప్పడం రాజీపడటం ఆరంభిస్తే, మనం క్రీస్తు ఆజ్ఞ ప్రకారం "మొదట" దేవుని సంగతులను వెదకడంలో విఫలమైనట్టే. ఒకరోజు రెండురోజులు మానేస్తావేమో అన్న భయం మనలను మొత్తానికి మొదలుపెట్టకుండా చేయకూడదు. సహనం అంటే ఎన్నిసార్లు మనం చేయలేకపోయినా, మరలా మొదటినుండి ఆరంభించడం అని అర్థం!

## 2 పేతురు 1:1-15నుండి సహనానికి పాఠములు

సహనాన్ని గూర్చి కొన్ని ముఖ్యమైన తలంపులు 2 పేతురు 1:1-15వరకు ఉన్నవచనాలలో మనం చూడవచ్చు. సహనాన్నిగూర్చి మనం చేస్తున్న ధ్యానంలో ఈ వాక్యభాగాన్ని మన మార్గదర్శిగా ఉపయోగించుకుంటాం.

> "యేసు క్రీస్తు దాసుడును అపొస్తలుడునైన సీమోను పేతురు, మన దేవునియొక్కయు రక్షకుడైన యేసుక్రీస్తుయొక్కయు నీతినిబట్టి, మావలెనే అమూల్యమైన విశ్వాసము పొందినవారికి శుభమని చెప్పి వ్రాయునది. తన మహిమనుబట్టియు, గుణాతిశయమును బట్టియు మనలను పిలిచినవాని గూర్చిన అనుభవ జ్ఞానమూలముగా ఆయన దైవశక్తి, జీవమునకును భక్తికిని కావలసిన వాటినన్నిటిని మనకు దయచేయుచున్నందున, దేవుని గూర్చినట్టియు, మన ప్రభువైన యేసునుగూర్చినట్టియునైన అనుభవ జ్ఞానమువలన మీకు కృపయు సమాధానమును విస్తరించునుగాక. ఆ మహిమ గుణాతిశయములనుబట్టి ఆయన మనకు అమూల్యములును అత్యధికమైన వాగ్దానములను అనుగ్రహించియున్నాడు. దురాశను అనుసరించుటవలన లోకమందున్న భ్రష్టత్వమును ఈ వాగ్దానముల మూలముగా మీరు తప్పించుకొని, దేవ స్వభావమునందు పాలివారగునట్లు వాటిని అనుగ్రహించెను. ఆ హేతువుచేతనే మీ మట్టుకు మీరు పూర్ణజాగ్రత్తగలవారై మీ విశ్వాసమునందు సద్గుణమును, సద్గుణమునందు జ్ఞానమును, జ్ఞానమునందు ఆశానిగ్రహమును, ఆశానిగ్రహమునందు సహనమును, సహనమునందు భక్తిని, భక్తియందు సహోదర దయను, సహోదర దయయందు ప్రేమను అమర్చుకొనుడి. ఇవి మీకు కలిగి విస్తరించినయెడల అవి మన ప్రభువైన యేసుక్రీస్తునుగూర్చిన అనుభవజ్ఞాన విషయములో మిమ్మును సోమరులైనను నిష్ఫలులైనను కాకుండ చేయును. ఇవి ఎవనికి లేకపోవునో వాడు తన పూర్వపాపములకు శుద్ధి కలిగిన సంగతి మరచిపోయి, గ్రుడ్డివాడును దూరదృష్టిలేనివాడునగును. అందువలన సహోదరులారా, మీ పిలుపును ఏర్పాటును నిశ్చయము చేసికొనుటకు మరి జాగ్రత్తపడుడి. మీరిట్టి క్రియలు చేయువారైతే ఎప్పడును తొట్రిల్లరు.

ఆలాగున మన ప్రభువును రక్షకుడైన యేసుక్రీస్తు యొక్క నిత్య రాజ్యములో ప్రవేశము మీకు సమృద్ధిగా అనుగ్రహింపబడును. కాబట్టి మీరు ఈ సంగతులను తెలిసికొని మీరంగీకరించిన సత్యమందు స్థిరపరచబడియున్నను వీటినిగూర్చి ఎల్లప్పుడును మీకు జ్ఞాపకము చేయుటకు సిద్ధముగా ఉన్నాను. మరియు మన ప్రభువైనయేసుక్రీస్తు నాకు సూచించిన ప్రకారము నా గుడారమును త్వరగా విడిచిపెట్టవలసివచ్చునని యెరిగి, నేను ఈ గుడారములో ఉన్నంతకాలము ఈ సంగతులను జ్ఞాపకము చేసి మిమ్మును రేపుట న్యాయమని యెంచుకొనుచున్నాను. నేను మృతిపొందిన తరువాతకూడ మీరు నిత్యము వీటిని జ్ఞాపకము చేసికొనునట్లు జాగ్రత్త చేతును.

**1. మన విశ్వాసమునకు చేర్చుకొనవలసినవాటిలో సహనము ఒకటని మనకు మందలింపు ఇవ్వబడింది (6వచనం) :**

"....పూర్ణ జాగ్రత్తగలవారై విశ్వాసమునందు...సహనమును" (5,6 వచనాలు). దీని అర్థం సహనము అనేది "అంతగా అవసరములేని" లేక మన రక్షణకు కలుపుకోవలసిన "కొంచెం అధిక"మైనది అని కాదు. మనమెంత అసంపూర్ణంగా స్పందించినా సరే, ప్రతి విశ్వాసిని పరిశుద్ధాత్మ విశ్వాసములో సహనముతో సాగమని ప్రోద్బలం ఇస్తుంది అనే భావన ఇందులో ఉన్నది (ఫిలిప్పీ 1:6; 2 తిమోతి 1:7; 1యోహాను 2:19). అయితే ఈ సందర్భంలో (2 పేతురు 1:6), సహనము బహుమతి పొందే ఒక గుణలక్షణముగా చూపబడింది. వేరే మాటల్లో చెప్పాలంటే, దేవుడు మనలో సహనాన్ని పుట్టించే విధానం, మనం దేవునిని, నిత్యజీవాన్ని ఇష్టపడి మన:పూర్వకంగా వెంబడించేలా చేస్తుంది. **దేవుడు మనముందు సహనం చూపాలని మందలింపు, హెచ్చరిక పెట్టి, తరువాత ఆయన మనముందు ప్రోత్సాహకాలు ఉంచుతున్నాడు.**

## సహనమునకు హెచ్చరికలు, ప్రోత్సాహకాలు

**(అంటే మన విశ్వాసమునకు సహనమును "కలుపుకోవడం")**

లేఖనాలు మనం నమ్మకస్థులుగా ఉన్నందుకు, విశ్వాసంలో సహనము చూపినందుకు, ప్రభువుతో మన నడకలో మనకు అనేక హెచ్చరికలు, ప్రోత్సాహకాలు ఇస్తున్నాయి :

1) ఒక గొప్ప ప్రోత్సాహకం **"ప్రభువునందు మన ప్రయాస వ్యర్థం కాదు అనే సత్యం".** 1కొరింథి 3:11-14వచనాలలో కొందరు విశ్వాసులు తమ సమయాన్ని దేవుని దృష్టిలో గడ్డి, కఱ్ఱ, కొయ్యకాలువంటి పనులు చేస్తూ వృథా చేయడం వివరిస్తుంది. అలాంటి పనికిరాని పనులు అంత్య తీర్పులో క్రీస్తు యెదుట అగ్నిలో కాలి బూడిదైపోతాయి అని మనం చూస్తాం. అందుకే పౌలు కొరింథీయులను హెచ్చరిస్తున్నాడు "...స్థిరంగా ఉండండి, కదలనివారుగా ఉండండి, ప్రభువు కార్యాల విషయంలో ఎల్లప్పుడూ ఆసక్తిగా ఉండండి, ఎందుకంటే ప్రభువునందు మీ ప్రయాస వ్యర్థము కాదు అని మీరు ఎరుగుదురు" (1 కొరింథి.15:58). ఒక్కసారి ఆలోచించండి! జీవితం ఎంతో చిన్నది! క్రొత్త నిబంధనలో యాకోబు అంటున్నాడు, "మీ జీవమేపాటిది? మీరు కొంతసేపు కనబడి అంతలోనే మాయమయ్యే ఆవిరివంటివారే" (యాకోబు 4:14). నిష్ప్రయోజనమైన వాటికొరకు ఎందుకు మన జీవితాన్ని చెదరగొట్టుకోవడం? ఈ జీవితంలో ఉన్న కొద్ది సమయంలో నిత్యత్వపు ప్రాధాన్యత గలవాటిని సాధించడానికి ప్రయత్నించవచ్చునుగదా?

దేవుడు విధేయత చూపి నమ్మకస్థులుగా పరిచర్య చేసిన వారికి బహుమాన మివ్వడం మరచిపోడు అనే సత్యాన్ని మరలా స్థిరపరచే మరొక వాక్యభాగం హెబ్రీ 6:10-12: "మీరు చేసిన కార్యమును, మీరు పరిశుద్ధులకు ఉపచారము చేసి యింకను ఉపచారము చేయుచుండుటచేత తన నామమునుబట్టి చూపిన ప్రేమను మరచుటకు దేవుడు అన్యాయస్థుడు కాడు. మీరు మందులుకాక, విశ్వాసము చేతను ఓర్పుచేతను వాగ్దానములను స్వతంత్రించుకొను వారిని పోలి నడుచుకొనునట్లుగా మీలో ప్రతివాడును మీ నిరీక్షణ పరిపూర్ణమగు నిమిత్తము మీరిదివరకు కనుపరచిన ఆసక్తిని తుదమట్టుకు కనుపరచవలెనని అపేక్షించుచున్నాము."

2) సహనానికి ఇవ్వబడే మరొక గొప్ప ప్రోత్సాహకం **మనమందరము ఒకరోజు ప్రభువు యెదుట నిల్చి, ఈ శరీరములో ఉండగా చేసిన పనులనుగూర్చి ఆయనకు లెక్క అప్పగించడం,** అవి మంచివైనాసరే, చెడ్డవైనాసరే (2 కొరింథి 5:10). ఈ ప్రోత్సాహకం 1యోహాను 2:28లో కూడా చెప్పాడు. ఇక్కడ యోహాను పరిశుద్ధులతో చెబుతున్నాడు, "కాబట్టి చిన్నపిల్లలారా, ఆయన ప్రత్యక్షమగునప్పుడు ఆయన రాకడయందు మనము ఆయనయెదుట సిగ్గుపడక ధైర్యము

కలిగియుండునట్లు మీరాయనయందు నిలిచియుండుడి". ఈ గొప్పరోజుకొరకు మనలను మనము సిద్ధపరచుకుంటూ ఆలోచించవలసిన అవసరం ఉన్నది. మనం దానిగురించి మన జీవితంలోని ప్రతిరోజు ఆలోచించాలి! మనమెవరమో, మనము దేనినుండి రక్షింపబడ్డామో, మనము దేనికొరకు పిలువబడ్డామో ప్రతిరోజు జ్ఞాపకం చేసుకోవాలి. మన శ్రమలలో, హింసలలో తట్టుకొని నిలువబడడానికి అవసరమైన వనరులన్నీ దేవుడు మనకు ఇచ్చాడు (2 పేతురు 1:3) అనే నిశ్చయతతో మనలను ప్రోత్సాహపరచు కోవాల్సిన అవసరత ఉన్నది. ప్రతిరోజు విశ్వాసముతో, విధేయులముగా ఆయనమీద ఆధారపడి మనం బయటకు వెళ్ళాలి,..."తొట్రిల్లకుండా మిమ్మును కాపాడుటకును, తన మహిమయెదుట ఆనందముతో మిమ్మును నిర్దోషులుగా నిలువబెట్టుటకును, శక్తిగల మన రక్షకుడైన అద్వితీయ దేవునికి,"..మహిమ! (యూదా 24వచనం).

3) సహనానికి మరొక ప్రోత్సాహకం **మనం ఒంటరిగా లేము అనే సత్యం!** మన జీవితంలోని కష్టపరిస్థితులలో, మన శ్రమలవెనుక దేవుడు ఎల్లప్పుడూ ఉన్నాడు. ఆయన గమనిస్తున్నాడు, మనకేమి జరిగినా ఆయన శ్రద్ధవహిస్తున్నాడు! నిజానికి, ఈ పరిస్థితులన్నిటిని ఉపయోగించి, మనకు మేలు చేయాలనే రహస్య ప్రణాళిక కలిగి ఉన్నాడు (రోమా 8:28; యిర్మియా 29:11). గాఢాంధకార సమయాలలో కూడ, నీవు మార్గము తప్పిపోయి, ఒంటరిగా చీకటిలో ఉన్నప్పుడు సహితం, ఆయనను నమ్మి సహనముతో సాగమని దేవుడు నిన్ను ప్రోత్సహిస్తున్నాడు. యెషయా 50:10 "మీలో యెహోవాకు భయపడి ఆయన సేవకునిమాట వినువాడెవడు? వెలుగులేకయే చీకటిలో నడచువాడు, యెహోవా నామమును ఆశ్రయించి తన దేవుని నమ్ముకొనవలెను." అని చెబుతుంది.

నిజానికి, క్రొత్త నిబంధనలో యాకోబు పత్రిక ఇచ్చే సలహా ఏమిటంటే క్రైస్తవులు వారు ఎదుర్కొనే శ్రమలలో నిజానికి సంతోషించాలి. ఆ శ్రమల వెనుక దేవుని ఉద్దేశమున్నదని ఎరిగి, దేవుడు మనలను పరీక్షిస్తున్నాడు, మన విశ్వాసాన్ని శ్రమలద్వారా ప్రక్షాళిస్తున్నాడు అని గుర్తించి సంతోషించాలి. ఈ శ్రమలను వాడుకొని దేవుడు మనలో సహనాన్ని పెంపొందిస్తున్నాడు: "నా సహోదరులారా, మీ విశ్వాసమునకు కలుగు పరీక్ష ఓర్పును పుట్టించునని యెరిగి, మీరు నానావిధములైన శోధనలలో పడునప్పుడు, అది మహానందమని

యెంచుకొనుడి. మీరు సంపూర్ణులును అనూనాంగులును, ఏ విషయములోనైనను కొదువలేనివారునైయుండునట్లు ఓర్పు తన క్రియను కొనసాగింపనీయుడి." (యాకోబు 1:2-4). అదే అధ్యాయం 12వచనంలో "శ్రమను సహించువాడు ధన్యుడు; అతడు శోధనకు నిలిచినవాడై, ప్రభువు తన్ను ప్రేమించువారికి వాగ్దానము చేసిన జీవ కిరీటము పొందును." ఐదవ అధ్యాయంలో, 7,8 వచనాలు, "సహోదరులారా, ప్రభువు రాకడవరకు ఓపిక కలిగియుండుడి; వ్యవసాయకుడు తొలకరి వర్షమును కడవరి వర్షమును సమకూడు వరకు విలువైన భూఫలము నిమిత్తము ఓపికతో కాచుకొనుచు దానికొరకు కనిపెట్టును గదా. ప్రభువు రాక సమీపించుచున్నది గనుక మీరును ఓపిక కలిగియుండుడి, మీ హృదయములను స్థిరపరచుకొనుడి." అని చెప్తున్నాడు.

**గమనిక : ఇక్కడ ఆగి అపెండిక్స్‌లో ఉన్న "దృక్కోణం" చదవండి.**

4) చివరిగా, మన సహనానికి లేఖనాలలో ఉన్న ఇంకొక ప్రోత్సాహకం **ప్రభువైన యేసు క్రీస్తు మాదిరి!** హెబ్రీయులకు వ్రాసిన పత్రికలోని 11వ అధ్యాయంలో గొప్ప విశ్వాస వీరుల జాబితా వ్రాసిన తరువాత, 12వ అధ్యాయం మొదటిలో: "ఇంత గొప్ప సాక్షి సమూహము మేఘమువలె మనలను ఆవరించియున్నందున మనముకూడ ప్రతిభారమును, సులువుగా చిక్కులబెట్టు పాపమును విడిచిపెట్టి, విశ్వాసమునకు కర్తయు దానిని కొనసాగించువాడునైన యేసువైపు చూచుచు మనయెదుట ఉంచబడిన పందెములో ఓపికతో పరుగెత్తుదము. ఆయన తన యెదుట ఉంచబడిన ఆనందము కొరకై అవమానమును నిర్లక్ష్యపెట్టి, సిలువను సహించి, దేవుని సింహాసనముయొక్క కుడిపార్శ్వమున కూర్చుండియున్నాడు." (1-2 వచనాలు). ఇక్కడ క్రీస్తు తానే సహనమునకు ఒక ఉదహరణగా ఉన్నారు. ఆయన తన శ్రమలకంటె, తాను సహించాల్సిన, తట్టుకోవాల్సిన బాధలను దాటి ముందుకు (భవిష్యత్తులో తనకు కలుగబోయే మహిమను) చూసారు, నిత్యానందము వైపుకు- తాను తన స్వరక్తముతో కొన్న విమోచింపబడిన అన్ని తరముల ప్రజలు తన మహిమను చూస్తుండగా (యోహాను 17:24) తండ్రి సన్నిధిలో నిరంతరము ఉండబోతున్నాడు అనే సత్యంవైపుకు చూసారు.

మనం ఇదే ఆలోచనా విధానాన్ని కలిగివుండాలి. హెబ్రీయులకు 10:34,

ఆదికాలంలోని విశ్వాసులు క్రీస్తు చూపిన కారణాలతోనే సహనాన్ని కలిగియుండుటకు నేర్చుకున్నారు అని చూపుతుంది: "ఏలాగనగా నేను ఖైదులో ఉండగా నన్ను కరుణించి, మీకు మరి శ్రేష్ఠమైనదియు, స్థిరమైనదియునైన, పరలోక స్వాస్థ్యమున్నదని యెరిగి, మీ ఆస్తి కోలుపోవుటకు సంతోషముగా ఒప్పకొంటిరి." రోమా 8:18 ఇదే ఆలోచనను వ్యక్తపరుస్తుంది. క్రైస్తవుడు దత్తపుత్రాత్మనుపొంది, ప్రభువైన యేసుక్రీస్తు తోడి వారసుడుగా చేయబడడాన్ని వివరించిన తరువాత, అపొస్తలుడైన పౌలు చెబుతున్నాడు, "మనయెడల ప్రత్యక్షము కాబోవు మహిమయెదుట ఇప్పటికాలపు శ్రమలు ఎన్నతగినవి కావని యెంచుచున్నాను," అంటూ, "దేవుని కుమారుల ప్రత్యక్షత కొరకు సృష్టి మిగుల ఆశతో తేరిచూచుచు కనిపెట్టుచున్నది" అంటాడు.

**2. సహనము మన ప్రభువైన క్రీస్తు అనుభవజ్ఞాన విషయములో మిమ్ము "సోమరులు"గాను, "నిష్ఫలులు"గాను కాకుండ చేస్తుంది.**

ఈ లక్షణాలు మీకు కలిగివుండి (అందులో ఒకటి సహనం), వాటిలో మీరు విస్తరించితే (పెంపొందితే), "అవి మన ప్రభువైన యేసుక్రీస్తునుగూర్చిన అనుభవజ్ఞానవిషయములో మిమ్మును సోమరులైనను నిష్ఫలులైనను కాకుండ చేయును." (8వచనం). ఫలములు ఫలించని వారికి, ప్రభావవంతముగా లేకున్న, నిష్ఫలులైన వారికి లేఖనాలలో చాలా హెచ్చరికలు ఇవ్వబడ్డాయి. యోహాను 15 వ అధ్యాయంలో ఫలించని కొమ్మలు, నరికివేయబడి అగ్నిలో పారవేయబడతాయి అని చెబుతుంది. యాకోబు 1:22 పాఠకులను హెచ్చరిస్తుంది వారు వాక్యము వినువారు మాత్రమై ఉంటే సరిపోదు, వాక్యము ఆజ్ఞాపించినదాని ప్రకారము చేయువారై ఉండాలి అని. 2 తిమోతి 3:7లో ఎల్లప్పుడూ నేర్చుకుంటూ, సత్యము విషయమైన అనుభవజ్ఞానము పొందలేకపోతున్నవారిని గూర్చి హెచ్చరిక ఇవ్వబడింది. లూకా 3:7-14వచనాలలో, బాప్తీస్మమిచ్చు యోహాను తన ద్వారా బాప్తీస్మము పొందుటకు వచ్చిన వారిని, కేవలం పెదవులతో ఒప్పకొంటూ, హృదయం మారిందనే సూచన లేనివారిని గూర్చి, "మారుమనస్సుకు తగిన ఫలములు ఫలించండి" (8వచనం) అని హెచ్చరించాడు. తీర్పు దినమున ప్రతివాని పని ఎలాంటిదో పరీక్షింపబడుతుంది అని 1 కొరింథి 3:12-15 బోధిస్తుంది. కొందరు బహుమతి పొందుతారు, కొందరు కాలిపోతారు. కాబట్టి మనము

మన జీవితాలలో ఫలములు ఫలించాలి, సరియైన నిలిచియుండే ఫలములు ఫలించాలి!

మరలా 2 పేతురు 1:8 -మనం సహనముతో కలిపి అక్కడ ఇవ్వబడిన ఇతర లక్షణాలను కలిగివుంటే , అవి విస్తరిస్తుంటే, మనము యేసుక్రీస్తునుగూర్చిన అనుభవ జ్ఞానవిషయములో సోమరులుగాను నిష్ఫలులుగాను ఉండకుండా కాపాడుతుందని తెలియజేస్తుంది. ఇది చాల ప్రాముఖ్యమైనది! భూమిమీద నీ జీవితకాలాన్ని నిత్యత్వపు విలువ ఉన్న సంగతులు సాధించడానికి వాడాలనుకుంటున్నావా? (5-7వచనాలలో ఉన్న ఉదాహరణ గమనించండి: మంచితనము, జ్ఞానము, ఆశానిగ్రహము, సహనము, భక్తి, సహోదర దయ, ప్రేమ). నీ జీవితం నిత్యత్వానికి నిలిచేదిగా ఉండాలా? యాకోబు మాటలు గుర్తుంచుకో: "మీ జీవమేపాటిది? మీరు కొంతసేపు కనబడి అంతలో మాయమైపోయే ఆవిరివంటివారే" (యాకోబు 4:14). సమయాన్ని గూర్చి, నిత్యత్వాన్ని గూర్చి సరియైన దృక్పథం నీకు తెలియపరస్తుండగా, ఈ లోకముతోను దాని భోగములతోను మాత్రమే నిండిపోయిన బుద్ధిహీనమైన జీవితాన్ని జీవిస్తావా? నిత్యత్వపు విలువలున్న వాటికొరకు నీ జీవితాన్ని అర్పించడానికి ఇష్టపడవా?

అయితే ఇదెలా చేస్తావు? ఇక్కడ మేము చెప్పాలనుకుంటున్న సత్యము ఏమిటంటే, ఒకసారి నీవు నిత్యత్వపు విషయాలతో అనుబంధంలోనికి వచ్చిన తరువాత, ఏమి జరిగినా సరే, వాటిలో నీవు సహనముతో సాగాలి. నీ మార్గములో ఏ ఆటంకము ఉండనీయకు! హృదయపూర్వకంగా దేవునిని, ఆయనకు సంబంధించినవాటిని వెంబడించుట, నిత్యత్వమును వెంబడించుట మానవద్దు! ఆయనకు నీ ఆలోచనలలో, ప్రాధాన్యతలలో ప్రతిరోజు మొదటి స్థానాన్ని ఇవ్వు. మన దుష్టహృదయాలకున్న స్వాభావికమైన బుద్ధిని బట్టి విలువైన విషయాలనుండి వెనక్కి జారిపోకుండా, హృదయాన్ని కాపాడుకో.

దేవుని వాక్యమనే నది ప్రక్కన నిలిచి నీ వేరులు లోతుకు ఎదుగునట్లు సహనముతో జీవించుటే నీ లక్ష్యంగా పెట్టుకోవాలి. మొదటి కీర్తనలో చెప్పబడిన దైవజనునివలె నీవుండాలి. "ధర్మశాస్త్రమందు (దేవుని వాక్యమునందు) ఆనందించుచు, దివారాత్రులు దానిని ధ్యానించు"వాడవుగా నీవుండాలి. అలాచేస్తే, "అతడు నీటికాలువల యోరను నాటబడినదై, ఆకువాడక తన

కాలమందు ఫలమిచ్చు చెట్టువలెనుండును. అతడు చేయునదంతయు సఫలమగును." (కీర్తన 1:2-3వచనాలు). "యెహోవాను నమ్ముకొనువాడు ధన్యుడు, యెహోవా వానికి ఆశ్రయముగా ఉండును. వాడు జలములయొద్ద నాటబడిన చెట్టువలెనుండును; అది కాలువల ఓరను దాని వేళ్ళు తన్నును; వెట్ట కలిగినను దానికి భయపడదు, దాని ఆకులు పచ్చగానుండును, వర్షములేని సంవత్సరమున చింతనొందదు కాపుమానదు." అని అంటాడు యిర్మియా17:7-8లో.

కీర్తన 1:3లో "నీటి కాలువల యోరను నాటబడిన చెట్టుకును, గాలికి చెదరిపోయే పొట్టుకును" సామ్యము చూపుతుంది. వేసవికాలంలో అరణ్యాలలో వచ్చిన కార్చిచ్చు అనేక లక్షల ఎకరాలలోని వృక్షాలను కాల్చివేయడం నాకు గుర్తువస్తున్నది. దానికి విరుద్ధముగా, వాషింగ్టన్ రాష్ట్రంలో వందల వేల సంవత్సరాలుగా నిలిచినవున్న సిక్వోయా చెట్లు ఉన్నాయి. మిగిలిన చెట్లు కాలిపోయినప్పటికీ అవి మాత్రం నిలిచివున్నాయి. ఏమిటి తేడా? వాషింగ్టన్ రాష్ట్రంలో కొద్దిరోజులు గడిపినవారెవరైనా అక్కడ ఏకధాటిగా కురిసే వర్షాన్ని గూర్చి చెప్పకమానరు. మిగతా చెట్లకన్నా ఇవి ఎక్కువ కాలం జీవించడానికి కారణం క్రమంగా చాలినంత నీరు అందడంవల్లనే. ఆత్మీయంగా, దేవుని వాక్యమైన బైబిల్ సత్యం అనే నది ప్రక్కనే నిలిచివుండి, దేవుని వాక్య సత్యములో వేళ్ళూనికొన్నవారు మాత్రమే, దారి ప్రక్కన పడిపోయినవారితో కాక సహనముతో నిలిచి ఫలిస్తారు!

విశ్వాసంలో తాను శిష్యులుగా చేసిన వారియెడల అపొస్తలుడైన పౌలు కలిగియున్న లక్ష్యం అతడు చేసిన ప్రార్థనలో వ్యక్తీకరించాడు. కొలస్సి 1:9-12 వచనాలలో పౌలు కొలస్సిలో ఉన్న క్రైస్తవులు, "....ఆనందముతో కూడిన పూర్ణమైన ఓర్పును దీర్ఘశాంతమును కనుపరచునట్లు ఆయన మహిమ శక్తినిబట్టి సంపూర్ణ బలముతో బలపరచబడవలెననియు..." ప్రార్థిస్తున్నాడు. తాను శిష్యులుగా మలచిన వారిలో ఓర్పును, సహనమును పెంపొందించుటకు పౌలు అధిక ప్రాధాన్యతను ఇచ్చాడని గమనించండి. 10వ వచనంలో చెబుతున్నాడు, "...అన్ని విషయములలో ప్రభువును సంతోషపెట్టునట్లు, ఆయనకు తగినట్టుగా నడుచుకొనవలెనని..." ఎలా? "....ప్రతి సత్కార్యములో సఫలులగుచు, దేవుని విషయమైన జ్ఞానమందు అభివృద్ధి పొందుచు...". సహనమునకును, ఫలభరితమైన జీవితానికి ఉన్న సంబంధం మరలా చెప్పబడింది గమనించండి!

కాబట్టి, ప్రతిరోజు క్రైస్తవుడు ఎదుర్కొనే యుద్ధాన్నిగూర్చి కొన్ని పాఠాలు పూర్తిచేసిన తరువాత, కొంతకాలంపాటు (అంటే 40రోజులు) నీ జీవితంలో కొన్ని క్రమశిక్షణలు (అంటే క్రమమైన ప్రార్థనా సమయం, దేవుని వాగ్దానాలపై దృష్టి నిలపడం, లేఖనాలు కంఠస్థం చేయడం) స్థిరపరచుకున్నాక కూడా అది ఎక్కువకాలానికి సరిపోదు. నీవు వీటిని అభినందిస్తూ, విశ్వాసంలో ఓర్పును కలిగి, ఈ ప్రాథమిక క్రమశిక్షణలు నీ జీవితకాలమంతా ఓర్పుగా అనుసరించి నడుచుకోవాలి! ఇలా చేస్తే నీవు నిలిచియుండే ఫలమును ఫలిస్తావు (యోహాను 15:16), అది దేవుని అంత్యతీర్పులో బహుమతిని నీకిస్తుంది.

**3. సహనము నీ రక్షణ నిశ్చయతకు కావలసిన బైబిల్ పునాదిని కలిగివుండడానికి సహాయం చేస్తుంది:**

మనం విశ్వాసానికి కలుపుకోవలసిన విషయాల జాబితా వ్రాసి, (అందులో ఒకటి సహనము), 2 పేతురు 1:8లో, వీటిని కలిగి వుండడం, అవి మనలో విస్తరించడం మనం నిష్ఫలులము సోమరులము కాకుండా చేస్తుంది అని మనం తెలుసుకుంటాం. తరువాత తొమ్మిది పది వచనాలలో, "ఇవి ఎవనికి లేకపోవునో వాడు తన పూర్వపాపములకు శుద్ధి కలిగిన సంగతి మరచిపోయి, గ్రుడ్డివాడును, దూరదృష్టి లేనివాడునగును. అందువలన సహోదరులారా, మీ పిలుపును ఏర్పాటును నిశ్చయము చేసికొనుటకు మరి జాగ్రత్తపడుడి. మీరిట్టి క్రియలు చేయువారైతే ఎప్పుడును తొట్రిల్లరు...." అని మనకు తెలియపరచబడింది.

5-7వచనాలలో ఇవ్వబడిన గుణలక్షణాలు, సహనముతోపాటు, మనలో పెంపొందింపచేసేది పరిశుద్ధాత్మ దేవుడు. **ఈ వచనాలలో ఉన్న బోధ చూస్తే, ఈ కార్యములు పరిశుద్ధాత్మ మనలో చేస్తుండగా ఆయనకు ఎదురుచెప్తే, మన రక్షణ నిశ్చయతను కోల్పోతాం.** ఇది చింత, ఆందోళన, భయం, అనిశ్చితి మొ॥నవి కలిగిస్తుంది. అంటే మన మనసులో శాంతి ఉండదు! **తన పిల్లలు ఇలా ఉండాలని దేవుడు కోరుకోడు. 1యోహాను 5:13, "దేవుని కుమారుని నామమందు విశ్వాసముంచు మీరు నిత్యజీవము గలవారని తెలిసికొనునట్లు నేను ఈ సంగతులను మీకు వ్రాయుచున్నాను" అని చెపుతోంది. విమోచించబడినవారు అలా ఉండాలని దేవుని కోరిక -దేవుని ప్రేమ, ఆదరణ, క్రీస్తులో వారి నిత్య గమ్యంనుగూర్చి పూర్తి నిశ్చయతతో ఉండాలని ఆయన కోరిక!** ఇంకా, దేవుడు తన బిడ్డలు తన శాంతితో నిండి ఉ

ండాలని కోరుకుంటున్నాడు (ఫిలిప్పీ. 4:6-7).

గనుక, మన అనుదిన జీవితంలో ప్రభువుతో నడవడంలో మనం నమ్మకంగా సహనంతో ఉండాలి. బైబిల్ చదవడంలో, లేఖనాలను కంఠస్థం చేయడంలో, ధ్యానించడంలో, దేవుని వాక్యబోధనకు లోబడటంలోను మనం సహనముతో కొనసాగాలి. ఈ విధంగా, ప్రభువుతో మన వ్యక్తిగత అనుబంధాన్ని కొనసాగించాలి. "మీరిట్టి క్రియలు చేయువారైతే ఎన్నడును తొట్రిల్లరు" అని చెబుతున్నాడు పేతురు. నీ మనస్సు ఆరోగ్యంగా ఉంటుంది, నీవు సమాధానముతో, సంతోషముతో నిండివుంటావు. ఆ విధంగా చేయకపోతే నీ మనఃస్థితి పతనమైపోతుంది. పరిశుద్ధాత్మ ఇచ్చే శాంతి సంతోషములు, దేవుని సన్నిధి మనతో ఉన్నదనే సమాధానము కోల్పోతాం, ప్రతిరోజు మనకు దేవుడిచ్చే ఆశీర్వాదాలు కోల్పోతాం. మనం 2 పేతురు 1:9లో చెప్పిన "గ్రుడ్డివాడును, దూరదృష్టి లేనివాడును, తన పూర్వ పాపములకు శుద్ధి కలిగిన సంగతి మరచిపోయిన" వ్యక్తిలా మారిపోతాం.

### 4) సహనము నీవు నిత్యరాజ్యములో ప్రవేశించునపుడు గొప్ప స్వాగతము పొందుటకు సహాయం చేస్తుంది:

"అందువలన సహోదరులారా, మీ పిలుపును ఏర్పాటును నిశ్చయము చేసికొనుటకు మరి జాగ్రత్తపడుడి. మీరిట్టి క్రియలు చేయువారైతే ఎప్పుడును తొట్రిల్లరు. ఆలాగున మన ప్రభువును రక్షకుడైన యేసు క్రీస్తుయొక్క నిత్యరాజ్యములో ప్రవేశము మీకు సమృద్ధిగా అనుగ్రహించబడును." (2 పేతురు 1:10-11).

దానిగురించి ఒక్కసారి ఆలోచించండి! ఇప్పుడు ఈ లోకంలో నిత్యరాజ్యాన్ని గూర్చి మరింత పూర్ణ నిశ్చయత నీకు ఉంటుంది, అంతేకాదు, ఈ భూమిమీద నీ జీవితం ముగియగానే క్రీస్తు నిత్యరాజ్యంలోనికి నీకు గొప్ప స్వాగతం దొరుకుతుంది! నీవు క్రీస్తు సన్నిధిలో ప్రవేశించగానే, "భళా (శభాష్!) నమ్మకమైన మంచి దాసుడా!" అనే ఆయన మాటలు వినబడతాయి. వీటికి, 1యోహాను 2:28లో మాటలకు ఉన్న తేడా చూడండి- "కాబట్టి చిన్నపిల్లలారా, ఆయన ప్రత్యక్షమగునప్పుడు ఆయన రాకడయందు మనము ఆయన యెదుట సిగ్గుపడక ధైర్యము కలిగియుండునట్లు మీరాయనయందు నిలిచియుండుడి." ఈ

వచనంలో, ఎవరైతే ఈ సహనము విషయములో విఫలమౌతారో, వారు తమ విమోచకుని యెదుట ముఖాముఖిగా నిలువబడినప్పడు సిగ్గుపడాల్సివస్తుంది అనే భావం సూచనగా కనిపిస్తుంది. 1 కొరింథి 3:15 కూడా ఇలాంటి వ్యక్తినిగూర్చియే మాట్లాడుతున్నట్లు ఉంటుంది, "ఒకని పని కాల్చివేయబడినయెడల వానికి నష్టము కలుగును; అతడు తనమట్టుకు తాను రక్షింపబడును గాని అగ్నిలోనుండి తప్పించుకున్నట్టు రక్షింపబడును."

"కాగా నా ప్రియులారా, మీరెల్లప్పుడును విధేయులైయున్న ప్రకారము, నాయెదుట ఉన్నప్పుడు మాత్రమే గాక, మరియెక్కువగా నేను మీతో లేని యీ కాలమందును, భయముతోను వణకుతోను మీ సొంతరక్షణను కొనసాగించుకొనుడి (సహనముతో!). (అంటే నీ శక్తితో నీవు చేయలేవు అని గుర్తిస్తూ, దేవునిమీద నీవు సంపూర్ణంగా ఆధారపడి ఉన్నావు అనేది గుర్తిస్తూ). ఎందుకనగా మీరు ఇచ్ఛయించుటకును కార్యసిద్ధి కలుగజేసికొనుటకును, తన దయాసంకల్పము నెరవేరుటకై మీలో కార్యసిద్ధి కలుగజేయువాడు దేవుడే." (ఫిలిప్పీ.2:12-13).

## ఎనిమిదవ అధ్యాయం కొరకైన చర్చించే ప్రశ్నలు

## "సహనము"

1. క్రైస్తవుడు "లోకమునకు వెలుగైయున్నాడు" అనే దానికి, ఆత్మీయ క్రమశిక్షణలలో సహనముతో ఉండేదానికి ఉన్న సంబంధం ఏమిటి? (151 పేజి)

2. ఆత్మీయ క్రమశిక్షణల విషయంలో సహనంతో నమ్మకంగా ఉండడానికి చాలామంది క్రైస్తవులకున్న ఆటంకం ఏమిటి? ఎందుకని ఇది సరియైన సాకు కాదు?(152 పేజి)

3. క్రమమైన, అనుదిన ధ్యానసమయాన్ని ఏర్పాటు చేసుకోకుండా ఉండడానికి, క్రైస్తవులకు ఏ అబద్దం చెప్పడం ద్వారా అపవాది విజయవంతమౌతున్నాడు? ఇది ఏ విధంగా అబద్దం? (152 పేజి)

4. "నా కార్యక్రమాలు, నా జీవితం ఇలా చేయడానికి సాధ్యం కాదు" అని చెబుతూ ఆత్మీయ క్రమశిక్షణలలో క్రమమైన అనుదిన ధ్యానసమయంను కేటాయించలేనని సాకు చెప్పే క్రైస్తవునికి నీవు ఎలా జవాబు చెబుతావు? (152-154 పేజిలు)

5. సహనంతో ఉన్న క్రైస్తవులకు లేఖనాల్లో ఇవ్వబడిన నాలుగు ప్రోత్సాహకాల జాబితా వ్రాయండి.(156-159 పేజీలు)

6. నిష్ఫలముగా, సోమరిగా కాకుండా ఉండటం ఎందుకు ముఖ్యమో తెలపండి? (160-161 పేజీలు)

7. 2 పేతురు 1:8 ప్రకారం, మనం సోమరులుగా, నిష్ఫలులుగా ఉండకుండా ఎలా చూచుకోగలం? (160 పేజి)

8. కీర్తన 1కి, ఎత్తైన సిక్వోయా వృక్షమునకు ఉన్న సంబంధం ఏమిటి? (161-162 పేజీలు)

9. నీ జీవిత లక్ష్యం ఏమైయుండాలి? (162 పేజి)

10. 2 పేతురు 1:9-10 యొక్క ప్రాథమిక ఉపదేశం ఏమిటి? (161-162 పేజీలు)

11. మన రక్షణను మనం దృష్టించే విధానంలో దేవుడు తాను విమోచించినవారు ఎలా ఉండాలని కోరుతున్నాడు? (162-163 పేజీలు)

12. దేవునితో మన నడకను బట్టి మన మనస్సుకు కలిగే మేలులు ఏమిటి, నడవకపోతే వచ్చే ప్రతికూల ప్రభావాలు ఏమిటి? (163పేజీ)

13. అపెండిక్స్‌లోని "దృక్కోణము"ను గూర్చిన చర్చించే ప్రశ్నలు:

ఎ) "ప్రాపంచిక దృక్పథం" అనే మాట దేనిని సూచిస్తుంది?

బి) జీవితాన్ని సరియైన దృక్పథంతో చూడకపోతే మనకు ఎలాంటి విషయాలు జరుగుతాయి?

సి) సహనానికి దృక్పథానికి ఉన్న సంబంధం ఏమిటి?

డి) “....మనం ఐగుప్తులో లేము, కనానులోనూ లేము, కాని ఐగుప్తునుండి కనానుకు యాత్రలో ఉన్నాం” అనే విలియం జే మాటలకున్న ఆత్మీయ దృక్కోణమును వివరించుము

ఇ) ప్రతి ఉదయం మనకు మనం ఏమి జ్ఞాపకం చేసుకుంటూ ఉండాలి?

# Bibliography


1. David Platt, “Follow Me”: A simulcast presented in August of 2013. Used by permission.

2. Edward T. Welch, “Addictions” : A Banquet in the Grave : Finding Hope in the power of the Gospel (Phillipsburg, N.J.: P&R Publishing, 2001), pp 226-227.

3. Jay Adams, “Winning the War Within”: A Biblical Strategy for Spiritual Warfare (Woodruff, SC: Timeless Texts, revised edition,1996), pp 11-12.

4. D. Martin Lloyd-Jones, “Spritual Depression”: Its Causes and Cures 1965 Wm. B. Eerdmans Publishing Co., Grand Rapids, MI. Used by permission of the publisher.

5. Donald Whitney, Excerted from his “Spiritual Disciplines for the Christian LIfe”, copy right 1991. Used by permission of NavPress www.navpress.com. All rights reserved.

6. Eugene Peterson, “Leap Over a Wall” (New York:HarperCollins Publishers, Inc., 1998), pp 152-153.

7. A.W. Pink, “Gleanings in Exodus” (Chicago: Moody Press, 1964), pp 126-130.

8. Nathan stone, “The names of God” (Chicago: Moody Press, 1944), p. 87.

9. Charles colson, “How Then Shall We Live?” (Wheaton, IL:Tyndale House Publishers, Inc., 1999), p. 14.

10. William Jay, “Morning Exercises” (Amityville, NY: Calvary Press Publishing, 1998), p. 21. Used by permission of Calvary Press www.calvarypress.com.

# ఉప గ్రంథాలు (అపెండిక్స్)

## 40 రోజుల పట్టిక

పాత అలవాట్లు వదులుకోవడం కష్టం, క్రొత్త అలవాట్లు అలవరచుకోవడం కష్టం. దేవునితో నీ అనుదిన నడకలో కొనసాగడానికి క్రమశిక్షణ అవసరం!

ఈ 40 రోజుల పట్టిక యొక్క ఉద్దేశం ఏమిటంటే, నీ ధ్యాన సమయాలలో క్రమంగా కొనసాగడానికి నీకు సహాయపడడం. 40రోజులు పూర్తి అయ్యేంత వరకు పెన్సిల్‌తో ఒక్కొక్క బాక్సులో 'x' గుర్తు పెడుతూ 40 రోజులు పూర్తి చేయండి. ఒక వేళ మధ్యలో ఎక్కడైనా ఒక రోజు మర్చిపోతే, అన్నీ చెరిపేసి మరలా మొదటి రోజునుండి మొదలు పెట్టండి.

40 రోజుల తరువాత ఈ అభ్యాసం నీలో భాగంగా మారిపోతుంది, అలవాటు అయిపోతుంది.

| | | | | |
|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 |
| 6 | 7 | 8 | 9 | 10 |
| 11 | 12 | 13 | 14 | 15 |
| 16 | 17 | 18 | 19 | 20 |
| 21 | 22 | 23 | 24 | 25 |
| 26 | 27 | 28 | 29 | 30 |
| 31 | 32 | 33 | 34 | 35 |
| 36 | 37 | 38 | 39 | 40 |

# కంఠత వాక్య కార్డు విధానం

"నేను నీయెదుట పాపము చేయకుండునట్లు నా హృదయములో నీ వాక్యమును ఉంచుకొనియున్నాను."
కీర్తన 119:11

"....క్రీస్తు వాక్యమును మీలో సమృద్ధిగా నివసింపనీయుడి" కొలస్సి 3:16

"...ఆయన దైవశక్తి జీవమునకును భక్తికిని కావలసినవాటినన్నిటిని మనకు దయచేయుచున్నందున, దేవునిగూర్చినట్టియు మన ప్రభువైన యేసునుగూర్చినట్టియునైన అనుభవజ్ఞానమువలన మీకు కృపయు సమాధానమును విస్తరించునుగాక. ఆ మహిమ గుణాతిశకములనుబట్టి ఆయన మనకు అమూల్యములును అత్యధికములైన వాగ్దానములను అనుగ్రహించియున్నాడు. దురాశను అనుసరించుటవలన లోకమందున్న భ్రష్టత్వమును ఈ వాగ్దానముల మూలముగా మీరు తప్పించుకొని, దేవస్వభావమునందు పాలివారగునట్లు వాటిని అనుగ్రహించెను." 2 పేతురు 1:3-4

కంఠతవాక్య కార్డు విధానము ఉపయోగించడం చాలా సులువు, దేవుని వాక్యమును హృదయములో దాచుకొనుటను గూర్చి ఒక క్రమమైన పద్ధతిలో నేర్చుకోవడానికి ఇది ఉపయోగకరం. నీకు కావలసిందల్లా నీ బైబిల్, 3x5 కార్డులు, రెండు రబ్బర్ బాండ్‌లు. ఈ విధానం ఎలా పనిచేస్తుందో క్రింద చూడండి:

1) మీ అనుదిన బైబిల్ పఠనంలో, మీరు సంఘంలో విన్న ప్రసంగాలలో, రేడియోలో విన్న వాక్యంలో, మీరు చదివే పుస్తకాలలో దేవుని "అమూల్యములును అత్యధికములైన" వాగ్దానాల కొరకు వెదకడం అలవరచుకోండి, వాటిని సంకలనం చేసుకోండి. (నీ వ్యక్తిగత ఆత్మీయ జీవితంలో నీవు పోరాడుతున్న, బలహీనంగా ఉన్న విభాగాల్లో నిన్ను ఆదరించిన వాగ్దానాలు వచనాలు నీ సంకలనంలో ఉంటాయి.)

2) 3x5 కార్డు తీసుకుని, ఒకవైపు మీరు కంఠస్థం చేయాలనుకున్న వచనాన్ని, వాక్యభాగాన్ని, లేక పదాలను వ్రాయండి, రెండవవైపు

లేఖనభాగాన్ని (రిఫరెన్స్) స్పష్టంగా వ్రాయండి.

3) ఈ వచనాలను రెండు వేర్వేరు గుంపులుగా విభజించి వాటికి రబ్బరు బాండ్‌లు పెట్టండి:

ఎ) ''కోరుకునే'' గుంపు -మీరు సమకూర్చిన వచనాలు, కంఠస్థపెట్టాలని కోరుకునే వచనాలు.

బి) "కంఠస్థం" గుంపు -ఇందులో మీరు ఇప్పటికే కంఠస్థం పెట్టిన వచనాల కార్డులను ఉంచండి.

4) ఇప్పుడు మీరు కంఠస్థం చేస్తున్న కార్డులు రోజంతా మీ దగ్గరే ఉంచుకొని అవకాశం వచ్చినప్పుడల్లా చదువుతూ ఉండండి.

5) మీ ధ్యాన సమయానికి ఉపయోగించే పుస్తకాల వద్దే ఈ కార్డులనుకూడా ఉంచి, ఉదయకాల ధ్యాన సమయాలలో వాటిని వాడుకోండి. మీరు "కంఠస్థం" చేసిన వాక్యాల కార్డులను కూడా క్రమంగా చదువుతూ ఉండండి.

## వ్యక్తిగత ప్రార్థనా జాబితాకు సహకారి

**మీరు ప్రార్థన ఆరంభిస్తుండగా కొన్ని ఆలోచనలు సూచనలు:**

యాకోబు 4:8 "మీరు దేవునివద్దకు రండి, అప్పుడాయన మీయొద్దకు వచ్చును"

కీర్తన 34:15 "యెహోవా దృష్టి నీతిమంతులమీద నున్నది, ఆయన చెవులు వారి మొరలకు ఒగ్గియున్నవి".

సామెతలు 15:8 "...యథార్థవంతుల ప్రార్థన ఆయనకు ఆనందకరము"

1 పేతురు 5:7 "ఆయన మిమ్మును గూర్చి చింతించుచున్నాడు గనుక మీ చింత యావత్తు ఆయనమీద వేయుడి."

కీర్తన 55:22 "నీ భారము యెహోవా మీద మోపుము ఆయనే నిన్ను ఆదుకొనును. నీతిమంతులను ఆయన ఎన్నడును కదలనీయడు".

హెబ్రీయులకు 4:16 "గనుక మనము కనికరింపబడి సమయోచితమైన సహాయము కొరకు కృప పొందునట్లు ధైర్యముతో కృపాసనమునొద్దకు చేరుదము"

ఫిలిప్పీ. 4:6-7 "దేనినిగూర్చియు చింతపడకుడి గాని ప్రతి విషయములోను ప్రార్థన విజ్ఞాపనములచేత కృతజ్ఞతా పూర్వకముగా మీ విన్నపములు దేవునికి తెలియజేయుడి. అప్పుడు సమస్త జ్ఞానమునకు మించిన దేవుని సమాధానము యేసు క్రీస్తు వలన మీ హృదయములకును మీ తలంపులకును కావలియుండును."

కీర్తన 27:14 "యెహోవా కొరకు కనిపెట్టుకొనియుండుము, ధైర్యము తెచ్చుకొని నీ హృదయమును నిబ్బరముగా నుంచుకొనుము, యెహోవా కొరకు కనిపెట్టుకొనియుండుము"

కీర్తన 37:7 "యెహోవా ఎదుట మౌనముగా నుండి ఆయనకొరకు కనిపెట్టుకొనుము. తన మార్గమున వర్థిల్లువాని చూచి వ్యసనపడకుము. దురాలోచనలు నెరవేర్చుకొనువాని చూచి వ్యసన పడకుము."

**ఆరాధనకు సహాయం:**

యెషయా 40:12-25; కీర్తన 147:3,4 (ఇంకా సేకరించండి)

**పాపపుటొప్పకోలు:**

1యోహాను 1:9,7; కీర్తన 66:18; సామెతలు 28:13; కీర్తన 139:23-24; కీర్తన 51:7,10

క్రింద ఉన్నవి మనలో పాపమునకు అవకాశం ఉన్న విషయాల జాబితా, స్వపరీక్ష కొరకు:

**స్వార్థం**: (ఫిలిప్పి 2:3-4చూడండి)

స్వార్థపూరిత అత్యాశ

యథేచ్ఛా విహారము

స్వప్రయోజనమునుగూర్చి పక్షపాతము

ఇతరులు అవసరతలలో ఉన్నప్పటికీ స్వయంతృప్తికి ఆరాటం

స్వయంగా హెచ్చించుకోవడం (గొప్పలు చెప్పకోవడం)

తనమీద తానే జాలిపడడం

స్వయం విమోచన

స్వనీతి

అహంకారము, అతిశయము

**గర్వము** :సామెతలు 16:18; 29:23; యాకోబు 4:6

**ఆతురత (ఆత్రం/తొందరపాటు)** : కీర్తన 37; 27:14

**కోపం** : సామెతలు 14:16-17; 14:29

**ద్వేషం(చేదుభావం)** : హెబ్రీ. 12:15

**అపవిత్రమైన ఆలోచనలు** : 1 పేతురు 2:11
ఇచ్ఛలు
విపరీతమైన లైంగిక భావనలు
కక్ష, న్యాయమును నిరూపించే ఆలోచనలు

**ఇతరులను అవమానపరచే మాటలు మాట్లాడటం (నిందలు/చాడీలు)**
: యాకోబు 4:11; కీర్తన 141:3; 19:4

**సణగడం** : ఫిలిప్పీ 2:14

**లోభిత్వం దురాశ** : రోమా 7:7; కొలస్సి 3:5

**ఇంకా ఏమైనా...**

**నడిపింపు కొరకు ప్రార్థన** : సామెతలు 3:5-6; 16:3; 21:29; 14:8; 2 దినవృత్తాంతము 16:9
**జ్ఞానము** : యాకోబు 1:5

**మిమ్ములను ఎక్కువగా ఇబ్బందిపెట్టే సమస్యలనుగూర్చి ప్రార్థించండి** :
(వ్యక్తిగత సమస్యల జాబితా)

**ప్రాముఖ్యమైనది!!! నీ సమస్యలు ఆయనయొద్దకు తెస్తుండగా ఈ వాగ్దానములు ఎత్తిపట్టుకుని దేవునిని అడగండి:**

కీర్తన 34:17 "నీతిమంతులు మొఱ్ఱపెట్టగా యెహోవా ఆలకించును; వారి ఆపదలన్నిటిలోనుండి వారిని విమోచించును"
కీర్తన 34:19 "నీతిమంతునికి కలుగు ఆపదలు అనేకములు, వాటన్నిటిలోనుండి యెహోవా వానిని విడిపించును."

**నా వ్యక్తిగత సమస్యల జాబితా:**

1

2

3

**ఆరోగ్యము బలము:** భౌతిక, ఆత్మీయ, మానసిక, భావోద్వేగాలు (యెషయా 40:29,31)

**దేవుని వాక్యమును గూర్చిన జ్ఞానము, అవగాహన**

**సంరక్షణ**

**దయ**

**నీ జీవితంలో పరిశుద్ధాత్మ ఫలములు (గలతి. 5:22-23)**

**వీరి ఆశీర్వాదములకొరకు ప్రార్థించు:** (1) నీ కుటుంబం; (2) నీ బంధుమిత్రులు; (3) నీ సంఘం; (4) భారతదేశంలోను ప్రపంచమంతటా ఉన్న సంఘం (సార్వత్రిక సంఘం); (5) మన దేశం (దయకొరకు, మారుమనస్సుకొరకు, నైతిక, ఆధ్యాత్మిక ఉజ్జీవం కొరకు); (6) మన రాష్ట్రపతి, ఆయన కుటుంబం, ఆయనసిబ్బంది; (7) ప్రధానమంత్రి, ఆయన కుటుంబం, ఆయన మంత్రివర్గం; సిబ్బంది; (8) ముఖ్యమంత్రి, ఆయన కుటుంబం, ఆయన మంత్రివర్గం; సిబ్బంది.

B- body **శరీరము -ఆరోగ్య దీవెన కొరకు**

L- labor **పని** -ఆర్థిక పరిస్థితి, ఉద్యోగాలు, అర్థవంతమైన ఉద్యోగావకాశాలు

E-emotional **భావోద్వేగాలు** -సంతోషము, సమాధానము, స్థిరత్వము

S-social **సాంఘికం** -అనుబంధాలు: కుటుంబం, స్నేహితులు, ప్రియులు, ఇరుగుపొరుగు మొ॥

S-spiritual **ఆత్మీయం** -రక్షణ, పవిత్రీకరణ, కంచె, సంరక్షణ

**కుటుంబం (పేర్లు)**

**బంధువులు (పేర్లు)**

**మీ సంఘం :** కాపరి, పరిచర్యలు: నాయకులు పరిచారకులు (పేర్లు)

**ఇండియాలోని సంఘం :** నైతిక ఆత్మీయ ఉజ్జీవం

రాష్ట్రపతి, కుటుంబం, కార్యనిర్వాహక సిబ్బంది: జ్ఞానము, నీతి, దేవుని మీద ఆధారపడుతున్నామని గుర్తింపు, ధైర్యము

**ప్రధానమంత్రి, మంత్రివర్గం, సిబ్బంది :** నీతిగా, న్యాయంగా పరిపాలించుటకు, అవినీతిని ఖండించునట్లు

**ముఖ్యమంత్రి, మంత్రివర్గం, సిబ్బంది:** నీతిగా, న్యాయంగా పరిపాలించుటకు, అవినీతిని ఖండించునట్లు.

**మిషన్:** మిషనరీలుగా వెళ్ళిన వారిని వారి కుటుంబాలను పేరుపేరున ప్రార్థించండి! ప్రపంచమంతటా సువార్త ప్రకటన గూర్చి, ఆత్మల రక్షణకొరకు ప్రార్థించండి.

**తప్పుడు సిద్ధాంతములనుగూర్చి (మానవతావాదం), తప్పుడు మతములు, దయ్యముల బోధను గూర్చి ప్రార్థించండి** ఇవి సువార్త ప్రకాశం ప్రజలకు అందకుండా గ్రుడ్డితనాన్ని కలుగజేస్తాయి

**ప్రపంచవ్యాప్తంగా హింసింపబడుతున్న క్రైస్తవులనుగూర్చి ప్రార్థించండి :** ముఖ్యంగా ఉత్తరకొరియా, చైనా, ఇండోనేషియా, లావోస్, కంబోడియా, సూడాన్

**సంఘములను హింసిస్తున్న వారికొరకు ప్రార్థించండి :** వారి అంతమగునట్లు, వారికి మనశ్శాంతిలేకుండా, అపరాధభావనతో సిగ్గుతో- అయితే రక్షణ పొందేలా లేక నశించిపోయేలా.

# బైబిల్ పఠన చరిత్ర

సూచనలు : నీ చదివే వేగంతో బైబిల్‌ను పూర్తిగా చదివేలా ఈ విధానం రూపకల్పన చేయబడింది. 'సంవత్సరంలో బైబిల్' విధానంలో చదివేవారు అనేకులు, మధ్యలో ఆగిపోయినందున, నిరుత్సాహంతో చదవడం మానేస్తారు. అంతేకాక, ఇలా చేయడం నీకు ప్రోత్సాహం కలిగిస్తుంది, ఎందుకంటే కొన్ని రోజులు నీవు చదవలేకపోయినా, నీవు ఎంత చదివావో నీకు కనిపిస్తుంది కాబట్టి. ఆ రోజు తారీఖు వ్రాసి, మీరు చదివిన వాక్యభాగాన్ని వ్రాయండి. బైబిల్‌ను పుస్తకాలు ఉన్న క్రమంలో చదివితే మంచిది, ఒక్కొక్క పుస్తకాన్ని ముగించి, ఆ పుస్తకం పేరువద్ద టిక్ పెట్టడం ద్వారా నీవు ఎంతవరకు చదివావో నీకు తెలుస్తుంది. అధ్యయన బైబిల్ మంచిది ఉంటే, పరిచయవాక్కులు, పుస్తకాల వివరాలు చదవడం ద్వారా ఇంకా బైబిల్‌ను అర్థవంతంగా మార్చుతాయి.

| తారీఖు | పా. ని. | చదివిన అ. | క్రొ.ని. | చ. అధ్యా. | కీర్తన/సామెతలు |
|---|---|---|---|---|---|
| | | | | | |

పూర్తిచేసిన పుస్తకాలు:

| | | |
|---|---|---|
| ఆదికాండము | నిర్గమకాండము | లేవీయకాండము |
| సంఖ్యాకాండము | ద్వితీయోపదేశకాండము | యెహోషువ |
| న్యాయాధిపతులు | రూతు | 1 సమూయేలు |
| 2 సమూయేలు | 1 రాజులు | 2 రాజులు |
| 1 దినవృత్తాంతములు | 2 దినవృత్తాంతములు | ఎజ్రా |
| నెహెమ్యా | ఎస్తేరు | యోబు |
| కీర్తనలు | సామెతలు | ప్రసంగి |
| పరమగీతము | యెషయా | యిర్మియా |
| విలాపవాక్యములు | యెహెజ్కేలు | దానియేలు |
| హోషేయ | యోవేలు | ఆమోసు |
| ఓబద్యా | యోనా | మీకా |
| నహూము | హబక్కూకు | జెఫన్యా |
| హగ్గయి | జెకర్యా | మలాకి |

| | | |
|---|---|---|
| మత్తయి | మార్కు | లూకా |
| యోహాను | అపో. కార్యములు | రోమా |
| 1కొరింథి | 2 కొరింథి | గలతీయులకు |
| ఎఫెసీయులకు | ఫిలిప్పీయులకు | కొలస్సయులకు |
| 1 థెస్సలోనికయు | 2 థెస్సలోనికయు | 1 తిమోతి |
| 2 తిమోతి | తీతు | ఫిలెమోను |
| హెబ్రీయులకు | యాకోబు | 1పేతురు |
| 2 పేతురు | 1యోహాను | 2 యోహాను |
| 3యోహాను | యూదా | ప్రకటన |

**తిస్చక్షా త్చిట్దృఊ**

పేరు:....................................................................................

బాధ్యతా భాగస్వామి: ...........................................................................

కలసిన సమయాలు 1 2 3 4 5 6 7 8 9 10

తేదీలు:

పూర్తిచేసిన పని

40రోజుల చార్టు

కంఠతవాక్య కార్డు

బైబిల్ పఠన చరిత్ర

వ్యక్తిగత ప్రార్థన జాబితా

సరిగ్గా పూర్తి చేసారా?

ఆత్మీయ యుద్ధ శిక్షణ అధ్యాయం

# "దృక్పథం"

ప్రాపంచిక దృక్పదంలో ఛార్లెస్ కాల్సన్ వ్రాసిన "ఇప్పడు మనం ఎలా బ్రతకాలి?" అనే పుస్తకంలో, కాల్సన్ అంటారు: "మన జీవితంలోని ముఖ్యమైన పని ఏమిటి అంటే -సత్యం ఏమిటో తెలుసుకోవడం, దానికి తగినట్టుగా నడుచుకోవడమే." "ప్రాపంచిక దృక్పథం" అనే ఆలోచన చాలా ప్రాముఖ్యం. ఒక వ్యక్తి యొక్క 'ప్రాపంచిక దృక్పథం' ను నిర్వచిస్తూ, "...ప్రపంచాన్ని గూర్చి మనకున్న నమ్మకాల మొత్తం, మన అనుదిన ధ్యానాన్ని, పనులను నడిపించే సంపూర్ణ చిత్రం." మనం జీవితాన్ని అలా చూస్తామన్నమాట. మన జీవితాలలో వచ్చే పరిస్థితులను, మనకు ఉన్న ఆలోచనా సరళిలో మన మనస్సులో మనం అన్వయించుకునే తీరు. అది మన జీవితాన్నిగూర్చిన "దృక్పథం"! క్రైస్తవుని ప్రాపంచిక దృక్పథం దేవుడు లేఖనాలలో ప్రత్యక్ష పరచినదానిమీద ఆధారపడివుంటుంది.

ముఖ్యమైన విషయం ఏమిటంటే, బైబిల్‌లో బయల్పరచబడిన అన్నిటికన్నా ఉన్నత వాస్తవం, ఒక్కటే, క్రైస్తవులు (సహనంగా ఉండటం కోసం) దాని వెలుగులోనే నడచుకోవాలి అని తెలుసుకోవాలి. ఈ వాస్తవాన్ని మనం స్పష్టంగా గ్రహిస్తే, జీవితంలోని అన్ని పరిస్థితులమధ్య దానిని గట్టిగా పట్టుకొని ఉండాలి. ఆత్మీయ, భావోద్వేగ, మానసిక అసమతౌల్యంలో చింత, భయం, ఆందోళన, కృంగుబాటు మొ॥నవి కలగడానికి కారణం ఆ "దృక్పథాన్ని కోల్పోవడమే"! అంటే ఆ ఉన్నత వాస్తవం వెలుగులో మన జీవితంలోని పరిస్థితులను చూడలేకపోవడమే.

చార్లెస్ హడ్డన్ స్పర్జన్‌గారి సమకాలీకుడైన విలియం జే, కీర్తన 48:14మీద ఒక ధ్యానాన్ని వ్రాస్తూ, ఈ క్రైస్తవుని ప్రాపంచక దృక్పథాన్ని బైబిల్ భాషలో చెప్పాడు: ''మనం భూమి మీద పరదేశులమును యాత్రికులునైయున్నాము. అరణ్యప్రయాణంలో యూదులవలె; మనం ఐగుప్తులో లేము, కనానులోనూ లేము, ఒకదానినుండి మరొకదాని దగ్గరకు ప్రయాణం చేస్తున్నాము. మన స్వాభావిక స్థితినుండి మనం విమోచన పొందాం, అయితే మనం మహిమలో ప్రవేశించడానికి ముందు, 'ఈ లోకమనే ప్రమాదకరమైన, అలసటతోకూడిన అరణ్యం మనం దాటాలి'. యూదులు ఒంటరిగా

విడువబడనట్టే, వారికి నాయకుడు ఉన్నట్లే, మనకు కూడా నాయకుడు ఉన్నాడు-'ఈ దేవుడు తరతరములకు మన దేవుడు, మరణము వరకు ఆయన మనలను నడిపించును'.

ఇదిగో ఈ దృక్పథాన్నే క్రైస్తవులమైన మనం పట్టుకోవాలి! "మనం ఐగుప్తులో లేము", అంటే మనము ఇంకా పాపముయొక్క శాపము క్రింద, అపరాధభావన క్రింద లేము, లేక మనం పాపపు శక్తికి బానిసలుగా లేము. అయితే, "మనమింకా కనానుకు వెళ్లలేదు" అంటే మన విమోచనలో ఆఖరి అంకానికి మనమింకా చేరలేదు. "ఈ లోకం అనే ప్రమాదకరమైన, అలసటతో కూడిన అరణ్యం మనం దాటాలి". ఇది మనం గుర్తుంచుకోవలసిన ముఖ్యమైన విషయం! మనం పిలువబడిన మహిమలో చేరుటకు ముందు మధ్యలో ఉన్న తాత్కాలికమైన స్థితి ఈ జీవితం.

క్రైస్తవునికి, ఈ ప్రస్తుత జీవితం, "కొనసాగుతున్న శుద్ధీకరణ" అనుభవం. ఇందులో మన జీవితంలోని పరిస్థితుల గుండా వెళ్తున్నపుడు, పరిశుద్ధాత్మ కార్యంద్వారా, వాక్యంద్వారా, క్రీస్తు రూపంలోనికి మనం క్రమక్రమంగా మార్చబడుతూ, రూపాంతరము పొందుతూ ఉన్నాం (రోమా 8:29). ఈ ప్రక్రియ కూడా, దేవునికి విరోధమైన ప్రపంచం మధ్యలో జరుగుతుంది; ఇశ్రాయేలీయుల అరణ్య అనుభవం వలె, శ్రమలు, ఇబ్బందులతో కొనసాగుతుంది. ఇది "ప్రమాదకరమైన, అలసటతోకూడిన ప్రదేశం", ఎండిన ఎడారి ప్రాంతం (యిర్మియా 17:5-8).

అయితే, మనం ఒంటరిగా లేము! దేవుడే మనకు తోడుగా ఉన్నాడు. ఈ "అరణ్యానుభవంలో" మన ప్రతి అవసరతలో సరిపోయినంత, పూర్తి నిధి ఆయనే అని లేఖనాలు అనేకసార్లు నిశ్చయంగా చెబుతున్నాయి (ఫిలిప్పీ 4:19).

1. నిర్గమకాండము 2:23-25 ఇశ్రాయేలీయులు ఐగుప్తు బానిసత్వంలో ఉండగా, దేవుడు స్పందించిన విషయాన్ని మనకు తెలియజేస్తుంది; ఆయన వారి మొఱ్ఱలను వినడానికి ఇష్టపడ్డాడు; వారిని విడిపించి, పాలు తేనెలు ప్రవహించే దేశంలోనికి వారిని తీసుకురావడానికి ఆయన దిగివచ్చారు. ఇది అపరాధభావన, పాపపు శక్తి, శాపమునుండి క్రీస్తుద్వారా దేవుడు మనలను విడిపించిన దానికి సాదృశ్యముగా ఉన్నది.

2. ద్వితీయోపదేశకాండము 32:9-10 దేవుడు ఇశ్రాయేలును తన స్వాస్థ్యముగా ఎలా ఎంచుకున్నారో తెలియజేస్తుంది. (ద్వితీయోప.14:2తో పోల్చండి). "అరణ్య ప్రదేశములోను, భీకరధ్వనిగల పాడైన యెడారిలోను, వాని కనుగొని ఆవరించి పరామర్శించి తన కనుపాపనువలె వాని కాపాడెను". మానవజాతినుండి తన స్వంత ప్రజలను దేవుడు ఎలా పిలుస్తాడో, వారిని ఎలా ఆవరించి, పరామర్శించి, తన కనుపాపవలె కాపాడుతాడో అనడానికి మరొక అద్భుతమైన చిత్రం ఇక్కడ కనిపిస్తుంది.

3. లేఖనాలలో దేవుడు ఇలా బయల్పరచబడ్డారు:

ఎ) మన నాయకుడు (యెషయా 48:17; 49:10; కీర్తన 23:3; 48:14)

బి) మన పాలకుడు (కీర్తనలు 32:10; 31:19-20; యెషయా 43:1-5)

సి) మన రక్షకుడు (1 పేతురు 1:8,9)

డి) మన పోషకుడు (ఫిలిప్పీ 4:19)

క్రైస్తవులముగా, మనం విశ్వాసముతో జీవించడానికి పిలువబడ్డాము. క్రీస్తునందు నమ్మికయుంచుట ద్వారా మనం నిజజీవితంలో ఈ స్థానాన్ని పొందుకున్నాం! అన్ని రకాల శ్రమలు, ఇబ్బందులు మనమీద పడినప్పడు, మనమెవరమో మనకు మనం జ్ఞాపకంచేసుకోవాలి (దేవుని రాజ వంశీకులం; దేవునియెదుట ప్రత్యేకమైన స్థానం పొందుటకు ఆయన దయపొందుకున్నవారం; తన నిత్యరాజ్యములో చేరువరకు మనలను కాపాడి సంరక్షిస్తానని దేవునిచే వాగ్దానం పొందినవారం).

ఇది, మనం సహనంగా ఉండాలంటే, దేవుడు కోరుకున్న స్థిరత్వాన్ని, సంతోషాన్ని, సమాధానాన్ని మన స్వంతం చేసుకోవాలంటే, మనస్సులో ఉంచుకోవలసిన నిజమైన "దృక్పధం". ప్రతి ఉదయం మనకు మనం జ్ఞాపకం చేసుకోవలసినది: 1. దేవుడు తన సింహాసనంపై ఉన్నాడు -"యెహోవా ఆకాశమందు తన సింహాసనమును స్థిరపరచియున్నాడు. ఆయన అన్నిటిమీద రాజ్య పరిపాలన చేయుచున్నాడు." (కీర్తన 103:19);

2. ''నేను భరించగలిగిన దానికంటె ఎక్కువగా ఆయన నన్ను పరీక్షింపబడనియ్యడు" (1కొరింథి 10:13);

3. "శాశ్వతుడైన దేవుడు నీకు నివాసస్థలము, నిత్యముగనుండు బాహువులు నీ క్రిందనుండును." (ద్వితీయోప. 33:27)

## రచయితనుగూర్చి

టెడ్ గ్రోవ్స్‌గారు విస్కాన్సిన్, పశ్చిమ అల్లిస్ లోని గ్రేస్ కమ్యూనిటి చర్చి వ్యవస్థాపక సంఘ కాపరి. ఆయన అక్కడ 1988వరకు సీనియర్ పాస్టర్‌గా ఉన్నారు. ఆయన 40 ఏళ్లకు పైబడి సువార్త పరిచర్యలో ఉన్నారు. 'యూత్ ఇవాంజిలిజమ్ ఎక్స్‌ప్లోజన్' కార్యక్రమానికి ఆయన సంఘం 'మిడ్‌వెస్ట్ ట్రైనింగ్ సెంటర్' గా ఉన్నది. ఆయన బైబిల్ కౌన్సిలింగ్‌లో 'నేషనల్ అసోసియేషన్ ఆఫ్ నౌథెటిక్ కౌన్సిలర్స్" (NAN ఇప్పుడు అది 'అసోసియేషన్ ఆఫ్ సర్టిఫైడ్ బిబ్లికల్ కౌన్సిలర్స్' అని పిలవబడుతుంది.)నుండి , 'ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ బిబ్లికల్ కౌన్సిలర్స్' నుండి పట్టా పుచ్చుకున్నారు.

ఆయన ఇవాన్స్‌విల్ యూనివర్సిటీనుండి బి.ఎ., ఎమ్.ఎ., పట్టాలు తీసుకున్నారు. పరిచర్యలోనికి సంపూర్ణ సేవకు ప్రవేశించడానికి ముందు 10 సంవత్సరాలు స్కూల్లో బోధించారు. తరువాత వీటన్ కాలేజినుండి క్రైస్తవ చరిత్ర, వేదాంతంలో రెండవ మాస్టర్ డిగ్రీ తీసుకున్నారు.

టెడ్ భార్య, ఆయన కుటుంబం ఆయన జీవితంలో గొప్ప సంతోషము, బలమును ఇచ్చారు. ఆయన లిండాను వివాహం చేసుకుని 50సంవత్సరాలు. ఆయనకు ముగ్గురు పిల్లలు: డేవిడ్, జేసన్, ఆడ్రి. ఆయనకు మనవలు మనవరాండ్రు కూడా ఉన్నారు.